

'జాతికి జల సౌభాగ్యం కల్పించిన రోజే
నాకు అసలైన పండుగ రోజు'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 17
సంచిక: 337

గురువారం 27-2-2025

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

సాక్షి
ఫ్యామిలీ II
హైదరాబాద్
గురువారం ॥ 27-2-2025

'హోమ్‌వర్క్ చేయలేదేంటి?' టీచర్ ప్రశ్న.
'చెయ్యిలా'... అన్నాడా స్టూడెంట్ తల వంకరగా పెట్టి.
'నిర్లక్ష్యంగా బదులిస్తావేంటి... క్లాసయ్యే వరకు నిలబడు'
'తగ్గేదేలే' అంటూ విచిత్రంగా అభినయించాడు.
భుజం తిప్పుతూ వికారంగా ముఖం పెట్టాడు.
ఇది ఇప్పుడు స్కూళ్లను పట్టి పీడిస్తున్న జబ్బు.
ఆ జబ్బుకు విరుగుడు కూడా
రోగం మొదలైన చోటే ఉంది.





సినిమాయకు మంత్రం లేదా!

'మా స్కూల్‌లో సగం మంది విద్యార్థులు 'ఫలానా' సినిమా చూసిన తర్వాత చెడిపోయారు. విద్యార్థుల భాష మారిపోయింది, జుట్టు స్టైల్, డ్రెస్సింగ్ విచిత్రంగా ఉంటోంది. టీచర్‌లుగా వారికి మంచి మాట చెప్పే ప్రయత్నం చేస్తుంటాం. ఎంత చెప్పినా మా మాట వినడం లేదు. భాష మార్చుకోవాలని చెప్పినప్పుడు నిర్లక్ష్యంగా స్పందిస్తున్నారు. ఇలాంటి సినిమాలకు ప్రభుత్వం ఎందుకు అనుమతి ఇస్తోంది? ఇలాంటి సినిమాలకు సెన్సార్‌బోర్డు సర్టిఫికేట్ ఎలా ఇస్తోంది?' ఇటీవల విద్యాశాఖ కమిషనర్ మీటింగ్‌లో ఓ టీచర్ వెలిబుచ్చిన ఆవేదన ఇది. ఈ సంఘటన హైదరాబాద్‌లో జరిగింది. ఆమె ఒక్కరే కాదు, బయటకు చెప్పలేక ఎందరో టీచర్‌లు ఇలాగే ఆవేదన చెందుతున్నారు. ఎవరూ పట్టించుకోకపోతే విద్యార్థుల భవిష్యత్తు ఏమవుతుందోనని ఆందోళన చెందుతున్నారు.

జాతీయోద్యమకాలం సినిమాలు

''సినిమా అనేది చాలా ప్రభావవంతమైన మాధ్యమం. అది ప్రధానంగా వినోదసాధనమే. కానీ సామాజిక బాధ్యత కూడా ఉండాలి. సామాజిక బాధ్యతతో కూడిన వినోదాన్ని అందించాలి. జాతీయోద్యమకాలంలో సినిమాలు ఈ పాత్ర పోషించాయి. జనంలో స్వాతంత్ర్యపోరాట స్ఫూర్తిని రగిలించాయి. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత మన సినిమాలకు ఒక సామాజిక లక్ష్యం అనేది లేకుండా పోయింది. సినిమా ప్రభావం పిల్లల మీద మంచి–చెడు రెండు వైపులా ఉంటుంది. సినిమాలో ప్రధానంగా ఏం ఉందో అదే నేర్చుకుంటారు. ఏ విషయాన్ని హీరోయిక్‌గా చూపించారో దానికే ఆకర్షితమవుతారు. సెన్సార్‌బోర్డు ఒక సినిమాకు ప్రదర్శనకు అనుమతి ఇచ్చే ముందు పిల్లలను దృష్టిలో పెట్టుకోవాలి. అలాగే 'ఏ' సర్టిఫికేట్ సినిమాలకు పిల్లలను తీసుకెళ్లకుండా జాగ్రత్తపడాల్సిన బాధ్యత తల్లిదండ్రులది. తల్లిదండ్రులు శృంగార దృశ్యాలున్న సినిమాలకు మాత్రమే పిల్లలను మినహాయిస్తున్నారు. హింస ఉన్న సినిమాల విషయంలో పట్టింపుగా ఉండడం లేదు. పిల్లలను పక్కదారి పట్టిస్తున్న మాధ్యమాల్లో సినిమాలతోపాటు టీవీ ప్రసారాలు, సోషల్ మీడియాను కూడా ప్రస్తావించాలి. పిల్లల క్షేమం దృష్ట్యా ఆలోచించి నప్పుడు మనదేశాల్లో పటిష్ఠమైన నియమాలు లేవు.'' అన్నారు విద్యావేత్త రేఖారావు.

లేజీ పేరెంటింగ్ పరిణామాలివన్నీ

ప్రశాంతంగా ఉండాల్సిన పిల్లలు ముఖాలు ఆవేశంగా, అలసటగా, ఆందోళనగా కనిపిస్తున్నాయి. అర్ధరాత్రి వరకు సినిమాలు చూసి, పగలు క్లాస్‌రూమ్‌లో కునికిపాట్లు పడుతుంటారు. దీనికి బాధ్యత తల్లిదండ్రులదే. పిల్లలకు కథలు చెప్పే ఓపిక లేక వీడియో గేమ్స్‌కు అలవాటు చేస్తున్నారు. ఫస్ట్ గ్రేడ్, సెకండ్ గ్రేడ్ పిల్లల తల్లిదండ్రులు స్కూల్‌కి వచ్చి పిల్లలు తమ మాట వినడం లేదని కంప్లయింట్ చేస్తుంటారు. సినిమాలు చూసి పాడయిపోతున్న మాట నిజమే. పిల్లల ఖాళీసమయాన్ని సద్వినియోగం చేస్తే కదా! పెద్దవాళ్లను, టీచర్లను గౌరవించాలనే బుద్ధి పుట్టించే కథలను వాళ్లకు చెప్పి ఉంటే తల్లిదండ్రులను, టీచర్లను ధిక్కరించే ఆలోచనే రాదు. కథలు చెప్పే ఓపిక చాలామంది పేరెంట్స్‌కు ఉండడం లేదు. క్రిటికల్ థింకింగ్, క్రియేటివ్ సొల్యూషన్స్ ఉన్న కథలు మనకెన్నో ఉన్నాయి. కాకి నీటి కోసం కుండలో రాళ్లు వేసిన కథ. నోటిమాటతో డోర్ ఓపెన్ అయ్యే కథల్లో టెక్నాలజీ దాగి ఉంది. ఎలుకలను అమ్మే కథలో స్టార్టప్ మార్గం ఉంది. పంచతంత్ర కథల్లో లేనిదేమిటి? పిల్లల్లో ఇలాంటి అవాంఛిత ధోరణికి సినిమా అనేది ప్రత్యక్ష కారణం అయితే లేజీ పేరెంటింగ్ పరోక్ష కారణం.



– రేఖారావు, విద్యావేత్త

పాడైన విద్యార్థుల లెక్క తేలేదెలా?

పిల్లల మీద సినిమాల ప్రభావం తీవ్రరూపం దాల్చింది. ఆ దుష్ప్రభావం పిల్లల భవిష్యత్తు మీద కూడా చూపిస్తుందని టీచర్లు ఆందోళన పడుతున్నారు. పిల్లలను సరిచేయడానికి మందలింపుగా ఒక మాట అంటే చాలా హింసాత్మకంగా స్పందిస్తున్నారని, ఇలాగే కొనసాగితే సమాజానికి మంచి పౌరులను అందించలేమని ఆవేదన చెందుతున్నారు. మరి ఇలాంటి సినిమాలు తీసిన ఫిల్మ్ మేకర్‌లు ఏం చేస్తున్నారు? సదరు సినిమా ఎన్ని కోట్లు కలెక్ట్ చేసిందనే లెక్కల గొప్పలు చెప్పడానికి ముందుంటారు. కానీ తమ సినిమా చూసిన తర్వాత ఎంతమంది పిల్లలు పాడయ్యారో లెక్కచెప్పే ధైర్యం వాళ్లకుంటుందా? ఒకప్పుడు సిగరెట్ గాల్లోకి ఎగరేసి పెదవులతో పట్టుకోవడం హీరోయిజంగా ఒక ట్రెండ్ సెట్ చేసింది. కేవలం స్టయిల్ అనే భావనతో సిగరెట్ అలవాటు చేసుకున్న నాటి యువతరం ఇప్పుడు అరవైలు–డెబ్బైలకు చేరి క్రమం తప్పకుండా లంగ్స్ టెస్టులు చేసుకుంటోంది. హీరోలు తమ పిల్లలను కూడా ఈ మత్తులోనే ఉంచుతున్నారా? సమాజంలోని పిల్లల పట్ల వారికి బాధ్యత అక్కర్లేదా?

– వాకా మంజులారెడ్డి, సాక్షి ఫీచర్స్ ప్రతినిధి



● అనుబంధం



● భార్యతో విజయ్ మండల్

అతడు సత్యవంతుడు

సత్యవంతుడి కోసం సావిత్రి
యముడితో పోరాడింది...
నేను నా భార్యకోసం
సత్యవంతుడిలా పోరాడుతున్నాను...
అంటున్నాడు విజయ్ మండల్.
గత నాలుగేళ్లుగా ఇతను
భార్యకు 24 గంటల్లో కావలసిన
3 ఆక్సిజన్ సిలిండర్లను
రోజూ భుజంపై మోస్తున్నాడు.
ఇందుకోసం సిలిండర్‌తో
రోజుకు 30 కిలోమీటర్లు నడుస్తాడు.
అలుపు లేదు. ఆగిందీ లేదు.
బిహార్ భాగల్‌పూర్‌కు చెందిన ఈ భర్తకు
భార్య కన్నీటి కృతజ్ఞత తెలుపుతుంటోంది.
నేటి ఉలిక్కిపడే వార్తల మధ్య
ఈ అనుబంధం ఎంతో ఆదర్శం.

భర్త కోసం భార్యలు పోరాడిన గాథలు ఉన్నాయి. కాని భార్య కోసం భర్తలు చేసే త్యాగాలు లోకం దృష్టికి రావడం తక్కువ. కాని విజయ్ మండల్ కథ విస్మరించను వీలు కానిది. ఒక మనిషి నిజమైన హృదయంతో పూనుకుంటే తప్ప ఇలాంటి ఘనకార్యాన్ని, ఘనమైన సేవను చేయలేడు. బిహార్‌లోనే ఇటువంటి భర్తలు ఉన్నారేమో. గతంలో దశరథ్ మాంఝీ అనే అతను తన భార్యకు సమయానికి వైద్యం అందనివ్వకుండా అడ్డుగా నిలిచిన కొండను ఒక్కడే తొలిచి, దారి వేసి 'మౌంటెన్ మేన్' అనిపించుకున్నాడు. కరోనా తర్వాత రోగగ్రస్త అయిన భార్య కోసం నాలుగేళ్లుగా పట్టుదలగా ఆక్సిజన్ సిలిండర్లు మోస్తున్న విజయ్ మండల్‌ను 'ఆక్సిజన్ మేన్' అనొచ్చేమో.

భాగల్‌పూర్ నుంచి

విజయ్ మండల్‌ది బిహార్‌లోని భాగల్‌పూర్‌కు దగ్గరలోని కహల్‌గావ్. ఇక్కడ అతను చిన్న కిరాణా షాపు నడిపేవాడు. భార్య అనితాదేవికి 2021లో కరోనా సోకింది. పరిస్థితి చాలా సీరియస్ అయ్యింది. భార్యను బతికించుకోవడానికి విజయ్ మండల్ చేయని ప్రయత్నం లేదు. కూతురి పెళ్లి కోసం దాచిన 10 లక్షల రూపాయలు ఖర్చు పెట్టేశాడు. చివరకు ఢిల్లీ ఎయిమ్స్‌కు కూడా తీసుకెళ్లారు. వాళ్లు ఆమెను చేర్చుకొని అన్ని విధాలా వైద్యం చేసి చివరకు 'ఈమె ఊపిరితిత్తులు పూర్తిగా కోలుకోవు. బతికి ఉన్నంత కాలం ఆక్సిజన్ మీద బతకాల్సిందే' అని చెప్పి ఆక్సిజన్ కాన్సన్‌ట్రేటర్ ఇచ్చి పంపారు. అది సంవత్సరంలో చెడిపోయింది. ఇంకోటి కొన్నా దాని పరిస్థితీ అంతే. దాంతో స్థానికంగా దొరికే ఆక్సిజన్ సిలిండర్లే మేలని వాటితో భార్యను బతికించుకోవాలని విజయ్ మండల్ నిశ్చయించుకున్నాడు.

ఉదయాన్నే 4 గంటలకు లేచి

ఒక్కో సిలిండర్ 8 గంటలు వస్తుంది. అందుకే ఖాళీ అయిన దానిని వెంటనే ఇచ్చి నిండింది తెచ్చుకోవాలి. విజయ్ మండల్ దినచర్య ఇలా ఉంటుంది. అతడు తన ఊరు రసల్‌పూర్ నుంచి తెల్లవారు జాము 4 గంటలకు లేచి ఐదు కిలోమీటర్ల దూరంలోని 'ఇక్‌చారి' రైల్వేస్టేషన్‌కు సిలిండర్ మోసుకొని బయలుదేరుతాడు. అక్కడ రైలు పట్టుకుని 50 నిమిషాల దూరంలోని భాగల్‌పూర్ చేరుకుంటాడు. అక్కడి నుంచి ఆక్సిజన్ దొరికే చోటుకు వెళ్లి సిలిండర్ తీసుకుని 9 గంటలకు ఇల్లు చేరుతాడు. మళ్లీ 11కు వెళ్లి ఒంటి గంటకు వస్తాడు. తర్వాత మధ్యాహ్నం 3 గంటలకు వెళ్లి 7కు తిరిగి వస్తాడు. అంటే రోజులో భుజాన సిలిండర్‌తో 30 కిలోమీటర్లు అతడు నడుస్తాడు. అతని భుజం కదుం కట్టిపోయింది. 'ఎందుకు ఆక్సిజన్ మోస్తూ కనిపిస్తావు' అని ఎవరైనా అడిగితే 'ఒక పక్షి దాహంతో ఉంది. దాని కోసం' అని సమాధానం చెబుతాడు.

ఇంట్లోని గదినే ఐసీయుగా మార్చి...

'నేను బాగా ఆలోచించుకుని ఈ నిర్ణయం తీసుకున్నాను. భార్యను ఎంత బాగా చూసుకోవాలనే విషయం పై నేను ఒక ఉదాహరణగా నిలవాలి' అన్నాడు విజయ్ మండల్. అతను తాను నడిపే కిరాణా దుకాణాన్ని కొడుక్కు అప్పజెప్పి జీవితాన్ని ఇక పూర్తిగా భార్యకు అంకితం చేశాడు. మూడు ఆక్సిజన్ సిలిండర్లను పర్మినెంట్‌గా ఉండేలా కొనేశాడు. వాటిని నింపుకొని రావడమే ఇప్పుడు తని కర్తవ్యం.

ఆయుష్మాన్ కార్డు

'ఒకరికొకరు తోడుండటమే వివాహం అంటే. ఆమె మరణించేవరకూ నేనే తోడు' అంటాడు విజయ్ మండల్. ఇతని గాథ అందరికీ తెలిసినా స్థానిక అధికారులు ఆయుష్మాన్ కార్డు ఇచ్చి సరిపెట్టారు. ఒక మనిషి ఆక్సిజన్ కోసం ఇంతగా ఎందుకు తిరగాలి పర్మినెంట్ సొల్యూషన్ ఏమిటి అనేది ప్రభుత్వం ఆలోచించడం లేదు. పిచ్చివాడిలా గడ్డం పెంచుకుని తిరుగుతున్న ఆ భర్తను చూసి భార్య రెండు చేతులూ జోడిస్తుంటుంది. 'ఉత్త పుణ్యానికి భార్యలను హతమార్చే ఈ రోజుల్లో అనారోగ్యంతో ఉన్న నన్ను కళ్లల్లో పెట్టి చూసుకుంటున్నాడు నా భర్త' అని కన్నీరు కారుస్తుంది. విజయ్ మండల్ ఆ మాటలు పట్టించుకోడు. తనకు మిగిలిన టైమ్‌లో ఆమె దగ్గర కూచుంటాడు. పాదాలు నొక్కుతాడు. కబుర్లు చెబుతాడు. ఆమెలో జీవితేచ్ఛ నశించకుండా చూసుకుంటాడు.

ఒక మనిషి ఇంత గొప్పగా ఉంటాడా? ఉంటాడు. ప్రతి మనిషి ఇలా ఉంటే కనీసం ఇంతలో కొంతగా అయినా ఉంటే ఎంత బాగుణ్ణు.

● మన(సు)లో మాట

విపరీతమైన పగటి కలలు..!

దాక్టరు గారూ! నేను డిగ్రీ ఫైనల్ ఇయర్‌లో ఉన్నాను. నాకీ మధ్య పగటి కలలు ఎక్కువగా వస్తున్నాయి. క్లాసులో ఉన్నా, ఇంట్లో ఉన్నా, నడుస్తున్నా, ఏ పనిలో ఉన్నా, ఏవేవో పగటి కలలు వస్తున్నాయి. కలెక్టర్‌ను చూస్తే కలెక్టర్ అయినట్లు, పోలీస్ ఆఫీసర్‌ను చూస్తే ఎస్.పి. ని అయినట్లు, సినిమాలో హీరోయిన్‌ను చూస్తే నేను కూడా హీరోయిన్ అయినట్లు, ఇలా రకరకాలుగా పగటి కలలు, ఊహలు వస్తున్నాయి. ఆటోలో బస్సులో వెళుతున్నప్పుడు ఇవి మరీ ఎక్కువగా వస్తున్నాయి. అలా వచ్చినప్పుడల్లా చాలా హాయిగా ఉంటుంది. దాంట్లోంచి బయట పడగానే అయ్యో! ఇది నిజం కాదా అని చాలా బాధ కలుగుతుంది. క్లాసులో ఇలా కలలు రావడం వల్ల చదువు కూడా దెబ్బతింటోంది. నాకే ఎందుకు ఇలా జరుగుతుందో అని ఆందోళనగా ఉంది. ఈ ఊహల్లోంచి బయట పడే మార్గం చెప్పండి

– ప్రణీత, మహబూబ్ నగర్

ఇలా కలలు, పగటి కలలు కనడం మనిషికి చాలా సహజం. ఈ ప్రపంచంలో అసలు కలలు–పగటి కలలు ఎప్పుడో ఒకసారి కనని వారుండరంటే అతిశయోక్తి కాదు. ఇలా పగటి కలలు... అంటే 'డే డ్రీమింగ్' యుక్త వయసులో చాలా సహజం. మానసిక ఒత్తిడికి, ఆందోళనకు గురైనవారు, 'ఎ.డి.హెచ్.డి.' అంటే నిలకడ, ఏకాగ్రత లేకుండా ఓవర్ యాక్టివ్‌గా ఉండేవారిలో కూడా ఈ పగటి కలలు ఎక్కువగా ఉంటాయని పరిశోధనలు తెలుపుతున్నాయి. మనం అనుకున్నవన్నీ నిజ జీవితంలో సాధించలేనప్పుడు, కొంతసేపైనా ఊహాలోకంలో విహరించి, నిజజీవితంలో పొందలేనివి ఇలా ఊహల్లోనైనా పొంది మనిషి తృప్తి పొందాలనుకుంటాడు. ఎడారిలాంటి మన జీవితాలకు పగటి కలలు ఒక 'ఒయాసిస్' లాగా పనిచేస్తాయి. అసంతృప్తితో ఉన్న మనసుకు ఈ పగటికలలు కొంత ఊరట కలిగించి, మన బాధలకు సమస్యలకు ఒక 'ఔట్‌లెట్' లాగా పనిచేసి మనల్ని సంతృప్తి పరుస్తాయి. మరికొందరికి పగటి కలలు, వారిలో 'క్రియేటివిటీ' పెరిగేందుకు, జీవిత సమస్యల నుండి కొన్ని పరిష్కారాలు పొందేందుకు కూడా తోడ్పడతాయి. కానీ 'అతి సర్వత్రా వర్జయేత్!' అన్నట్లు ఏదైనా అతిగా ఉంటేనే ఇబ్బంది. వాస్తవాన్ని పూర్తిగా మరచి, పగలంతా పగటి కలల్లో, విహరించడమనేది అంత మంచిది కాదు. దీనివల్ల మీ చదువు, ఇతర పనులు దెబ్బతింటాయి. మీరు మీ జీవిత గమ్యాలను ప్రతిరోజు స్మరించుకుంటూ, వాటిని సాధించేందుకు, మీ శక్తియుక్తులను పూర్తిగా వినియోగించండి. ఏకాగ్రత నిగ్రహ శక్తి, పెంచుకునేందుకు సరైన నిద్ర, ధ్యానం, ప్రాణాయామం, మైండ్‌ఫుల్‌నెస్, ఉపయోగపడతాయి. మీకిష్టమైన వేరే వ్యాపకాలపై ధ్యాస పెట్టండి. జీవితంలో పగటి కలలు ఒక భాగమే తప్ప పగటి కలలే జీవితం కారాదు!



డా. ఇండ్ల విశాల్ రెడ్డి,
సీనియర్ సైకియాట్రిస్ట్, విజయవాడ.
మీ సమస్యలు, సందేహాలు పంపవలసిన
మెయిల్ ఐడీ:sakshifamily3@gmail.com

నీళ్లలో స్వచ్ఛత ఎంత?

ఈ రోజుల్లో శుద్ధమైన నీటిని తాగడమూ కొంత ప్రయాసతో కూడిన అంశంగా మారింది. భూగర్భ, నదీ జలాల కాలుష్యం, కొన్నాళ్ల పాటు నిల్వ ఉంచే వాటర్ ట్యాంకుల వల్ల స్వచ్ఛమైన నీటి కోసం వెతుకులాట తప్పడం లేదు. దీంతో చాలా మంది వాటర్ ప్యూరిఫైయర్లను ఎంచుకుంటున్నారు. మార్కెట్‌లో లభించే రకరకాల వాటర్ ప్యూరిఫైయర్‌లలో కొన్ని నీటిని వడకట్టేవి, మరి కొన్ని నీటి నుంచి పోషకాలు పోకుండా కాపాడేవి, ఇంకొన్ని మోతాదులో పోషకాలు కలిపేవి లభిస్తున్నాయి. ప్రకృతి సిద్ధంగా లభించే నీటిలో ఉండే స్వచ్ఛత తెలుసుకోవడానికి అవగాహనే ప్రధానమైనది.

ఎంపిక చేసుకున్న ప్యూరిఫైయర్‌ని ఆపరేటర్లు ఇంట్లో అమర్చాక టిడిఎస్ ఎంత ఉందో నాణ్యత చూపించి, మరీ వాటి గురించి వివరిస్తుంటారు. వరప్రదాయినిగా లభించే నీటిలో పోషకాలు ఏంటి, టిడిఎస్ ఏంటి.. అంటూ కొంత ఆందోళన పడుతుంటాం. ఖనిజాలు, లవణాలు, లోహాలతో సహా నీటిలో కరిగిన పదార్థాల మొత్తాన్ని కొలవడమే టిడిఎస్ (టోటల్ డిసాల్వ్డ్ సాలిడ్స్).





నీటిలో టిడిఎస్ స్థాయి ఎంత మేరకు ఉండాలంటే...

➡ 0 – 50 పిపిఎమ్ (పార్ట్స్ పర్ మిలియన్) ఉంటే... దీనిని స్వేదన జలం అంటారు. అవసరమైన ఖనిజాలు, పోషకాలు లేకపోవడం వల్ల ఈ నీటిని తాగడానికి ఉపయోగించలేం ➡ 50–150 పిపిఎమ్ ఉంటే అవసరమైన ఖనిజాలు, పోషకాలు ఉన్నాయని, తాగడానికి మేలైనదని గుర్తించాలి ➡ 150 – 300 పిపిఎమ్ ఉంటే తాగడానికి మేలైనది ➡ 300 – 500 పిపిఎమ్ ఉంటే ఆ నీరు ఆరోగ్య సమస్యలను తగ్గిస్తాయి ➡ 500–600 పిపిఎమ్ కంటే ఎక్కువ ఉంటే తాగడానికి మేలైనది కాదు.



నీటి శుద్ధి యంత్రాల రకాలు:

ఆర్‌వో (రివర్స్ ఓస్మోసిస్): అధిక టిడిఎస్ (300 పిపిఎమ్ కంటే ఎక్కువ)కు ఆర్‌వో ఉత్తమమైనది. ఇది, నీటిలో భార లోహాలు, రసాయనాలు, అదనపు లవణాలను తొలగిస్తుంది. అయితే, ముఖ్యమైన ఖనిజాలను కూడా తొలగించవచ్చు, కాబట్టి దీనిలోనూ మినరలైజర్ ఉన్న మోడల్‌ను ఎంచుకోవడం మేలు.

UV (అతినీల లోహిత) ఫిల్టర్ బ్యాక్టీరియా, వైరస్‌లకు వ్యతిరేకంగా, ప్రభావవంతంగా పని చేస్తుంది. నీటిలో తక్కువ టిడిఎస్ ఉన్నప్పుడు యువి మోడల్ మంచిది.

UF అతినీలలోహిత ఫిల్టర్

ఈ మోడల్ వాటర్ ఫిల్టర్ UV లాగానే ఉంటుంది. కానీ సస్పెండ్ చేయబడిన కణాలను కూడా యుఎఫ్ మోడల్ తొలగిస్తుంది.

యాక్టివేటెడ్ కార్బన్ ఫిల్టర్లు: రుచిని మెరుగుపరచడానికి, క్లోరిన్, సేంద్రీయ మలినాలను తొలగించడానికి ఈ ఫిల్టర్ బాగా ఉపయోగపడుతుంది.

శుద్ధమైన నీటిని తాగితే చాలు...

గతంలో సంప్రదాయ పద్ధతిలో మరిగించడం అనేది ఒక పద్ధతిగా ఉండేది. దీని వల్ల కూడా కొన్ని పోషకాలు పోతున్నాయి అని గ్రహించారు. వాటర్ క్వాలిటీ కోసం టిడిఎస్‌ను చెక్ చేస్తాం. ప్రభుత్వం కూడా ఈ పద్ధతిని అవలంబిస్తుంది. ఆర్‌వో సిస్టమ్ అయితే సురక్షితం అనుకుంటాం. ఫిల్టర్ వరకు పర్వాలేదు. కానీ, వీటి ద్వారా కూడా నీటిలో కొన్ని పోషకాలు పోతుంటాయి. 100 శాతం క్లోరిన్, కాలుష్య శుద్ధి చేసి, నీటి నుంచి మనకు కావల్సిన పోషకాలు లభిస్తే చాలు. ఇప్పుడు ఆల్కలైన్ వాటర్ తాగితే చాలా ప్రయోజనాలు అని చెబుతుంటారు. వాటికి సంబంధించిన ఫిల్టర్లు కూడా వస్తున్నాయి. నీటిలో ప్రధానంగా ఉండే పొటాషియం, మెగ్నీషియమ్, ఐరన్ వంటివి ఉంటే చాలు. ఎక్కువ పోషకాలు కలిపి మరీ తీసుకోవాల్సిన అవసరం లేదు.

– సుజాత స్టీఫెన్, న్యూట్రిషనిస్ట్


సుజాత స్టీఫెన్ ఆర్.డి. న్యూట్రిషనిస్ట్

సరైన ప్యూరిఫైయర్‌ను ఎంచుకోవడం:

➡ అధిక టిడిఎస్ కోసం (300 పిపిఎమ్) RO లేదా RO+ UV/UFని ఎంచుకోవచ్చు ➡ తక్కువ టిడిఎస్ (300 పిపిఎమ్ లోపల) కోసం UV, UF లేదా గురుత్వాకర్షణ ఆధారిత ప్యూరిఫైయర్లు సరిపోతాయి ➡ మున్సిపల్ నీటి కోసం సాధారణ టిడిఎస్, యాక్టివేటెడ్ కార్బన్ ఫిల్టర్లు బాగా పనిచేస్తాయి ➡ బోర్‌వెల్/హార్డ్ వాటర్‌లో అధిక టిడిఎస్ స్థాయిలు ఉంటాయి కాబట్టి ఆర్‌వో ఫిల్టర్ బాగా పనిచేస్తుంది ➡ కాల్షియం, మెగ్నీషియం వంటి ఖనిజాలను తిరిగి కలపడానికి మినరలైజర్/టిడిఎస్ కంట్రోలర్ వంటి కొన్ని ఆర్‌వో ప్యూరిఫైయర్‌లు ఉన్నాయి

ఇంట్లో వాడే వాటర్ ఫిల్టర్ ఎంపిక ను బట్టి టిడిఎస్ స్థాయిని కొలవడానికి మీరు టిడిఎస్ మీటర్‌ను ఉపయోగిస్తూ ఉండాలి. ఏవైనా మార్పులు కనిపిస్తే సంబంధిత ఆపరేటర్‌కు తెలియజేసి, ఫిల్టర్‌ను మార్చుకోవాలి.


● టెక్నాలజీ

ఇంటి పనుల రోబో

రోబోలు మన ఇంట్లో తిరుగాడే రోజులు సుదూర కల కాకపోవచ్చు. నార్వేకు చెందిన రోబోటిక్స్ కంపెనీ '1 ఎక్స్' వివిధ రకాల పనులు చేయగల కొత్త రోబోను మార్కెట్‌లోకి తీసుకు వచ్చింది.

'నియో గామా' అనే ఈ హ్యూమనాయిడ్ రోబోట్ ఇంటిపనులకు సహాయపడుతుంది.

సహజ కదలికలతో ఆకట్టుకుంటుంది. కంపెనీ షేర్ చేసిన ప్రమోషన్ క్లిప్‌లో... నైలాన్ నిట్ సూట్ ధరించిన రోబో కాఫీ సర్వ్ చేయడం, పెయింటింగ్ వేలాడదీయడం, బుట్ట మోయడం, అద్దాలు శుభ్రం చేయడం, బయటి నుంచి వచ్చిన వస్తువులను ఇంట్లోకి తీసుకురావడం... మొదలైన దృశ్యాలు ఉన్నాయి. ఇంటి పనులు సరే... ఈ హ్యూమనాయిడ్ రోబోట్‌లు సాంకేతికపరంగా ఎంత వరకు భద్రం అనే అనుమానాన్ని దృష్టిలో పెట్టుకొని...'నియో గామా భద్రతకు సంబంధించి తగు జాగ్రత్తలు తీసుకున్నాం' అని ప్రకటించింది కంపెనీ.




● బ్యూటిప్స్

ముఖం చూస్తే ఎంత ముచ్చటగా ఉన్నా, కాళ్లూ చేతులను పట్టించుకోకపోతే ఆ అందానికి అర్థం ఉండదు. పాదాలూ, చేతులూ కూడా బాగుంటేనే అందానికి సార్థకత.



కోమలమైన కాళ్లూ చేతులకు..

- కాళ్లు, చేతులపై మృతకణాలు పేరుకున్నప్పుడు చర్మం పొడిబారి నిర్జీవంగా కనిపిస్తుంది. మీ పరిస్థితి కూడా ఇదే అయితే.. ఎప్పటికప్పుడు ఈ మృతకణాలు తొలగించేందుకు ప్రయత్నించడం మంచిది. దానికి సంబంధించిన కొన్ని పూతలు తయారుచేసి ప్రయత్నిస్తే మంచి ఫలితం కనిపిస్తుంది. చర్మం కూడా ఆరోగ్యంగా మారుతుంది.
- రాత్రి పడుకునే ముందు కాస్తంత స్వచ్ఛమైన కొబ్బరినూనెను పాదాలకు రాసుకుని మర్దన చేయాలి. ఆ తర్వాత సాక్సులు వేసుకోవాలి. ఇలా క్రమం తప్పకుండా రోజూ చేయడం వల్ల పొడిబారిన చర్మం కాస్తా చాలా తక్కువ వ్యవధిలోనే మృదువుగా మారుతుంది.
- గోరువెచ్చని నీటిలో కొద్దిగా వంటసోడా, ఏదైనా కొన్ని చుక్కల ఎసెన్షియల్ ఆయిల్‌ను వేయాలి. లేదంటే ఆల్మండ్ ఆయిల్ లేదా ఆలివ్ ఆయిల్ అయినా ఫరవా లేదు. కుదిరితే అందులో కొన్ని గులాబీ రేకలూ వేసుకోవచ్చు. ఇందులో చేతులు లేదా కాళ్లను ఓ పదినిమిషాలు ఉంచి తీసేయాలి. ఇలా చేయడం వల్ల కాళ్లు, చేతుల చర్మం మృదువుగా మారుతుంది.
- గోరువెచ్చని నీటిలో కొద్దిగా ఎప్సమ్ సాల్ట్ వేసుకుని అందులో కాళ్లు లేదా చేతుల్ని ఉంచాలి. పది నిమిషాల తర్వాత శుభ్రంగా కడిగేసుకుని పొడిబట్టతో మృదువుగా అద్దుతూ తుడిచేసుకోవాలి. ఇలా చేయడం వల్ల ఆ భాగాలకు రక్తప్రసరణ సజావుగా జరిగి, రఫ్‌నెస్ తగ్గి మృదువుగా మారతాయి.
- ఒక నిమ్మచెక్కకు పంచదార అద్దుకోవాలి. దీనితో కాళ్లు, చేతులకు మర్దన చేస్తున్నట్లు మృదువుగా రుద్దుకోవాలి. అలాగే రాత్రి నిద్రించే ముందు ఆలివ్ లేదా ఆల్మండ్ ఆయిల్‌తో మర్దన చేసుకున్నా సరిపోతుంది. ఇది చర్మాన్ని ఎంతో కోమలంగా ఉంచుతుంది.



'సంపద పంపిణీ సక్రమంగా జరిగితే అట్టడుగు వర్గాలకు చేరుతుంది. అప్పుడే వారి కొనుగోలు శక్తి పెరుగుతుంది'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 17 సంచిక: 337

గురువారం 27-2-2025

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



మళ్లీ అదరగొట్టిన అఫ్గాన్

ఇంగ్లండ్‌పై 8 పరుగులతో గెలుపు. మెరిసిన ఇబ్రహీమ్, అజ్మతుల్లా -12లో



2 నెలల్లో లక్షకోట్లు ఉఫ్

మార్కెట్లకు విదేశీ ఇన్వెస్టర్ల షాక్.. గత అక్టోబర్ నుంచి పెట్టుబడులు వెనక్కి -13లో



మహా కుంభమేళాకు ఇక సెలవు..

45 రోజులపాటు వైభవంగా సాగిన మహా కుంభమేళా బుధవారం ముగిసింది. శివరాత్రి పర్వదిన వేళ ప్రయాగ్‌రాజ్ త్రివేణి సంగమంలో పుణ్యస్నానాల ఘట్టానికి తెరపడింది. ప్రపంచంలోనే అతిపెద్ద సామూహిక వేడుకగా రికార్డుకెక్కిన ఈ మహా క్రతువు.. జనవరి 13, పౌష్య పూర్ణిమ రోజున ప్రారంభమైంది. చివరి రోజైన బుధవారం పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. హరహర మహాదేవ మంత్రోచ్చారణలతో ఈ ప్రాంతం మార్మోగింది. భక్తులపై హెలికాప్టర్లతో పూలవర్షం కురిపించారు. మళ్లీ 144 ఏళ్లకు మహా కుంభమేళా జరగనుంది.

6లో



ఎములాడ రాజన్నకు భక్త నీరాజనం

హరహర మహదేవ నామస్మరణతో వేములవాడ క్షేత్రం మార్మోగింది. బుధవారం మహా శివరాత్రి వేడుకల వేళ శ్రీరాజరాజేశ్వరస్వామి దేవస్థానం భక్తజనంతో కిక్కిరిసింది. దాదాపు 4 లక్షల మంది భక్తులు రాజన్నను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. శివదీక్షాపరులు, భక్తులు రాత్రంతా జాగారం చేసేందుకు వీలుగా ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసింది. అర్ధరాత్రి వరకు ఆలయాన్ని తెరిచి ఉంచారు.

5లో



3లో

పాపం పాలపిట్ట..

చూడముచ్చటైన రూపం.. కనువిందు చేసే వర్ణరంజితం.. దసరా నాడు దాన్ని చూస్తేనే కాని పూర్తికాని సంబురం..
అంతటి అపురూపమైన పాలపిట్ట అంతరించిపోయే జాబితాలో చేరింది. రాష్ట్ర పక్షి కూడా అయిన ఈ బుల్లిపిట్ట ఇటీవలి కాలంలో కనిపించడమే గగనమైపోయింది. గతేడాదితో పోలిస్తే ఈ పక్షులు 30 శాతం మేర తగ్గిపోయాయట. వాతావరణ మార్పులు, కాలుష్యం వంటివి వీటి పాలిట ప్రాణ సంకటంగా మారుతున్నాయి. ఈ ప్రమాదాన్ని గమనించిన రాష్ట్ర ప్రభుత్వం పాలపిట్ట సంరక్షణకు నడుం బిగించింది.

చేయూత ఇవ్వండి

ఐదు అంశాలపై ప్రధాని మోదీకి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వినతులు

- తెలంగాణ పురోభివృద్ధికి కేంద్రం తరఫున తగిన సహకారం అందించండి
- రూ.24,269 కోట్ల వ్యయమయ్యే హైదరాబాద్ మెట్రో ఫేజ్–2కు అనుమతి ఇవ్వండి
- ఆర్ఆర్ఆర్ దక్షిణ భాగం, రీజనల్ రింగ్ రైల్, డ్రైపోర్ట్ మంజూరు చేయండి
- మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టుకు రూ.20 వేల కోట్ల నిధులు ఇవ్వండి.. సెమీ కండక్టర్ మిషన్‌కు అనుమతి ఇవ్వాలని విజ్ఞప్తి
- తెలంగాణకు అదనంగా 29 ఐపీఎస్ పోస్టులు మంజూరు చేయాలని విన్నపం
- గంటన్నర పాటు ప్రధానితో భేటీ.. ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ప్రమాదం అంశం ప్రస్తావన
- చర్చకు రాని కులగణన, ఎస్సీ వర్గీకరణ!



ఢిల్లీలో ప్రధాని మోదీని కలిసి రాష్ట్ర ప్రాజెక్టులపై చర్చిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణ రాష్ట్ర పురోభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం తమ సహకారాన్ని, ఆర్థిక చేయూతను అందించాలని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్‌లో మెట్రోరైలు ఫేజ్–2కు అనుమతులు, రీజనల్ రింగ్ రోడ్డు, రీజనల్ రింగ్ రైల్, మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టులకు నిధుల మంజూరు, సెమీ కండక్టర్ మిషన్‌కు అనుమతి విషయంలో సానుకూలంగా స్పందించాలని కోరారు. రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాలపై ప్రధానితో చర్చించేందుకు మంగళవారం రాత్రి ఢిల్లీకి వచ్చిన సీఎం రేవంత్, మంత్రి శ్రీధర్‌బాబు తదితరులు బుధవారం ఉదయం మోదీని ఆయన అధికారిక నివాసంలో కలిశారు. సుమారు గంటన్నర పాటు జరిగిన ఈ భేటీలో.. రాష్ట్ర ప్రాజెక్టులకు రావాల్సిన అనుమతులు, నిధుల విషయమై వినతులు సమర్పించారు. వీటిపై ప్రధాని సానుకూలంగా స్పందించినట్టు భేటీ అనంతరం ముఖ్యమంత్రి తెలిపారు.

టన్నెల్ ప్రమాదంపై ప్రధాని ఆరా..

సీఎంతో భేటీ సందర్భంగా ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ప్రమాదం, సహాయక

మిగతా 14వ పేజీలో ▶

పదేళ్లు పనులు చేయనందునే టన్నెల్ ప్రమాదం

- పెద్దగా కమీషన్లు రావనే కేసీఆర్ ఎస్ఎల్‌బీసీని గాలికొదిలేశారు
- మీడియాతో చిట్‌చాట్‌లో సీఎం రేవంత్ ఆరోపణలు
- మెట్రోరైల్ అనుమతుల అంశం కేంద్ర కేబినెట్‌లోకి రాకుండా అడ్డుకున్నది కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డే
- ప్రధాని మోదీకి ఇచ్చిన వినతులపై.. అనుమతులు, నిధులు తేవాల్సిన బాధ్యత కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లదేనని వ్యాఖ్య

14లో

నేడు 'ఎమ్మెల్సీ' పోలింగ్

రెండు ఉపాధ్యాయ, ఒక పట్టభద్రుల స్థానంలో గెలుపు కోసం పోటాపోటీ

- మూడుచోట్లా గెలిచి సత్తా చాటాలని ఆశిస్తున్న బీజేపీ
- గ్రాడ్యుయేట్ సీటు సాధించాలనే పట్టుదలతో కాంగ్రెస్
- స్వతంత్ర అభ్యర్థుల ఓట్ల చీలికపైనే ఆయా పార్టీల అభ్యర్థుల విజయావకాశాలు

స్థానం	అభ్యర్థులు	ఓటర్లు
మెదక్-నిజామాబాద్-ఆదిలాబాద్-కరీంనగర్ జిల్లాల పట్టభద్రుల స్థానం	56	3,55,159
మెదక్-నిజామాబాద్-ఆదిలాబాద్-కరీంనగర్ జిల్లాల ఉపాధ్యాయ స్థానం	15	27,088
వరంగల్-ఖమ్మం-నల్లగొండ జిల్లాల ఉపాధ్యాయ స్థానం	19	25,797

సాక్షి, హైదరాబాద్ : మూడు ఎమ్మెల్సీ స్థానాల్లో గురువారం జరిగే పోలింగ్‌కు సర్వం సిద్ధమైంది. మెదక్–నిజామాబాద్–ఆదిలాబాద్–కరీంనగర్ జిల్లాల పట్టభద్రులు, అదే జిల్లాల ఉపాధ్యాయ, వరంగల్–ఖమ్మం–నల్లగొండ జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాల్లో ఎన్నికలకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. గెలుపు కోసం బీజేపీ, కాంగ్రెస్, స్వతంత్రులు శక్తివంచన లేకుండా పోరాడుతున్నారు. 3 ఎమ్మెల్సీ స్థానాల్లోనూ విజయం సాధించి శాసనమండలిలో తమ బలాన్ని పెంచుకోవాలని భావిస్తున్న బీజేపీ నాయకత్వం ఈ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. కాంగ్రెస్ కూడా ఉత్తర తెలంగాణలో గెలిచి పట్టు నిలుపుకునే ప్రయత్నంలో పావులు కదిపింది. వరంగల్–ఖమ్మం–నల్లగొండ జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీచేస్తున్న హర్షవర్ధన్‌రెడ్డి (పీసీసీ అధికార ప్రతినిధి)కి అధికార అభ్యర్థిగా కాకుండా కాంగ్రెస్ పరోక్ష మద్దతు అందిస్తోంది. ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్ ఈ ఎన్నికల్లో ఎక్కడా అభ్యర్థిని నిలపలేదు. ఏ స్వతంత్ర అభ్యర్థికి కూడా

మిగతా 2వ పేజీలో ▶



9 ఓట్లు.. 12 మంది సిబ్బంది

ఇది భీమారం ప్రభుత్వ పాఠశాల (జగిత్యాల జిల్లా)లో ఏర్పాటైన పోలింగ్ కేంద్రం. దీని పరిధిలోని కరీంనగర్– ఆదిలాబాద్–నిజామాబాద్ – మెదక్ గ్రాడ్యుయేట్స్, టీచర్స్ స్థానాలకు సంబంధించి 9 మంది ఓటర్లే ఉండగా, పోలింగ్ నిర్వహణకు 12 మంది సిబ్బంది, పోలీసులు నియమితులయ్యారు.

కోరుట్ల

పండుగ వేళా ప్రలోభాలే

- శివరాత్రి శుభాకాంక్షల పేరుతో 'ఎమ్మెల్సీ' ప్రచార పర్వం - 2లో



14లో

చెట్టూ... నీ చరిత్ర చెప్పూ..

ఆ ఊళ్లో ప్రతి చెట్టుకీ క్యూఆర్ కోడ్.. జియో ట్యాగింగ్‌తో పర్యవేక్షణ.. చెట్టుకున్న క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే కళ్లకు కట్టే ఆ చెట్టు చరిత్ర.. అది ఏ జాతికి చెందినది?, ఎప్పుడు నాటారు?, ఇప్పటి వరకు వాతావరణం నుంచి ఎంత కార్బన్‌డయాక్సైడ్‌ను తీసుకుందనే వివరాలూ ప్రత్యక్షం.. ఈ ప్రత్యేకతతోనే ఇప్పుడు ముఖరా (కె) గ్రామం దేశంలోనే చెట్ల డేటాబేస్‌ను క్రోడీకరించే తొలి 'డిజిటల్ ట్రీ ఆధార్' విలేజ్‌గా నిలుస్తోంది.

అప్రమత్తంగా.. ఆచితూచి..

ఎస్ఎల్‌బీసీ సొరంగంలో నేటి నుంచి తవ్వకాలు

- తేలికపాటి పరికరాలతో శిథిలాల తొలగింపునకు నిపుణుల సూచన
- పైకప్పు మళ్లీ కూలకుండా రీఎన్‌ఫోర్స్‌మెంట్ చర్యలు
- రైల్వే శాఖ నుంచి హెవీ స్టీల్ గ్యాస్ కట్టర్‌లను తెప్పిస్తున్న ప్రభుత్వం
- నేటి నుంచి రంగంలోకి సింగరేణి, మార్కోస్ బృందాలు
- ఒకటీ రెండురోజుల్లో గల్లంతైన కార్మికుల జాడ తెలిసే అవకాశం



సొరంగం చివరి భాగంలో కార్మికుల జాడ కోసం గాలిస్తున్న రెస్క్యూ బృందం సభ్యులు

సాక్షి, హైదరాబాద్/నాగర్‌కర్నూల్: శ్రీశైలం ఎడమగట్టు కాల్వ (ఎస్ఎల్‌బీసీ) ఒకటో సొరంగం కుప్పకూలిన ఘటనలో గల్లంతైన 8 మంది కార్మికుల అన్వేషణలో భాగంగా గురువారం నుంచి సొరంగం లోపల తవ్వకాలను ప్రారంభించనున్నారు. గత ఆరు రోజుల్లో ఏడు రెస్క్యూ బృందాలు సొరంగం లోపలికి వెళ్లి పరిస్థితులను అంచనా వేసి బయటకు తిరిగి వచ్చాయి. అయినా కార్మికుల జాడ తెలుసుకోవడంలో పెద్దగా పురోగతి సాధ్యం కాలేదు. ఈ పరిస్థితుల్లో తవ్వకాలు ప్రారంభించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. అయితే భారీ యంత్రాలతో తవ్వకాలు జరిపితే మళ్లీ సొరంగం కుప్పకూలే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరించిన నేపథ్యంలో ప్రస్తుతానికి

మిగతా 3వ పేజీలో ▶

రెండ్రోజుల్లో ఆపరేషన్ పూర్తి చేస్తాం

- సొరంగంలో చిక్కుకున్న కార్మికులపై ఆశలు వదులుకోలేదు
- మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి వెల్లడి

- వివరాలు 3లో▶

శ్రీశైలం నుంచి చుక్క నీరు తీసుకోనివ్వొద్దు

- ఏపీని నిలువరించాలన్న తెలంగాణ
- సాగర్ నుంచి తీసుకుంటున్న జలాలు కూడా 5 వేల క్యూసెక్కులకు తగ్గించాలి
- అనధికారికంగా నీళ్లను తోడుకోవడానికే సమావేశాలకు గైర్హాజరవుతున్నారు
- కృష్ణా బోర్డు చైర్మన్ వద్ద రాష్ట్ర అధికారుల నిరసన

సాక్షి, హైదరాబాద్: శ్రీశైలం జలాశయం నుంచి ఇకపై చుక్క నీరు తీసుకోకుండా ఏపీని నిలువరించాలని, నాగార్జునసాగర్ నుంచి కుడి ప్రధాన కాల్వ ద్వారా ఆ రాష్ట్రం తీసుకుంటున్న 7 వేల క్యూసెక్కులను తక్షణమే 5 వేల క్యూసెక్కులకు తగ్గించేలా ఆదేశాలు జారీ చేయాలని తెలంగాణ డిమాండ్ చేసింది. శ్రీశైలం, సాగర్‌లో మిగిలి ఉన్న నిల్వలను ఏపీ, తెలంగాణ రాష్ట్రాలకు పంపిణీ చేసే అంశంపై బుధవారం హైదరాబాద్ జలసౌధలో కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) రెండో అత్యవసర సమావేశం జరగాల్సి ఉండగా, ఏపీ విజ్ఞప్తితో గురువారం ఉదయం 11 గంటలకు వాయిదా పడింది. దీంతో తెలంగాణ

మిగతా 5వ పేజీలో ▶

బల్క్‌డ్రగ్స్, వ్యాక్సిన్ క్యాపిటల్‌గా హైదరాబాద్

బయో ఆసియా-2025 ముగింపు సదస్సులో కిషన్‌రెడ్డి

- హైదరాబాద్ వేదికగా 800 ఫార్మా, బయోటెక్, మెడ్‌టెక్ కంపెనీలు పనిచేస్తున్నాయి
- గత పదేళ్లలో ఫార్మా ఎగుమతుల విలువ రెట్టింపైంది
- ఫార్మసీ ఆఫ్ ది వరల్డ్‌గా భారత్: కేంద్ర మంత్రి పీయూష్



సదస్సులో ఏర్పాటు చేసిన స్టాల్‌ను పరిశీలిస్తున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: బల్క్ డ్రగ్స్, వ్యాక్సిన్ క్యాపిటల్‌గా హైదరాబాద్ ఖ్యాతి గాంచిందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి చెప్పారు. డ్రగ్స్, ఫార్మాస్యూటికల్స్ ఉత్పత్తిలో భారత్ ప్రపంచంలోనే మూడో స్థానంలో ఉందని.. ప్రపంచ అవసరాల్లో 60 శాతానికి పైగా వ్యాక్సిన్లు, 20% జనరిక్ మందులు ఇక్కడి నుంచే సరఫరా అవుతున్నాయని తెలిపారు. బయో ఆసియా–2025 సదస్సు ముగింపు కార్యక్రమంలో కిషన్‌రెడ్డి ప్రసంగించారు. ''గత పదేళ్లలో భారత ఫార్మా ఎగుమతుల విలువ రెట్టింపు అయింది. 2014లో ఫార్మా ఎగుమతి విలువ 15 బిలియన్ డాలర్లుకాగా.. 2024 నాటికి అది 27.85 బిలియన్ డాలర్లకు చేరింది. ప్రధాని మోదీ నేతృత్వంలో భారత్ పరిశోధనలు, ఏఐ–హెల్త్ కేర్,

మిగతా 5వ పేజీలో ▶

రెడ్‌బుక్ రాజ్యాంగం

పోసాని కృష్ణ మురళి అక్రమ అరెస్ట్

- హైదరాబాద్‌లో అదుపులోకి తీసుకున్న అన్నమయ్య జిల్లా పోలీసులు.. ఆస్పత్రిలో చూపించుకున్నాక వస్తానని కోరినా ఆలకించని వైనం
- అరెస్టు చేసింది బుధవారం రాత్రి.. రిపోర్టులో గురువారం అని నమోదు

2లో



హైదరాబాద్‌లో పోసానిని అదుపులోకి తీసుకుంటున్న ఏపీ పోలీసులు

ఇదండీ సంగతి



పుతిన్ కాదంటే.. మీరేనా సార్!



తమిళనాడు

డీలిమిటేషన్‌పై అమిత్ షా

దామాషా విధానంలో చేపట్టే పునర్వ్యవస్థీకరణ వల్ల లోక్‌సభ నియోజకవర్గాల సంఖ్య తగ్గదని హోం మంత్రి అమిత్ షా ప్రకటించారు. తమిళనాడుకే కాదు, ఏ ఒక్క దక్షిణాది రాష్ట్రానికీ నష్టం జరగదని కుండబద్దలు కొట్టారు. దక్షిణాది రాష్ట్రాలకు న్యాయమైన వాటా లభిస్తుందని, ఇందులో ఎలాంటి సందేహం లేదని అన్నారు.

ఒక్క సీటూ తగ్గదు..

- వివరాలు 6లో▶



అమెరికా

పెట్టుబడితో వచ్చేవారికి డొనాల్డ్ ట్రంప్ ఆఫర్

అక్రమ వలసదారులను సాగనంపుతున్న ట్రంప్ పెట్టుబడిదారులకు మాత్రం స్థిరనివాసం కల్పిస్తామంటూ సాదర స్వాగతం పలుకుతున్నారు. రూ.43.56 కోట్ల పెట్టుబడితో వచ్చే వారికి కొత్తగా గోల్డ్ కార్డ్ వీసాలను ఇస్తామని ప్రకటించారు.

43 కోట్లుంటే.. గోల్డ్‌కార్డ్

- వివరాలు 6లో▶



న్యూఢిల్లీ

సుప్రీంలో కేంద్రం అఫిడవిట్

క్రిమినల్ కేసుల్లో దోషులుగా తేలిన రాజకీయ నాయకులపై జీవితకాలం నిషేధం విధించాలన్న వినతిని కేంద్ర ప్రభుత్వం వ్యతిరేకించింది. వారిపై అనర్హత వేటు వేయడం అనేది కేవలం పార్లమెంట్ పరిధిలోని అంశమని ఉద్ఘాటించింది. దీనితో న్యాయ వ్యవస్థకు సంబంధం లేదంటూ సుప్రీంలో అఫిడవిట్ దాఖలు చేసింది.

పార్లమెంట్‌దే నిర్ణయాధికారం

- వివరాలు 6లో▶



అవినీతి ఆరోపణలున్నా అందలం!

దేవాదాయ శాఖలో విచిత్రం..

ఓ అధికారిని గతంలో ప్రాధాన్యం లేని పోస్టుకు పరిమితం చేసిన కమిషనర్

ఆయన రిటైర్‌మెంట్‌తో మళ్లీ కీలక పోస్టులోకి...

సాక్షి, హైదరాబాద్: దేవాదాయ శాఖలో అవినీతి ఆరోపణలున్న ఓ అధికారి మళ్లీ కీలక పోస్టుకు రావడం ఇప్పుడు చర్చనీయాంశమవుతోంది. కమిషనర్ రిలీవ్ రాగానే చక్రం తిప్పాడంటూ.. పాత రోజులు గుర్తు చేసుకొని కొందరు ఈఓలు హడలిపోతున్నారు. రాష్ట్రంలోని పెద్ద ఆలయాల్లో ఆ ఏడాది ఖర్చు చేయాల్సిన నిధులకు సంబంధించి ముందస్తు అనుమతి తీసుకోవాలి. ఆ బడ్జెట్ ప్రతిపాదనలకు గ్రీన్‌సిగ్నల్ రావాలంటే ప్రధాన కార్యాలయంలోని ఆ అధికారికి కమీషన్ ముట్టజెప్పాల్సిందే. చేయి తడిపితే.. రికార్డుల్లోని లోపాలను ఆసరా చేసుకొని సీనియారిటీ జాబితాలో మతలబు చేయటం ద్వారా అందలం దక్కేందుకు వీలు కల్పిస్తారు. తనిఖీల పేరిట దేవాలయాలకు వచ్చి కొంత మొత్తం ఖరారు చేసి పుచ్చుకుంటుంటారని ఆయన లీలలను అధికారులు, సిబ్బంది కథలుకథలుగా చెప్పుకుంటారు. గతంలో వసూళ్ల పేరిట ఆయన వేధింపులు తాళలేకపోయిన కొందరు ఈఓలు కమిషనర్‌కు తమ గోడు వినిపించారు. ఆయన ప్రాథమిక విచారణ జరిపి ఆ అధికారిని ప్రాధాన్యం లేని పోస్టుకు మార్చారు. ఇప్పుడు ఆ కమిషనర్ మారిపోగానే, మళ్లీ ఆ అధికారి తిరిగి అదే కుర్చీలో పాగా వేశారు.

కమిషనర్ కాదన్నా... నేతల అండతో..

దేవాదాయశాఖ ప్రధాన కార్యాలయంలో తాజాగా ఓ ఉన్నతాధికారి నియామకం ఇప్పుడు దేవాలయ ఈఓలు, ఇతర అధికారుల గుండెల్లో రైళ్లు పరిగెత్తేలా చేస్తోంది. గతంలో ఆయన కమీషన్ల కోసం వేధించిన తీరును వారు ఉదహరిస్తున్నారు. కమీషన్లు ఇవ్వని అధికారులను వేధించటం, పదోన్నతులు, బదిలీల్లో ఇబ్బంది పెట్టడం లాంటివి చేస్తుండటంతో అప్పట్లో ఆయనపై తీవ్ర ఫిర్యాదులు వెల్లువెత్తాయి. నాటి బీఆర్ఎస్ ప్రభుత్వంలో దేవాదాయ శాఖ మంత్రి కార్యాలయానికి ఫిర్యాదులు చేస్తే పట్టించుకోలేదు. దీంతో కమిషనర్‌కు ఫిర్యాదులు పంపారు. వీటిని పరిశీలించిన నాటి కమిషనర్ అనిల్‌కుమార్ అంతర్గతంగా విచారణ జరిపించారు. అయితే నేతల అండ ఉండటంతో ఆయన మాట చెల్లుబాటు కాలేదు. దీంతో నాటి దేవాదాయ శాఖ మంత్రిని కలిసి.. ఆ ఉన్నతాధికారిని తప్పించాల్సిందేనని, లేదంటే తననే మార్చాలంటూ పట్టుబట్టారు. దీంతో ఆ అధికారిని బదిలీ చేసి ప్రాధాన్యం లేని పోస్టు కేటాయించారు. దీంతో ఈఓలు ఊపిరిపీల్చుకున్నారు. కమిషనర్ అనిల్‌కుమార్ ఉన్నంతకాలం ఆయనకు మళ్లీ కీలక పోస్టు దక్కకుండా చూశారు. పదవీ విరమణ అనంతరం కొంతకాలం ఎక్స్‌టెన్షన్‌తో కొనసాగిన అనిల్‌కుమార్ ఇటీవల రిలీవ్ అయ్యారు. దీంతో ఆరోపణలున్న ఆ అధికారి మళ్లీ పైరవీలు ప్రారంభించి తిరిగి కీలక పోస్టును దక్కించుకున్నారు. అక్కడ పనిచేస్తున్న మరో అధికారిపై కూడా అవినీతి ఆరోపణలు రావటాన్ని ఆసరా చేసుకొని, ఆ అధికారిని తప్పించటం ద్వారా తనకు ఆ పోస్టు దక్కేలా చక్రం తిప్పారు. మళ్లీ రేట్లు ఫిక్స్ చేసి వసూళ్ల పర్వం ప్రారంభించకముందే ఆయన్ను తప్పించాలంటూ ఉద్యోగులు విన్నపాలు ప్రారంభించారు.

దేవాదాయ శాఖ

ఆ దేవుడే దిక్కు..

టెండర్లు లేకుండా సెక్యూరిటీ సిబ్బంది సరఫరా!



దేవాదాయశాఖలో తెర వెనుక కసరత్తు

ఉమ్మడి కరీంనగర్‌లోని ఓ ప్రధాన దేవాలయం నుంచి ప్రతిపాదన

అది ఓకే కాగానే.. మిగతా దేవాలయాలకు వర్తించేలా ఏర్పాట్లు?

సాక్షి, హైదరాబాద్: దేవాదాయ శాఖలో టెండర్ల ప్రక్రియను మళ్లీ అపహాస్యం చేసేందుకు కొందరు అధికారులు రంగం సిద్ధం చేస్తున్నారు. గతంలో వస్తువుల కొనుగోలు, సెక్యూరిటీ సిబ్బంది సరఫరా తదితరాలను టెండర్లతో ప్రమేయం లేకుండా అస్మదీయులకు కట్టబెట్టే విచ్చలవిడితనం కొనసాగేది. కొన్నేళ్లపాటు నిలిచిపోయిన ఆ తీరును మళ్లీ ప్రారంభించేందుకు తెర వెనుక ఏర్పాట్లు జరుగుతున్నాయి. ప్రస్తుతం దేవాలయాల్లో ప్రైవేట్ సంస్థలు సెక్యూరిటీ సిబ్బందిని సరఫరా చేస్తున్నాయి. ఇవి ఏ దేవాలయానికి ఆ దేవాలయం టెండర్లు పిలిచి తక్కువ మొత్తం కోట్ చేసిన సంస్థకు బాధ్యత అప్పగిస్తాయి. తరచూ కమిషనర్లు మారటం, ఉన్నవారికి ఇతరశాఖ అదనపు బాధ్యతలుండటంతో దేవాదాయశాఖపై అంతగా దృష్టి పెట్టడం లేదన్న విమర్శలున్నాయి. ఈ నేపథ్యంలో కొందరు ఉన్నతాధికారులు ఇష్టం వచ్చినట్టు చేస్తున్నారు. తాజాగా ఓ డిప్యూటీ కమిషనర్‌స్థాయి అధికారి ఉమ్మడి కరీంనగర్‌లోని ఓ ప్రముఖ దేవాలయ సెక్యూరిటీ సిబ్బంది సరఫరా విషయంలో ఈ విచ్చలవిడితనానికి తెరదీస్తున్నారు. ఈ ఆలయంలో ప్రైవేట్ ఏజెన్సీ సెక్యూరిటీ సిబ్బంది బాధ్యతలు చూస్తోంది. దాని గడువు పూర్తి కావటంతో టెండర్లు పిలిచి కొత్త సంస్థను ఎంపిక చేయాల్సి ఉంది. ఇప్పటి వరకు ఆ బాధ్యత చూసిన సంస్థకు టెండర్ దక్కితే దానికే ఆ బాధ్యతలను అప్పగించాల్సి ఉంటుంది. కానీ, టెండర్ల అవసరం లేకుండా, పాత సంస్థకే మరికొంత కాలం గడువు పెంచేలా ఉన్నతాధికారి చక్రం తిప్పారు. అత్యవసర పని తరహాలో, టెండర్లు పిలిచి కొత్త సంస్థను ఎంపిక చేసే సమయం లేదన్నట్టుగా.. పాత సంస్థనే కొనసాగించేలా అనుమతి కోరుతూ ప్రతిపాదన పెట్టారు. దీనికి మరో ఉన్నతాధికారి అనుకూలంగా వ్యవహరిస్తూ ఆమోదముద్ర పడేలా చూస్తున్నట్టు తెలిసింది. ఇది ఓకే కాగానే..మరికొన్ని పెద్ద దేవాలయాల్లో కూడా టెండర్లు పిలవకుండా, ఉన్న కంపెనీ గడువునే పొడిగించేలా ప్రతిపాదించే యోచనలో ఉన్నట్టు తెలిసింది.

క్లుప్తంగా...

రాహుల్‌కు ఉన్నత పదవి ఖాయం

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయంలో పూజలు చేస్తున్న డిప్యూటీ సీఎం భట్టి దంపతులు

వైరా: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ భవిష్యత్‌లో రాజకీయంగా ఉన్నత పదవి అలంకరిస్తారని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. మహాశివరాత్రి సందర్భంగా స్వగ్రామమైన ఖమ్మం జిల్లా వైరా మండలం స్నానాల లక్ష్మీపురంలోని శ్రీ రామలింగేశ్వరస్వామి ఆలయంలో భట్టి విక్రమార్క, నందిని దంపతులు బుధవారం రాహుల్ గాంధీ పేరిట ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భట్టి మాట్లాడుతూ రాహుల్ గాంధీకి చెందిన దత్తాత్రేయ గోత్రంతో పూజలు నిర్వహించినట్లు తెలిపారు. అనంతరం గ్రామస్తులు, స్నేహితులను భట్టి ఆప్యాయంగా పలకరిస్తూ మిఠాయిలు కొనుగోలు చేసి అందజేశారు.

కేటీఆర్ ఫ్లెక్సీలుంటే కక్ష కడుతుండ్రు

- ఎమ్మెల్సీ కవిత ఆరోపణ
- రాజన్నకు మొక్కుల చెల్లింపు



రాజన్నను దర్శించుకుంటున్న కవిత

వేములవాడ: సిరిసిల్లలో కేటీఆర్ ఫొటోలు ఫ్లెక్సీలపై పెట్టుకుంటే కక్ష సాధింపు చర్యలకు దిగుతున్నారని, ఇలాంటి దుర్మార్గపు ప్రభుత్వంతో ప్రజలు విసుగెత్తిపోతున్నారని ఎమ్మెల్సీ కవిత విమర్శించారు. మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ఆమె వేములవాడ రాజన్నను బుధవారం దర్శించుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి కేసీఆర్ హయాంలో రూ.250 కోట్లు ఖర్చు చేశామన్నారు. తమ ప్రభుత్వ హయాంలోనే గుడి చెరువు వద్ద 30 ఎకరాల స్థలాన్ని సేకరించడాన్ని గుర్తు చేశారు.

'కోడ్' లేని జిల్లాల్లో ఆత్మీయ భరోసా నిధులు విడుదల

ఉమ్మడి రంగారెడ్డి, పాలమూరు జిల్లాల్లో ఉపాధి కూలీల ఖాతాల్లో జమ

సాక్షి, హైదరాబాద్: ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లో లేని ఉమ్మడి రంగారెడ్డి, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాల్లోని ఉపాధి హామీ కూలీల ఖాతాల్లో ప్రభుత్వం ఇందిరమ్మ ఆత్మీయ భరోసా నిధులను జమచేసింది. ఉపాధి కూలీలకు ఆర్థిక చేయూత కల్పిస్తూ, ఇందిరమ్మ ఆత్మీయ భరోసాను ప్రభుత్వం అమలు చేస్తున్న విషయం తెలిసిందే. జనవరి 26న ఈ పథకం ప్రారంభం కాగా ఒక్కో మండలంలోని ఒకగ్రామంలో ప్రయోగాత్మకంగా గ్రామ సభలు నిర్వహించి కూలీల బ్యాంకు ఖాతాల్లో నిధులు జమ చేయడం ప్రారంభించారు. ఈ పథకం ప్రారంభం సందర్భంగా.. మొత్తం 18,180 మందికి రూ.6 వేల చొప్పున ఉపాధి కూలీల ఖాతాల్లో జమ చేశారు. ఆ తర్వాత మండలి ఎన్నికల నేపథ్యంలో కోడ్ అమల్లోకి రావడంతో ఈ పథకం కింద చెల్లింపులు నిలిచిపోయాయి. అయితే కోడ్ అమల్లో లేని జిల్లాలకు నిధులు విడుదల చేయాలని మంత్రి సీతక్క విజ్ఞప్తి చేయడంతో, ఉమ్మడి మహబూబ్‌నగర్, రంగారెడ్డి జిల్లాలకు నిధులు విడుదల చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ఈ రెండు జిల్లాల్లో 66,240 మంది ఉపాధి హామీ కూలీల ఖాతాల్లో రూ. 39.74 కోట్ల నిధులు జమచేసింది.

నేడు 'ఎమ్మెల్సీ' పోలింగ్



నల్లగొండలోని డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లో బ్యాలెట్ బాక్స్‌ను పరిశీలిస్తున్న రిటర్నింగ్ అధికారి, నల్లగొండ కలెక్టర్ ఇలాత్రిపాఠి



రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండల కేంద్రంలోని ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రానికి ఒక వైపు ప్రహరీ లేదు. దీంతో టెంట్‌హౌస్ నుంచి పరదాలు తెప్పించి చాటు చేశారు



జయశంకర్ భూపాలపల్లి జిల్లా పలిమెల మండల కేంద్రంలోని పోలింగ్ స్టేషన్ పరిధిలోని పట్టభద్రుల ఓటర్లు 38 మంది ఉండగా, ఉపాధ్యాయ ఓటరుఒక్కరే ఉన్నారు

▶ మొదటి పేజీ తరువాయి

ప్రత్యక్ష, పరోక్ష మద్దతు ప్రకటించలేదు.

కరీంనగర్ ఉపాధ్యాయ పరిధిలో ఇలా...

మెదక్–నిజామాబాద్–ఆదిలాబాద్–కరీంనగర్ జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానంలో తమ అభ్యర్థి మల్క కొమురయ్య గెలిచే అవకాశాలు ఉన్నట్టుగా బీజేపీ అంచనా వేస్తోంది. ఇక్కడ ప్రధానంగా మల్క కొమురయ్య (బీజేపీ), వంగా మహేందర్‌రెడ్డి (పీఆర్‌టీయూ), అశోక్‌కుమార్.వై (యూటీఎఫ్, ఇతర సంఘాల మద్దతు), సిట్టింగ్ ఎమ్మెల్సీ కూర రఘోత్తమ్‌రెడ్డి (ఎస్టీయూ, ఇతర సంఘాలు)ల మధ్య పోటీ ఉంటుందని రాజకీయవర్గాల్లో చర్చ సాగుతోంది.

కరీంనగర్ గ్రాడ్యుయేట్స్ పరిధిలో ఇలా...

మెదక్–నిజామాబాద్–ఆదిలాబాద్–కరీంనగర్ జిల్లాల పట్టభద్రుల స్థానంలో ప్రధానంగా సి.అంజిరెడ్డి, ప్రసన్న హరికృష్ణల మధ్య పోటీ ఉంటుందని బీజేపీ నాయకులు భావిస్తున్నారు. తమ పార్టీ అభ్యర్థిగా బరిలో ఉన్న నరేందర్ రెడ్డికి విజయావకాశాలు ఉన్నాయని కాంగ్రెస్ నేతలు అంచనా వేస్తున్నారు. అయితే పలువురు స్వతంత్ర అభ్యర్థులు పోటీలో ఉండడంతో వారికి పడే ఓట్లను బట్టి ఫలితాలు ప్రభావితం అవుతాయనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. సి.అంజిరెడ్డి (బీజేపీ), ఊటుకూరి నరేందర్‌రెడ్డి (కాంగ్రెస్), ప్రసన్న హరికృష్ణ (బీఎస్‌పీ), రవీందర్‌సింగ్(ఏఐఎఫ్‌బీ)ల మధ్య పోటీ ఉంటుందని భావిస్తున్నారు.

వరంగల్ ఉపాధ్యాయ పరిధిలో ఇలా...

వరంగల్–ఖమ్మం–నల్లగొండ జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానంలో ప్రధానంగా సరోత్తమ్‌రెడ్డి, హర్షవర్ధన్‌రెడ్డిల మధ్య పోటీ ఉండే అవకాశాలున్నాయని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. చివరకు టీచర్లను ఇన్‌ఫ్లుయన్స్ చేయడం మనీ మేనేజ్‌మెంట్ అనేది కీలకంగా మారిందని చెబుతున్నారు. హర్షవర్ధన్‌కు మంత్రులు, ఎమ్మెల్యేలు పరోక్షంగా మద్దతు ప్రకటించినట్టు చెబుతున్నారు. శ్రీపాల్‌రెడ్డి కూడా గట్టి పోటీ ఇచ్చే అవకాశాలున్నాయనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. టీచర్ల సమస్యలపై సరిగ్గా స్పందించలేదని సిట్టింగ్ ఎమ్మెల్సీ నర్సిరెడ్డిపై కొంత వ్యతిరేకత వ్యక్తమవుతున్నట్టు సమాచారం. ఇక మాజీ ఎమ్మెల్సీ పూలరవీందర్ ఓటింగ్‌పై ఏ మేరకు ప్రభావం చూపుతారనే దానిని బట్టి ఓటింగ్ సరళిలో మార్పులు వచ్చి విజేతలపై స్పష్టత వస్తుందంటున్నారు. ఇక్కడ ప్రధానంగా హర్షవర్ధన్‌రెడ్డి (టీచర్స్ జేఏసీ అభ్యర్థి, టీపీసీసీ అధికార ప్రతినిధి), పులి సరోత్తమ్‌రెడ్డి (బీజేపీ), శ్రీపాల్‌రెడ్డి (పీఆర్‌టీయూ మద్దతు), మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్ (ఎస్టీయూ, బీసీ సంఘాల మద్దతు), సిట్టింగ్ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి (యూటీఎఫ్ అభ్యర్థి)ల మధ్యనే పోటీ ఉంటుందని అంచనా వేస్తున్నారు.

కాళేశ్వరం కూలిందన్న మూర్ఖులకు ఈ నీరే సమాధానం

14 నెలల కాంగ్రెస్ పాలనలో నాలుగు ప్రాజెక్టులు కూలాయి: మాజీ మంత్రి హరీశ్‌రావు

సాక్షి, సిద్దిపేట: కాళేశ్వరం కూలిందని ప్రచారం చేసిన మూర్ఖులకు పొలాల్లో గలగలా పారుతున్న నీరే తగిన సమాధానం చెపుతుందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. 'హైదరాబాద్ గాంధీభవన్‌లో కూర్చొని మాట్లాడటం కాదు..., పల్లెల్లోకి వచ్చి గోదావరి జలాలను చూసి మేల్కోవాలి'అని హితవు పలికారు. సిద్దిపేట నియోజకవర్గం చిన్నకోడూరు మండలం విఠలాపూర్ వద్ద కాళేశ్వరంలో భాగమైన రంగనాయకసాగర్ నుంచి బుధవారం కాలువలకు నీళ్లను వదిలారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ సిద్దిపేట, యాదాద్రి, మెదక్ సహా తెలంగాణకు కాళేశ్వరం ప్రాజెక్టు వరప్రదాయిని అని, కాళేశ్వరం లేకుంటే పంటలు పండేవి కావని, బోరు బావుల్లో చుక్క నీరు ఉండేది కాదని అన్నారు. 14 నెలల కాంగ్రెస్ పాలనలో ఖమ్మం జిల్లాలో పెద్ద వాగు, నల్లగొండ జిల్లాలో సుంకిశాల, పాలమూరులో వట్టెం పంప్ హౌస్, నిన్న గాక మొన్న ఎస్ఎల్‌బీసీ కూలిపోయాయన్నారు. కాళేశ్వరంలో ఒక్క పిల్లర్ కుంగితే బీఆర్ఎస్ తప్పు చేసిందని రాజకీయం చేశారని ధ్వజమెత్తారు. ఇప్పటికైనా కుంగిన పిల్లర్‌కు మరమ్మతులు చేయించాలని కోరారు.



చిన్నకోడూరు మండలంలో గోదావరి నీటి ప్రవాహం వద్ద సెల్ఫీ దిగుతున్న హరీశ్‌రావు

నేను బీఆర్‌ఎస్‌లోనే ఉన్నా

ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి



గద్వాల: 'నేను బీఆర్ఎస్ పార్టీ నుంచి గెలుపొందిన ఎమ్మెల్యేను. నా ఫొటోను గుర్తు తెలియని వ్యక్తులు కాంగ్రెస్ పార్టీలో వాడారు. వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలి' అని కోరుతూ గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి ఈ నెల 11వ తేదీన గద్వాల పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు సోషల్ మీడియాలో ప్రచారం అవుతోంది. ఇదిలా ఉండగా దీనిపై కేటీఆర్ సైతం స్పందించినట్లు తెలుస్తోంది. 'బండ్ల కృష్ణమోహన్‌రెడ్డితో పాటు పార్టీ మారిన ఎమ్మెల్యేలు అనర్హత వేటు పడుతుందన్న భయంతో రకరకాల జిమ్మిక్కులు చేస్తున్నారు' అని కేటీఆర్ విడుదల చేసిన ప్రకటనలో ఘాటుగా స్పందించారు. ప్రస్తుతం ఈ వ్యవహారం బీఆర్ఎస్ సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తోంది. దీనిపై వివరణ కోసం ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డిని ఫోన్ ద్వారా సంప్రదించగా అందుబాటులోకి రాలేదు. గద్వాల పట్టణ ఎస్సై కల్యాణ్‌కుమార్‌ను వివరణ కోరగా.. శాంతి భద్రతల దృష్ట్యా కొన్ని విషయాలు బయటకు చెప్పలేమని, దీనిపై తాము ఏమి మాట్లాడలేమని చెప్పడం కొసమెరుపు.

శివ.. శివా.. పండుగ వేళా ప్రలోభాలే

శివరాత్రి వేళ.. ఉపాధ్యాయ ఓటర్లకు ప్రత్యేక దర్శనాలు

- పూజా సామగ్రితో పాటు తాయిలాలు

సాక్షి, హైదరాబాద్: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ఆఖరి ఘట్టం శివ తాండవాన్ని తలపించింది. టీచర్ల ఓట్లను ఆకర్షించేందుకు శివరాత్రి పర్వదినాన్ని సైతం అభ్యర్థులు వదిలిపెట్టలేదు. సెంటిమెంట్‌ను ముందుపెట్టి మరీ గుట్టుచప్పుడు కాకుండా ప్రచారం చేశారు. మూడో కన్నుకు తెలియకుండా తాయిలాలు పంపిణీ చేశారు. గెలుపే లక్ష్యంగా ప్రతీ ఓటరుకూ శివరాత్రి పర్వదిన శుభాకాంక్షలు జోడించి మరీ తమ వైపు తిప్పుకునే ప్రయత్నం చేశారు. గురువారం పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానంతోపాటు, రెండు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాలకు పోలింగ్ జరగనుంది. కొన్ని రోజులుగా విస్తృతంగా ప్రచారంలో మునిగితేలిన అభ్యర్థులు ఆఖరిరోజు ఆకర్షణల పర్వానికి తెరలేపారు. ప్రభుత్వ విద్యా సంస్థలకు బుధవారం సెలవు...ఇది కూడా అభ్యర్థుల తెరచాటు ప్రచారానికి కలిసొచ్చింది.

- ఖమ్మం–నల్లగొండ–వరంగల్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానం నుంచి 19 మంది పోటీ పడుతున్నారు. వీరిలో మూడు ప్రధాన ఉపాధ్యాయ సంఘాల మధ్యే పోటీ తీవ్రంగా ఉంది.
- కరీంనగర్–ఆదిలాబాద్–నిజామాబాద్–మెదక్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి 15 మంది పోటీ పడుతున్నా, ఇందులో 12 మంది ఇండిపెండెంట్ అభ్యర్థులే. ప్రధాన సంఘాల నుంచి పోటీ చేస్తున్న నేతలు మాత్రం అందుబాటులో ఉన్న గెలుపు అవకాశాలను విడిచిపెట్టలేదు.



ఆయా జిల్లాల్లో ఇలా...

ఉపాధ్యాయ ఓటర్లను ఆకట్టుకునేందుకు కొందరు అభ్యర్థులు తమ అనుయాయులను పెద్దఎత్తున రంగంలోకి దింపారు. హంగూఆర్భాటం లేకుండా ఓటర్ల ఇంటికి వెళ్లి ఓట్లు అడిగారు. 'అన్నా శివరాత్రి ఉపవాసం ఉంటున్నావు మాట తప్పవుగా'లాంటి సెంటిమెంట్‌ను ప్రయోగించారు. కొన్నిచోట్ల చేతిలో చెయ్యి కూడా వేయించుకున్నారు. కొందరు అభ్యర్థులు ఓట్లున్న టీచర్లను శివాలయాల వద్దకు గుంపుగా తీసుకెళ్లడం, ప్రత్యేక దర్శనాలు చేయించడం కూడా కనిపించింది. 'ఇద్దరు అభ్యర్థులు పిలిచారు. శివాలయానికి రెండుసార్లు వెళ్లక తప్పలేదు'అని కరీంనగర్‌కు చెందిన ఓ టీచర్ వాపోయారు.

- ఖమ్మం జిల్లాలో ఓ ఉపాధ్యాయ సంఘం అనుయాయులు శివరాత్రి వేల..పండ్లు, పూజాసామగ్రి ఇస్తూ అందులో డబ్బులు పెట్టారు. ఓటుకు రూ. 2 నుంచి 5 వేల వరకూ పంపిణీ చేసినట్టు తెలిసింది.
- వరంగల్ జిల్లాలో పూజా సామగ్రిలో వచ్చిన డబ్బులను కొంతమంది టీచర్లు చూసుకోలేదు. శివాలయానికి యథాతథంగా ఇవ్వడం..ఆ తర్వాత విషయం తెలిసి ఆందోళన పడటం విశేషం. కొంతమంది పూజాసామగ్రిలో డబ్బులు ఇచ్చిన విషయాన్ని ఫోన్లు చేసి చెప్పారు. తమ అభ్యర్థికి ఓటు వేయమని తెలిపారు.
- అన్ని జిల్లాల్లో శివరాత్రి శుభాకాంక్షలు తెలిపే సందేశాలను రాజకీయ కోణంలో తయారు చేయించారు. దీనికోసం డిజిటల్ ప్లాట్‌ఫామ్‌ను ఎక్కువగా వాడుకున్నారు. అందులో తమ అభ్యర్థికి ఓటు వేయాలని భావన వచ్చేలా జాగ్రత్త పడ్డారు.
- నల్లగొండ, ఖమ్మం, నిజామాబాద్ జిల్లాల్లో టీచర్ల బంధువుల నంబర్లు ముందే తీసుకున్నారు. వారికి ఫోన్ పే, ఇతర మార్గాల్లో డబ్బులు పంపారు.
- కరీంనగర్ జిల్లాలో అభ్యర్థులు ఉపవాస దీక్షను ఎన్నికల ప్రచారం కోసం వాడుకున్నారు. ఉపవాస దీక్షలో ఉన్న టీచర్లను ఎంపిక చేసుకొని, వారికి పాలు, పండ్లు, తేనె వంటివి పంపారు. అందులోనూ డబ్బుల పంపిణీ గుట్టుచప్పుడు కాకుండా సాగినట్టు తెలిసింది.


రెడ్‌బుక్ రాజ్యాంగం

పోసాని కృష్ణ మురళి అక్రమ అరెస్ట్

సాక్షి, అమరావతి: రెడ్‌బుక్ రాజ్యాంగ కుట్రలతో చంద్రబాబు ప్రభుత్వం యథేచ్ఛగా విధ్వంసానికి బరితెగిస్తోంది. టీడీపీ కూటమి నియంతృత్వ పాలన రాష్ట్రంలో రాజ్యాంగ హక్కులను కాలరాస్తోంది. పౌరుల ప్రాథమిక హక్కులను పాశవికంగా అణచివేస్తోంది. చట్టబద్ధ దర్యాప్తు ప్రక్రియను భ్రష్టు పట్టిస్తోంది. ధర్మబద్ధ న్యాయ ప్రక్రియను మంటగలుపుతోంది. అందుకోసం పోలీసు శాఖ ద్వారా అధికారిక గూండాగిరీకి పాల్పడుతోంది. సీఐడీ విభాగాన్ని తమ కక్ష సాధింపు చర్యలకు సాధనంగా చేసుకుంటోంది. రాష్ట్రంలో అన్ని వ్యవస్థలను నిర్వీర్యం చేస్తూ పచ్చ కుట్రలకు అంతకంతకూ పదునుపెడుతోంది. వైఎస్సార్‌సీపీ హయాంలో మద్యం విధానంపై టీడీపీ కూటమి ప్రభుత్వం నమోదు చేసిన అక్రమ కేసు దర్యాప్తు తీరే చంద్రబాబు కుతంత్రానికి తాజాగా మరో తార్కాణం. ఏకంగా 164 సీఆర్‌పీసీ పేరిట అబద్ధపు వాంగ్మూలం నమోదుకు తెగబడటం చంద్రబాబు కుట్రకు పరాకాష్ట. కాగా ప్రముఖ సినీ నటుడు పోసాని కృష్ణ మురళిని బుధవారం రాత్రి హైదరాబాద్‌లో అక్రమంగా అరెస్ట్ చేయడం టీడీపీ కూటమి ప్రభుత్వ కక్షసాధింపు కుతంత్రంలో తాజా పర్వం. ఏనాడో చేసిన సాధారణ వ్యాఖ్య ఆధారంగా టీడీపీ కూటమి ప్రభుత్వం కక్ష సాధింపులకు పాల్పడింది. ఆయన్ను అక్రమంగా అరెస్ట్ చేసి వికట్టాహాసం చేస్తోంది. చంద్రబాబు ప్రభుత్వ రెడ్‌బుక్ రాజ్యాంగ అమానుష పాలనలో మరెన్ని దారుణాలను చూడాల్సి వస్తుందోనని యావత్ రాష్ట్రం బెంబేలెత్తిపోతోంది.

మరోసారి రెడ్‌బుక్ కుట్రకు బరితెగించింది: పోసాని కృష్ణ మురళిని అక్రమంగా అరెస్ట్ చేసి తన రాజకీయ వికృతరూపాన్ని నిస్సిగ్గుగా ప్రదర్శించింది. అన్నమయ్య జిల్లా సంబేపల్లి పోలీసులు పోసాని కృష్ణ మురళిని హైదరాబాద్ గచ్చిబౌలిలోని ఆయన నివాసంలో బుధవారం రాత్రి అరెస్ట్ చేశారు. ఆయన్ను హైదరాబాద్ నుంచి అన్నమయ్య జిల్లాకు తరలిస్తున్నారు. గతంలో కుట్రపూరితంగా ఆంధ్రప్రదేశ్‌లోని పలు జిల్లాల్లో ఆయనపై టీడీపీ, జనసేన పార్టీలు అక్రమ ఫిర్యాదులు చేశాయి. తద్వారా తాము ఎప్పుడు అనుకుంటే అప్పుడు అక్రమంగా అరెస్ట్ చేసి తరలించేందుకు ముందస్తు పన్నాగం పన్నాయి. ఆ ఫిర్యాదులపై పోసాని కృష్ణ మురళిని ఇప్పటివరకు విచారించడంగానీ ఇతరత్రా దర్యాప్తు ప్రక్రియగానీ కొనసాగలేదు. కానీ హఠాత్తుగా బుధవారం ఆయన్ను అరెస్ట్ చేసి అన్నమయ్య జిల్లాకు తరలించడం గమనార్హం. అసలు ఏ కేసులో అరెస్ట్ చేస్తున్నారో కూడా స్పష్టంగా చెప్పలేదు. అన్నమయ్య జిల్లా సంబేపల్లి పోలీస్ స్టేషన్‌లో గతంలో నమోదు చేసిన కేసులో అరెస్ట్ చేస్తున్నట్టు ప్రకటించి ఆయన్ను పోలీసులు బలవంతంగా తమ వాహనంలో తరలించారు. అసలు సంబేపల్లి పోలీస్ స్టేషన్‌లో తనపై ఎవరు ఫిర్యాదు చేశారు..? ఏ విషయంలో ఫిర్యాదు చేశారో చెప్పాలని పోసాని కృష్ణ మురళి ప్రశ్నించినా పోలీసులు సరైన సమాధానమే ఇవ్వలేదు. ఆయన్ని అరెస్ట్ చేస్తున్నట్టు ఓ నోటీసు ఇచ్చి తమతో తీసుకుపోయారు.

గురువారం తేదీతో... బుధవారం రాత్రే అరెస్ట్: చంద్రబాబును సంతృప్తిపరచమే లక్ష్యంగా పెట్టుకున్న పోలీసులు దర్యాప్తు నిబంధనలు, ప్రమాణాలను పూర్తిగా గాలికొదిలేశారు. పోసాని కృష్ణ మురళిని బుధవారం రాత్రి 9 గంటల సమయంలో అరెస్ట్ చేశారు. కానీ కుటుంబ సభ్యులకు ఇచ్చిన నోటీసులో మాత్రం... ఆయన్ను గురువారం (ఫిబ్రవరి 27తేదీ) రోజు అరెస్ట్ చేసినట్లు పేర్కొనడం గమనార్హం. పోసాని కృష్ణ మురళిని గురువారం అరెస్ట్ చేస్తున్నట్టు చెప్పి... బుధవారమే అరెస్ట్ చేసి తమతో తీసుకుపోయారు. అంటే ఇది కచ్చితంగా అక్రమ అరెస్టేనన్నది సుస్పష్టం. పోసాని అరెస్ట్ గురించి ఆయన కుటుంబ సభ్యులకు పోలీసులు కనీస సమాచారం కూడా ఇవ్వకపోవడం గమనార్హం. ఆయన్ని ఎందుకు అరెస్ట్ చేస్తున్నారు? ఎక్కడికి తీసుకు వెళుతున్నారో కూడా చెప్పలేదు. యూనిఫాంలో ఇద్దరు పోలీసులు, మఫ్టీలో మరో ఇద్దరు పోలీసులు వచ్చి ఆయన్ను బలవంతంగా తమతో తీసుకుపోయారు. పోసాని అనారోగ్యంతో ఉన్నారని, కనీసం మందులు అయినా తీసుకెళ్లనివ్వాలని కుటుంబ సభ్యులు ఎంతగా కోరినా పోలీసులు పట్టించుకోలేదు. తమ న్యాయవాది వచ్చే వరకు ఆగాలని అభ్యర్థించినా ఆలకించకుండా బలవంతంగా తమతో తీసుకెళ్లారు. నిబంధనల ప్రకారం పోలీసులు ఎవర్ని అయినా అరెస్ట్ చేస్తే అందుకు సంబంధించిన పూర్తి వివరాలను కుటుంబ సభ్యులకు తెలపాలి. వారు న్యాయ సహాయం పొందేందుకు అవకాశం కల్పించాలి. కనీసం ఈ ప్రాథమిక సూత్రాలను కూడా పాటించకుండా పోలీసులు పోసాని కృష్ణమురళిని అక్రమంగా అరెస్ట్ చేసి తమతో తీసుకుపోయారు. కాగా పోసాని కృష్ణమురళిని అరెస్ట్ చేసి తీసుకువెళ్తున్నట్టు సంబేపల్లి పోలీసులు చెప్పారు. కానీ ఆయన కుటుంబ సభ్యులకు ఇచ్చిన సమాచారంలో ఓబులవారిపల్లె పోలీస్ స్టేషన్ నంబరు ఇవ్వడం గమనార్హం. అంటే ఉద్దేశపూర్వకంగానే వేర్వేరు పోలీస్ స్టేషన్ల వివరాలు ఇచ్చి ఆయన కుటుంబ సభ్యులకు సందిగ్ధంలోకి నెట్టేశారు. నిబంధనలకు విరుద్ధంగా అరెస్ట్ చేస్తున్నందున తరువాత న్యాయపరమైన అభ్యంతరాలు తలెత్తకుండా న్యాయస్థానాన్ని తప్పుదారి పట్టించేందుకే ఈ ఎత్తుగడ వేశారని న్యాయ నిపుణులు చెబుతున్నారు. అంటే పక్కా ముందస్తు కుట్రతోనే అరెస్ట్ చేసినట్టు తేటతెల్లమవుతోంది.



You are hereby informed that one Mr.Krishna Murali Posani, aged 66 years, S/o Posani Subba Rao, residing in D.No.8-3-430/1/24, New Science Colony, Yellareddyguda, Hyderabad, Telangana State, who is your ... is arrested on 26.02.2025 at ... AM/PM of ... Hyderabad, Telangana State, who is concerned as accused in Cr.No.65/2025 U/s 196, 353(2), 111 r/w 3(5) of the BNS Act, 2023 of Obulavaripalle PS, Annamayya District, AP. The offence committed by him is cognizable and non bailable in nature and he is forwarded to the Hon'ble Additional Judicial Magistrate of 1st Class, Rajampet for Judicial custody.

ముందస్తు కుట్రతోనే: పోసాని కృష్ణ మురళిని లక్ష్యంగా చేసుకుని చంద్రబాబు ప్రభుత్వం గత ఏడాదే ముందస్తు కుట్రలకు తెరతీసింది. అందులో భాగంగానే చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లతోపాటు టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడుపై తప్పుడు వ్యాఖ్యలు చేశారని టీడీపీ కూటమి నేతలు, కార్యకర్తలు రాష్ట్రవ్యాప్తంగా ఫిర్యాదులు చేశారు. ఒకే రోజు ఆంధ్ర ప్రదేశ్‌లో అన్ని జిల్లాల్లోనూ పదుల సంఖ్యలో ఫిర్యాదులు చేయడం గమనార్హం.

వివరాలకు క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

అబద్ధపు వాంగ్మూలంతో అక్రమ అరెస్టులకు కుట్ర!

నిబంధనలకు విరుద్ధంగా 164 సీఆర్‌పీసీ వాంగ్మూలం నమోదు



పాపం పాలపిట్ట

కనిపించటమే గగనమైన 'రాష్ట్ర పక్షి'

సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో దసరా పండుగ పూర్తయ్యేది రంగురంగుల పాలపిట్టను దర్శించిన తర్వాతే. అందుకే అది రాష్ట్ర పక్షిగా కూడా అయ్యింది. అయితే, ఎంతో పవిత్రంగా భావించే పాలపిట్ట ఈ మధ్య కనిపించటమే లేదు. దేశంలోని అంతరించిపోతున్న పక్షుల జాబితాలో పాలపిట్ట కూడా చేరిపోయింది. 'రైతు నేస్తం'గా పిలిచే పాలపిట్ట పూర్తిగా అంతరించిపోకుండా కాపాడేందుకు తాజాగా ప్రభుత్వం నడుం బిగించింది.

ప్రమాదం అంచున..

ఆకర్షణీయమైన ప్రత్యేక రంగులతో ఇట్టే ఆకట్టుకునే రంగురంగుల పక్షి పాలపిట్ట. దీనిని ఇండియన్ రోలర్, బ్లూ జే అని కూడా పిలుస్తారు. రెక్కలు విచ్చుకున్నప్పుడు ముదురు, లేత నీలం రంగు డామినేట్ చేస్తూ... తెలుపు, గోధుమ, నలుపు రంగులతో ఈ పక్షి ప్రత్యేకంగా కనిపిస్తుంది. మామూలు సమయంలో 30–34 సెం.మీ (12–13 అంగుళాలు), రెక్కలు విచ్చుకున్నప్పుడు 65–74 సెం.మీ (26–29 అంగుళాలు) పొడవు, 166–176 గ్రాముల బరువుతో చూడముచ్చటగా ఉంటుంది. ఏడాది క్రితం విడుదలైన 'స్టేట్ ఆఫ్ ఇండియాస్ బర్డ్స్ రిపోర్ట్'లో సంఖ్య తగ్గిపోతున్న పక్షి జాతుల్లో వీటిని కూడా చేర్చారు. అంతకుముందు ఏడాదితో పోల్చితే వీటి సంఖ్య 30 శాతం తగ్గినట్లు వెల్లడైంది. ఇంటర్నేషనల్ యూనియన్ ఫర్ కన్జర్వేషన్ ఆఫ్ నేచర్ (ఐయూసీఎన్) నివేదికలో రెడ్ లిస్ట్ రీఅసెస్‌మెంట్ కోసం పాలపిట్టను సిఫార్సు చేశారు. తెలంగాణతోపాటు ఏపీ, కర్ణాటక, ఒడిశా, బిహార్ రాష్ట్రాల్లో కూడా పాలపిట్టను రాష్ట్ర పక్షిగా గుర్తించారు.

రైతు నేస్తం

పాలపిట్టలు రైతు నేస్తాలు. ఇవి వలస పక్షులు కావు. భారత్, ఇరాక్, థాయ్‌లాండ్‌లో అధికంగా కనిపిస్తాయి. చిన్న కప్పలు, మిడతలు, కీచురాళ్లు వంటి వాటిని వేటాడి తింటుంటాయి. వీటి జీవితకాలం 17–20 ఏళ్లు. చెట్ల తొర్రల్లో గూళ్లు పెట్టి మూడు నుంచి ఐదు గుడ్ల వరకు పెడతాయి. వీటి ప్రత్యుత్పత్తి కాలం వాటి ఆవాస ప్రాంతాలను బట్టి ఫిబ్రవరి–జూన్ నెలల మధ్యలో ఉంటుంది. ఈ పక్షులు పంట పొలాలు, తోటలు, ఉద్యానవనాల్లో తెగుళ్లను ఆహారంగా తీసుకుంటాయి. పంటలను నష్టపరిచే కీటకాలు, సరీసృపాలు, ఉభయచరాలను వేటాడి తింటూ రైతులకు పరోక్షంగా సహకారం అందిస్తాయి. అందుకే వీటిని రైతునేస్తాలు అని పిలుస్తారు.

పాలపిట్ట పరిరక్షణకు ప్రణాళిక

పాలపిట్టల సంఖ్య తగ్గిపోవటానికి ప్రధాన కారణం గ్లోబల్ వార్మింగ్, కాలుష్యం, మొబైల్ టవర్ల ద్వారా వస్తున్న రేడియేషన్ అని పర్యావరణవేత్తలు చెబుతున్నారు. దసరా, ఉగాది పండుగల సమయంలో కొందరు వీటిని బంధించి పట్టణాల్లో ప్రదర్శించి డబ్బులు వసూలు చేస్తుండడం కూడా వాటికి ప్రాణసంకటంగా మారుతోంది. ప్రమాదాన్ని గుర్తించిన ప్రభుత్వం పాలపిట్టను రక్షించేందుకు చర్యలకు ఉపక్రమించింది. తాజాగా జరిగిన రాష్ట్ర వన్యప్రాణి సంరక్షణ బోర్డు సమావేశంలో పాలపిట్ట సంరక్షణకు ప్రణాళిక సిద్ధం చేయాలని అటవీ శాఖా మంత్రి కొండా సురేఖ ఆదేశించారు. అటవీచట్టం షెడ్యూల్–4లో పాలపిట్ట ఉండడంతో దానిని బంధించడం, హింసించడం వంటివి చేస్తే నాన్‌బెయిలబుల్ కేసులతో పాటు మూడేళ్ల జైలుశిక్ష, రూ.25 వేల వరకు జరిమానా విధించే వీలుంది. దీంతో పాలపిట్ట సంరక్షణకు చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు.

పంటల సాగు తగ్గటంవల్లే..



కొంతకాలంగా పాలపిట్టలు అంతగా కనబడడం లేదు. హైదరాబాద్‌తో పాటు జిల్లాల్లోనూ రియల్ ఎస్టేట్ విస్తరణ, నగరాలు, పట్టణాలకు దగ్గరగా ఉన్న ప్రాంతాల్లో వ్యవసాయం నిలిచిపోవడంతో వాటి ఆవాస ప్రాంతాలకు ఇబ్బందులు తలెత్తాయి. పంటల రక్షణకు పురుగుమందులు అధికంగా వినియోగించటం కూడా ఈ పక్షుల సంఖ్య తగ్గటానికి కారణం.

– హరికృష్ణ ఆదెపు, హైదరాబాద్ బర్డింగ్ పాల్స్ అధ్యక్షుడు.

పూర్తిగా అంతరించకపోవచ్చు..



పాలపిట్టలు మనుషులు, జనావాసా లకు దూరంగా ఉండేందుకు ఇష్టపడతాయి. అందు వల్ల వాటి కచ్చితమైన సంఖ్యను తెలుసుకోవడం కష్టమే. పాలపిట్ట జాతి పూర్తిగా అంతరించిపోతుందని భావించడానికి లేదు.

– డా. సాయిలు గైని, బయో డైవర్సిటీ నిపుణుడు.



బయో ఆసియా సదస్సులో ఉటోపియా స్టాల్ వద్ద సంస్థ సీఈవో గోపి కడియాల. ఆ సంస్థ ప్రతినిధులు ఉదయ్ సక్సేనా, శరణ్య, బెనిహ

ఊబకాయానికి ఉటోపియా విరుగుడు!

- శరీరంలో కొవ్వును కరిగించే టీకా ఆవిష్కరణ
- ఆకలిని చంపుకోకుండానే బరువు తగ్గే మార్గం
- ఉటోపియా థెరపాటిక్ శాస్త్రవేత్త గోపి కడియాల వెల్లడి

సాక్షి, హైదరాబాద్: ప్రపంచంలో అత్యధిక మందిని వేధిస్తున్న ఆరోగ్య సమస్యల్లో ఊబకాయం ఒకటి. శరీరంలో కొవ్వు పెరుగుతున్నాకొద్దీ.. కొత్త కొత్త వ్యాధులు కూడా పెరుగుతాయి. ఊబకాయాన్ని తగ్గించుకొనేందుకు కొందరు శారీరక శ్రమ చేస్తే.. మరికొందరు ఆకలిని తగ్గించే ఒజెంపిక్ వంటి మందులపై ఆధారపడుతున్నారు. ఇకపై ఇలాంటి కష్టతరమైన పనులతో అవసరం లేకుండా ఒక్క టీకాతో ఊబకాయాన్ని తగ్గించుకోవచ్చని చెబుతోంది ఉటోపియా థెరపాటిక్స్ సంస్థ. ఊబకాయాన్ని తగ్గించేందుకు ఈ సంస్థ ప్రత్యేక వ్యాక్సిన్‌ను అభివృద్ధి చేసింది. ఈ టీకా ఆవిష్కరణలో సంస్థ సీఈవో డాక్టర్ గోపి కడియాల కీలక భూమిక పోషించారు.

ఇది ఎలా పనిచేస్తుందంటే..: ప్రస్తుతం మార్కెట్లో ఉన్న ఊబకాయాన్ని తగ్గించే మందుల్లో అత్యధికం ఆకలిని తగ్గించటం ద్వారా శరీరంలోని కొవ్వును కరిగించే పని చేస్తాయి. ఈ విధానంలో దుష్ప్రభావాలు కూడా అధికమే. అందుకు భిన్నంగా ఉటోపియా సిద్ధం చేసిన టీకా ఆకలిని తగ్గించకుండానే.. నేరుగా శరీరంలో కొవ్వును కరిగించే వ్యవస్థను చైతన్యవంతం చేస్తుంది. తద్వారా ఒక క్రమ పద్ధతిలో ఆరోగ్యకరంగా బరువు తగ్గుతారు. కాలేయంలో కొవ్వు పేరుకుపోవడాన్ని కూడా ఈ టీకా నియంత్రిస్తుందని ఉటోపియా చీఫ్ సైంటిఫిక్ ఆఫీసర్ డాక్టర్ ఉదయ్ సక్సేనా తెలిపారు. ఈ టీకాను ఇప్పటికే కోళ్లు, ఎలుకలపై ప్రయోగించి చూశామని, శరీరానికి హాని చేసే ట్రైగ్లిజరైడ్స్ 42 శాతం వరకు తగ్గినట్లు గుర్తించామని డాక్టర్ గోపి కడియాల చెప్పారు. అలాగే పొట్ట భాగంలో ఉండే విసరల్ ఫ్యాట్ 24 శాతం తగ్గిందని, ప్రీక్లినికల్ ట్రయల్స్‌లో ఎలాంటి దుష్ప్రభావాలు కానీ.. కండర నష్టం, ఆకలి తగ్గిపోవడం వంటివి కనిపించలేదని వెల్లడించారు. త్వరలో ఈ టీకాను మనుషులపై కూడా ప్రయోగించనున్నట్లు తెలిపారు. వచ్చే ఫలితాల ఆధారంగా టీకాను అందరికీ అందుబాటులోకి తెస్తామని 'సాక్షి'తో మాట్లాడుతూ చెప్పారు. ఉటోపియా థెరపాటిక్ సంస్థకు బయో ఆసియా–2025 సదస్సులో టాప్–5 ఉత్తమ స్టార్టప్‌లో ఒకటిగా అవార్డు రావటం విశేషం.

క్లుప్తంగా...

విద్యుత్ వినియోగంలో మళ్లీ కొత్త రికార్డు

రాష్ట్రంలో 16,506 మెగావాట్ల డిమాండ్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో గరిష్ట విద్యుత్ వినియోగంలో మరోసారి సరికొత్త రికార్డు నమోదైంది. బుధవారం ఉదయం 8.03 గంటలకు రాష్ట్రంలో విద్యుత్ వినియోగం 16,506 మెగావాట్లకు పెరిగి కొత్త రికార్డు సృష్టించింది. ఈ నెల 21న ఏర్పడిన 16,412 మెగావాట్ల గరిష్ట విద్యుత్ డిమాండ్ రికార్డును తాజాగా రాష్ట్రం అధిగమించింది. విద్యుత్ వినియోగం రోజంతా ఒకే తరహాలో ఉండదు. వినియోగంలో చోటుచేసుకునే హెచ్చుతగ్గులకు అనుగుణంగా ఉంటుంది. ఈ సమయంలో ఒకానొక సమయంలో విద్యుత్ డిమాండ్ గరిష్టానికి చేరుకుని కొత్త రికార్డు సృష్టిస్తుంది. రోజువారీ గరిష్ట విద్యుత్ వినియోగంలో సైతం కొత్త రికార్డు నమోదైంది. మంగళవారం 24 గంటల్లో రాష్ట్రంలో 313.37 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగం జరిగింది.

గరళకంఠుని దీవెనలుండాలి: కేసీఆర్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రజలకు మాజీ సీఎం, బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ మహా శివ రాత్రి శుభాకాంక్షలు తెలిపారు. గరళాన్ని కంఠంలో దాచుకుని ముల్లోకాలను కాపాడుతున్న ఆ ఉమా శంకరుని కరుణాకటాక్షాలు ప్రజలందరిపై ఉండాలని ఆయన ప్రార్థించారు.

'మన ఊరు- మన బడి' పెండింగ్ బిల్లులు చెల్లించండి

సీఎంకు లేఖ రాసిన మండలి చైర్మన్ గుత్తా

సాక్షి, హైదరాబాద్: 'మన ఊరు- మన బడి' పథకం కింద పెండింగ్ బిల్లులను తక్షణమే చెల్లించాలని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి కోరారు. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డికి బుధవారం ఆయన లేఖ రాశారు. బీఆర్‌ఎస్ హయాంలో పాఠశాలల పునరుద్ధరణ, పునర్నిర్మాణం కోసం కాంట్రాక్టర్లకు పనులు అప్పగించారని, కాంట్రాక్టర్లు సొంత డబ్బులతో చాలా చోట్ల పాత భవనాలను కూల్చివేసి కొత్త నిర్మాణాలను ప్రారంభించారని, గత ప్రభుత్వం నిధులు చెల్లించకపోవడంతో నిర్మాణాలన్నీ సగంలోనే నిలిచిపోయాయని తెలిపారు. దీంతో విద్యార్థులు రోడ్లు, చెట్లకింద చదువులు కొనసాగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పనులన్నీ పూర్తి కావాలంటే సెమీ స్ట్రక్చర్ పనులకు రూ. 300 కోట్లు, ఇప్పటికే వివిధ పనులు చేసిన కాంట్రాక్టర్లకు రూ. 700 కోట్లు అవసరమని తెలిపారు. దీని కోసం ప్రభుత్వం తక్షణమే రూ. 1,000 కోట్లు కేటాయిస్తే పాఠశాల పునరుద్ధరణ పనులన్నీ పూర్తవుతాయని సీఎంకు రాసిన లేఖలో గుత్తా వెల్లడించారు.

నెట్ జేఆర్‌ఎఫ్‌లో మనూ విద్యార్థినికి ఆలిండియా ఫస్ట్ ర్యాంక్



రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయం (మ నూ) విద్యార్థిని యూజీసీ నెట్ జేఆర్‌ఎఫ్‌లో ఆలిండియా టాప్ ర్యాంకర్ గా నిలిచింది. వర్సిటీలోని ఎడ్యుకేషన్ విభా గంలో ఎంఈడీ నాలుగో సెమిస్టర్ చదువుతు న్న ఆనం జాఫర్.. ఇటీవల విడుదలైన యూ జీసీ నెట్ ఫలితాల్లో ఎడ్యుకేషన్ సబ్జెక్టులో ఆలిండియా నంబర్–1 ర్యాంకు సాధించినట్లు వర్సిటీ వర్గాలు తెలిపాయి. ఆనం జాఫర్‌ను బుధవారం వర్సిటీలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో అధ్యాపకులు ఘనంగా సత్క రించారు. ఈ సందర్భంగా విద్యా, శిక్షణా వి భాగం అధిపతి ప్రొఫెసర్ షాహీన్ ఏ షేక్ మాట్లాడుతూ.. ఆనంజాఫర్ ఔత్సాహిక పరిశోధకులకు రోల్ మోడల్‌గా నిలిచిందని ప్రశంసించారు. ఆనమ్ జాఫర్ మాట్లాడుతూ.. ఈ ఘనత సాధించడంలో తన కుటుంబసభ్యులు, అధ్యాపకులు అండగా నిలిచారని తెలిపారు.

అప్రమత్తంగా.. ఆచితూచి

▶ మొదటి పేజీ తరువాయి

తేలికపాటి పరికరాలతో రెస్క్యూ బృందాల ఆధ్వర్యంలోనే తవ్వకాలు జరిపించాలని నిర్ణయించింది. బోర్డర్ రోడ్స్ ఆర్గనైజేషన్ (బీఆర్‌ఓ) మాజీ డీజీ/ఆర్మీ మాజీ ఈఎన్‌సీ జనరల్ హర్పాల్ సింగ్, సొరంగాలకు సంబంధించి ప్రముఖ అంతర్జాతీయ నిపుణుడు క్రిస్ కూపర్, బీఆర్‌ఓ అదనపు డీజీ కేపీ పురుషోత్తం, మరో ప్రముఖ సొరంగాల నిపుణుడు కల్నల్ పరీక్షిత్ మెహ్రాతో కూడిన నిపుణుల బృందం బుధవారం మధ్యాహ్నం 12.30 గంటలకు ఎన్డీఆర్‌ఎఫ్ బలగాలు, ర్యాట్ హోల్ మైనర్లతో కలిసి సొరంగం లోపలికి వెళ్లింది. సాయంత్రం 4.10 గంటలకు బయటకు వచ్చింది. అనంతరం రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్ రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో సమావేశమై విస్తృతంగా చర్చించింది. నిపుణుల సూచనల మేరకు ప్రభుత్వం వ్యూహాన్ని ఖరారు చేసింది..



సొరంగంలో పేరుకుపోయిన బురద

చివరి వరకు నెమ్మదిగా తవ్వకాలు

గల్లంతైన కార్మికుల ఆచూకీ తెలుసుకోవడంలో భాగంగా సొరంగం కూలిన ప్రదేశంలో పేరుకుపోయిన మట్టి, రాళ్లు, శిథిలాలు, తుక్కును తేలికపాటి పరికరాలతో తవ్వకాలు జరిపి తొలగించవచ్చని నిపుణుల బృందం సూచించింది. సొరంగం కూలిన సమయంలో అక్కడున్న కార్మికులు బయటకు వచ్చేందుకు పరుగెత్తి ఉంటారని, వారు శిథిలాల కింద ఈ వైపే ఉండి ఉంటారనే తమ అంచనాను వివరించింది. ఈ నేపథ్యంలో రెస్క్యూ బృందాలు తవ్వకాలు ప్రారంభిస్తే ఒకటీ రెండురోజుల్లోనే కార్మికుల ఆచూకీ లభ్యం కావచ్చని భావిస్తున్నారు. తవ్వకాలు, శిథిలాల తొలగింపు చర్యలు ఈ వైపు నుంచి ప్రారంభించి సొరంగం చివరి భాగం వరకు నెమ్మదిగా కొనసాగించాలని నిపుణులు సూచించారు. తవ్వకాలు కొద్దిగా పురోగమించిన వెంటనే సొరంగం పైకప్పు మళ్లీ కూలకుండా రక్షణగా రీఎన్‌ఫోర్స్‌మెంట్ చర్యలు తీసుకోవాలనే నిర్ణయం తీసుకున్నారు. మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి, జనరల్ హర్పాల్ సింగ్‌లు నేషనల్ డిఫెన్స్ అకాడమీ (ఎన్డీఏ)కి చెందిన ఒకే బ్యాచ్ అధికారులు కావడం గమనార్హం. ఉత్తమ్‌కుమార్ రెడ్డి గతంలో భారత వాయుసేనలో కెప్టెన్‌గా పనిచేసిన సంగతి తెలిసిందే.

రాత్రికి రాత్రే పరికరాల తరలింపు..

సొరంగం లోపల తవ్వకాలు, శిథిలాల తొలగింపు పనులకు కార్మికులు ముందుకు రావడం లేదు. సొరంగం మళ్లీ కూలుతుందేమోనని భయపడుతున్నారు. దీంతో సింగరేణి రెస్క్యూ బృందాలను అత్యవసరంగా రప్పిస్తున్నారు. గురువారంలోగా వారు ప్రమాద స్థలానికి చేరుకోనున్నారు. ఇక సొరంగంలోని మట్టి, శిథిలాల్లో కూరుకుపోయిన టన్నుల కొద్దీ బరువు ఉన్న తుక్కును కట్ చేయడానికి రైల్వే శాఖ నుంచి యుద్ధ ప్రాతిపదికన హెవీ స్టీల్ గ్యాస్ కట్టర్లను రప్పిస్తున్నారు. బుధవారం రాత్రికే ఈ పరికరాలన్నీ సొరంగంలోకి వెళ్లేలా ఏర్పాట్లు చేశారు.

ఇక టీబీఎం ముక్కలు ముక్కలే..

సొరంగం కూలడంతో శిథిలాల కింద కూరుకుపోయిన టన్నెల్ బోరింగ్ మెషీన్ (టీబీఎం)ను హెవీ స్టీల్ గ్యాస్ కట్టర్ సహాయంతో ముక్కలు ముక్కలుగా కట్ చేసి సొరంగం నుంచి తొలగించాలని నిర్ణయించారు. దీనిని తొలగిస్తేనే గల్లంతైన కార్మికుల ఆచూకీని కనుక్కోవడానికి వీలుండడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు.

అత్యంత క్లిష్టపరిస్థితుల్లోనూ రెస్క్యూ 'మార్కోస్' ప్రత్యేకత

గురువారం నుంచి జరిగే సహాయక కార్యక్రమాల్లో ఇండియన్ మెరైన్ కమాండో ఫోర్స్ (మార్కోస్) కూడా పాల్గొననుంది. అత్యంత క్లిష్టపరిస్థితుల్లోనూ రెస్క్యూ నిర్వహించే ఈ దళం బీఆర్‌ఓ, ఆర్మీ, నేవీ నిపుణులు, ఎన్డీఆర్‌ఎఫ్, ఎస్డీఆర్‌ఎఫ్ బృందాలు, ర్యాట్ హోల్ మైనర్స్‌తె కలిసి పని చేయనుంది. కాగా అధునాతన ఇమేజింగ్ టెక్నాలజీని వినియోగిస్తూ సహాయక చర్యలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. రెస్క్యూ సిబ్బందికి అవసరమైన ఆక్సిజన్, లైఫ్ సపోర్ట్ వ్యవస్థలను కూడా ఏర్పాటు చేస్తున్నారు.

రెండురోజుల్లో ఆపరేషన్ పూర్తి చేస్తాం

- సొరంగంలో చిక్కుకున్న కార్మికులపై ఆశలు వదులుకోలేదు
- మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి



అధికారులతో సమీక్ష అనంతరం మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్. చిత్రంలో మల్లు రవి, కోమటిరెడ్డి, అనిరుధ్‌రెడ్డి తదితరులు

సాక్షి, నాగర్‌కర్నూలు/అచ్చంపేట: ఎస్‌ఎల్‌బీసీ సొరంగంలో చిక్కుకున్న వారి విషయంలో ఆశలు ఇంకా పూర్తిగా వదులుకోలేదని, బతికి ఉన్నారని, బయటికి తీసుకురావాలనే ఉద్దేశంతోనే ప్రయత్నాలు కొనసాగిస్తున్నామని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చెప్పారు. ఆర్మీ, నేవీ, ఎన్డీఆర్‌ఎఫ్ సిబ్బంది.. ర్యాట్ మైనర్స్ సహాయంతో 8 మందిని కాపాడే సీరియస్ ప్రయత్నం చేయబోతున్నామని తెలిపారు. రెండురోజుల్లో ఈ ఆపరేషన్ అంతా పూర్తి చేస్తామని అన్నారు. బుధవారం ఉదయం రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, రాష్ట్ర విపత్తుల నిర్వహణ శాఖ ప్రత్యేక కార్యదర్శి అరవింద్‌కుమార్‌తో కలిసి.. బోర్డర్ రోడ్స్ ఆర్గనైజేషన్ (బీఆర్‌ఓ) మాజీ అధికారులు, ఇతర నిపుణులతో ఉత్తమ్ సమావేశమయ్యారు. సొరంగంలో పరిస్థితి, కొనసాగుతున్న సహాయక చర్యలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సహాయక చర్యలకు ఆటంకంగా ఉన్న బురద నీటిని తొలగించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అయితే సొరంగం లోపలికి వెళ్లే వారికి కూడా రిస్కు ఉందని అన్నారు. రెండురోజులుగా రెస్క్యూ ఆపరేషన్ కొంత ఆలస్యమైందని, తాజాగా ఆర్మీ నిపుణులతో మాట్లాడి గురువారం నుంచి వేగవంతం చేస్తామని చెప్పారు. టీబీఎం వెనుక భాగం శిథిలాలను గ్యాస్ కట్టర్‌తో తొలగించాలని నిర్ణయించినట్లు తెలిపారు. దేశ సరిహద్దుల్లో టన్నెల్స్ నిర్మించే బీఆర్‌ఓకు చెందిన వారిని రప్పించి పరిశీలన చేయించినట్లు వివరించారు. ఆర్మీ అధికారులు కూడా టన్నెల్‌లోకి వెళ్లి చూశారన్నారు.

రాజకీయ లబ్ధి పొందాలని చూస్తున్నారు..

బీఆర్‌ఎస్ మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావులు ప్రకృతి వైపరీత్యాలను అడ్డుపెట్టుకొని రాజకీయ లబ్ధి పొందాలని ప్రయత్నిస్తున్నారని ఉత్తమ్ విమర్శించారు. తాము మాట్లాడాలంటే శ్రీశైలం ఎడమ గట్టు పవర్ ప్లాంట్ ప్రమాదం, కాళేశ్వరం ప్రమాదం గురించి మాట్లాడే వారమని, మేడిగడ్డ బరాజ్ ఎందుకు కూలిపోయిందని అడిగేవారమని అన్నారు. ప్రతిపక్షాలు దిగజారి మాట్లాడటం దురదృష్టకరమని వ్యాఖ్యానించారు. సమీక్షలో ఎంపీ మల్లు రవి, జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి, నాగర్‌కర్నూల్ కలెక్టర్ బదావత్ సంతోష్, ఎస్పీ వైభవ్ గైక్వాడ్ రఘునాథ్, టీజీఎస్పీ డీసీఎల్ సీఎండీ ముషారఫ్ అలీ తదితరులు పాల్గొన్నారు.

మాకే ఇవ్వండి

- ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ సీటు కోసం పట్టుబడుతున్న ఎంఐఎం
- తమకు కూడా ఒకటి కావాలని సీపీఐ అడుగుతున్నా.. స్పందించని కాంగ్రెస్

సాక్షి, హైదరాబాద్: ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికలను వేదికగా చేసుకొని అధికార కాంగ్రెస్‌తో మిత్రబంధం కొనసాగించేందుకు అటు ఎంఐఎం, ఇటు సీపీఐ ఆసక్తి కనబరుస్తున్నాయి. అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు తమకు ఒక ఎమ్మెల్సీ స్థానం ఇవ్వాలని సీపీఐ అడుగుతుండగా, అసెంబ్లీ ఎన్నికల తర్వాత ఏర్పడిన సత్సంబంధాల నేపథ్యంలో తమకూ ఓ ఎమ్మెల్సీ ఇవ్వాలని ఎంఐఎం అంటోంది. దీనిపై అధిష్టానంతో చర్చించాలని టీపీసీసీ నిర్ణయించింది. ఇక, మరో మిత్రపక్షం సీపీఐ మాత్రం తమకు ఇచ్చిన మాట ప్రకారం రెండు ఎమ్మెల్సీలు ఇవ్వాల్సి ఉందని, ఇప్పుడు కనీసం ఒక్కటైనా ఇవ్వాలని కోరుతోంది.

మూడా...నాలుగా?: గాంధీభవన్ వర్గాల్లో జరుగుతున్న చర్చ ప్రకారం మూడు ఎమ్మెల్సీ స్థానాలకు కాంగ్రెస్ అభ్యర్థులపై ఏకాభిప్రాయం వచ్చిందని తెలుస్తోంది. ఓసీ కోటాలో ముఖ్యమంత్రి సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డి, ఎస్సీ కోటాలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి అద్దంకి దయాకర్, ఎస్టీ కోటాలో ఖమ్మం జిల్లా వైరా అసెంబ్లీ టికెట్ ఆశించిన విజయాబాయిల పేర్లకు అంగీకారం వచ్చిందని తెలుస్తోంది. నాలుగో స్థానంలో కూడా పోటీ చేసే అవకాశం వస్తే బీసీ నేతల పేర్లను పరిశీలిస్తారని సమాచారం.

కేంద్ర ప్రభుత్వ ఆదేశాలపై స్టేకు నో

- ఐపీఎస్ అభిలాష బిస్త్‌కు స్పష్టం చేసిన క్యాట్
- కేంద్రం, రెండు రాష్ట్ర ప్రభుత్వాలకు నోటీసులు జారీ
- తదుపరి విచారణ వచ్చే నెలకు వాయిదా



సాక్షి, హైదరాబాద్: కేంద్ర హోం శాఖ ఉత్తర్వుల మేరకు ఆంధ్రప్రదేశ్‌లో విధుల్లో చేరాలని సీనియర్ ఐపీఎస్ అధికారి అభిలాష బిస్త్‌కు కేంద్ర పరిపాలన ట్రిబ్యునల్(క్యాట్) బుధవారం సూచించింది. అక్కడ కూడా సీనియర్ అధికారుల అవసరం ఉందని వ్యాఖ్యానించింది. ఈ అంశంపై కేంద్ర ప్రభుత్వంతో పాటు ఏపీ, తెలంగాణ ప్రభుత్వాలకు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణలోగా కౌంటర్ దాఖలు చేయాలని స్పష్టం చేస్తూ, విచారణ వచ్చే నెలకు వాయిదా వేసింది. కేంద్ర ప్రభుత్వ ఆదేశాలను నిలుపుదల చేస్తూ, మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చేందుకు నిరాకరించింది. అభిలాష.. 1994 బ్యాచ్ ఐపీఎస్ అధికారి. ఆమెను మొదట పశ్చిమ బెంగాల్ కేడర్‌కు కేటాయించారు. అయితే ఆమె ఏపీ కేడర్ ఐపీఎస్ అధికారిని వివాహం చేసుకుని 1997లో తన కేడర్‌ను ఏపీకి మార్చుకున్నారు. రాష్ట్ర విభజన సమయంలో ఆమెను ఏపీకి కేటాయించారు. కేటాయింపుల అంశంపై గతంలో క్యాట్ ఇచ్చిన ఆర్డర్ ఆధారంగా ఆమె 11 సంవత్సరాలుగా తెలంగాణలో కొనసాగుతున్నారు. ఇలా రాష్ట్ర విభజన సమయంలో ఏపీకి కేటాయించినా.. కొందరు ఐపీఎస్‌లు తెలంగాణలోనే కొనసాగుతున్నారు. ఈ నేపథ్యంలో తెలంగాణలో పనిచేస్తున్న ఏపీ కేడర్ అధికారులు డీజీ అంజనీకుమార్, అభిలాష బిస్త్, అభిషేక్ మహంతి వెంటనే ఏపీకి వెళ్లేలా రిలీవ్ చేయాలని ఫిబ్రవరి 21న కేంద్రం.. తెలంగాణను ఆదేశించింది. దీంతో 22న తెలంగాణ సర్కార్ అంజనీకుమార్, అభిలాష బిస్త్‌ను రిలీవ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో, కేంద్ర ప్రభుత్వ ఆదేశాలను సవాల్ చేస్తూ అభిలాష క్యాట్‌ను ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై జ్యుడీషియల్ సభ్యురాలు డాక్టర్ లతా బస్వరాజ్ పట్నే, పరిపాలన సభ్యురాలు శాలిని మిశ్రా ధర్మాసనం విచారణ చేపట్టింది.

సీనియారిటీ వివాదం ఉంది..

పిటిషనర్ తరపు న్యాయవాది జె.సుధీర్ వాదనలు వినిపిస్తూ.. కేంద్ర ప్రభుత్వ ఆదేశాలు నిలుపుదల చేయాలని కోరారు. ఐపీఎస్ అధికారుల సీనియారిటీకి సంబంధించిన వివాదం ఉందన్నారు. ఈ విషయంలో అభిలాష వాదనను గతంలో క్యాట్, హైకోర్టు సమర్థించిన విషయాన్ని గుర్తు చేశారు. ఈ వాదనలు విన్న బెంచ్.. కేంద్ర ప్రభుత్వ ఉత్తర్వులపై వెంటనే స్టే ఇచ్చేందుకు నిరాకరించింది. కేంద్రం వాదనలు కూడా విని తీర్పు వెలువరిస్తామని, అప్పటివరకు ఏపీలో చేరాలని సూచించింది.

'బయో'కు భాగ్య నగరం బెస్ట్

- ఇక్కడి మౌలిక సదుపాయాలు బాగున్నాయి
- మూడేళ్లలో 2 వేల మందికి ఉద్యోగాలిస్తాం
- అజిలిసియమ్ సీఈవో రాజ్‌బాబు



సాక్షి, హైదరాబాద్: అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన విమానాశ్రయం, గంటలోపు నగరంలోకి వచ్చేందుకు చక్కటి రోడ్లు, అన్ని విధాలుగా సహకరించేందుకు సిద్ధంగా ఉన్న ప్రభుత్వం.. తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు తమను ఆకర్షించిన అంశాలు ఇవేనని అమెరికా కేంద్రంగా పనిచేస్తున్న అజిలిసియమ్ కంపెనీ సీఈవో రాజ్‌బాబు తెలిపారు. మూడు నెలల క్రితం హైదరాబాద్‌లో కేంద్రాన్ని ప్రారంభించిన తాము, జీవశాస్త్ర రంగంలో తెలంగాణ ప్రభుత్వ లక్ష్యాలను అందుకునేందుకు సహకరిస్తామని చెప్పారు. హైదరాబాద్‌లో జరుగుతున్న బయో ఆసియా సదస్సులో పాల్గొన్న ఆయన.. బుధవారం విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వ 'లైఫ్ సైన్సెస్ గ్రిడ్'వ్యూహంలో భాగస్వాములవుతామని చెప్పారు. మందుల తయారీ, క్లినికల్ డెవలప్‌మెంట్, సప్లై చెయిన్ మేనేజ్‌మెంట్, సేల్స్, మార్కెటింగ్, నియంత్రణ అంశాల్లో కృత్రిమ మేధ (ఏఐ) ఆధారిత ఏజెంట్లను సిద్ధం చేస్తున్నామని తెలిపారు.

మూడేళ్లలో రెండు వేల మందికి ఉపాధి..

హైదరాబాద్‌లోని అజిలిసియమ్ 'లైఫ్ సైన్సెస్ ఇన్నోవేషన్ అండ్ టాలెంట్ డెవలప్‌మెంట్ ల్యాబ్'లో రానున్న మూడేళ్లలో సుమారు 2,000 మందికి ఉపాధి కల్పిస్తామని రాజ్‌బాబు తెలిపారు. వైద్యులు, ఫార్మా, బయోటెక్ రంగాల్లో పరిశోధనలు చేస్తున్న వారిని ఎంపిక చేసి.. వారికి ఏఐ, డేటా సైన్సెస్‌లలో శిక్షణ ఇస్తామని చెప్పారు. ఇందుకోసం ఒక్కొక్కరిపై సుమారు రూ.25 – 50 లక్షల వరకు ఖర్చు చేస్తామని వెల్లడించారు. అమెరికా, కెనడా, కోస్టారికా, స్విట్జర్లాండ్, బెల్జియం, నెదర్లాండ్స్‌లలో కంపెనీ కేంద్రాలు ఉన్నాయని చెప్పారు. ప్రస్తుతం అమెరికా కేంద్రంలోనే ఎక్కువ మంది ఉద్యోగులు పనిచేస్తుండగా.. మరికొన్నేళ్లలో ఆ స్థానాన్ని హైదరాబాద్ ఆక్రమించనుందని చెప్పారు.

నేడు ఎస్‌ఎల్‌బీసీ సందర్శనకు హరీశ్‌రావు బృందం

- సొరంగం కూలిన ప్రాంతాన్ని పరిశీలించనున్న నేతలు



సాక్షి, హైదరాబాద్: శ్రీశైలం ఎడమ గట్టు కాలువ(ఎస్‌ఎల్‌బీసీ) సొరంగం పైకప్పు కూలిన ప్రాంతాన్ని పరిశీలించేందుకు మాజీ మంత్రి హరీశ్‌రావు నేతృత్వంలోని బీఆర్‌ఎస్ ప్రతినిధి బృందం వెళ్లనుంది. గురువారం ఉదయం 9 గంటలకు కోకాపేటలోని తన నివాసం నుంచి హరీశ్‌రావు బయలుదేరుతారు. ఆయన వెంట మహబూబ్‌నగర్, నల్లగొండ జిల్లాకు చెందిన బీఆర్‌ఎస్ ముఖ్య నేతలు వెళతారు. స్థానికంగా అధికారులు, కార్మికులతో మాట్లాడి ఘటన జరిగిన తీరు తెన్నులతో పాటు సహాయక చర్యలపై ఆరా తీస్తారు. అనంతరం దోమలపెంటలో హరీశ్‌రావు మీడియాతో మాట్లాడతారని బీఆర్‌ఎస్ వర్గాలు వెల్లడించాయి. పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో టన్నెల్ పనులు జరగలేదని కాంగ్రెస్ చేస్తున్న విమర్శలను బీఆర్‌ఎస్ ఖండిస్తోంది.

వ్యవసాయంలో ఏఐ వినియోగంపై ఐటీఈసీ శిక్షణ కార్యక్రమం

- 26 దేశాల నుంచి హాజరైన ప్రతినిధులు
- మేనేజ్ ఆధ్వర్యంలో మార్చి 11వరకు సాగనున్న శిక్షణ

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్‌లోని 'నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అగ్రికల్చరల్ ఎక్స్‌టెన్షన్ మేనేజ్‌మెంట్' (మేనేజ్) ఆధ్వర్యంలో బుధవారం 'రిమోట్ సెన్సింగ్, జీఐఎస్, డ్రోన్లు, వ్యవసాయ విస్తరణలో ఏఐ వినియోగం' అనే అంశంపై ఇండియన్ టెక్నికల్ అండ్ ఎకనామిక్ కోఆపరేషన్ (ఐటీఈసీ) అంతర్జాతీయ శిక్షణ కార్యక్రమం ప్రారంభమైంది. మార్చి 11 వరకు జరిగే ఈ శిక్షణ కార్యక్రమానికి 26 దేశాల నుంచి 29 మంది ప్రతినిధులు హాజరయ్యారు. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన 'మేనేజ్' డైరెక్టర్ జనరల్ డాక్టర్ హనుమాన్ సాగర్‌సింగ్ మాట్లాడుతూ, అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేయడం వల్ల మంచి ఫలితాలు సాధించవచ్చని అన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డ్రోన్లు, ఇతర సాంకేతిక పరిజ్ఞానాలు దేశ రైతులకు ఎంతో ఉపయోగపడతాయని చెప్పారు. నేషనల్ పెస్ట్ సర్వైలెన్స్ సిస్టం (ఎన్‌పీఎస్‌ఎస్) ద్వారా చీడ, పీడల నియంత్రణ సమర్థవంతంగా నిర్వహించవచ్చునని తెలిపారు. 'మేనేజ్' డైరెక్టర్ (ఎంఅండ్‌ఈ) మాట్లాడుతూ, ఏఐ వంటి ఆధునిక సాంకేతికత వనరుల వినియోగాన్ని, లావాదేవీల వ్యయాన్ని తగ్గించడంతో పాటు రైతులకు లాభాలను పెంచుతుందని చెప్పారు. ఈ శిక్షణ కార్యక్రమం ద్వారా అధునాతన వ్యవసాయ సాంకేతికతపై అవగాహన పెంచి, రైతులకు అందుబాటులోకి తేవడమే లక్ష్యమని చెప్పారు. శిక్షణలో భాగంగా ఆయా దేశాల ప్రతినిధులు ఇక్రిసాట్, వ్యవసాయ వర్సిటీలోని డ్రోన్ అకాడమీ, టీ-హబ్, ఐకార్-క్రిడా, ఇన్‌కాయిస్, ఎన్‌ఐపీహెచ్‌ఎం వంటి ప్రముఖ సంస్థలను సందర్శిస్తారు.



ఆలోచన ఎక్కడ వదిలివెళ్తుందో,
సరిగ్గా అక్కడే విశ్వాసం మొదలవుతుంది.
– సోరెన్ కీర్క్‌గార్డ్

సాక్షి
గురువారం, 27 ఫిబ్రవరి 2025

ఆలస్యంగా దక్కిన న్యాయం

రాజ్యం అండదండలతో పట్టపగలు ఢిల్లీ రాజవీధుల్లో చెలరేగిపోయిన ముష్కర మూకలు చిన్నా పెద్దా ఆడా మగా తేడా లేకుండా 3,000 మందిని ఊచకోత కోసిన ఉదంతాల్లో ఆలస్యంగానైనా బాధితులకు న్యాయం దక్కుతోంది. ఆ మారణహోమం జరిగి నిరుడు అక్టోబర్‌కు నలభైయేళ్లు కాగా, ఒక కేసులో అప్పటి కాంగ్రెస్ నాయకుడు, మాజీ ఎంపీ సజ్జన్‌కుమార్‌కు రెండు యావజ్జీవ శిక్షలు పడ్డాయి. ఢిల్లీలోని సరస్వతి విహార్ ప్రాంతంలో తండ్రీకొడుకులను హతమార్చిన కేసులో ఒక యావజ్జీవ శిక్ష, గృహదహనానికి ప్రేరేపించిన కేసులో మరో యావజ్జీవ శిక్ష విధిస్తూ కోర్టు తీర్పునిచ్చింది. ఇప్పటికే ఈ ఊచకోతకు సంబంధించి వేరే కేసులో సజ్జన్ 2018 నుంచి యావ జ్జీవ శిక్ష అనుభవిస్తున్నారు. దేశ విభజన సమయంలో పెద్ద యెత్తున జరిగిన హత్యలు, అత్యా చారాలు, గృహదహనాలు, లూటీలు, ఆస్తుల ధ్వంసం ఉదంతాల తర్వాత దేశ చరిత్రలో 1984 నాటి నరమేధం అతి పెద్దది. ఇలాంటి ఉదంతాల్లో మూకలు ఉన్మాదంతో దాడులు చేయటం కనబడు తుంది. ఈ దాడుల వెనక ఎప్పుడూ సంఘటిత నేరగాళ్ల ముఠా ఉంటుంది. వీరికి రాజకీయ నాయకుల అండదండలుంటాయి. రాజకీయాల్లో తమ మాటే చెల్లు బాటు కావాలని, తమ పేరు చెబితే జనమంతా హడలెత్తిపోవాలని ఈ ముఠాల వెనకున్న నేతలు కోరుకుంటారు. నాటి ప్రధాని ఇందిరాగాంధీ తన నివాస గృహంలోనే ఒకచోటి నుంచి మరో చోటుకు వెళ్తుండగా అంగరక్షకులు ఆమెను తుపాకులతో కాల్చిచంపిన అనంతరం ఢిల్లీలోనూ, వేరే రాష్ట్రాల్లోనూ ఈ మారణహోమం కొనసాగింది. ఇందిర హంతకులు సిక్కులు గనుక, ఆ ఉదంతానికి ప్రతీకారంగా సిక్కు మతానికి చెందిన ఎవరినైనా చంపుకుంటూ పోవాలని స్పష్టమైన ఆదేశాలున్న పర్యవసానంగానే ఈ దుర్మార్గం సాగింది. 'ఉన్మాద మూకలు ఇల్లిల్లూ తిరిగి మారణహోమం సాగిస్తున్నాయి. దయచేసి కాపాడండ'ంటూ పోలీస్ స్టేషన్లకు పోయి మొరపెట్టుకున్నా ఫలితం లేకపోయింది.

హంతక ముఠాలు పట్టపగలు నడివీధుల్లో స్వైరవిహారం చేస్తున్నా దిక్కూ మొక్కూ లేదంటే అలాంటి నేరగాళ్లు మరింతమంది పుట్టుకొస్తారు. సమాజానికి పీడలా తయారవుతారు. ప్రతీకారం పేరుతో మరికొన్ని ముఠాలు రంగప్రవేశం చేస్తాయి. పర్యవసానంగా శాంతిభద్రతలు కరువవుతాయి. వరసగా మూడు నాలుగు రోజులపాటు ఈ మాదిరి ఉదంతాలు తీవ్ర స్థాయిలో కొనసాగినా పోలీసులు ఉలుకూ పలుకూ లేకుండా ఉండిపోతే ఆనాడు ప్రజాతంత్ర హక్కుల ప్రజాసంఘం (పీయూడీఆర్), పౌరహక్కుల ప్రజాసంఘం(పీయూసీఎల్) నాయకులు విధ్వంసం జరిగిన ప్రాంతాల్లో బాధిత కుటుంబాల నుంచి వివరాలు కనుక్కుని హత్యలు, సజీవ దహనాలు, అత్యాచారాలు, ఆస్తుల విధ్వంసాలు, గృహదహనాల వివరాలతో రోజుల వ్యవధిలోనే 'ఎవరు నేరస్తులు?' పేరుతో పుస్తకం ప్రచురించారు. ఒకపక్క ఢిల్లీ నగరంలో దారుణాలు కొనసాగుతుండగానే వీరు ప్రాణాలకు తెగించి ఇల్లిల్లూ తిరిగారు. ప్రత్యక్ష సాక్షులు చెప్పిన కథనాల ఆధారంగా దగ్గరుండి హింసాకాండ నడిపించిన ఆనాటి కాంగ్రెస్ నాయకుల పేర్లు సైతం దానిలో ప్రచురించారు. అందులో సజ్జన్‌కుమార్ ఒకరు. ఢిల్లీలోని సుల్తాన్‌పురి, కంటోన్మెంట్ తదితరచోట్ల సజ్జన్ రెచ్చగొట్టే ఉపన్యాసాలిచ్చి ఉన్మాద ముఠాల్లోని ప్రతి ఒక్కరికీ వందేసి రూపాయలు, మద్యం సీసా అందించాడని ప్రత్యక్ష సాక్షులు ఫిర్యాదు చేశారు. హంతక మూకలను ఉసిగొల్పిన నాయకుల్ని వదిలి ప్రత్యక్ష సాక్షులను భయపెట్టేందుకు, కేసులు ఉపసంహరింపజేయటానికి పోలీసులు ఒత్తిడి తెచ్చిన ఉదంతాలు కోకొల్లలు. ఢిల్లీ కౌన్సిలర్‌గా, మూడుసార్లు ఎంపీగా పనిచేసిన వ్యక్తి ఇంతగా బరితెగించటం ఊహించలేం. ఈయనే కాదు... హెచ్‌కేఎల్ భగత్, జగదీష్ టైట్లర్ వంటి అనేకమంది నాయకులకు ఢిల్లీ ఊచకోతలో ప్రమేయం ఉండొచ్చని దాదాపు డజను కమిషన్‌లు భావించాయి. అయినా తమ దర్యాప్తులో సాక్ష్యాధారాలు దొరకలేదని సీబీఐ తేల్చింది.

వ్యక్తులకు భావోద్వేగాలుంటాయి. రాగద్వేషాలుంటాయి. కానీ వ్యవస్థ వీటికి అతీతంగా ఉండాలి. తటస్థంగా మెలగాలి. రాజ్యాంగబద్ధంగా, చట్టబద్ధంగా వ్యవహరించాలి. కానీ ఢిల్లీ ఊచకోత నిందితులకు ఆనాటి రాజ్యవ్యవస్థ అండదండలిచ్చింది. అందుకే నలభైయేళ్లు గడుస్తున్నా చాలా కేసులు ఇంకా కింది కోర్టుల్లో విచారణ దశలోనే ఉన్నాయి. కొన్ని సరైన సాక్ష్యాధారాలు లేవన్న కారణంతో వీగిపోయాయి. ఇలాంటి పరిస్థితులే ప్రతీకారేచ్ఛకు పునాదులవుతాయి. పంజాబ్‌ను దాదాపు దశాబ్దంపాటు అట్టుడికించిన ఉగ్రవాదానికి మూలం సిక్కుల ఊచకోతనే. వెనువెంటనే నిందితులను అరెస్టుచేసి వారికి సత్వరం శిక్షలుపడేలా చేస్తే ఈ బెడద ఉండేదే కాదు. ఈ మారణకాండపై అప్పటి ప్రధాని రాజీవ్‌గాంధీని ప్రశ్నించినప్పుడు 'వటవృక్షం నేలకూలినప్పుడు భూమి కంపించటం సహజమే' అని వ్యాఖ్యానించటం గమనించదగ్గది. ఆ తర్వాత కాలంలో సోనియాగాంధీ, మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ ఆనాటి ఊచకోతకు క్షమాపణ చెప్పారు. అలాగని నిందితులను శిక్షించే ప్రక్రియను వేగవంతం చేయలేకపోయారు. ఇలాంటి ధోరణులు మరిన్ని హత్యాకాండలను ప్రోత్సహిస్తాయి. 2002లో గుజరాత్‌లో జరిగిన నరమేధం అందుకు ఉదాహరణ. ఆ దారుణ ఉదంతంలోనూ కొద్దిమంది దోషులకు శిక్షపడినా చాలామంది తప్పించుకున్నారు. కాలం గాయాలను మాన్పుతుందని చెబుతారు. కానీ తమ ఆప్తులను కళ్లెదుటే హతమార్చినవారిని నిర్లజ్జగా నెత్తిన పెట్టుకునే వ్యవస్థలుంటే అది ప్రతీకారానికి పురిగొల్పుతుంది. క్షతగాత్ర హృదయం చల్లారదు. అది నిత్యమూ రగులుతూనే ఉంటుంది.

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు మాఘ మాసం, **తిథి:** బ.చతుర్దశి ఉ.8.42 వరకు, తదుపరి అమావాస్య, **నక్షత్రం:** ధనిష్ఠ సా.4.03 వరకు, తదుపరి శతభిషం, **వర్జ్యం:** రా.10.59 నుండి 12.31 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.10.18 నుండి 11.06 వరకు, తదుపరి ప.2.59 నుండి 3.47 వరకు, **అమృతఘడియలు:** లేవు

సూర్యోదయం : 6.24
సూర్యాస్తమయం : 6.01
రాహుకాలం : ప.1.30 నుండి 3.00 వరకు
యమగండం : ఉ.6.00 నుండి 7.30 వరకు

ఆయన అనుకున్నదంతా అయ్యేనా?

విశ్లేషణ



టంకశాల అశోక్

ఆయుధ బలం, ఆర్థిక బలంతో ఏదైనా సాగించవచ్చునన్నట్లు వ్యవహరిస్తున్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌కు, అదంత తేలిక కాదని నెల రోజులు తిరిగేసరికి అర్థమవుతుండాలి! అమెరికన్లతోపాటు వారి అనుయాయ పశ్చిమ దేశాలను, మొత్తం ప్రపంచాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తూ సాగుతున్న ఆయన చర్యలను, అందుకు ఎదురవుతున్న ప్రతిఘటనలను బట్టి ఈ అభిప్రాయం కలుగుతున్నది.

అధ్యక్షుని ప్రకటనలను, చర్యలను రెండు విధాలుగా విభజించాలి. అంతర్గతమైనవి, విదేశాంగపరమైనవి. అంతర్గతంగా అన్నీ ఇప్పటికి తను కోరుకున్న విధంగానే జరిగిపోతున్నాయి. కొన్ని చర్యల వల్ల తమ వ్యవసాయ, పారిశ్రామిక, సర్వీస్ రంగాలపైన, గృహావసరాలపైన, సామాజిక సంబంధాలపైన ప్రభావాలు మొదలైనా, నిరసనలు మంద్ర స్థాయిలోనే ఉన్నాయి. ప్రతిపక్షమైన డెమోక్రాట్లలో చలనమే లేదు. ట్రంప్‌కు అడ్డుపడటమంటూ ఏమైనా జరిగితే అది కోర్టుల స్టే ఉత్తర్వుల వల్లనే. నష్టపోతున్న వారిలో ట్రంప్ 'మేక్ అమెరికా గ్రేట్ అగైన్' (మాగా), 'అమెరికా ఫస్ట్' నినాదాలకు ఆకర్షితులై భారీగా ఓటు చేసిన తరగతుల వారు కూడా ఉన్నారనీ, వారికి ఇప్పటికే పనులూ, ఫెడరల్ ఉద్యోగాలు పోతుండటం, ధరల పెరుగుదల వంటి సమస్యలు ఎదురవుతున్నాయనీ వార్తలు చెప్తున్నాయి. ఆ వర్గాల నుంచి వ్యతిరేకత పెరిగితే తప్ప ట్రంప్ తన అంతర్గత విధానాలను సవరించుకోకపోవచ్చు.

బయటి నిరసనలు

అంతర్గతంగా ఎట్లున్నా, బయటి ప్రపంచానికి విదేశాంగ విధానాలే ప్రధానమవుతాయి. విదేశాంగ విధానాలకు మూలం ఆంతరంగిక పరిస్థితులు, ప్రయోజనాలతో ఉండటం నిజమే అయినా, బయటివారికి ప్రత్యక్ష అనుభవంలోకి వచ్చేది ముఖ్యమవుతుంది. ఆ విధంగా చూసినపుడు ఈ 40 రోజులలో కనిపిస్తున్నది ఏమిటి? ట్రంప్ మొదట చేసిన భౌగోళిక సంబంధమైన ప్రకటనలు పనామా కాలువ స్వాధీనం, గల్ఫ్ ఆఫ్ మెక్సికో పేరు గల్ఫ్ ఆఫ్ అమెరికాగా మార్చటం, గ్రీన్‌ల్యాండ్ ఆక్రమణ, కెనడాను ఆర్థిక ఒత్తిడితో అమెరికాలో విలీనం చేసి 51వ రాష్ట్రంగా మార్చటం. ఈ అంశాలలో జరిగిందేమిటి? పనామా బలహీన దేశం. అయినా వారి కాలువను స్వాధీనపరచుకోలేక పోయారు. కానీ ఆ కాలువ ద్వారా ప్రయాణించే అమెరికన్ నౌకలపై సుంకాల రద్దుకు అంగీకరించారన్నది అమెరికా చేసిన ప్రకటన. అది నిజం కాదన్నది పనామా ప్రభుత్వ ఖండన. కాలువపై చైనా నియంత్రణ ఉందన్నది ట్రంప్ ఆరోపణ కాగా, అది నిజం కాదని అక్కడి ప్రభుత్వం వెల్లడించింది. కాకపోతే అమెరికా ఒత్తిడిని తట్టుకోలేక చైనా నిర్వహిస్తున్న బెల్ట్ అండ్ రోడ్ ప్రాజెక్టు నుంచి పనామా ఉపసంహరించుకున్నది. ఆ ప్రాజెక్టులో చేరిన మొట్టమొదటి లాటిన్ అమెరికన్ దేశం పనామాయే.

అదే ప్రాంతపు మెక్సికో, తమ గల్ఫ్ ఆఫ్ మెక్సికో పేరును గల్ఫ్ ఆఫ్ అమెరికాగా మార్చటాన్ని బలంగా తిరస్కరించింది. ఐక్యరాజ్య సమితి గుర్తించింది కూడా పాత పేరునే. ఇపుడు ట్రంప్ కొత్త పేరు పెట్టి ఉత్తర్వులు జారీ చేసినా, యూరోపియన్ దేశాలు సైతం ఆమోదించటం లేదు. మెక్సికో ఆర్థికంగా అమెరికాపై ఎంత ఆధారపడినా ట్రంప్ నిర్ణయాన్ని ప్రతిఘటిస్తున్నది. ఆయన ఏమీ చేయలేక మౌనం వహించారు. గ్రీన్‌ల్యాండ్ మరొక బలహీన దేశం. కానీ డెన్మార్క్ పరిధిలో స్వయంప్రతిపత్తి గలది. ట్రంప్‌కు కావలసింది అక్కడి విస్తారమైన వనరులు. ఆ ప్రాంతం కీలక ప్రదేశంలో ఉన్నందున తమ రక్షణ వ్యూహాలకు అవసరం. కానీ అమెరికాకు అమ్మకం అయేందుకు గ్రీన్‌ల్యాండ్, డెన్మార్క్ సమ్మతించలేదు. డెన్మార్క్ యూరప్ దేశమైనందున మొత్తం యూరప్ కూడా తీవ్రంగా వ్యతిరేకించింది. గ్రీన్‌ల్యాండ్‌లో ఇప్పటికే అమెరికా సైనిక స్థావరాలు ఉన్నందున వాటి విస్తరణకు, సహజ వనరులపై ఒప్పందాలకు మాత్రం గ్రీన్‌ల్యాండ్ రాజీపడుతున్న సూచనలున్నాయి. యూరప్ మద్దతు లేనట్లయితే ఆ చిన్న దేశంపై ట్రంప్‌దే రాజ్యమయ్యేది.



ట్రంప్: పాలన రెండవ నెలలో ప్రవేశించే సరికే ఇన్నిన్ని అనుభవాలు గడించటం మరెవరి విషయంలోనూ జరిగి ఉండదు.

◆ బలమైన యూరప్ మద్దతుగల గ్రీన్‌ల్యాండ్ వలెనే, స్వయంగా బలమైన కెనడా విషయంలోనూ ట్రంప్ యథేచ్ఛ ధోరణి నెరవేరటం లేదు. అన్నివిధాలైన సన్నిహిత సంబంధాలు ఉన్నప్పటికీ, ట్రంప్ అంటున్న 51వ రాష్ట్రపు మాటను కెనడా ఛీత్కరిస్తున్నది.

◆ గాజాను తామే ఆక్రమించి బీచ్ రిసార్టుగా మారుస్తామన్నారు ట్రంప్. ఆ రియల్ ఎస్టేట్ మాటను పాలస్తీనియన్లే గాక మొత్తం అరబ్ రాజ్యాలు ఖండించాయి. తాము చెప్పిన దానికన్న మెరుగైన ప్రతిపాదన ఉంటే సూచించాలని అరబ్ దేశాలను అమెరికా విదేశాంగ మంత్రి మార్క్ రూబియో ఇపుడు కోరుతున్నారు.

అమెరికాకు సరిహద్దున ఉండటమేగాక అన్నివిధాలైన సన్నిహిత సంబంధాలు ఉన్నప్పటికీ, ట్రంప్ అంటున్న 51వ రాష్ట్రపు మాటను కెనడా ఛీత్కరిస్తున్నది. 25 శాతం సుంకాలకు బెదరక అదే స్థాయిలో ఎదురు సుంకాలు ప్రకటించింది. ప్రజలలో జాతీయాభిమానం ఎగసి రాగా వారు అమెరికన్ ఉత్పత్తుల కొనుగోలును తగ్గించి వేస్తున్నట్లు కథనాలు వెలువడుతున్నాయి. బలమైన మద్దతుగల గ్రీన్‌ల్యాండ్ వలెనే, స్వయంగా బలమైన కెనడా విషయంలోనూ ట్రంప్ స్వేచ్ఛా ధోరణి నెరవేరటం లేదన్నమాట.

బుల్‌డోజర్ పథకం సాగేనా?

ఇంచుమించు ఇటువంటిదే గాజా విషయం. పాలస్తీనా, ఇజ్రాయెల్ రెండు స్వతంత్ర దేశాలు కావాలన్న అమెరికా విధానంలో నిజాయితీ లేకున్నా నోటి మాటగా అంటూ వస్తూ, ఇపుడు తిరిగి అధికారానికి వచ్చినాక దానిని అకస్మాత్తుగా వదిలివేసిన ట్రంప్, గాజాను తామే ఆక్రమించి బీచ్ రిసార్టుగా మారుస్తామన్నారు. ఆ రియల్ ఎస్టేట్ మాటను పాలస్తీనియన్లే గాక మొత్తం అరబ్ రాజ్యాలు, యూరోపియన్ యూనియన్, తక్కిన ప్రపంచం, ఐక్యరాజ్యసమితి వెంటనే కొట్టివేశాయి. అయినప్పటికీ తన పంతం వీడని ట్రంప్, తమపై బాగా ఆధారపడి ఉన్న ఈజిప్టు, జోర్డాన్‌లను ఒత్తిడి చేసి గాజా ప్రజలను, బహుశా తర్వాత వెస్ట్ బ్యాంక్ పాలస్తీనియన్లను కూడా ఆ దేశాలకు తరలించేందుకు గట్టి ప్రయత్నాలే చేశారు. కానీ ఆయన ఎంతో ఆశలు పెట్టుకున్న ఈజిప్ట్, జోర్డాన్‌ల సొంత ఆలోచనలు ఏవైనా అక్కడి ప్రజాభిప్రాయానికి, తక్కిన అరబ్ ప్రపంచం ఆగ్రహానికి భయపడి అందుకు అంగీకరించలేదు. కీలకమైన పాత్ర వహించే సౌదీ అరేబియా వెంటనే తిరస్కరించగా, ఆ తర్వాత అరబ్ విదేశాంగ మంత్రులు, గల్ఫ్ కో ఆర్డినేషన్ కౌన్సిల్ సమావేశమై అదే వైఖరి తీసుకున్నారు. దానితో, తాము చెప్పిన దానికన్న మెరుగైన ప్రతిపాదన ఉంటే సూచించాలని అరబ్ దేశాలను అమెరికా విదేశాంగ మంత్రి మార్క్ రూబియో ఇపుడు కోరుతున్నారు. గాజా ప్రజలు తమ మాతృభూమిలోనే నివసించే విధంగా పునర్నిర్మాణ పథకాన్ని, పాలస్తీనా స్వతంత్ర దేశ పథకాన్ని అరబ్ దేశాలు ఇంచుమించు రూపొందించాయి. ఆ విధంగా అమెరికా అధ్యక్షుని బుల్‌డోజర్ ఉధృతి అక్కడ సాగబోవటం లేదు. ఈ పరిణామాల దరిమిలా, తాము, ఇజ్రాయెల్ కలిసి ఇరాన్‌ను ధ్వంసం చేయటం, లొంగ దీసుకోవటం జరగవచ్చునా అన్నది వేచి చూడవలసిన ప్రశ్న అవుతున్నది.

ఉక్రెయిన్ విషయంలో ట్రంప్ చేస్తున్నదేమిటో రోజూ వార్తలు వెలువడుతున్నాయి. తాము, యూరప్ కలిసి ఉక్రెయిన్‌ను మూడేళ్లుగా నిలబెట్టలేక పోవటంతో, వ్యక్తిగతంగా వ్యాపార ధోరణి గల ట్రంప్ ఇప్పుడు రెండువైపుల నుంచి ప్రయోజనాలు పొందే వ్యూహం వైపు మారారు. ఉక్రెయిన్‌ను, యూరప్‌ను దారికి తెచ్చుకుని ఉక్రెయిన్‌లోని లోహాలు, ఖనిజాలను సంపాదించటం; బలమైన రష్యాతో ఆర్థిక, ఇతర సంబంధాల మెరుగుదల. ఎటూ గెలవలేని యుద్ధంలో ఆ విధంగా ఉక్రెయిన్, యూరప్, తనను కాదని చేయగలిగింది కూడా లేని బలహీనులు కావటం వల్ల వారిని దారికి తేగలుగుతున్నారు. దీనినిబట్టి అర్థమయే దేమిటి? పనామా, కెనడా, గాజా, ఉక్రెయిన్, యూరప్ వంటివి వేర్వేరు విధాలైన కేసులు. మొత్తం మీద తన పాలన రెండవ నెలలో ప్రవేశించే సరికే అమెరికా అధ్యక్షుడు ఇన్నిన్ని అనుభవాలు గడించటం బహుశా మరెవరి విషయంలోనూ జరిగి ఉండదు. ఆయనతో ప్రపంచ అనుభవాలు కూడా అటువంటివే.

వ్యాసకర్త సీనియర్ సంపాదకుడు

సోషల్ మీడియా

వెరీ లోకల్



మధ్యప్రదేశ్‌లోని గ్లోబల్ ఇన్వెస్టర్స్ శిఖరాగ్ర సమావేశంలో భోజనం కోసం కొట్టుకున్నంత పని జరిగింది. వీళ్లు నూరు శాతం భారతీయులు. చూస్తుంటే సీట్లు నిండటానికి తెచ్చినట్టుంది. ఇందులో 'గ్లోబల్' ఏముంది? అంతా జనాన్ని మభ్యపెట్టే నాటకం. ప్రజాధనాన్ని కొల్లగొట్టడానికి ఒక మార్గం.

– జయంత్ భండారీ, ఇన్వెస్టర్ కన్సల్టెంట్

మహా జననం



నేను మహాశివరాత్రి రోజు జన్మించాను. శివుడి సిగలోని నెలవంక మీదుగా నాకు శశి అని పేరు పెట్టారు. 'కేరళ క్యాలెండర్' ప్రకారం, నా 'నక్షత్ర జన్మదినం' ఈ రోజు. ఈ పండుగ నా కుటుంబానికి ఎప్పుడూ ప్రత్యేకమైన రోజు.

– శశి థరూర్, కాంగ్రెస్ ఎంపీ

ఆఫ్రికా స్థానికమా?



చైనీయులు సాంస్కృతిక సంపన్నులు. వాళ్లు పిల్లలకు తమ సంస్కృతి, సంప్రదాయాలు, పూర్వీకుల చరిత్రను లేత వయసులోనే బోధిస్తారు. అదే ఆఫ్రికావాళ్లు మానసిక బానిసలు. తమ భాషను స్థానిక భాష అనుకుంటారు.

– అడేమోలా, పాన్ ఆఫ్రికనిస్ట్

చెట్ల మీద పీడ



కరాచీ నగరం (పాకిస్తాన్) పసుపు పచ్చటి సేమియా లాంటి బదనిక మహమ్మారిని ఎదుర్కొంటోంది. అది ప్రతి చెట్టునూ చంపేయగలదు. దీన్ని వెంటనే అరికట్టాలి. లేదంటే అది పాకే ప్రతి చెట్టూ, పొదా మనకు లేకుండాపోతాయి.

– జుల్ఫికర్ అలీ భుట్టో, పాక్ పర్యావరణవేత్త

మూర్ఖులు మాట్లాడకుండా...



ఇలా చేస్తే ఎలా ఉంటుంది? ఒక పాడ్‌కాస్ట్ ప్రారంభించడానికి ముందు ఎవరైనా చిన్న ఐక్యూ పరీక్ష, ఒక ప్రాథమిక రీజనింగ్ పరీక్ష లాంటిది ఇవ్వాలి. ఆ రెండూ ఫలానా శాతం మార్కులతో పాస్ అయితేనే పాడ్‌కాస్ట్ ప్రారంభించడానికి అర్హులని నియమం పెడితే ఎలా ఉంటుంది? ప్రపంచం మెరుగ్గా ఉండదా?

– వీర్ దాస్, కమెడియన్

ఇప్పటికీ అదే సత్తా!



తుర్కెస్తాన్‌లో (కజక్‌స్తాన్) జరిగిన సంచార జీవుల క్రీడల పోటీల్లో 6,000–8,000 మంది తమ గుర్రాలతో పాల్గొన్నారు. దీన్ని మూడుతో గుణించండి; బైజాంటైన్లను (తూర్పు రోమన్ సామ్రాజ్యం) జయించిన ఆల్ప్ అర్సలన్ (క్రీ.శ.11వ శతాబ్దం) ఆశ్విక దళం సంఖ్య వస్తుంది.

– ఎల్ ఎర్రాంతే, తుర్క్‌మెనిస్తాన్ యాత్రికుడు

జట్టు ముఖ్యం



ఒక జట్టులో కేవలం ఒక వ్యక్తి శూన్యం, జట్టే సర్వం. మీరు కారును ఒంటి టైరుతో నడపలేరు – ఆ టైరు ఎంత మంచిదైనప్పటికీ! జీవితంలో గుర్తుంచుకోవాల్సిన విషయం ఇది.

– మనోజ్ అరోరా, రచయిత

ఇన్ బాక్స్

ఆయన కృషికి గుర్తింపేదీ?

'ఆదివాసుల ఆత్మాబంధువు యాడికెళ్ళెనే... అడవి బిడ్డల తోడు నీడ ఏమైపోయనే... జనప్రియుడేడమ్మా... జనార్దనేడమ్మా... తన గుండెలాగిపోయినా... మన గుండె చప్పుడాయన!' ఈ పాట ప్రొఫెసర్ బియ్యాల జనార్దన్ సార్ జీవనశైలినీ, ఆయన ఆదివాసీల కోసం తపించిన తీరునూ మన కళ్ళకు కడుతుంది.



ప్రొ॥ బియ్యాల జనార్దన్

1955 అక్టోబర్ 12న మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలంలోని మునిగలవీడు గ్రామంలో జన్మించిన జనార్దన్ కాకతీయ విశ్వవిద్యాలయంలో 'గిరిజన భూముల పరాయీకరణ' అనే అంశంపై పరిశోధన చేసి 1985లో పీహెచ్‌డీ పట్టాపొందారు. అటవీ సంపదంతా ఆదివాసీలకే దక్కాలని, అది పరాయీకరణ కాకుండా 1/70 చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని పోరాడారు. తెలంగాణ నీళ్ళు, నిధులు, వనరులు, ఉద్యోగాలు తెలంగాణ ప్రజలకే దక్కాలనే నినాదంతో ప్రత్యేక తెలంగాణ కోసం అనాడే పోరాటం చేయమన్నారు. తాను సైతం అందులో భాగమయ్యారు. అధ్యాపకుడిగా ఉంటూనే ఆదివాసీలపై అత్యంత మమకారాన్ని పెంచుకున్నారు. కాకతీయలో ప్రొఫెసర్‌గా పనిచేస్తూనే మలిదశ తెలంగాణ ఉద్యమకారుడిగా, ఆదివాసీల భూసమస్యలు, స్వయంపాలన ఉద్యమాలపై పరిశోధన చేసి వారి సంక్షేమానికి కృషి చేశారు.

మలిదశ తెలంగాణ ఉద్యమంలో ప్రొ॥ జయశంకర్ సార్‌తో కలిసి అమెరికాలో జరిగిన 'తానా' సభల్లో పాల్గొని ప్రత్యేక తెలంగాణ అవశ్యకతను వివరించారు. మేధావులు ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో ముందుండాలని ఆ దిశగా ప్రయత్నం చేశారు. తెలంగాణపై వివక్ష, అణచివేతలపై అనేక రచనలు చేశారు. 1999లో కన్నబిరాన్, ఎస్.ఆర్. శంకరన్ తదితరులతో ప్రభుత్వం తరఫున నక్సలైట్లతో శాంతి చర్చలు జరపాలని ఎజెండాను ముందుకు తెచ్చారు. 2001లో 'తెలంగాణ రాష్ట్ర సమితి' ఏర్పాటులో కీలకపాత్ర పోషించారు. చివరకు 2002 ఫిబ్రవరి 27న జనార్దన్ సార్ కన్ను మూశారు. ఆయనకు స్వరాష్ట్రంలో ఇప్పటివరకు సముచిత స్థానం దక్కలేదు. ఆయన స్మృత్యర్థం ప్రభుత్వం ఒక గ్రంథాలయాన్నో, విగ్రహాన్నో నెలకొల్పి, గౌరవించాలి.

– కలువకొలను హరీష్‌రాజు, జర్నలిస్టు
(నేడు ప్రొ॥ బియ్యాల జనార్దన్‌రావు వర్ధంతి)

కార్పొరేట్ కాలేజీలపై చర్యలేవి?


అభిప్రాయం



డా॥ బి. కేశవులు

తెలుగు నేలపై పుట్టి మొత్తం దక్షిణాదిలో విద్యను వ్యాపారీకరించిన రెండు కార్పొరేట్ విద్యాసంస్థలు పిల్లలు, తల్లిదండ్రుల కలలపై వ్యాపారం చేస్తున్నాయి. ఇటువంటి సంస్థలు దేశవ్యాప్తంగా చాలానే ఉన్నాయి. ఎందరో పిల్లల జీవితాలు ఇవి చేసే వ్యాపారంలో సమిధలవుతున్నాయి.

నేడు భారతదేశంలో ఆత్మహత్యలు అనేది ఒక జాతీయ సామాజిక సమస్యగా మారిపోయింది. భారతదేశంలో ప్రతి 40 నిమిషాలకు ఒక విద్యార్థి ఆత్మహత్య చేసుకుంటున్నాడు. సగటున ప్రతిరోజూ సుమారుగా 36 మంది విద్యార్థుల ఆత్మహత్యలు నమోదవుతున్నాయి. మనదేశంలో ప్రతి సంవత్సరం ఆత్మహత్యల ద్వారా సుమారుగా 7–8 శాతం వరకు విద్యార్థులు మరణిస్తున్నారు. గత 25 ఏళ్లగా (1995 నుండి 2021 వరకు) దాదాపుగా 2 లక్షల మంది విద్యార్థులను భారత్ ఆత్మహత్యల ఫలితంగా కోల్పోయింది.



నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో డేటా ఆధారంగా, వార్షిక ఐసీ–3 కాన్ఫరెన్స్– ఎక్స్‌పో– 2024 (ఆగస్టు 28)లో 'విద్యార్థుల ఆత్మహత్యలు: ఎపిడెమిక్ స్వీపింగ్ ఇండియా' నివేదిక విడుదల చేయబడింది. మొత్తం ఆత్మహత్యల సంఖ్య ఏటా 2% పెరుగుతుండగా, విద్యార్థుల ఆత్మ హత్యల కేసులు 4% పెరిగాయని ఈ నివేదిక ఎత్తి చూపింది. గత రెండు దశాబ్దాలుగా, విద్యార్థుల ఆత్మహత్యలు జాతీయ సగటు కంటే రెట్టింపు స్థాయిలో వార్షికంగా 4% పెరిగాయి. 2022లో మొత్తం ఆత్మహత్యల్లో 53% మంది విద్యార్థులు ఉన్నారు. 2021, 2022 మధ్య విద్యార్థులలో మగపిల్లల ఆత్మహత్యలు 6% తగ్గగా, బాలికల ఆత్మహత్యలు 7% పెరిగాయి అని ఐసీ–3 ఇన్‌స్టిట్యూట్ రూపొందించిన నివేదిక పేర్కొంది.

చాలా మంది దిగువ – మధ్యతరగతి నేపథ్యాల వారు కార్పొరేట్ కాలేజీల్లో చేరి ఇటు ఫీజులు కట్టలేక, అటు కాలేజీల్లో ఉన్న ఒత్తిడి వాతావరణాన్ని తట్టుకోలేక సతమతమవుతున్నారు. కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఉండే అసహజ వాతావరణం తల్లిదండ్రులకు తెలిసినా... వాటిలో చేరితేనే తమ పిల్లలు మంచి ర్యాంకు పొంది డాక్టర్లు, ఇంజినీర్లు అవుతారనే నమ్మకంతో వాటిల్లోనే చేరుస్తున్నారు. ప్రభుత్వాలు ఇటువంటి సంఘటనలు జరిగినప్పుడు విచారణా కమిటీలు నియమించి చేతులు దులుపుకొంటున్నాయి. తమ డబ్బు, పలుకుబడులతో అవి మేనేజ్ చేయగలుగుతున్నాయి.

ఆత్మహత్య చేసుకున్న వారిలో చాలామంది నిరాశా నిస్పృహలకు లోనైనవారే ఉంటారు. ఏ వైపు నుంచి కూడా ఎలాంటి సహాయం అందని పరిస్థితుల్లో మాత్రమే వారు ఈ చర్యకు పాల్పడతారు. చనిపోకముందే చాలా సార్లు మాటల ద్వారా, చేతల ద్వారా చనిపోవాలనే ఆలోచనను వ్యక్తపరుస్తారు. స్నేహితులు, కుటుంబ సభ్యులు ఆ మాటలు – చేతల్లోని భావాన్ని అర్థం చేసుకుని జాగ్రత్త పడకపోవడం వల్ల ఎక్కువమంది ప్రాణాలు తీసుకుంటున్నారు. అందుకనే విద్యా సంస్థలలో కచ్చితంగా ఒత్తిడికి గురవుతున్న విద్యార్థులను గుర్తించి సహాయమందించే ఏర్పాట్లు చెయ్యాలి. భావి భారత యువతను కాపాడుకోవాలంటే కార్పొరేట్ కాలేజీలపై కన్నేసి ఉంచాల్సిందే.

వ్యాసకర్త ఎండి. సైకియాట్రీ,
తెలంగాణ ఆత్మహత్యల నిరోధక కమిటీ చైర్మన్

శివజ్ఞానం అంటే...

నైమిశారణ్యంలో ఒక రోజు వీరభద్రుడి విజయగాథను మునులతో వాయు దేవుడు కథగా చెబుతూ శంకరుని గురించి అద్భుతంగా చెప్పాడు: సృష్ట్యాదికి సంబంధించిన కాలం గడుస్తున్న రోజులలో, చంద్ర విభూషణుడైన ఉమామహేశ్వరుడు సతీసమేతంగా రజతాచలంపై కొలువుతీరి ఉండగా... హరుడికి తమ కార్యకలాపాలన్నిటినీ విన్నవించుకోవాలన్న కోరికతో, ఒకనాడు సకల దేవతలు, మునిగణాలు, గంధర్వాధిపులతో కూడి రజతగిరికి ప్రయాణం కట్టారు. నాలుగు వేదములు కూడా అలా ప్రయాణం కట్టిన వారిలో భాగంగా ఉన్నాయి. ఆ సంగతిని 'వీరభద్ర విజయం' ప్రథమా శ్వాసంలోని ఈ క్రింది పద్యంలో అక్షరరమ్యంగా చెప్పాడు పోతన.

జ్యోతిర్మయం

కం. చదువులు పెక్కులుగల వా
చదువులకును మొదలు నాల్గుచదువులు గలవా
చదువులకు మొదలుగలిగిన
చదువులు గల శంభుగొలువ వచ్చెన్.

'చదువులు' అనగా లోకంలో మనుషులు సుఖంగాను, సౌకర్యవంతంగాను జీవనం సాగించడానికి తప్పనిసరిగా 'నేర్వదగిన విద్యలు, నేర్వ వలసిన విద్యలు' చాలా ఉన్నాయి. 'ఆ చదువులకు'– అనగా అలా 'లోకంలో మనిషి నేర్వవలసిన విద్యలన్నిటికీ' ఆధారమైనట్టివి, లోకంలోని విద్యలన్నిటికంటే మొదటివి అని చెప్పవలసిన 'నాల్గు చదువులు' – అనగా 'నాలుగు వేదములు' ఉన్నాయి. అయితే ఆ నాలుగు వేదములకు కూడా ముందుది, మూలమైనటువంటివి అని చెప్పదగిన చదువులను – అనగా అన్నిటి కంటె పరమమైనదిగా భావించబడే ఆదిమ జ్ఞానాన్ని – తనలో నిక్షిప్తం చేసుకుని ఉన్న ఆ శంభునిదర్శనం చేసుకుని కొలవడానికి, భక్తితో పూజించడానికి, అందరితో కలిసి 'నాలుగు వేదములు' కూడా వచ్చాయి అని పై పద్యంలో భావయుక్తంగా చెప్పాడు పోతన. పరమ శివుడిని గురించిన పూర్తి జ్ఞానం కలిగి వుండడం అంటే వేదాలలో చెప్పబడిన విషయాలకు మూలమైన జ్ఞానాన్ని కలిగి ఉండడంతో సమానమని ఇందులో సూచించబడింది.

– భట్టు వెంకటరావు

ఏఐ వార్తలు @ గిరిజన టీచర్

- గోండి, కొలామి భాషల రక్షణకు కృషి
- గోండి భాషలోకి మహాభారతం అనువాదం
- గిరిజన ఉపాధ్యాయుడు తొడసం కైలాస్ ఘనత
- మన్‌కీ బాత్‌లో ప్రశంసించిన ప్రధాని మోదీ

ఆదిలాబాద్ టౌన్: ఆదివాసీ పేద కుటుంబంలో జన్మించి అభ్యున్నతి వైపు పయనిస్తున్నాడు గిరిజన ఉపాధ్యాయుడు తొడసం కై లాస్. అంతరించిపోతున్న గోండి, కొలామి భాషల పరిరక్షణకు ఎనలేని కృషి చేస్తున్నాడు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ద్వారా యాంకర్‌ను సృష్టించి గోండి భాషలో వార్తలు చదివిస్తున్నాడు. గోండి, కొలామి, తెలుగు, హిందీ, ఆంగ్లం, లంబాడా భాషల్లో వందలాది పాటలు రాసి ఔరా అనిపించాడు. ఆదిలాబాద్ జిల్లాలోని మావల మండలం వాఘాపూర్ గ్రామంలో నిరుపేద కుటుంబంలో జన్మించిన కైలాస్ సేవల గురించి ఇటీవల మన్‌కీబాత్ కార్యక్రమంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కూడా ప్రస్తావించి ప్రశంసించటం గమనార్హం.

మట్టిలోని మాణిక్యం

కైలాస్ 1 నుంచి 10వ తరగతి వరకు వాఘాపూర్ సర్కారు బడిలో చదివాడు. ఉట్నూర్‌లోని లాల్‌టేక్డి రెసిడెన్షియల్‌లో ఇంటర్, ఆదిలాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఏ పూర్తి చేశాడు. 2000 సంవత్సరంలో అన్‌ట్రెయిన్డ్ డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ కొలువు సాధించాడు. ఈయనకు భార్య ఉమాదేవి, ఇద్దరు పిల్లలు గంగోత్రి, సృజన్‌రామ్ ఉన్నారు. గాదిగూడ మండలంలోని డొంగర్‌గావ్ ప్రాథమిక పాఠశాలలో ఎస్జీటీగా పనిచేసి, ప్రస్తుతం ఇంద్రవెల్లి మండలం గౌరపూర్‌లో స్కూల్ అసిస్టెంట్ (సాంఘిక శాస్త్రం)గా విధులు నిర్వహిస్తున్నాడు. విద్యార్థులకు ప్రొజెక్టర్ ద్వారా డిజిటల్ పాఠాలు బోధిస్తున్నాడు. కరోనా సమయంలో గిరిజనులను అప్రమత్తం చేసేందుకు గోండి భాషలో కరపత్రాలు ప్రచురించి పంపిణీ చేశాడు.

గోండి భాషలోకి మహాభారతం

ఆదివాసీలకు మహాభారత గ్రంథాన్ని అందించాలనే ఉద్దేశంతో తెలుగు లిపి ద్వారా గోండి భాషలోకి ఆ గ్రంథాన్ని కైలాస్ అనువదించాడు. 'సుంగల్‌తూర్పో (ఇలవేల్పు), తొడసం బండు (ఇంటి దేవత), నైతం మారుబాయి (అమ్మమ్మ), తొడసం నేలేంజ్ (తమ్ముని కూతురు)'పేరిట ఏఐ యాంకర్‌తో వార్తలు చదివించేవాడు. సంగీతం అంటే ఆయనకు మక్కువ. దీంతో కొలామి భాషలో వందకు పైగా పాటలు రచించి, వాటిని సైతం ఏఐ యాంకర్‌తో పాడించి సోషల్ మీడియాలో పోస్టు చేశాడు.



ఆదిలాబాద్ ఆకాశవాణిలో తొడసం కైలాస్



పాటలను స్వరపరుస్తున్న కైలాస్

గిరిజనులను చైతన్యపర్చాలని..

గిరిజనులను చదువు వైపు మళ్లించడంతోపాటు చెడు వ్యసనాలకు దూరంగా ఉంచాలనే ఉద్దేశంతో పలు కార్యక్రమాలను చేపడుతున్నా. జ్ఞానం ఏ ఒక్కరి సొత్తు కాదు. కష్టపడి చదివితే అనుకున్న లక్ష్యం నెరవేరుతుంది. సాంకేతికతపై ఉన్న మక్కువతో ఏఐ యాంకర్ ద్వారా గోండి, కొలామి ఇతర భాషల్లో వార్తలు చదివించడం, పాటలు పాడించడం చేస్తున్నాను. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నన్ను అభినందించడం సంతోషంగా ఉంది.

– తొడసం కైలాస్, ఉపాధ్యాయుడు



వేములవాడకు భారీగా తరలివచ్చిన భక్తులు



స్వామివారికి పట్టు వస్త్రాలు తీసుకువస్తున్న బండి సంజయ్

వేములవాడలో వైభవంగా మహాశివరాత్రి వేడుకలు

- రాజన్నను దర్శించుకున్న 4 లక్షల మంది భక్తులు

వేములవాడ: రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి దేవస్థానంలో బుధవారం మహాశివరాత్రి వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. ఉదయం మహాలింగార్చన నిర్వహించారు. దాదాపు 4 లక్షల మంది భక్తులు రాజన్నను దర్శించుకున్నారు. భక్తులు ధర్మగుండంలో స్నానాలు చేసి కోడె మొక్కులు, కల్యాణకట్టలో తలనీలాలు సమర్పించుకున్నారు. శివదీక్షాపరులు స్వామి వారిని దర్శించుకున్నారు. మహాలింగార్చన అనంతరం నిరంతరం లఘు దర్శనాలు కొనసాగాయి. జాతర సందర్భంగా ఆర్జిత సేవలు రద్దు చేశారు. గురువారం అర్ధరాత్రి వరకు ఆలయాన్ని తెరిచే ఉంచుతున్నట్లు ఈవో కొప్పుల వినోద్‌రెడ్డి ప్రకటించారు. ఏర్పాట్లను ప్రభుత్వవిప్ ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, ఎస్పీ అఖిల్ మహాజన్, అడిషనల్ ఎస్పీ చంద్రయ్యలు పరిశీలించారు. గతంలో పట్టువస్త్రాల సమర్పణ తదితర అంశాలతో ఆరుసార్లు దర్శనం బ్రేక్ చేసేవారు. ఈసారి ఒకరోజు ముందుగానే పట్టువస్త్రాలను ప్రభుత్వం, టీటీడీ తరఫున సమర్పించారు.

సుందరం.. స్వర్ణ విమాన గోపురం

- విమాన గోపురం చుట్టూ కర్రల తొలగింపు



అద్భుతంగా కనిపిస్తున్న స్వర్ణ విమాన గోపురం

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ స్వర్ణ విమాన గోపురం చుట్టూ ఉన్న కర్రలను సిబ్బంది పూర్తిగా తొలగించారు. ఈ నెల 23న స్వర్ణ విమాన గోపురం మహా కుంభాభిషేకం, సంప్రోక్షణ సందర్భంగా ప్రముఖులు పాల్గొనేందుకు కర్రలతో మెట్లను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం స్వర్ణగోపురం ఆవిష్కరణ, పూజలు పూర్తి కావడంతో మెట్ల కోసం ఏర్పాటు చేసిన కర్రలను పూర్తిగా తొలగించగా.. స్వర్ణ విమాన గోపురం అద్భుతంగా కనిపిస్తోంది.

మార్చి మొదటివారం తర్వాతే | కొత్త రేషన్‌కార్డులు!

మొదట్లో ఏటీఎం తరహా స్మార్ట్‌కార్డులు జారీ చేస్తామన్న సర్కార్

- కార్డుల తయారీ టెండర్లకు లభించని సీఎం ఆమోదముద్ర
- ప్రస్తుతానికి సాధారణ ఆహారభద్రత కార్డులతోనే సరిపెట్టే అవకాశం
- తొలి విడతలో 3–4 లక్షల కార్డుల జారీ
- ఈ నెల 28 వరకు మీ సేవలో దరఖాస్తులకు అవకాశం

సాక్షి, హైదరాబాద్: కొత్త రేషన్‌కార్డుల జారీకి ఏర్పాట్లు చకచకా సాగుతున్నాయి. మార్చి మొదటివారం తర్వాతనే కొత్తగా ఆహారభద్రత (రేషన్) కార్డులు జారీ చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. మంత్రి పొన్నం ప్రభాకర్ మార్చి 1న లక్ష కార్డులు జారీ చేయనున్నట్టు ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే అధికార యంత్రాంగం మాత్రం మొదటివారం తర్వాతే కొత్తకార్డుల జారీ చేసే అవకాశం ఉన్నట్టు చెబుతోంది. అయితే ప్రభుత్వం తీసుకునే నిర్ణయాన్ని బట్టి కార్డుల జారీ ప్రక్రియ ఉంటుందని పౌరసరఫరాల శాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్ 'సాక్షి'కి తెలిపారు. ప్రభుత్వం ఎప్పుడు కార్డులు జారీ చేయమంటే అప్పుడు ఇచ్చేందుకు పౌరసరఫరాల శాఖ సిద్ధంగా ఉందన్నారు. ఎస్ఎల్‌బీసీ సొరంగం కూలి 8 మంది కార్మికులు గల్లంతైన నేపథ్యంలో పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి బిజీగా ఉన్నారని, కొత్త రేషన్‌కార్డులు ఎలా ఉండాలనే విషయంలో ఇప్పటి వరకు స్పష్టత లేకపోవడంతో మార్చి మొదటి వారం తర్వాతే ఈ ప్రక్రియ ప్రారంభమవుతుందని సమాచారం.

చిప్‌తో కూడిన కార్డు అనుకున్నారు...

ఏటీఎం తరహాలో స్మార్ట్‌కార్డు రూపంలో కొత్త రేషన్‌కార్డులు తీసుకురావాలని ప్రభుత్వం భావించింది. ఆహారభద్రత కార్డుగా పేర్కొనే దీనికి చిప్‌ను అటాచ్ చేసి, యూనిక్ నంబర్ కేటాయించి, కుటుంబం వివరాలన్నీ పొందుపరచాలనుకున్నారు. ఆ శాఖ కమిషనర్ చౌహాన్ సైతం చిప్ సిస్టమ్‌తో కూడిన రేషన్‌కార్డు తీసుకురాబోతున్నట్టు తెలిపారు. దీనికి సంబంధించిన ఫైల్‌ను కూడా సీఎంకు పంపారు. అయితే ఇప్పటివరకు స్మార్ట్‌కార్డులకు ప్రభుత్వం నుంచి ఆమోదముద్ర రాలేదు. ప్రస్తుతం ఎమ్మెల్సీ ఎన్నికల హడావుడితోపాటు సీఎం ఢిల్లీ పర్యటన, ఎస్ఎల్‌బీసీ ఘటన నేపథ్యంలో సీఎం, మంత్రులు బిజీబిజీగా ఉన్నారు. దీంతో దీనిపై ఏ నిర్ణయమూ తీసుకోలేదు. ఒకవేళ ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నా, స్మార్ట్‌కార్డు తయారీకి కంపెనీకి టెండర్లు పిలవడం, అర్హులను ఎంపిక చేయడం, చిప్‌తో కూడిన కొత్తకార్డుల తయారీ, కుటుంబ వివరాలన్నీ పొందుపరచడం లాంటివి ఇప్పట్లో అయ్యే పరిస్థితులు లేవు. మరోవైపు స్థానిక సంస్థల ఎన్నికల నగారా మోగే లోపే కొత్త రేషన్‌కార్డుల పంపిణీ పూర్తి చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. దీంతో పాత పద్ధతిలో ఆహారభద్రత కార్డులను జారీ చేసి, తర్వాత వాటిని ఏటీఎం కార్డు రూపంలోకి తీసుకొచ్చే ఆలోచనలో ఉన్నట్టు తెలిసింది.



కొత్తగా ఎన్ని కార్డులో ?

- రాష్ట్రంలో ప్రస్తుతం 89 లక్షల ఆహారభద్రత కార్డులున్నాయి. ఈ కార్డుల్లో 2.81 కోట్ల మంది లబ్ధిదారులుగా నమోదై ఉన్నారు.
- కాంగ్రెస్ సర్కారు కొత్త రేషన్‌కార్డుల జారీ ప్రక్రియ ప్రారంభించిన తర్వాత ప్రజాపాలన, గ్రామసభలు, మీ సేవ కేంద్రాల్లో కలిపి సుమారు 7 లక్షల కుటుంబాల నుంచి కొత్త దరఖాస్తులు అందించినట్టు సమాచారం.
- ఆ దరఖాస్తుల్లో అర్హులను గుర్తించి కొత్తగా తొలివిడతగా 3 నుంచి 4 లక్షల వరకు రేషన్ కార్డులు జారీ చేయనున్నట్టు తెలిసింది.
- హైదరాబాద్, ఉమ్మడి రంగారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల్లో 1.12 లక్షల మంది లబ్ధిదారులను గుర్తించినట్టు తెలుస్తోంది.
- కాగా గత జనవరి 26న ఎంపిక చేసిన 577 గ్రామాల్లో 16,900 కుటుంబాలకు కొత్త రేషన్ కార్డులు పంపిణీ చేసిన విషయం తెలిసిందే.
- ఈనెల 28వ తేదీ వరకు మీసేవ సెంటర్ల నుంచి కొత్త రేషన్‌కార్డుల కోసం దరఖాస్తులు స్వీకరిస్తారు. వివిధ రూపాల్లో వచ్చిన దరఖాస్తులను క్రోడీకరించి, జిల్లా స్థాయిలోనే అర్హులను ఎంపిక చేసి, ఆమోదానికి కమిషనర్ కార్యాలయానికి పంపుతారు.

ఏడుపాయల జాతర ప్రారంభం

- దుర్గమ్మకు పట్టువస్త్రాలు సమర్పించిన మంత్రి దామోదర



దుర్గమ్మకు పట్టు వస్త్రాలు తీసుకెళ్తున్న మంత్రి దామోదర రాజనర్సింహ

పాపన్నపేట (మెదక్): తెలంగాణలో ప్రసిద్ధి చెందిన ఏడుపాయల జాతర బుధవారం ప్రారంభమైంది. వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ప్రభుత్వం తరఫున దుర్గమ్మ తల్లికి పట్టువస్త్రాలు సమర్పించి, ప్రత్యేక పూజలు చేశారు. మహాశివరాత్రి సందర్భంగా జరిగే జాతరకు మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి సుమారు 15 లక్షల మంది భక్తులు వస్తారని అంచనా. ఏడు పాయలుగా చీలి ప్రవహించే మంజీరా నది ఒడ్డున, రాతి గుహలో దుర్గమ్మ లక్షలాది భక్తుల కొంగు బంగారంగా వర్ధిల్లుతోంది. మూడు రోజుల పాటు జరిగే ఈ జాతరలో తొలిరోజు భక్తులు శివదీక్షలు చేపడతారు. రెండో రోజు జాతరలో ప్రధాన ఘట్టమైన బండ్లు తిరిగే కార్యక్రమం ఉంటుంది. మూడో రోజు రథోత్సవం ఉంటుంది. కలెక్టర్ రాహుల్‌రాజ్, ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో సుమారు 2 వేల మంది ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు.

పట్నా ఐఐటీలో విద్యార్థి ఆత్మహత్య

- చదువుల ఒత్తిడే కారణం!




రాహుల్‌నాయక్

మిర్యాలగూడ అర్బన్: పట్నా ఐఐటీలో బీటెక్ మూడో సంవత్సరం చదువుతున్న నల్లగొండ జిల్లా మిర్యాలగూడ విద్యార్థి కళాశాల భవనం పైనుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దామరచర్ల మండలం బొట్లితండాకు చెందిన లావూరి శంకర్, జ్యోతి దంపతులు ప్రభుత్వ ఉపాధ్యాయులు. శంకర్ పెద్దవూర మండలం పెద్దగూడెంలో, జ్యోతి కుంటకిందితండాలో పనిచేస్తూ మిర్యాలగూడ పట్టణంలోని హౌసింగ్‌బోర్డులో నివసిస్తున్నారు. వీరి చిన్న కుమారుడు రాహుల్‌నాయక్ (20) పట్నా ఐఐటీలో బీటెక్ కంప్యూటర్ సైన్స్ చదువుతున్నాడు. చదువులో ఒత్తిడికి గురైన రాహుల్ నాయక్ మంగళవారం కళాశాల భవనం పైనుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు పట్నా వెళ్లారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బుధవారం రాత్రి మిర్యాలగూడకు తీసుకొచ్చారు. రాహుల్ మృతితో కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతమవుతున్నారు.

వ్యవసాయ కళాశాల విద్యార్థిని ఆత్మహత్య

- గదిలో ఉరి వేసుకుని బలవన్మరణం



రేష్మిత

వరంగల్: వరంగల్ ఆరెపల్లి సమీపంలోని ప్రొఫెసర్ జయశంకర్ అగ్రికల్చర్ యూనివర్సిటీ ఆవరణలోని వరంగల్ వ్యవసాయ కళాశాలలో బీఎస్సీ (అగ్రికల్చర్) మొదటి సంవత్సరం చదువుతున్న గుంటోజు రేష్మిత (29) బుధవారం ఉదయం ఆత్మహత్య చేసుకుంది. ఏనుమాముల పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ రాఘవేందర్ కథనం ప్రకారం... నల్లగొండ జిల్లా కేంద్రానికి చెందిన రేష్మిత గత ఏడాది బీఎస్సీ ప్రథమ సంవత్సరంలో చేరింది. బుధవారం ఉదయం రేష్మిత ఉన్న గది తలుపులు తీయకపోవడంతో కాలేజీ నుంచి తండ్రి సత్యనారాయణకు సమాచారం అందించారు. ఆయన పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు కాలేజీకి వెళ్లి తలుపులు పగులగొట్టి చూశారు. రేష్మిత గదిలోని ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు గుర్తించారు. మంగళవారం రాత్రి గదిలో రేష్మిత ఒక్కరే ఉన్నట్లు తెలిసింది. కాగా, తన కూతురు మృతికి కారణాలను కనుక్కోవాలని తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు. కాగా, రేష్మిత గత ఏడాది కాలేజీలో చేరినప్పటినుంచి అయిష్టంగానే ఉంటున్నట్లు తెలిసింది. పలుమార్లు చదువు మానేసి నల్లగొండలో డిగ్రీ చేస్తానని చెప్పినప్పటికీ తల్లిదండ్రులు ఒప్పుకోలేదని సమాచారం. తల్లిదండ్రులు ఒత్తిడి చేయడంతోనే ఆత్మహత్యకు పాల్పడి ఉంటుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

బల్క్‌డ్రగ్స్, వ్యాక్సిన్ క్యాపిటల్‌గా హైదరాబాద్

▶ మొదటి పేజీ తరువాయి

తయారీ రంగంలో వేగంగా వృద్ధి చెందుతూ.. 'వసుధైక కుటుంబం'అనే భావనకు ప్రతిబింబంగా నిలుస్తోంది..''అని తెలిపారు.

ఫార్మాలో తెలంగాణ కీలకం..

ఫార్మా రంగంలో తెలంగాణ కీలక పాత్ర పోషిస్తోందని కిషన్ రెడ్డి చెప్పారు. దేశంలోని ఫార్మా ఆదాయంలో 35శాతం, బల్క్ డ్రగ్స్‌లో 40శాతం ఆదాయం భాగ్యనగరం నుంచే వస్తోందన్నారు. 800 ఫార్మా, బయోటెక్, మెడ్‌టెక్ కంపెనీలు హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్నాయని తెలిపారు. హైదరాబాద్‌లోని జీనోమ్ వ్యాలీ, ఫార్మాసిటీ, మెడికల్ డివైజెస్ పార్కు వంటివి భారీగా విదేశీ పెట్టుబడులను ఆకర్షిస్తున్నాయని... 2047 నాటికి 500 బిలియన్ డాలర్ల లైఫ్ సైన్సెస్ ఎకానమీ సృష్టి దిశగా హైదరాబాద్ అడుగులు వేస్తోందని చెప్పారు. లైఫ్ సైన్సెస్ రంగానికి సహకరించేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. గ్లోబల్ హెల్త్‌కేర్ రంగాన్ని అద్భుతంగా తీర్చిదిద్దేందుకు అంతర్జాతీయ పెట్టుబడిదారులు, ఇన్నోవేటర్లు, శాస్త్రవేత్తలు భారత్‌తో కలసి పనిచేసేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కాగా.. ఈ కార్యక్రమంలో వివిధ రంగాల్లో వినూత్న ఆవిష్కరణలు చేసిన వారికి కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, రాష్ట్ర మంత్రి శ్రీధర్ బాబు బహుమతులు అందజేశారు.

200కుపైగా దేశాలకు మందులు: పీయూష్ గోయల్

ఫార్మసీ ఆఫ్ ది వరల్డ్‌గా భారతదేశం గుర్తింపు పొందిందని కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ చెప్పారు. బయో ఆసియా–2025 సదస్సు ముగింపు సందర్భంగా ఆయన వర్చువల్‌గా మాట్లాడారు. ''ప్రపంచవ్యాప్తంగా 200కుపైగా దేశాలకు జనరిక్ మందులు సరఫరా చేస్తున్నాం. ఇన్నోవేషన్, రీసెర్చ్, డెవలప్‌మెంట్, హైవాల్యూ బయో ఫార్మాపై దృష్టి సారించాం..''అని పీయూష్ గోయల్ తెలిపారు. ఫార్మా రంగంలో సమాచార మార్పిడి, పెట్టుబడులు, ఆవిష్కర్తలకు సహకారం అందించేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు. వరంగల్ కాకతీయ మెగా టెక్స్‌టైల్స్, జహీరాబాద్‌లో ఇండస్ట్రియల్ జోన్, భారత్ మాల కార్యక్రమంలో భాగంగా 2,605 కిలోమీటర్ల జాతీయ రహదారులు, 4 గ్రీన్‌ఫీల్డ్ ప్రాజెక్టులు, నిజామాబాద్ పసుపు బోర్డులను తెలంగాణకు కేటాయించామని వివరించారు.



వర్చువల్‌గా మాట్లాడుతున్న పీయూష్ గోయల్

హైదరాబాద్‌ను ఫార్మా కేంద్రంగా నిలుపుతాం: మంత్రి శ్రీధర్‌బాబు

22వ బయో ఆసియా సదస్సుకు 44 దేశాల నుంచి 3 వేల మంది డెలిగేట్స్, 100 మంది వక్తలు హాజరయ్యారని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. 200 బిజినెస్ టు బిజినెస్ మీటింగ్‌లు జరిగాయని వెల్లడించారు. రాష్ట్రంలో పారిశ్రామికవేత్తలకు అన్నిరకాలుగా అండగా ఉంటామని తెలిపారు. బయో ఆసియా సదస్సు ముగింపు అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో లైఫ్ సైన్స్ పాలసీని త్వరలో తీసుకొస్తామని.. దేశంలోనే మొదటిసారిగా రాష్ట్రంలో లైఫ్ సైన్స్ విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేయబోతున్నామని శ్రీధర్‌బాబు తెలిపారు. ''అమెరికా, ఆస్ట్రేలియా, తైవాన్ దేశాల సంస్థలు మన రాష్ట్రంలో పెట్టుబడులకు సిద్ధంగా ఉన్నామని బయో ఆసియా సదస్సులో తెలిపాయి. పరిశోధనల ద్వారా కొత్త టెక్నాలజీని ఉపయోగించి మందులు తక్కువ ఖర్చుతో బాధితులకు అందించాలన్నది లక్ష్యం. మాపై నమ్మకంతో పెట్టుబడులు పెట్టండి, చెప్పింది చేస్తామని హామీ ఇస్తున్నాం. ప్రపంచంలోనే హైదరాబాద్‌ను ఫార్మా పరిశ్రమల కేంద్రంగా నిలపడానికి మా ప్రభుత్వం కార్యాచరణ తీసుకుంది..'' అని వెల్లడించారు.

యువ న్యాయవాదులకు అండగా ఉండాలి

- సీనియర్ న్యాయవాదులకు సూచించిన హైకోర్టు తాత్కాలిక సీజే సుజోయ్‌పాల్



సిటీ సివిల్ కోర్టు బార్ అసోసియేషన్‌ను ప్రారంభిస్తున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ విజయసేన్‌రెడ్డి, పక్కన హైకోర్టు తాత్కాలిక సీజే సుజోయ్‌పాల్ తదితరులు

సిటీ కోర్టులు: యువ న్యాయవాదులకు సీనియర్ న్యాయవాదులు అండగా ఉండాలని..వారి సమస్యలను పరిష్కరించే దిశగా కృషి చేయాలని హైకోర్టు తాత్కాలిక సీజే సుజోయ్‌పాల్ అన్నారు. బుధవారం సిటీ సివిల్ బార్ అసోసియేషన్‌ను రెన్నొవేషన్ చేయడంతోపాటు సిటీ సివిల్ కోర్టు అధికారిక వెబ్‌సైట్‌ను ప్రారంభించారు. అనంతరం సీజే సుజోయ్‌పాల్ మాట్లాడుతూ అధికారిక వెబ్‌సైట్‌ను ప్రారంభించడం వల్ల లీగల్ సలహాలతోపాటు చట్టపరమైన అన్ని విషయాలు అందుబాటులో ఉంటాయని, దీని ద్వారా న్యాయవాదులకు తమ కేసుల గురించి తెలుసుకునేందుకు వీలు ఉంటుందన్నారు. సిరి గ్రూప్ ఆఫ్ కంపెనీ సీఈవో విజయకుమార్‌రెడ్డి నేతృత్వంలో కర్ణాటక స్టేట్ బార్ కౌన్సిల్‌లో వెబ్‌సైట్‌ను ఏర్పాటు చేశారని, అక్కడ బాగా పనిచేస్తున్నదని, ఇప్పుడు తెలంగాణ సిటీ సివిల్ కోర్టులో ఏర్పాటు చేశారని, ఇక్కడ కూడా విజయవంతంగా పనిచేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జస్టిస్ బి.విజయసేన్‌రెడ్డి, జస్టిస్ కె.లక్ష్మణ్, హైకోర్టు అదనపు న్యాయమూర్తులు రేణుక యారా, నర్సింగ్‌రావు నందికొండ సిటీ సివిల్ కోర్టు చీఫ్‌జడ్జి వై.పద్మ, సిటీ సివిల్ కోర్టు ప్రెసిడెంట్ వై.శ్రీనివాసచారి, వైస్ ప్రెసిడెంట్ ప్రవీణరెడ్డి, జనరల్ సెక్రటరీ డి.హర్షవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

చెంచుల దైవం మల్లికార్జున స్వామి కల్యాణం

- నల్లమలలో వైభవంగా ఉత్సవాలు



కల్యాణోత్సవాన్ని తిలకిస్తున్న చెంచులు



కల్యాణం జరిపిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ, అడిషనల్ కలెక్టర్ అమరేందర్ దంపతులు

అచ్చంపేట: నల్లమల లోతట్టు అటవీ ప్రాంతంలో ఆదివాసీ చెంచుల ఆరాధ్యదైవం భౌరాపూర్ భ్రమరాంబికా మల్లికార్జున స్వామి ఉత్సవాలు బుధవారం వైభవంగా జరిగాయి. రాష్ట్ర ప్రభుత్వం తరఫున గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో చెంచుల సంప్రదాయం మేరకు ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ ఉత్సవాలకు రాష్ట్రం నలుమూలల నుంచి చెంచులు తరలివచ్చారు. ఉత్సవాల్లో భాగంగా భ్రమరాంబికా మల్లికార్జున స్వామి కల్యాణోత్సవాన్ని కనులపండువగా నిర్వహించారు. చెంచుల పెళ్లి సంప్రదాయాల ప్రకారం.. భ్రమరాంబికాదేవి, మల్లికార్జునస్వామి ఉత్సవ మూర్తులను కల్యాణ వేదిక వద్దకు తీసుకువచ్చి.. చెంచుల గురువు మల్లయ్య, పూజారులు మల్లయ్య, కోటయ్య, పట్నం గురవయ్యలు శాస్త్రోక్తంగా కల్యాణ వేడుక జరిపించారు. పెళ్లి తంతులో వధువు తరఫున అదనపు కలెక్టర్ అమరేందర్ దంపతులు, వరుడు తరఫున ఎమ్మెల్యే డా.చిక్కుడు వంశీకృష్ణ, అను రాధ దంపతులు పాల్గొన్నారు. భక్తుల సమక్షంలో జీలకర్ర బెల్లం, మాంగల్య ధారణ, తలంబ్రాలు, ఒడిబియ్యం కార్యక్రమాలను కనుల పండువగా నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్ల రథాన్ని లాగి ఉత్సవాలను ప్రారంభించారు.

శ్రీశైలం నుంచి చుక్క నీరు తీసుకోనివ్వొద్దు

▶ మొదటి పేజీ తరువాయి

నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జా, ఈఎన్సీ (జనరల్) జి.అనిల్‌కుమార్, డిప్యూటీ డైరెక్టర్ సుబ్రమణ్య ప్రసాద్, నల్లగొండ సీఈ వి.అజయ్‌కుమార్ తదితరులు.. కృష్ణా బోర్డు చైర్మన్ అతుల్ జైన్‌తో సమావేశమై తీవ్ర నిరసన తెలియజేశారు. ఇప్పటికే ఏపీ తమ వాటాకు మించి కృష్ణా జలాలను వాడుకుందని, ఇంకా అనధికారికంగా నీళ్లను తోడుకోవడానికే సమావేశానికి గైర్హాజరైందంటూ రాహుల్ బొజ్జా అసహనం వ్యక్తం చేశారు. కృష్ణా బోర్డుపై ఏపీకి కనీస గౌరవం లేదని, ఆ రాష్ట్ర అధికారులు తరచూ బోర్డు సమావేశాలకు గైర్హాజరు అవుతున్నారని అన్నారు. ఒంగోలు సీఈ హైదరాబాద్‌లోని జలసౌధలోనే ఉన్నా ఈ సమావేశానికి రాలేదని తప్పుబట్టారు.

2,260 క్యూసెక్కులు తీసుకుంటోంది

శ్రీశైలం జలాశయం నుంచి నీటి తరలింపును తక్షణమే నిలుపుదల చేయాలని ఈ నెల 24న జరిగిన మొదటి అత్యవసర సమావేశంలో ఏపీని కృష్ణా బోర్డు ఆదేశించిన విషయం తెలిసిందే. దీంతో మంగళవారం శ్రీశైలం జలాశయం నుంచి కేవలం 660 క్యూసెక్కులను మల్యాల ద్వారా తీసుకున్న ఏపీ, బుధవారం నాటికి ముచ్చుమర్రి నుంచి మరో 1,600 క్యూసెకులు కలిపి మొత్తం 2,260 క్యూసెక్కులు తీసుకుంటోందని రాహుల్ బొజ్జా ఫిర్యాదు చేశారు. తాము లేవనెత్తిన అభ్యంతరాలను మినిట్స్ రూపంలో రికార్డు చేయాలని డిమాండ్ చేశారు. గురువారం సమావేశానికి హాజరయ్యేలా ఏపీకి మరో అవకాశం ఇద్దామని ఈ సందర్భంగా కృష్ణా బోర్డు చైర్మన్ అతుల్ జైన్ సర్దిచెప్పారు. ఈ సమావేశంలో రెండు రాష్ట్రాలు పరస్పర అంగీకారంతో ఒక నిర్ణయానికి వస్తాయనే ఆశాభావం వ్యక్తం చేశారు. ఒక వేళ సయోధ్య కుదరకపోతే ఈ అంశాన్ని కేంద్ర జలశక్తి శాఖకు నివేదిస్తామని చెప్పారు.

తెలంగాణకు 63...ఏపీకి 55 టీఎంసీలు అవసరం

ఈ నెల 24న జరిగిన కృష్ణా బోర్డు తొలి అత్యవసర సమావేశంలో తీసుకున్న నిర్ణయం మేరకు.. తెలంగాణ తరఫున నల్లగొండ చీఫ్ ఇంజనీర్ వి.అజయ్‌కుమార్, ఏపీ తరఫున ఒంగోలు చీఫ్ ఇంజనీర్ బి.శ్యామ్ ప్రసాద్ బుధవారం జలసౌధలో సమావేశమయ్యారు. ప్రస్తుత రబీలో సాగర్ నుంచి ఇరు రాష్ట్రాలకు అవసరమైన సాగునీటికి సంబంధించిన ప్రణాళికను సిద్ధం చేశారు. కనీస నిల్వ మట్టానికి ఎగువన శ్రీశైలంలో 36.51 టీఎంసీలు, సాగర్‌లో 30.57 టీఎంసీలు కలిపి మొత్తం 67 టీఎంసీలు లభ్యతగా ఉన్నట్టు నిర్ధారించారు. శ్రీశైలం నుంచి ఏపీకి 10 టీఎంసీలు, తెలంగాణకు 13 టీఎంసీలు, సాగర్ నుంచి ఏపీకి 45 టీఎంసీలు, తెలంగాణకు 50 టీఎంసీల జలాలు అవసరమని తేల్చారు. గురువారం జరిగే సమావేశంలో ఈ ప్రణాళిక ఆధారంగా రెండు రాష్ట్రాలకు నీటి కేటాయింపులపై బోర్డు నిర్ణయం తీసుకోనుంది.

వరి, మొక్కజొన్న సాగు పెరగడంతోనే.. యూరియా కొనుగోళ్లు అధికం

- వ్యవసాయ సంచాలకులు డాక్టర్ గోపి

సాక్షి, హైదరాబాద్: యాసంగి సీజన్ ముందస్తుగా ప్రారంభం కావడంతో పాటు వరి, మొక్కజొన్న సాగు విస్తీర్ణం పెరగడంవల్లే ఈ సీజన్‌లో రైతులు గత ఏడాది కన్నా 1.99 మెట్రిక్ టన్నుల యూరియా అధికంగా కొనుగోలు చేసినట్లు వ్యవసాయ శాఖ సంచాలకులు డాక్టర్ గోపి తెలిపారు. ఈ యాసంగి సీజన్‌కు 9.80 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా అవసరమవుతుందని అంచనా వేయగా, ఫిబ్రవరి నాటికి రావలసిన 8.54 లక్షల మెట్రిక్ టన్నుల కోటాకుగాను 7.27 ఎల్‌ఎంటీ మాత్రమే వచ్చిందని ఒక ప్రకటనలో తెలిపారు. అయితే వ్యవసాయ శాఖ వద్ద ఉన్న ముందస్తు నిల్వల నేపథ్యంలో ఇప్పటివరకు 9.08 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువులను రైతులు కొనుగోలు చేసినట్లు వివరించారు. కేటాయించిన యూరియా ప్లాన్‌లో దిగుమతులు, దేశీయ తయారీ యూరియా కేటాయింపుల్లో 1.27 లక్షల మెట్రిక్ టన్నులు తక్కువగా సరఫరా అయిందని చెప్పారు. మార్చి నెలకు 1.80 ఎల్‌ఎంటీ యూరియాను దేశీయ కంపెనీల నుంచి సరఫరా చేయాలని కేంద్రాన్ని కోరినట్లు తెలిపారు.

శివయ్యకు నాగార్చన



మంథని: పెద్దపల్లి జిల్లా మంథని సమీపంలోని గోదావరి నది తీరంలో శ్రీగౌతమేశ్వరస్వామి ఆలయంలోకి బుధవారం రాత్రి నాగుపాము రావడంతో భక్తులు ఆందోళనకు గురయ్యారు. ఏటా మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా నాగుపాము ఆలయంలోకి వస్తుందని, లింగోద్భవ సమయంలో లింగం చుట్టూ చుట్టుకుంటుందని ఆలయ పూజారి గణపతి శర్మ తెలిపారు. పూజలు ముగిసిన తర్వాత బయటకు వెళ్లిపోతుందని చెప్పారు. అదే క్రమంలో పాము ఆలయంలోకి వస్తున్న క్రమంలో.. ఆందోళనకు గురైన భక్తులు.. గర్భగుడి లోపలికి ప్రవేశించకుండా పట్టుకొని దూరంగా వదిలివేశారు. గౌతమేశ్వరునికి నాగాభరణం ఉందని, పాములు పట్టే వ్యక్తి ఆ సర్పాన్ని ఎంత దూరంలో వదిలి వేసినా తరచూ వస్తుందని పలువురు భక్తులు తెలిపారు.

కోట్ల ఏళ్ల క్రితం ఆవాసయోగ్యమే!

- ఫెర్రీహైడ్రైట్ ఖనిజం వల్లే అంగారకుడికి ఎరుపు రంగు
- బ్రౌన్ యూనివర్సిటీ సైంటిస్టుల అధ్యయనంలో వెల్లడి



న్యూఢిల్లీ: ఎర్రని రంగుతో మెరిసిపోతూ అందంగా కనిపించే అంగారక(మార్స్) గ్రహంపై గతంలో జీవజాలం మనుగడకు అనుకూలమైన వాతావరణం ఉందన్న వాదనకు ఆధారాలు లభించాయి. అరుణ గ్రహానికి ఆ రంగు రావడానికి కారణం ఏమిటన్నది శాస్త్రవేత్తలు గుర్తించారు. ఇనుముతో కూడిన ఖనిజం సమృద్ధిగా ఉండడం వల్లే అంగారకుడు ఎరుపు రంగు సంతరించుకున్నట్లు తేల్చారు. ఇలాంటి ఖనిజం ఏర్పడాలంటే చల్లటి నీరు అవసరం. అంటే మార్స్‌పై వాతావరణం కోట్లాది సంవత్సరాల క్రితం జీవులకు ఆవాసయోగ్యంగా ఉండి ఉండొచ్చని తెలుస్తోంది. మార్స్ ఉపరితలంపై ఎర్రటి దుమ్ము, రాళ్లు కనిపిస్తుంటాయి. ఐరన్ ఆక్సైడ్, ఫెర్రీహైడ్రైట్ వంటి ఖనిజాల అరుణగ్రహంపై ఉన్నట్లు ఇప్పటికే వెల్లడయ్యింది. ఈ ఖనిజాల కారణంగానే గ్రహం ఎరుపు రంగులోకి మారినట్లు అమెరికాలోని బ్రౌన్ యూనివర్సిటీ సైంటిస్టులు కనిపెట్టారు. ఈ అధ్యయనం వివరాలను నేచర్ కమ్యూనికేషన్స్ పత్రికలో ప్రచురించారు. ఫెర్రీహైడ్రైట్ వల్ల మార్స్‌కు ఎరుపు రంగు వచ్చినట్లు చెప్పడం కొత్త విషయం కాకపోయినప్పటికీ దాన్ని తాము శాస్త్రీయంగా నిర్ధారించామని బ్రౌన్ యూనివర్సిటీ సైంటిస్టు ఆడమ్ వాలంటినాస్ స్పష్టంచేశారు. ఇందుకోసం మార్స్ ధూళిపై విస్తృతంగా పరిశోధనలు చేశామన్నారు. అరుణగ్రహంపై ధూళి, రాళ్లలో ఫెర్రీహైడ్రైట్ పుష్కలంగా ఉందని చెప్పారు. అతి తక్కువ ఉష్ణోగ్రతలు, చల్లటి నీటి సమక్షంలోనే ఈ ఖనిజం ఏర్పడుతుందన్నారు. ద్రవరూపంలో నీరు ఉన్నట్లు తేలింది కాబట్టి అంగారకుడు ఒకప్పుడు ఆవాసయోగ్యంగా ఉండేదని కచ్చితంగా చెప్పొచ్చని వెల్లడించారు. కోట్లాది సంవత్సరాల క్రితం బలమైన సౌర గాలులు వీచడం వల్ల మార్స్‌పై తడి వాతావరణం క్రమంగా పొడి వాతావరణంగా మారిపోయినట్లు పరిశోధకులు అంచనా వేస్తున్నారు. అక్కడ అయస్కాంత క్షేత్రం బలహీనంగా ఉంది. అందుకే సౌర గాలుల ప్రభావాన్ని తట్టుకోలేకపోయింది. అందుకే వాతావరణం పొడిగా, అతిశీతలంగా మారిపోయింది.

విశ్వం మూలాలపై నాసా అన్వేషణ

వచ్చే నెల 1న స్ఫిరెక్స్ టెలిస్కోప్ ప్రయోగం



వాషింగ్టన్: మనం ఉంటున్న ఈ సువిశాల విశ్వం ఎలా పుట్టింది? దీని మూలమెక్కడ? నక్షత్రాలు, గ్రహాలు ఎలా ఏర్పడ్డాయి? ఈ ప్రశ్నలకు సమాధానాలు కనుక్కోవడానికి ప్రాచీన కాలం నుంచి ఆధునిక కాలం దాకా ప్ర యత్నాలు జరుగుతూనే ఉన్నాయి. ఈ క్రమంలో ఎన్నెన్నో సిద్ధాంతాలు వ్యాప్తిలోకి వచ్చాయి. విశ్వంపై అన్వేషణలో అమెరికా అంతరిక్ష పరిశోధన సంస్థ 'నాసా' మరో అడుగు ముందుకేస్తోంది. బిగ్ బ్యాంగ్‌తో విశ్వం పురుడు పోసుకుందని ఎన్నో అధ్యయనాలు చెబుతు న్నాయి. అయితే, బిగ్ బ్యాంగ్ పరిణామం చోటుచేసుకున్న వెంటనే అసలేం జరిగింది? విశ్వం ఎలా మొదలైందో తెలుసుకోవడానికి 'స్ఫిరెక్స్' టెలిస్కోప్‌ను అంతరిక్షంలోకి ప్రయోగించడానికి నాసా ఏర్పాట్లు పూర్తిచేసింది. కాలిఫోర్నియాలోని వాండెన్‌బర్గ్ స్పేస్‌ఫోర్స్ స్టేషన్ నుంచి వచ్చే నెల 1వ తేదీన ఉదయం 8.39 గంటలకు స్పేస్‌ఎక్స్ ఫాల్కన్ 9 రాకెట్ ద్వారా ఈ టెలిస్కోప్‌ను పంపించనుంది. స్ఫిరెక్స్ టెలిస్కోప్ కాలపరిమితి రెండు సంవత్సరాలు. 45 కోట్ల నక్షత్ర మండలాలు, పాలపుంతలోని 10 కోట్ల నక్షత్రాల డేటాను సేకరించి, భూమిపైకి చేరవేస్తుంది. ఈ సమాచారం ఆధారంగా విశ్వం పుట్టుకను పరిశోధకులు అంచనా వేస్తారు. మన భూగోళం ఉన్న పాలపుంతలో భూమిపై కాకుండా ఇంకెక్కడైనా నీటి ఆనవాళ్లు? ఉన్నాయా? అనేది కూడా స్ఫిరెక్స్ అబ్జర్వేటరీ గుర్తించనుంది. అంతరిక్షానికి సంబంధించి 120 రంగుల్లో 3డీ మ్యాప్‌ను సైతం రూపొందిస్తుంది. స్ఫిరెక్స్ ప్రయోగంలో భాగంగా నాలుగు చిన్నపాటి ఉపగ్రహాలతో కూడిన పోలారిమీటర్ టు యునిఫై ద కరోనా, హెలియోస్ఫియర్(పంచ్) మిషన్‌ను సైతం నాసా సైంటిస్టులు అంతరిక్షంలోకి ప్రయోగించనున్నారు. సూర్యుడి నుంచి వెలువడే సౌర గాలులపై ఇది అధ్యయనం చేస్తుంది.

డీలిమిటేషన్‌తో ఒక్క సీటూ తగ్గదు

హోం మంత్రి అమిత్ షా స్పష్టీకరణ ● తమిళనాడుకు అన్యాయం అబద్ధం

పదేళ్లలో 5 లక్షల కోట్ల నిధులిచ్చింది ● దృష్టి మళ్లించేందుకు సీఎం స్టాలిన్ ప్రయత్నమంటూ ధ్వజం



కోయంబత్తూరు: దామాషా విధానంలో చేపట్టే పునర్వ్యవస్థీకరణ వల్ల లోక్‌సభ నియోజకవర్గాల సంఖ్య తగ్గదని హోం మంత్రి అమిత్ షా ప్రకటించారు. తమిళనాడుకే కాదు, ఏ ఒక్క దక్షిణాది రాష్ట్రానికి కూడా నష్టం జరగదని ఆయన కుండబద్దలు కొట్టారు. డీలిమిటేషన్ విషయంలో దక్షిణాది రాష్ట్రాల ప్రజల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని ప్రధాని మోదీ వ్యవహరిస్తారని చెప్పారు. ఒక్క సీటు కూడా నష్టపోనివ్వరని మంత్రి హామీ ఇచ్చారు. పునర్వ్యవస్థీకరణ కారణంగా దక్షిణాది రాష్ట్రాలకు నష్టం జరగదంటూ మోదీ ప్రభుత్వం ఇప్పటికే పార్లమెంట్‌లో ప్రకటించిందని ఆయన గుర్తు చేశారు. ఈ విషయంలో తమిళనాడు సీఎం స్టాలిన్ తప్పుడు సమాచారాన్ని ప్రచారం చేస్తున్నారంటూ మండిపడ్డారు. డీలిమిటేషన్ వల్ల తమిళనాడు లోక్‌సభ సీట్ల సంఖ్య 39 నుంచి 31కి తగ్గిపోతుందని సోమవారం సీఎం స్టాలిన్ వ్యాఖ్యానించడం, దీనిపై చర్చించేందుకు 5న అఖిలపక్ష భేటీ ఏర్పాటు చేశామనడం తెల్సిందే. తమిళనాడుకు నిధుల మంజూరు విషయంలో కేంద్రం అన్యాయం చేస్తోందంటూ సీఎం ఎంకే స్టాలిన్ చేసిన ఆరోపణలను మంత్రి తీవ్రంగా ఖండించారు. రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే స్టాలిన్ డీలిమిటేషన్‌తో నష్టం జరుగుతుందని చెబుతున్నారని ధ్వజమెత్తారు. బుధవారం అమిత్ షా కోయంబత్తూరులో బీజేపీ కార్యాలయాన్ని ప్రారంభించారు. తిరువణ్ణామలై, రామనాథపురంలలో పార్టీ కార్యాలయాలను వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సందర్భంగా కా ర్యకర్తలు, ప్రజలనుద్దేశించి మంత్రి ప్రసంగించారు.

దేశ వ్యతిరేక ధోరణి పెరిగింది

రాష్ట్రంలో శాంతి భద్రతలను కాపాడటంలో విఫలమైందంటూ అధికార డీఎంకేపై అమిత్ షా విరుచుకుపడ్డారు. తమిళనాడులో జాతి వ్యతిరేక ధోరణి గరిష్ట స్థాయికి చేరుకుందంటూ వ్యాఖ్యానించారు. 1998 బాంబు పేలుళ్ల కేసులో నిందితుడు, ప్రధాన సూత్రధారి ఎస్ఏ బాషా అంతిమ యాత్రకు తమిళనాడు ప్రభుత్వం భద్రత కల్పించిందని విమర్శించారు. 'రాష్ట్రంలో డ్రగ్స్ విక్రయాలు విచ్చలవిడిగా సాగుతున్నాయి. మైనింగ్ మాఫియానే ఇక్కడ రాజకీయాలను నడిపిస్తోంది. శాంతిభద్రతల పరిస్థితి అధ్వానంగా ఉన్న రాష్ట్రాల్లో తమిళనాడు కూడా ఉంది. అవినీతిలో డీఎంకే మంత్రులంతా మాస్టర్స్ డిగ్రీ చేశారు. డీఎంకే నేతలపై ఉద్యోగాలను అమ్ముకున్న కేసులు, మనీలాండరింగ్ ఆరోపణలు, ఆదాయానికి మించిన ఆస్తుల కేసులు, రూ.6 వేల కోట్ల కుంభకోణం కేసులున్నాయి. వీటిన్నిటినీ చూస్తే అవినీతికి పాల్పడిన వారికే డీఎంకే సభ్యత్వం ఇచ్చినట్లుగా కనిపిస్తోంది' అని అమిత్ షా వ్యాఖ్యానించారు. రాష్ట్ర ప్రజలు అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతుండగా వాటిని పరిష్కరించడం మానేసిన సీఎం, ఆయన కుమారుడు ఉదయనిధి వారి దృష్టిని మళ్లించేందుకు ఇతర అంశాలను తెరపైకి తెస్తున్నారని ఆరోపించారు.

నిధులపై వాస్తవ గణాంకాలివీ..

కేంద్రం నుంచి అందిన నిధులపై చేతనైతే సీఎం స్టాలిన్ వాస్తవాలను వెల్లడించాలని అమిత్ షా సవాల్ విసిరారు. 'మోదీ ప్రభుత్వ హయాంలో పదేళ్ల వ్యవధిలో తమిళనాడుకు రూ.5,08,337 లక్షల కోట్ల నిధులందాయి. వీటికి తోడు, మౌలిక వనరుల అభివృద్ధి కోసం మరో 1.43 లక్షల కోట్లను అందజేశాం. అదే, యూపీఏ హయాంలో 2004–14 సంవత్సరాల మధ్య కాలంలో తమిళనాడుకు కేవలం రూ.1.52 లక్షల కోట్లే దక్కాయి. అయితే, మోదీ ప్రభుత్వం అన్యాయం చేసిందని మీరంటున్నారు. వాస్తవానికి రాష్ట్రానికి యూపీఏ హయాంలో, అప్పటి ప్రభుత్వం మీరు కూడా భాగస్వాములుగా ఉండగానే అన్యాయం జరిగింది' అని షా చెప్పారు. రాష్ట్రంలోని యూనివర్సిటీల్లో విద్యార్థినులకు భద్రత కరువైందని ఆరోపించారు. అక్రమ సారాయి విక్రయాలను వ్యతిరేకించిన కాలేజీ విద్యార్థులు దారుణ హత్యకు గురవుతున్నారన్నారు. వచ్చే ఏడాది జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో తమిళనాడులో ఎన్డీయే ఘన విజయం సాధిస్తుందని, మహారాష్ట్ర, హరియాణాల్లో బీజేపీ సాధించిన గెలుపు కంటే ఇది మిన్నగా ఉంటుందన్నారు.

సూడాన్‌లో కూలిన సైనిక విమానం

46 మంది సజీవదహనం

కైరో: సూడాన్ దేశ రాజధాని ఖార్టూమ్ సమీప పట్టణంలో సైనిక విమానం కుప్పకూలిన ఘటనలో 46 మంది సజీవ దహనమయ్యారు. మరో 10 మంది గాయాలపాలయ్యారు. విమానం జనావాసాలపై కూలడంతో మరణాల సంఖ్య పెరిగే అవకాశముందని స్థానిక యంత్రాంగం ప్రకటించింది. ఓమ్డర్‌మ్యాన్ సిటీకి ఉత్తరాన ఉన్న వాడీ సయిద్నా వైమానిక స్థావరం నుంచి మంగళవారం రాత్రి టేకాఫ్ అయిన ఆంటోనోవ్ రకం సైనిక విమానం కొద్దిసేపటికే కర్రారీ జిల్లాలోని జనావాసాలపై కూలింది. విమానంలో ప్రయాణిస్తున్న ఆర్మీ సీనియర్ కమాండర్ బహర్ అహ్మద్, సైనిక అధికారులతోపాటు జనావాసంలోని సాధారణ ప్రజలూ ప్రాణాలు కోల్పోయారని ఖార్టూమ్ మీడియా కార్యాలయం తెలిపింది. ఘటనకు కారణాలు ఇంకా తెలియాల్సి ఉంది. అయితే విమానంలో సాంకేతిక లోపం తలెత్తడంతో కూలిపోయిందని స్థానిక మీడియాలో కథనాలు వెలువడ్డాయి.

నిర్ణయాధికారం పార్లమెంట్‌దే

- క్రిమినల్ కేసుల్లో దోషులుగా తేలిన నేతలపై ఆరేళ్ల పాటు నిషేధం సరిపోతుంది
- జీవితకాలం నిషేధం విధించడం అత్యంత కఠినమైన చర్య అవుతుంది
- సుప్రీంలో కేంద్ర ప్రభుత్వం అఫిడవిట్

న్యూఢిల్లీ: క్రిమినల్ కేసుల్లో దోషులుగా తేలిన రాజకీయ నాయకులపై జీవితకాలం నిషేధం విధించాలన్న వినతిని కేంద్ర ప్రభుత్వం వ్యతిరేకించింది. వారిపై అనర్హత వేటు వేయడం అనేది కేవలం పార్లమెంట్ పరిధిలోని అంశమని ఉద్ఘాటించింది. నిర్ణయాధికారం పార్లమెంట్‌దేనని పేర్కొంది. దీనితో న్యాయ వ్యవస్థకు సంబంధం లేదని పరోక్షంగా తేల్చిచెప్పింది. ఈ మేరకు ప్రభుత్వం సుప్రీంకోర్టులో అఫిడవిట్ దాఖలు చేసింది. ప్రజా ప్రాతినిధ్య చట్టం–1951లోని సెక్షన్ 8(1) ప్రకారం .. రాజకీయ నేతలు ఏవైనా క్రిమినల్ కేసుల్లో దోషులుగా నిరూపితమైతే వారు ఆరేళ్లపాటు ఎన్నికల్లో పోటీ చేయకుండా ప్రస్తుతం నిషేధం అమల్లో ఉంది. అలాంటి వారిపై కేవలం ఆరేళ్ల నిషేధం సరిపోదని, జీవితాంతం ఎన్నికల్లో పోటీ చేయకుండా నిషేధం విధించాలని కోరుతూ సీనియర్ అడ్వొకేట్ అశ్వినీ ఉపాధ్యాయ్ గతంలో సుప్రీంకోర్టులో వ్యాజ్యం దాఖలు చేశారు. ఈ మేరకు చట్టం తీసుకొచ్చేలా కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించాలని విన్నవించారు. దీనిపై విచారణ చేపట్టిన సర్వోన్నత న్యాయస్థానం ఫిబ్రవరి 10వ తేదీన కేంద్ర ప్రభుత్వాన్ని వివరణ కోరింది. ఈ నేపథ్యంలో కేంద్రం బుధవారం సుప్రీంకోర్టులో అఫిడవిట్ దాఖలు చేసింది. క్రిమినల్ కేసుల్లో దోషులుగా తేలిన నాయకులపై జీవితకాలం నిషేధం విధించడం అత్యంత కఠినమైన చర్య అవుతుందని పేర్కొంది. ప్రస్తుతం అమల్లో ఉన్న చట్టం ప్రకారం ఆరేళ్లపాటు నిషేధం విధిస్తే సరిపోతుందని తేల్చిచెప్పింది. అయితే, దోషులుగా నిర్ధారణ అయిన నాయకులపై జీవితకాల నిషేధం విధించాలా? లేక ఆరేళ్లపాటు నిషేధం విధించాలా? అనే అంశంపై తుది నిర్ణయం తీసుకొనే అధికారం పార్లమెంట్‌కే ఉందని వెల్లడించింది.

హిందీని బలవంతంగా రుద్దితే ప్రతిఘటిస్తాం: స్టాలిన్

చెన్నై: తమిళనాడుపై హిందీని బలవంతంగా రుద్దకుంటే ఆ భాషను తమ పార్టీ వ్యతిరేకించదని, ఈ విషయంలో తమిళులను బలవంతం చేయడమంటే వారి ఆత్మగౌరవంతో ఆడుకోవడమేనని డీఎంకే చీఫ్, సీఎం స్టాలిన్ వ్యాఖ్యానించారు. ఈ మేరకు బుధవారం ఆయన పార్టీ శ్రేణులకు ఒక లేఖ రాశారు. 'హిందీని మీరు ఇప్పటికీ ఎందుకు వ్యతిరేకిస్తున్నారని ప్రశ్నించే వారికి మీలో ఒకడిగా నా సమాధానం ఇదే..మీరు ఇప్పటికీ ఆ భాషను బలవంతంగా అమ లు చేయడానికి ప్రయత్నిస్తున్నారు' అని పేర్కొ న్నారు. 'బలవంతం చేయకుంటే హిందీని వద్దనం. తమిళనాడులో హిందీ అక్షరాలపై నల్లరంగు పూయం. ఆత్మ గౌరవం తమిళుల ప్రత్యేక లక్షణం. దానితో ఆడుకుంటామంటే ఊరుకునేది లేదు' అని అందులో స్పష్టం చేశారు. రాష్ట్రంలో గతంలో కూడా హిందీ వ్యతిరేక ఉద్య మాలు జరిగిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. నూతన విద్యావిధానంలో భాగమైన త్రిభాషా సిద్ధాంతంలో హిందీని తమ రాష్ట్రంలో బలవంతంగా అమలు చేయడానికి బీజేపీ సారథ్యంలోని ఎన్డీఏ ప్రభుత్వం ప్రయత్నిస్తోందంటూ ఆరోపి స్తున్న స్టాలిన్ తాజా ఈ మేరకు వ్యాఖ్యానించడం గమనార్హం.

పుణె బస్టాండ్‌లో దారుణం

ఆగిఉన్న బస్సులో మహిళను రేప్ చేసిన పాత నేరస్తుడు

పుణె: మహారాష్ట్రలోని పుణెలో మంగళవారం ఉదయం స్వార్‌గేట్ జంక్షన్ బస్టాండ్‌లో ఆగిఉన్న ప్రభుత్వ బస్సులో 26 ఏళ్ల మహిళను ఒక పాత నేరస్తుడు రేప్ చేసి పారిపోయాడు. మహారాష్ట్ర రాష్ట్ర రోడ్డు రవాణా కార్పొరేషన్‌కు చెందిన అత్యంత రద్దీగా ఉండే బస్‌జంక్షన్లలో ఒకటైన స్వార్‌గేట్ బస్టాండ్‌లో ఈ దారుణం చోటుచేసుకోవడంతో ఒక్కసారిగా కలకలం రేగింది. విషయం తెల్సుకున్న పోలీసులు ఘటనాస్థలికి వచ్చి సీసీటీవీ ఫుటేజీలను పరిశీలించి నిందితుడిని 36 ఏళ్ల దత్తాత్రేయ రాందాస్ గాడేగా గుర్తించారు. గతంలో ఇతనిపై దొంగతనం, దోపిడీ, చైన్ స్నాచింగ్ కేసులు నమోదయ్యాయి. ఘటనపై పోలీసులు, బాధిత మహిళ తెలిపిన వివరాల ప్రకారం మంగళవారం తెల్లవారుజామున 5.45 గంటలకు సతారా జిల్లాలోని ఫల్టణ్ పట్టణానికి వెళ్లే బస్సు ఎక్కేందుకు బాధిత మహిళ ఈ బస్టాండ్‌లోని ఒక ప్లాట్‌ఫామ్ వద్ద వేచిచూస్తోంది. అదే సమయానికి అక్కడికి వచ్చిన నిందితుడు 'సోదరీ' అంటూ ఆమెతో మాటలు కలిపాడు. తాను బస్ కండక్టర్‌ను అని, మీరు ఎక్కాలిన బస్సు సమీపంలో ఆగి ఉందని చెప్పి, సమీపంలో ఆగి ఉన్న 'శివ్ షాహీ' ఏసీ బస్సును చూపించాడు. అది మీరు వెళ్లాల్సిన రూట్‌లో వెళ్తుందని చెప్పి ఆ బస్సు ఎక్కాలని ఆమెకు సలహా ఇచ్చాడు. అతని మాటలు నమ్మిన ఆమె ఎవరూ లేని ఆ బస్సు ఎక్కింది. లైట్లు ఆఫ్ చేసి, చిమ్మచీకటిగా ఉన్న బస్సును ఎక్కేందుకు తొలుత ఆమె తటపటాయించింది. బస్సులో ప్రయాణికులు నిద్రిస్తుండటంతో లైట్లు ఆర్పివేశారని, నచ్చజెప్పి బస్సులో లోపలిదాకా వెళ్లేలా చేశాడు. వెంటనే వెనకాలే వచ్చిన అతను బస్సు తలుపు మూసేసి, ఆమెను రేప్‌చేసి పారిపోయాడని డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ స్మార్థనా పాటిల్ చెప్పారు. ఘటన జరిగినప్పుడు బస్టాండ్‌లో ఎన్నో బస్సులు, ఎంతో మంది ప్రయాణికులు ఉన్నారు. మహిళ తనకు జరిగిన అన్యాయంపై వెంటనే ఎవరికీ ఫిర్యాదు చేయలేదు. ఫల్టణ్‌కు వెళ్లే బస్సు ఎక్కి మార్గమధ్యంలో తన స్నేహితురాలికి ఫోన్‌చేసి ఘోరాన్ని వివరించింది. ఆమె సలహామేరకు బాధితురాలు వెంటనే బస్సు దిగి సమీప పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేసింది. దీంతో పోలీసులు భారతీయ న్యాయ సంహిత చట్టం కింద కేసు నమోదుచేశారు. నిందితుడిని అరెస్ట్‌చేసేందుకు పోలీసులు ఎనిమిది బృందాలను ఏర్పాటుచేసి వేట మొదలెట్టారు. పోలీస్‌స్టేషన్‌కు ఈ బస్టాండ్ కేవలం 100 మీటర్ల దూరంలో ఉంది. నిందితుడు గతంలో ఒక కేసులో బెయిల్ సంపాదించి 2019 ఏడాది నుంచి బయటే ఉన్నాడు.

విపక్షాల విమర్శలు

''ఏమాత్రం భయం లేకుండా అసాంఘిక శక్తులు స్వైర విహారం చేస్తున్నాయి. పుణెలో నేరాలను అరికట్టడంలో హోం శాఖ బాధ్యతలు చూస్తున్న సీఎం విఫలమయ్యారు'' అని ఎన్సీపీ(ఎస్పీ) నాయకురాలు, ఎంపీ సుప్రియా సూలే విమర్శించారు.

రూ.43 కోట్లుంటే గోల్డ్ కార్డ్ వీసా!

- అమెరికాలో శాశ్వత నివాస హోదా
- డొనాల్డ్ ట్రంప్ ప్రకటన
- ఈబీ–5 పెట్టుబడిదారుల వీసాలకు మంగళం

వాషింగ్టన్: అక్రమ వలసదారులను సంకెళ్లు వేసి మరీ స్వదేశాలకు సాగనంపుతున్న డొనాల్డ్ ట్రంప్.. సంపన్నులకు మాత్రం స్థిరనివాసం కల్పిస్తామంటూ సాదర స్వాగతం పలుకుతున్నారు. 50 లక్షల డాలర్లు(దాదాపు రూ.43.56 కోట్లు) చెల్లించిన వ్యక్తులకు గోల్డ్ కార్డ్ వీసాలను ఇస్తామని తన ప్రభుత్వ నూతన నిర్ణయాన్ని ట్రంప్ వెల్లడించారు. పెట్టుబడిదారుల వీసా విధానానికి స్వస్తి పలుకుతూ వాటి బదులు గోల్డ్ కార్డ్ వీసాను అందుబాటులోకి తెస్తున్నట్లు బుధవారం ప్రకటించారు. శ్వేతసౌధంలోని ఓవెల్ ఆఫీస్‌లో ట్రంప్ మీడియాతో మాట్లాడారు. '' అమెరికాలో పెట్టుబడులు పెట్టే వారి కోసం 35 ఏళ్లుగా అమల్లో ఉన్న పాత వీసా విధానానికి స్వస్తి పలుకుతున్నాం. అమెరికా ప్రభుత్వానికి 50 లక్షల డాలర్లు చెల్లించిన సంపన్నులకు శాశ్వత స్థిర నివాస హోదా కల్పిస్తాం. ఇది గ్రీన్ కార్డ్ ఆ తర్వాత పౌరసత్వానికి బాటలు వేస్తుంది'' అని ట్రంప్ వ్యాఖ్యానించారు. కొత్తగా ప్రవేశపెట్టబోయే గోల్డ్ కార్డ్ వీసా వివరాలను నూతన వాణిజ్య శాఖ మంత్రి హోవార్డ్ లుట్నిక్ వెల్లడించారు. '' 1990లో పార్లమెంట్ ఆమోదంతో అమల్లోకి వచ్చిన ఈబీ–5 వీసాల స్థానంలో వచ్చే రెండు వారాల్లోగా కొత్తగా ట్రంప్ గోల్డ్ కార్డ్ వీసాలను తీసుకొస్తాం. గతంలో ఈబీ–5 వీసా పొందాలంటే 10 లక్షల డాలర్ల పెట్టుబడులు పెట్టాలి. ఇప్పుడు గోల్డ్ కార్డ్ వీసా పొందాలంటే 50 లక్షల డాలర్లు చెల్లిస్తే సరిపోతుంది. ఈబీ–5 వీసా విధానంలో మోసాలు జరిగిన నేపథ్యంలో ఈ పెట్టుబడుల వీసాలకు మంగళం పాడుతున్నాం'' అని ఆయన వివరించారు.

100 దేశాల్లో ఈ తరహా విధానం

పెట్టుబడిదారులను ఆకర్షించే లక్ష్యంతో ప్రపంచ వ్యాప్తంగా దాదాపు 100కుపైగా దేశాలు ఇలా ఇన్వెస్టర్ వీసాల విధానాన్ని అమలుచేస్తున్నాయి. అమెరికా మొదలు బ్రిటన్, స్పెయిన్, గ్రీస్, మాల్టా, ఆస్ట్రేలియా, కెనడా, ఇటలీదాకా ఎన్నో దేశాలు ఇలా గోల్డెన్ వీసాలను ఏటా జారీచేస్తున్నాయి. అమెరికాలో ప్రతిఏటా ఈబీ–5 వీసాల జారీపై పరిమితి ఉంది. అయితే కొత్తగా అమలుచేయనున్న గోల్డ్ కార్డ్ వీసాలకు పరిమితి లేదు. ఎంత మంది ఔత్సాహిక పెట్టుబడిదారులు వస్తే అంతమందికీ గోల్డ్‌కార్డ్ వీసాలను ఇవ్వనున్నారు. అయితే తొలి ఏడాది దాదాపు 10 లక్షల గోల్డ్ కార్డు వీసాలను జారీచేసే వీలుంది. గతంలో ఈబీ–5 వీసా పొందే ఆ ఇన్వెస్టర్ స్థానికంగా కనీసం 10 మందికి ఉపాధి కల్పించాల్సి ఉంటుంది. గోల్డ్ కార్డ్ వీసాలో ఇలాంటి నిబంధన లేదు. కొత్త వీసాను కేవలం వ్యక్తిగత వీసాగా చెప్పొచ్చు. హెచ్1బీ, ఈబీ–2, ఈబీ–3 వీసా లాటరీల ద్వారా తమకు అవకాశం ఎప్పుడొస్తుందా? అని దశాబ్దాల తరబడి నాన్‌ఇమ్మిగ్రేషన్ వీసాదారులు వేచి ఉండాల్సిన పనిలేకుండా ఒకేసారి రూ.43 కోట్లు చెల్లించి ఒకరకంగా నేరుగా అమెరికా పౌరసత్వం సాధించవచ్చు. సాధారణంగా అమెరికా పౌరసత్వం పొందాలంటే పార్లమెంట్ నిర్దేశిత నియమాలకు లోబడి ఉండాలి. కానీ గోల్డ్‌కార్డ్‌కు పార్లమెంట్ నిబంధనలు వర్తించబోవని ట్రంప్ చెబుతున్నారు. కొత్త వీసాలను ట్రంప్ సర్కార్ కేవలం ఆదాయమార్గంగా భావిస్తోంది. ఎందుకంటే ఈ వీసాలో ఎలాంటి ఉపాధి కోణం లేదు.



వైట్ హౌస్‌లో మీడియా భేటీలో 'ప్రతి విషయంలోనూ ట్రంపే కరెక్ట్' అని రాసి ఉన్న టోపీని చూపిస్తున్న ట్రంప్



మహాకుంభ్‌కు ఆఖరి రోజు బుధవారం రాత్రి త్రివేణీ సంగమం వద్దకు భారీగా తరలివచ్చిన భక్తులు

ముగిసిన మహా కుంభమేళా

మహాకుంభ్‌నగర్: ప్రపంచంలోనే అతిపెద్ద సామూహిక వేడుకగా రికార్డుకెక్కిన మహా కుంభమేళా శివరాత్రి పర్వదినం సందర్భంగా బుధవారం ముగిసింది. ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్ త్రివేణి సంగమంలో పుణ్యస్నానాల ఘట్టానికి తెరపడింది. 144 సంవత్సరాల తర్వాత వచ్చిన ఈ మహా కుంభమేళాకు దేశ విదేశాల నుంచి భక్తులు పోటెత్తారు. 45 రోజులపాటు వైభవంగా సాగిన పుణ్యక్రతువులో ఉత్సాహంగా పాల్గొన్నారు. చివరి రోజు బుధవారం భక్తుల పుణ్యస్నానాలతో గంగ, యమున, సరస్వతి నదుల సంగమస్థలి కిక్కిరిసిపోయింది. ఒక్కరోజే 1.32 కోట్ల మంది తరలివచ్చారు. హర హర మహాదేవ అనే మంత్రోచ్ఛారణలతో ఈ ప్రాంతమంతా మార్మోగిపోయింది. చివరి రోజు కావడంతో భక్తులపై హెలికాప్టర్ల ద్వారా పూలవర్షం కురిపించారు. ఈ ఏడాది జనవరి 13న పౌష్య పూర్ణిమ రోజు మహా కుంభమేళా ప్రారంభమైన సంగతి తెలిసిందే. ఫిబ్రవరి 26 వరకూ 66.21 కోట్ల మందికిపైగా జనం స్నానాలు ఆచరించారని ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం ప్రకటించింది. ఈ సంఖ్య ప్రపంచంలోని చాలా దేశాల ఉమ్మడి జనాభా కంటే అధికం కావడం గమనార్హం. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సహా పలువురు కేంద్ర మంత్రులు, ఎంపీలు, ప్రజాప్రతినిధులు, ప్రముఖ వ్యాపారవేత్తలు, సినీ నటులు మహా కుంభమేళాలో పాలుపంచుకున్నారు. భూటాన్ రాజు సైతం పుణ్యస్నానం ఆచరించారు. మహా కుంభమేళాను విజయవంతం చేయడానికి ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం ఈసారి పటిష్టమైన చర్యలు చేపట్టింది. అత్యాధునిక టెక్నాలజీని ఉపయోగించింది. డ్రోన్లు, కృత్రిమ మేధ కెమెరాలను రంగంలోకి దించింది. మహాకుంభ్‌నగర్‌లో ప్రత్యేకంగా టెంట్ సిటీని నిర్మించింది. ప్రభుత్వం ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా కొన్ని అపశ్రుతులు చోటుచేసుకున్నాయి.

'కవచం'గా నిలబడితే ఖనిజాలిస్తాం

- అత్యంత విలువైన ఖనిజాలపై అజమాయిషీ ఇచ్చేందుకు సిద్ధపడ్డ జెలెన్‌స్కీ
- దేశ భద్రతపై భరోసా కోసం పట్టుబడుతున్న ఉక్రెయిన్ అధ్యక్షుడు
- రేపు అమెరికాలో పర్యటించనున్న జెలెన్‌స్కీ !



కీవ్: సొంత భూభాగాలను కాపాడుకునేందుకు రష్యాతో యుద్ధంచేస్తున్న ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ మూడేళ్లుగా అమెరికా చేసిన ఆయుధ, ఆర్థిక సాయానికి అత్యంత అరుదైన, విలువైన ఖనిజాల రూపంలో కృతజ్ఞత చూపేందుకు సిద్ధమయ్యారు. అయితే తమ దేశ రక్షణ, భద్రత విషయంలో అగ్రరాజ్యం అండగా ఉండాలని కీలక షరతు విధించారు. అయితే ఈ షరతుకు అమెరికా ఏ మేరకు ఒప్పుకుంటుందో శుక్రవారంకల్లా స్పష్టత వచ్చే వీలుంది. శుక్రవారం జెలెన్‌స్కీ అమెరికాలో పర్యటించి ట్రంప్‌తో భేటీ అయి విస్తృతస్థాయిలో చర్చలు జరపనున్నారు. చర్చలు సఫలమైతే కీలకమైన ఖనిజ, ఆర్థిక ఒప్పందంపై సంతకాలు చేయనున్నారు. అరుదైన ఖనిజాల డీల్ కుదిరాక, యుద్ధంలో రష్యాకు ఎదురునిలబడి అమెరికా తమకు ఏమేరకు అండగా నిలబడుతుందనే అనుమానాలు జెలెన్‌స్కీ మదిలో అలాగే ఉన్నాయి. తాజాగా ఐక్యరాజ్యసమితి సాక్షిగా రష్యా వ్యతిరేక తీర్మానంలో తమకు మద్దతు పలకాల్సిందిపోయి రష్యాకు అనుకూలంగా అమెరికా ఓటేసిన నేపథ్యంలో భద్రతా అంశంపై జెలెన్‌స్కీ పట్టుబట్టినట్లు తెలుస్తోంది. మూడేళ్లుగా కొనసాగుతున్న యుద్ధంలో వందల బిలియన్ డాలర్ల ఆర్థిక, ఆయుధ సాయం పొందిన కారణంగా అగ్రరాజ్య ఖనిజ సంపద డిమాండ్‌కు జెలెన్‌స్కీ తలొగ్గక తప్పని పరిస్థితి నెలకొంది. ఈ అంశంపై బుధవారం ఉక్రెయిన్ రాజధాని నగరం కీవ్‌లో జెలెన్‌స్కీ మీడియాతో మాట్లాడారు. '' అమెరికాలో ఆర్థిక ఒడంబడిక చేసుకునేందుకు సిద్ధంగా ఉన్నాం. ఈ కార్యాచరణ ఒప్పందం త్వరలో సమగ్ర ఒడంబడికకు బాటలు వేస్తుంది. ఈ ఒప్పందంలో మా దేశ భద్రతా అంశమే అత్యంత ప్రధానమైంది. ఈ అంశాన్ని తేల్చుకునేందుకు అమెరికాలో పర్యటించి ట్రంప్‌తో భేటీ అవుతా. ఖనిజ వనరులపై పాక్షిక హక్కులు ధారాదత్తం చేయడంసహా యుద్ధంలో ఆయుధసాయంపై చర్చిస్తా. యుద్ధంలో సైనికసాయం కొనసాగించే ఉద్దేశం అమెరికాకు ఉందో లేదో తెల్సుకుంటా. నేరుగా అమెరికా నుంచి ఆయుధాల కొనుగోలు విషయమూ మాట్లాడతా. స్తంభింపజేసిన రష్యా స్థిర,చరాస్తులను మేం ఆయుధాల పెట్టుబడుల కోసం వినియోగించుకునే అంశాన్నీ ప్రస్తావిస్తా. అన్ని విషయాలు కొలిక్కివస్తే సమగ్ర ఒప్పందంపై సంతకం చేస్తా'' అని జెలెన్‌స్కీ వివరించారు.

భారీ డీల్ కుదుర్చుకుంటాం: ట్రంప్

మూడేళ్ల సాయానికి ప్రతిఫలంగా విలువైన ఖనిజ సంపద, సహజ వనరులపై వాటా కోరుతున్న ట్రంప్ ఈ ఒప్పందంపై మాట్లాడారు. బుధవారం వాషింగ్టన్‌లో తమ మంత్రివర్గ తొలి భేటీ సందర్భంగా ట్రంప్ మీడియాతో మాట్లాడారు. '' జెలెన్‌స్కీ శుక్రవారం వాషింగ్టన్‌కు వస్తారు. నాతో కలిసి అతిపెద్ద ఒప్పందంపై సంతకాలు చేస్తారు. అమెరికన్లు పన్నుల రూపంలో ప్రభుత్వానికి కట్టిన సొమ్మును మేం ఉక్రెయిన్ కోసం యుద్ధంలో సాయంగా ఖర్చుచేశాం. ఈ సొమ్ము అంతా ఇప్పుడు తిరిగిరాబోతోంది. ఖనిజాల తవ్వకంతో అమెరికా లాభపడనుంది. ఉక్రెయిన్‌తో దాదాపు 1 ట్రిలియన్ డాలర్ల విలువైన ఒప్పందం కుదుర్చుకోబోతున్నా'' అని ట్రంప్ అన్నారు. ''నాటోలో సభ్యత్వం ఆశను ఉక్రెయిన్ వదులుకుంటే మంచిది. నాటో కూటమి సైతం ఈ అంశాన్ని మర్చిపోతే బాగుంటుంది'' అని ట్రంప్ అన్నారు.

ప్రాథమిక ఒప్పందం ఓకే

ఇరుదేశాల మధ్య ప్రాథమిక ఒప్పందం దాదాపు ఖరారైందని ఉక్రెయిన్ ప్రధాన మంత్రి డెనిస్ షెమిహాల్ బుధవారం వెల్లడించారు. '' యుద్ధంలో దెబ్బతిన్న కారణంగా ఉక్రెయిన్ పునర్ నిర్మాణం, శాంతి, పెట్టుబడుల ప్రాతిపదికన అమెరికాతో ఆర్థిక ఒప్పందం కుదుర్చుకుంటున్నాం. ఉక్రెయిన్ పునర్‌నిర్మాణ క్రతువులో అమెరికా క్రియాశీలక పాత్ర పోషిస్తుందని భావిస్తున్నాం'' అని ఉక్రెయిన్ ప్రభుత్వ టెలివిజన్‌లో ప్రధాని డెనిస్ ప్రకటించారు.

సాక్షి హైదరాబాద్

గురువారం । 27 । ఫిబ్రవరి । 2025



చట్టబద్ధతే దత్తతకు మార్గం!

చట్టబద్ధంగానే దత్తత తీసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. అక్రమ మార్గంలో పిల్లల్ని దత్తత తీసుకుంటే చట్టరీత్యా నేరమని హెచ్చరిస్తున్నారు.

-8లో



'రంగ'రంగ వైభవంగా..

నిన్నా మొన్నటి దాకా సినిమాల ప్రభావంతో కుదేలైపోయిన నాటక రంగం.. ప్రస్తుతం నగర వాసుల్ని తన ప్రదర్శనల వైపు నడిపిస్తోంది.

- సిటీప్లస్‌లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం
34.0/20.0

నగరంలో గురువారం ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. గరిష్టంగా 34, కనిష్టంగా 20 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉంది.



కీసర గుట్టలోని శివలింగం వద్ద వానరాల సందడి



శివలింగానికి అభిషేకం చేస్తున్న మహిళలు



భక్తితో నమస్కరిస్తూ..

శివోహం

మహా శివరాత్రి సందర్భంగా శివ నామస్మరణలతో భక్తులు పులకరించారు. జంగమయ్యను భక్తితో కొలిచారు. బుధవారం ప్రఖ్యాత శైవ క్షేత్రం కీసర శ్రీ రామలింగేశ్వర దేవాలయానికి భక్తులు పోటెత్తారు. శివలింగాల వద్ద దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు చేశారు. అలాగే.. నగరంలోని శివాలయాల్లో మహా శివరాత్రి వేడుకలు కన్నుల పండువగా జరిగాయి.



కీసర స్వామివారి దర్శనానికి భక్తుల క్యూ

నకిలీ విజయ బ్రాండ్‌లను నమ్మకండి



విజయ తెలంగాణ పాల ప్యాకెట్‌ను చూపిస్తున్న అమిత్‌రెడ్డి

లాలాపేట: విజయ తెలంగాణ పేరుతో ఉన్న పాలు, పాల ఉత్పత్తులను మాత్రమే కొనుగోలు చేయాలని విజయ డెయిరీ చైర్మన్ గుత్తా అమిత్ రెడ్డి వినియోగదారులకు సూచించారు. బుధవారం ఆయన ఇక్కడ మాట్లాడుతూ.. రెండేళ్ల నుంచి 'విజయ బ్రాండ్, లాఫింగ్ కౌ సింబల్‌ను అనధికారికంగా బ్రాండింగ్ అంశాలను అనుకరిస్తూ మార్క్స్ చట్టం కింద స్వయం ప్రతిపత్తితో పని చేస్తున్నటు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని జిల్లా యూనియన్లు ప్రైవేట్ డెయిరీలు తెలంగాణలో చట్టవ్యతిరేకంగా తమ ఉత్పత్తులను విక్రయిస్తున్నాయని, ఇది సరైన పద్ధతి కాదని హితవు పలికారు. ప్రతినిత్యం 75 వేల నుంచి 80 వేల లీటర్ల వరకు అమ్ముతున్నారని, దీంతో ప్రభుత్వ రంగ సంస్థ విజయ తెలంగాణ డెయిరీకీ ఆర్థికంగా నష్టం వాటిల్లుతోందన్నారు. జిల్లా యూనియన్లకు తెలంగాణలో ఎక్కడా కొనుగోలు కేంద్రాలు లేవన్నారు. కొన్ని గుర్తింపు లేని డెయిరీల ద్వారా ఉత్పత్తి చేసిన పాలను విజయ బ్రాండ్ పేరుతో తెలంగాణలో విక్రయిస్తూ ప్రజల ఆరోగ్యానికి హాని తలపెడుతున్నాయని తెలిపారు. నకిలీ విజయ బ్రాండ్ పాలు, పాల ఉత్పత్తులపై వాట్సాప్ నెంబర్ 91211 60569కు ఫిర్యాదు చేయాలని వినియోగదారులకు గుత్తా అమిత్‌రెడ్డి సూచించారు.

నేడు బీఎంఆర్‌పీఎఫ్ ఆవిర్భావ సభ

సాక్షి, సిటీబ్యూరో: భారత్ మైనారిటీస్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం (బీఎంఆర్‌పీఎఫ్) ఆవిర్భావ సభ గురువారం ఉదయం 11 గంటలకు బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లో జరగనుంది. ఈ సభకు ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ముఖ్య అతిథిగా హాజరు కానున్నట్లు బీఎంఆర్‌పీఎఫ్ వ్యవస్థాపకుడు సయ్యద్ ఇస్మాయిల్ తెలిపారు. మైనారిటీ హక్కుల సాధన కోసం భవిష్యత్ కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకునేందుకు కలిసి రావాలని ఆయన పిలుపునిచ్చారు.

హైటెక్ సిగ్నళ్లు!



గూగుల్ డేటాతో ట్రాఫిక్ సిగ్నళ్లకు అనుసంధానం

- రహదారుల్లో రద్దీకి అనుగుణంగా రెడ్- గ్రీన్ లైట్లు
- కసరత్తు చేస్తున్న పోలీసు, గూగుల్ ఇండియా టీమ్
- ఇటీవలే కొత్వాల్‌తో ఆ సంస్థ ప్రతినిధుల కీలక భేటీ



సీపీ ఆనంద్‌తో గూగుల్ ప్రతినిధులు (ఫైల్)

సాక్షి, సిటీబ్యూరో: సాధారణంగా ప్రతి ట్రాఫిక్ జంక్షన్‌లోనూ మూడు, నాలుగు రోడ్లు ఉంటాయి.. ఒక్కో రోడ్డుకు నిర్ణీత సమయం గ్రీన్ లైట్, రెడ్ లైట్ వెలుగుతూ 'సిగ్నల్స్ సైకిల్' నడుస్తుంది. అన్ని రోడ్లలోనూ, అన్ని వేళల్లో వాహనాల రద్దీ ఒకేలా ఉండదు. అయినప్పటికీ ట్రాఫిక్ సిగ్నళ్ల సైకిల్‌లో మాత్రం మార్పు ఉండదు. అలా ఉండాలంటే ప్రస్తుతం వాటిని క్షేత్రస్థాయి సిబ్బంది మాన్యువల్‌గా ఆపరేట్ చేయాలి. ట్రాఫిక్ సిగ్నళ్లకు అనుసంధానించి ఉండే సర్వర్‌కు ఏ జంక్షన్‌లోని, ఏ రహదారిలో, ఎంత టాఫిక్ ఉంది? అనేది సాంకేతికంగా తెలిస్తే సిగ్నళ్ల సైకిల్‌లోనూ మార్పు ఆటోమేటిక్‌గా జరుగుతుంది. ఈ దిశగా నగర పోలీసులు- గూగుల్ ఇండియా ప్రతినిధులు కసరత్తు చేస్తున్నారు. దీనికి సంబంధించి ఇటీవల కొత్వాల్ సీవీ ఆనంద్ నేతృత్వంలో బంజారాహిల్స్‌లోని ఐసీసీసీలో సమావేశమయ్యారు.

ప్రస్తుతం సిగ్నళ్ల పని తీరు ఇలా..

రాజధానిలోని మూడు కమిషనరేట్లలో ట్రాఫిక్ సిగ్నలింగ్ వ్యవస్థ మూస ధోరణిలో నడుస్తోంది. చిన్న జంక్షన్లలో 90 సెకన్లు, పెద్ద జంక్షన్లలో 240 సెకన్లలో సిగ్నళ్ల సైకిల్ పూర్తవుతుంది. అంటే సదరు జంక్షన్‌లోని ఓ రోడ్డుకు గ్రీన్‌లైట్ ఆగి రెడ్‌లైట్ పడిన తర్వాత మళ్లీ గ్రీన్‌లైట్ పడటానికి పట్టే సమయం ఇది. దీనివల్ల ప్రస్తుతం కొన్ని ఇబ్బందులు ఉంటున్నాయి. బేగంపేట మీదుగా సికింద్రాబాద్- పంజగుట్ట మధ్య ఉన్న రహదారినే తీసుకుంటే ఉదయం వేళల్లో సికింద్రాబాద్ వైపు నుంచి, రాత్రిపూట బేగంపేట దిశ నుంచి ట్రాఫిక్ ఎక్కువగా ఉంటుంది. ఈ మార్గంలో ఉన్న జంక్షన్లలో మాత్రం సిగ్నల్ సైకిల్ ఒకేలా పని చేస్తోంది. దీంతో ఆయా జంక్షన్లలోని కొన్ని రోడ్లు ఖాళీగా, మరికొన్ని బంపర్ టు బంపర్ జామ్‌తో కిక్కిరిసిపోయి ఉంటున్నాయి. ఇలాంటి పరిస్థితి విద్యాసంస్థలు, వాణిజ్య ప్రాంతాలు, ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో తెరచూ కనిపిస్తోంది.

స్మార్ట్ ఫోన్లతో గుర్తిస్తున్న గూగుల్..

సమస్యను పరిష్కరించడం కోసం పోలీసు విభాగం అడాప్టివ్ ట్రాఫిక్ కంట్రోలింగ్ సిస్టం (ఏటీసీఎస్) అమలు చేయాలని నిర్ణయించింది. దీనికోసం గూగుల్ ఇండియా సంస్థతో కలిసి పని చేయనుంది. కీలక మార్గాలు, జంక్షన్లతో పాటు ఇతర ప్రాంతాల్లో ట్రాఫిక్ రద్దీకి సంబంధించిన పూర్తి సమాచారం గూగుల్ వద్ద రియల్‌టైమ్‌లో అందుబాటులో ఉంటోంది. స్మార్ట్‌ఫోన్ వినియోగదారులు ఆ సంస్థకు సంబంధించిన యాప్స్ డౌన్‌లోడ్ చేసుకున్నప్పుడు తమ 'లొకేషన్' తెలుసుకోవడానికి అనుమతిస్తూ 'ఓకే' ప్రెస్ చేస్తూ ఉంటారు. దీంతో ఆయా ఫోన్లు ఉన్న లొకేషన్లు తెలుసుకునే అవకాశం గూగుల్ సంస్థకు కలుగుతోంది. వీటిని ఎప్పటికప్పుడు అధ్యయనం చేస్తున్న ఆ సంస్థ ఏ సమయంలో, ఏ ప్రాంతంలో, ఏ రహదారిలో, ఏ దిశలో సెల్‌ఫోన్లు ఎక్కువగా ఉన్నాయనేది గుర్తిస్తోంది. రహదారులపై ఉన్న సెల్‌ఫోన్లు సాధారణంగా వాహన చోదకుల వద్దవే అయి ఉంటాయి. ఇలా రోడ్లపై ఉన్న ట్రాఫిక్ వివరాలు ఎప్పటికప్పుడు గూగుల్ సంస్థకు చేరుతున్నాయి. వీటి ఆధారంగానే ఆ సంస్థ తమ మ్యాప్‌ల్లో ట్రాఫిక్ రద్దీ ఉన్న రహదారుల్ని ఎరుపు రంగులో చూపిస్తుంటుంది.

ఏపీఐ కోసం ఆ సంస్థతో కలిసి కసరత్తు..

గూగుల్ వద్ద ఉన్న ఈ వివరాలను వాహన చోదకులు, ప్రజలకు ఉపయుక్తంగా వినియోగించాలని పోలీసు విభాగం యోచించింది. దీంతో ట్రాఫిక్ అప్‌డేట్స్‌తో కూడిన గూగుల్ సర్వర్‌తో ట్రాఫిక్ సిగ్నళ్లు అనుసంధానించి ఉండే పోలీసు విభాగానికి చెందిన సర్వర్ అప్లికేషన్ ఇంటర్‌ఫేస్ (ఏపీఐ) ద్వారా అనుసంధానించాలని భావిస్తున్నారు. దీనికి సంబంధించి గూగుల్ సంస్థతో ప్రాథమిక సంప్రదింపులు పూర్తి చేశారు. ఇది అమలులోకి రావడంతో గూగుల్ సర్వర్ ఆధారంగా ట్రాఫిక్ సిగ్నల్స్ సమీపంతో పాటు ఆయా రహదారుల్లో ట్రాఫిక్ రద్దీ ఎప్పటికప్పుడు ట్రాఫిక్ సర్వర్‌కు చేరుతుంది. దీన్ని ఆటోమేటిక్‌గా గుర్తించే ఆ సర్వర్ సిగ్నళ్ల సైకిల్‌ను మారుస్తుంది. దీంతో ఓ చౌరస్తాకు సంబంధించి రద్దీ ఉన్న మార్గాల్లో ఎక్కువ సేపు గ్రీన్‌లైట్ వెలుగుతుంది. రద్దీని బట్టి ఆయా మార్గంలో ఈ సిగ్నల్ సైకిల్‌ను సర్వర్ మార్చేస్తూ ఉంటుంది. అడాప్టివ్ ట్రాఫిక్ కంట్రోలింగ్ సిస్టం పిలిచే దీని ఫలితంగా ట్రాఫిక్ జామ్స్ తగ్గడంతో పాటు వాహనచోదకుల సమయం సైతం ఆదా అవుతుంది. ఇంటిగ్రేటెడ్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ సిస్టంలో (ఐటీఎంఎస్) అంతర్భాగంగా అమలులోకి రానున్న అడాప్టివ్ ట్రాఫిక్ కంట్రోలింగ్ సిస్టం మంచి ఫలితాలు ఇస్తుందని అధికారులు చెబుతున్నారు.

ట్రాఫిక్ కష్టాలు తీరాయ్!

అంబర్‌పేట ఫ్లైఓవర్‌పై వాహనాలకు అనుమతి



అంబర్‌పేట ఫ్లైఓవర్‌పై వాహనాల రాకపోకలు

అంబర్‌పేట: అంబర్‌పేట ఫ్లైఓవర్ బుధవారం నుంచి అందుబాటులోకి వచ్చింది. ఏళ్ల తరబడి నిరీక్షణకు తెరపడింది. ఫ్లైఓవర్‌పై వాహనాల రాకపోకలకు అనుమతి ఇవ్వడంతో ట్రాఫిక్ కష్టాలు చెక్ పెట్టినట్టయింది. ఏడేళ్ల క్రితం వరంగల్ జాతీయ రహదారిపై ఫ్లైఓవర్ నిర్మాణం ప్రారంభించడంతో నిత్యం వేలాది వాహనదారులు అంబర్‌పేట మీదుగా వెళ్లడానికి తీవ్ర అవస్థలు పడ్డారు. ఉప్పల్, రామంతాపూర్ ప్రాంతాల వారు చాదర్‌ఘట్ వెళ్లడానికి అంబర్‌పేట శ్రీరమణ చౌరస్తా మీదుగా వాహనాలను మళ్లించుకుని అలీకేఫ్, గోల్నాక కొత్త బ్రిడ్జి మీదుగా కాచిగూడ కబేళా, చాదర్‌ఘాట్‌కు చేరుకునే వారు. ట్రాఫిక్ కష్టాలతో పాటు అరగంట సమయం వృథా అయ్యేది. అలాగే దిల్‌సుక్‌నగర్ నుంచి ఛే నంబర్ చౌరస్తా మీదుగా శివం, నల్లకుంట వారు వెళ్లే వారు సైతం గోల్నాక మీదుగా చిన్న చిన్న గల్లీల్లో నుంచి అతికష్టం మీద చేరుకోవాల్సి వచ్చేది. చాదర్‌ఘాట్ నుంచి ఉప్పల్ వెళ్లే వారు నల్లకుంట శంకర్‌మఠం, విద్యానగర్, తార్నాక మీదుగా వెళ్లాల్సివచ్చేది. కాగా.. అంబర్‌పేట ఫ్లైఓవర్ అందుబాటులోకి రావడంతో వేలాది వాహనదారులు ఎంతో ఉపశమనం పొందారు. బుధవారం ఉదయం నుంచి వాహనదారులు ఎలాంటి ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా ప్రయాణం సాగించారు.

ఇక కింద పనుల్లో వేగం..

ఫ్లైఓవర్ పై నుంచి వాహనాలను అనుమతించడంతో కింద ట్రాఫిక్ తగ్గింది. దీంతో ఫ్లైఓవర్ సర్వీసు పెండింగ్ పనుల్లో వేగం పెంచేందుకు అవకాశం ఉంది. రెండు వైపులా సర్వీసు రోడ్డు ఇప్పటికీ పూర్తి స్థాయిలో పనులు పూర్తి కాలేదు. అలాగే కొన్ని సున్నిత అంశాలు సైతం ముడిపడి ఉండడంతో సర్వీసు రోడ్డు సమస్యగా మారింది. ఇకపై కింద నుంచి వాహనాల రద్దీ తగ్గడంతో జరుగుతున్న పనుల్లో వేగం పెరిగే ఆవకాశం ఉంది.

పొదుపు.. బిల్లు అదుపు


గ్రేటర్ పరిధిలో 60 లక్షలకు పైగా విద్యుత్ కనెక్షన్లు

- ప్రస్తుతం 10 లక్షలకుపైగా కనెక్షన్లకే గృహజ్యోతి వర్తింపు
- వేసవిలో భారీగా పెరగనున్న గృహ విద్యుత్ వినియోగం
- టారీఫ్ మారితే.. జీరో బిల్లు అవకాశాన్ని కోల్పోయే ప్రమాదం
- కరెంట్ పొదుపుగా వాడి బిల్లులను అదుపు చేయవచ్చంటున్న నిపుణులు

సాక్షి, సిటీబ్యూరో: శివరాత్రితో చలి తీవ్రత తగ్గిపోనుంది. పగటి ఉష్ణోగ్రతలు ఇప్పటికే 35 డిగ్రీలు దాటింది. భగ్గున మండుతున్న ఎండలకు ఉక్కపోత తోడైంది. ఉపశమనం కోసం సిటిజన్లు పేద, మధ్య తరగతి కుటుంబాలు సైతం ఏసీలు, కూలర్లు కొనుగోలు చేస్తున్నాయి. ఇప్పటికే రిఫ్రిజిరేటర్, వాటర్ హీటర్, మిక్సీ, టీవీ, ఫ్యాన్ వాడకంతో నెలకు 120 నుంచి 150 యూనిట్ల లోపు విద్యుత్ వినియోగించేవారు.. తాజాగా ఏసీలు, కూలర్లు వినియోగించనుండటంతో మీటర్ రీడింగ్ గిర్రున తిరిగే అవకాశం లేకపోలేదు. నెలకు 200 యూనిట్ల లోపు విద్యుత్ వినియోగించే వారికి ప్రభుత్వం 2024 మార్చి నుంచి జీరో విద్యుత్ బిల్లులు (గృహజ్యోతి పథకం) జారీ చేస్తున్న విషయం తెలిసిందే. గ్రేటర్‌లో 60 లక్షలకుపైగా విద్యుత్ కనెక్షన్లు ఉండగా, వీటిలో ఇప్పటి వరకు 10,03,286 కనెక్షన్లు మాత్రమే జీరో బిల్లుకు అర్హత పొందారు. వీరు ప్రతి నెలా 89.39 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగిస్తుండగా, ఇందుకు సంబంధించిన రాయితీ మొత్తం రూ.38.62 కోట్లు ప్రభుత్వం డిస్కంకు చెల్లిస్తోంది. ఇక నుంచి రోజువారీ విద్యుత్ పొదుపు చర్యలు చేపట్టకపోతే.. నిర్దేశిత టారీఫ్ దాటి ఇప్పటి వరకు పొందిన జీరో బిల్లును కోల్పోయే ప్రమాదం లేకపోలేదని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

ఈ చిట్కాలు పాటించండి..

చిన్న చిన్న చిట్కాలు పాటించడం వల్ల విద్యుత్ వినియోగాన్ని తగ్గించవచ్చంటున్నారు నిపుణులు. హాల్ నుంచి గదిలోకి వెళ్లినప్పుడు టీవీ, ఫ్యాన్, లైటు ఆఫ్ చేయడం, ఇప్పటి వరకు ఆన్‌లో ఉన్న గ్రీజర్‌కు ఇకపై స్వస్తి పలకడం, వేడి నీటితో కాకుండా చన్నీటితో స్నానం చేయడం వల్ల కరెంట్ వినియోగం తగ్గించుకోవచ్చంటున్నారు. విద్యుత్ పొదుపుతోనే నెలవారీ విద్యుత్ బిల్లును అదుపులో ఉంచుకోవచ్చని సూచిస్తున్నారు.



సర్కిళ్ల వారీగా జీరో విద్యుత్ బిల్లులు ఇలా..

సర్కిల్ పేరు	జీరో బిల్లు కనెక్షన్లు	ఇస్తున్న రాయితీ	విద్యుత్ వినియోగం
బంజారాహిల్స్	32,855	రూ.1.57 కోట్లు	3.56 ఎంయూలు
హైదరాబాద్ సెంట్రల్	62,709	రూ.2.84 కోట్లు	6.49 ఎంయూలు
హైదరాబాద్ సౌత్	92,573	రూ.3.53 కోట్లు	8.18 ఎంయూలు
సికింద్రాబాద్	66,909	రూ.2.97 కోట్లు	6.82 ఎంయూలు
సైబర్ సిటీ	68,073	రూ.2.67 కోట్లు	6.14 ఎంయూలు
రాజేంద్రనగర్	1,29,387	రూ.4.04 కోట్లు	9.04 ఎంయూలు
సరూర్‌నగర్	1,10,000	రూ.4.48 కోట్లు	10.31 ఎంయూలు
హబ్సిగూడ	1,21,417	రూ.5.39 కోట్లు	12.35 ఎంయూలు
మేడ్చల్	1,09,613	రూ.4.94 కోట్లు	11.32 ఎంయూలు
సంగారెడ్డి	2,09,743	రూ.6.19 కోట్లు	14.82 ఎంయూలు

గుర్రపు డెక్క తొలగిస్తుండగా ప్రమాదం

చెరువులో మునిగి తండ్రి, కొడుకు మృతి

- బల్దియా నిర్లక్ష్యమే కారణమని ఆరోపణలు
- మృతుల కుటుంబంలో విషాద ఛాయలు





షేక్ కరీం, సాహిల్ (ఫైల్)

లంగర్‌హౌస్: లంగర్‌హౌస్‌లోని చెరువులో గుర్రపు డెక్క తొలగించడానికి వెళ్లిన జీహెచ్‌ఎంసీ మలేరియా విభాగం కాంట్రాక్ట్ ఉద్యోగి షేక్ కరీం, తొమ్మిదో తరగతి చదువుతున్న ఆయన కుమారుడు సాహిల్ ప్రమాదవశాత్తు అందులో మునిగి ప్రాణాలు కోల్పోయారు. ఈ విషాద ఘటన బుధవారం జరిగింది. కాగా.. బల్దియా అధికారుల నిర్లక్ష్యం కారణంగానే తండ్రీ కొడుకులు చెరువులో మునిగి మృత్యువాత పడ్డారని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. పోలీసులు, ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం.. చాంద్రాయణ గుట్ట కందికల్ గేట్ ప్రాంతంలో నివసించే షేక్ కరీం (39) జీహెచ్‌ఎంసీ మలేరియా విభాగంలో కాంట్రాక్ట్ ఉద్యోగి. ఇతడికి ఈత బాగా రావడంతో చెరువుల శుద్ధి కోసం పంపించేవారు. ఇందులో భాగంగా మంగళవారం లంగర్‌హౌస్‌లోని జీహెచ్‌ఎంసీ చెరువులో కరీం గుర్రపు డెక్క తొలగించి వెళ్లాడు. బుధవారం సెలవు కావడంతో 9 వ తరగతి చదువుతున్న తన కుమారుడు సాహిల్‌ను అధికారుల అంగీకారంతో తనతో పాటు తీసుకువచ్చాడు. గుర్రపు డెక్క తీస్తుండగా ప్రమాదవశాత్తు ఇద్దరూ చెరువులో మునిగి ప్రాణాలు కోల్పోయారు.

పతంగుల మాంజానే ప్రాణాలు తీశాయా?

లంగర్‌హౌస్ చెరువును ఎప్పటికప్పుడు శుద్ధి చేయకపోవడంతో గుర్రపు డెక్కతో పాటు చెరువులో చెత్త పేరుకుపోయింది. దీనికితోడు ఇటీవల పతంగులు చెరువు నిండా పడ్డాయి. పతంగుల మాంజా దారాలలో చిక్కుకొని తండ్రీ కొడుకులు మృతి చెందినట్లు అధికారులు చెబుతున్నారు.

కుమారుణ్ని కాపాడే ప్రయత్నంలో..

గుర్రపు డెక్క తొలగించడానికి చెరువులో దిగిన సమయంలో రెండు బండరాళ్ల వద్దకు కరీం తన కుమారుడు సాహిల్‌ను పంపించాడు. ఆ సమయంలో కాలుకు ఏదో తట్టుకుందని, తనతో కావట్లేదు.. తనను కాపాడాలని సాహిల్ అరిచాడు. ఇటువైపు ఉన్న తండ్రి వెంటనే అక్కడికి వెళ్లి కుమారుడిని ఎత్తే ప్రయత్నంలో ఇద్దరు మునిగిపోయారు.

అధికారులు పరార్..

కరీం, సాహిల్‌లు చెరువులో ఉన్న సమయంలో ఒడ్డున ఎంటమాలజిస్టు అధికారి రమేష్‌తో పాటు ఆరుగురు మలేరియా విభాగం సిబ్బంది ఉన్నారు. నీటిలో మునిగిపోతున్న కుమారుడు సాహిల్‌ను కరీం తన భుజాలపై ఎత్తుకుని సిబ్బందిని కాపాడాలని కోరాడు. ఆ సమయంలో అధికారులతో పాటు సిబ్బంది కాపాడే ప్రయత్నం చేయకుండా జరిగిన విషయాన్ని స్థానిక నాయకులకు, మరికొందరికి ఫోన్ ద్వారా తెలుపుతూ సహాయం కావాలని కోరారు. వెంటనే అక్కడ ఉన్న సిబ్బంది స్పందించి ఉంటే వారి ప్రాణాలు దక్కేవని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అలాగే.. జీహెచ్‌ఎంసీ మేయర్ విజయలక్ష్మి తాను బాధ్యతలు స్వీకరించిన వారం రోజుల్లో లంగర్‌హౌస్‌కు వచ్చి ఈ చెరువును దత్తత తీసుకొని అభివృద్ధి చేస్తానన్నారు. అప్పుడు వచ్చి వెళ్లిన ఆమె మళ్లీ ఇటువైపు కన్నెత్తి కూడా చూడకపోవడం గమనార్హం.

వెంటనే స్పందించిన హైడ్రా కమిషనర్..

చెరువులో తండ్రీ కొడుకులు మునిగిపోవడంతో పోలీసులు, స్థానిక ఎమ్మెల్యే వెంటనే హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు ఫోన్ చేసి సహాయం కోరారు. స్పందించిన ఆయన వెంటనే సహాయం కోసం డీఆర్‌ఎఫ్ సిబ్బందిని ఘటనా స్థలానికి పంపారు. సహాయక సిబ్బందికి కూడా మాంజా దారాలు అడ్డు రావడంతో 3 గంటల పాటు శ్రమించి తండ్రీకొడుకుల మృతదేహాలను వెలికితీశారు. కాగా.. 14 ఏళ్ల బాలుడిని పనిలో ఎలా పెట్టుకుంటారని జీహెచ్‌ఎంసీపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. లంగర్‌హౌస్ చెరువులో తండ్రి కొడుకుల మృతికి జీహెచ్‌ఎంసీ కమిషనర్, జోనల్ కమిషనర్‌లే బాధ్యత వహించాలని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ మండిపడ్డారు. విషయం తెలిసిన వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న ఆయన సహాయక చర్యలను పర్యవేక్షించారు.



మృతదేహాలను వెలికి తీస్తున్న డీఆర్‌ఎఫ్ సిబ్బంది



రోదిస్తున్న మృతుల కుటుంబ సభ్యులు

మోకిలలో కారు బీభత్సం



ప్రమాదంలో దెబ్బతిన్న కారు

- రెండు బైక్‌లు, లారీని ఢీకొట్టిన వైనం
- అపస్మారక స్థితిలో ఇద్దరు బైక్ ట్యాక్సీ డ్రైవర్లు
- కారులో ప్రయాణిస్తున్న ముగ్గురికి గాయాలు
- పరారైన డ్రైవర్
- క్షతగాత్రులంతా నగరవాసులే

శంకర్‌పల్లి: అతివేగం.. అజాగ్రత్త కారణంగా కారు అదుపుతప్పిన ఘటనలో ఇద్దరు వ్యక్తులు చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతుండగా మరో ముగ్గురు గాయపడ్డారు. ఈ ఘటన బుధవారం మోకిల పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ కోటేశ్వర్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మండల పరిధిలోని ప్రొద్దుటూరు గ్రామానికి చెందిన సురేందర్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, వట్టినాగులపల్లికి చెందిన సుధాకర్‌రెడ్డి, మల్లేశం కలిసి శంకర్‌పల్లికి వచ్చారు. తిరుగు ప్రయాణంలో కారులో అతివేగంగా వెళ్తుండగా మోకిల విజేత సూపర్‌మార్కెట్ ఎదుట కారు అదుపుతప్పి ఇద్దరు ద్విచక్ర వాహనదారులను ఢీ కొట్టి ముందుకెళ్లి ఓ లారీని ఢీకొట్టి ఆగిపోయింది. ఈ ఘటనలో కొండాపూర్‌కు చెందిన శ్రీనివాస్(30), లింగంపల్లికి చెందిన చంద్రసింగ్(31) బైక్‌పై నుంచి అమాంతం గాల్లోకి ఎగిరి కిందపడడంతో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వారిని నార్సింగిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. క్షతగాత్రులు ఇద్దరూ అపస్మారక స్థితిలో ఉన్నారు. కారు నడుపుతున్న సురేందర్‌రెడ్డి పరారు కాగా మిగిలిన ముగ్గురు గాయాలతో చికిత్స పొందుతున్నారు. గాయపడిన ద్విచక్రవాహనదారులు ర్యాపిడో, జొమాటోలో పనిచేసే బైక్ ట్యాక్సీ డ్రైవర్లుగా గుర్తించారు. బాధితుల కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

దేనికదే ప్రత్యేకం

ఆకట్టుకున్న ఆవిష్కరణలు..

హెచ్ఐసీసీ నోవాటెల్‌లో బయో ఏషియా-2025 సదస్సు

సాక్షి, సిటీ బ్యూరో: రెండు రోజుల పాటు హెచ్ఐసీసీ నోవాటెల్‌లో జరిగిన బయో ఏషియా-2025 సదస్సులో ఏర్పాటు చేసిన స్టాల్స్ చూపర్లను ఆకట్టుకున్నాయి. పలు స్టార్టప్‌లు వినూత్నమైన ఆలోచనలతో తాము తయారు చేసిన పరికరాలను స్టాల్స్‌లో ఉంచారు. సందర్శకులకు వాటి పనితీరును వివరించారు. వైద్య, ఆరోగ్య రంగాల్లో ఏఐ అద్భుతమైన ప్రతిభను ఆవిష్కరించారు.

30 సెకన్లలో ఆరోగ్య సమాచారం



'సియానా హెల్త్' అనే యాప్ మన మొబైల్‌లో ఇన్‌స్టాల్ చేసుకుని 30 సెకన్లు ముఖం చూస్తే చాలు మన శరీరంలో రక్త పోటు స్థాయి, మధుమేహం, స్కిన్ ఏజ్, రక్తంలో హిమో గ్లోబిన్, శ్వాస తీసుకోవడం, వంటి మొత్తం 27 రకాల నివేదికలను క్షణాల్లో అందిస్తుంది. భవిష్యత్తులో గుండె జబ్బులు వచ్చే అవకాశం ఉంటే ముందుగానే అలెర్ట్ చేస్తుంది. మనం తీసుకునే మందులు మన శరీరానికి సరిపోతాయా, సరిపోవా అనేది చెబుతుంది. ఆరోగ్య చిట్కాలు, డైట్ ఫుడ్, ఫార్మసీ, మెడిసిన్, కన్సల్టేషన్ వంటివి ఈ యాప్‌లో అందుబాటులో ఉంటాయని నిర్వాహకుడు సుమన్‌రెడ్డి తెలిపారు.

మూర్ఛ రోగాన్ని ముందుగానే గుర్తిస్తుంది



అవిన్యా న్యూరో టెక్ అనే డివైజ్ తలకు పెట్టుకుంటే భవిష్యత్తులో ఎప్పుడైనా మూర్ఛ రోగం వచ్చే ప్రమాదం ఉందా అనేది ముందుగానే తెలుసుకోవచ్చు. మూర్ఛ ఎందుకు వస్తుంది, దానికి గల కారణాలు ఏదైనా ప్రమాదం, జన్యు పరంగా, శస్త్రచికిత్సలు, న్యూరో ప్రాబ్లమ్స్ తదితర ఖచ్చితమైన కారణాలు చెబుతుంది. నగరంలోని ప్రముఖ ప్రభుత్వ ఆసుపత్రులకు నెలకు సరాసరిన సుమారు 30 మందికిపైగా మూర్ఛ రోగులు వస్తున్నారు. వారికి భవిష్యత్తులో, ఎంత సమయంలో మూర్ఛ వస్తుందో తెలుసుకోవచ్చు. దీనికి అనుగుణంగా మందులు వాడితే సరిపోతుందని అవిన్యా ఫౌండర్ సౌమ్య తెలిపారు.



స్టార్టప్స్‌కు ప్రోత్సాహం

సెంటర్ ఫర్ హెల్త్ కేర్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ అనేది ఓ ఎన్‌జీఓగా పనిచేస్తుంది. స్టార్టప్ కంపెనీలను ప్రోత్సహిస్తోంది. ఐడియాలను కార్యరూపంలో పెట్టడానికి నిధులను సమకూర్చడం, క్లీనికల్ ట్రయల్స్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ ల్యాబ్స్ 3డీ ప్రింటింగ్, మెంటార్, ఇతర సహాయ, సహకారాలు అందిస్తుంది. నైపుణ్యం ఉన్న స్మార్ట్, ఇంటిలిజెంట్ వెంటిలేటర్ వంటి డివైజ్, తదితర ఏఐ బేస్ స్టార్టప్స్‌కు రూ.25 లక్షల వరకు ఆర్థిక సాయం అందిస్తుంది. ఎండ్ టు ఎండ్ సపోర్టు చేస్తామని మేనేజర్ సాయి స్వరూప్ తెలిపారు

పేపర్ అవసరం లేదు



కాగితం కావాలంటే చెట్లు కొట్టాలి. పర్యావరణానికి ఎలాంటి నష్టం లేకుండా కాగితాన్ని తయారు చేస్తున్నాం. ఇది నీటిలో తడవదు. చింపినా చిరగదు. ఈ పేపర్‌పై రాతలను చెరిపేయవచ్చు. రీ-నోట్ ఏఐ అనే యాప్‌ను మొబైల్‌లో ఇన్‌స్టాల్ చేసుకోవాలి. వారు ఇచ్చిన పేపర్‌పై రాసినవి స్కాన్ చేసుకుంటే నేరుగా డివైజ్‌లో సేవ్ చేస్తుంది. టెక్ట్స్ కాపీ ఫార్వర్డ్ చేయడం సులువుగా ఉంటుంది. నోట్స్ ఉంటే మొబైల్‌లోని కేలండర్‌కు అనసంధానంగా పనిచేస్తుంది. ఎప్పుడు కావాలంటే అప్పుడు యాప్‌లో వివరాలు చూసుకోవచ్చు. విద్యార్థులు, ఐటీ, ఇతర కంపెనీలు, కళాశాలలు, కోచింగ్ సెంటర్లకు ఇది ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని రీనోట్‌ఏఐ సహ వ్యవస్థాపకుడు బాలబొమ్మ సుమన్ తెలిపారు. ఇప్పటికే పలు ఐటీ కంపెనీలు తమ ఉత్పత్తులను వినియోగిస్తున్నాయన్నారు.

పెళ్లి పేరుతో మోసం

రూ. 10 లక్షలు వసూలు

బంజారా హిల్స్: పెళ్లి చేసుకుంటానని ఓ వైద్యురాలిని నమ్మించి మోసం చేసిన వ్యక్తిపై జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే.. జూబ్లీహిల్స్ ప్రాంతానికి చెందిన వైద్యురాలికి జనవరిలో వివాహ వేదిక ద్వారా హర్ష చెరుకూరి అనే యువకుడితో పరిచయం ఏర్పడింది. ఫోన్ నంబర్లు ఇచ్చి పుచ్చుకున్న వారు వాట్సాప్ చాటింగ్ చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో సదరు యువకుడు తన పాన్ కార్డు విషయంలో కొంత గందరగోళం ఉందని ఆదాయపన్ను శాఖ అధికారులు తన బ్యాంకు ఖాతాను సీజ్ చేయడంతో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలిపాడు. తనకు కొంత నగదు సహాయం చేస్తే తిరిగి ఇస్తానని చెప్పాడు. అతడి మాటలు నమ్మిన వైద్యురాలు పలు దఫాలుగా రూ.10 లక్షలు ఇచ్చింది. ఈ నెల 21న తన తల్లి అమెరికా నుంచి వస్తున్నదని పెళ్లి విషయం మాట్లాడుకుందాం అని చెప్పాడు. తీరా అతడి తల్లి రాకపోవడంతో అనుమానం వచ్చిన బాధితురాలు అతడిని నిలదీసింది. తన డబ్బులు తిరిగి ఇవ్వాలని కోరింది. దీంతో తన నిజ స్వరూపాన్ని బయట పెట్టిన హర్ష డబ్బులు అడిగితే నీ ఫొటోలు మార్ఫింగ్ చేసి సోషల్ మీడియా వేదికలో పోస్ట్ చేస్తానంటూ బెదిరించాడు. ఫొటోలు వైరల్ కాకుండా ఉండాలంటే మరో రూ.10 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. దీంతో బాధితురాలు జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు

చిట్టీల పేరిట ఘరానా మోసం

- ఐదు వందల మందికి రూ.80 కోట్ల టోకరా
- ఇంటికి తాళం వేసి ఉడాయించిన వ్యాపారి
- లబోదిబోమంటున్న బాధితులు

అమీర్‌పేట: తాపీ మేస్త్రీగా పనిచేసి చిట్టీలు వేయడం ప్రారంభించాడు.. ఆపై అమాయకులకు అధిక వడ్డీ ఆశ చూపి రూ.80 కోట్లకుపైగా కుచ్చుటోపీ పెట్టి ఉడాయించాడు.. ఈ సంఘటన ఎస్ఆర్ నగర్ ప్రాంతంలో చోటు చేసుకుంది. బాధితులు లబోదిబోమంటూ అతడి ఇంటిని ముట్టడించారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... ఆంధ్ర ప్రదేశ్‌లోని అనంతపురం జిల్లా గుత్తికి చెందిన పుల్లయ్య రెండు దశాబ్దాల క్రితం నగరానికి వచ్చి ఎస్ఆర్‌నగర్ ప్రాంతంలో తాపీమేస్త్రీగా పనిచేసేవాడు. స్థానికులు, దాసారం బస్తీలో ఉండే రిక్షా కార్మికులతో పరిచయాలు పెంచుకుని 15 ఏళ్లుగా చిట్టీల వ్యాపారం నిర్వహించాడు. మేస్త్రీ పని మానేసి చిట్టీల వ్యాపారంపై దృష్టి సారించి బిల్డర్లకు ఫైనాన్స్ ఇచ్చే స్థాయికి ఎదిగాడు. బీకే గూడలో ఐదు అంతస్తుల భవనాన్ని కూడా నిర్మించుకున్నాడు.



బీకేగూడలోని పుల్లయ్య ఇంటి వద్ద బాధితులు

నమ్మించి.. నట్టేట ముంచి...

ఎస్ఆర్ నగర్, బల్కంపేట, బీకే గూడ, సనత్‌నగర్‌కు చెందిన దాదాపు 500 మంది వరకు అతడి వద్ద రూ.5 లక్షల నుంచి కోటి రూపాయల వరకు చిట్టీలు వేశారు. కొన్ని నెలలపాటు అందరికీ చిట్టీ డబ్బులను సకాలంలో చెల్లిస్తూ నమ్మకం పెంచుకున్నాడు. అయితే చిట్టీలు పాడిన వారికి అధిక వడ్డీ ఆశ చూపి, మాయమాటలు చెప్పి డబ్బులు తన వద్దే ఉంచుకునేవాడు. గత ఆరు నెలల నుంచి వడ్డీ డబ్బులు ఇవ్వకపోగా, చిట్టీ పాడిన వారికి కూడా డబ్బులు ఇవ్వడం లేదు. కొందరు గట్టిగా నిలదీయండంతో జనవరి నెలాఖరుకు డబ్బులు చెల్లిస్తానని నమ్మబలికాడు. అయితే 23వ తేదీ సాయంత్రం తన ఫార్చ్యునర్ కారును ఇంట్లోనే వదిలి ఓ క్యాబ్‌లో కుటుంబసభ్యులతో కలిసి ఎటో వెళ్లిపోయాడు. ఆయన ఫోన్లు కూడా స్విచ్ఛాఫ్ చేసి ఉన్నాయి. పుల్లయ్య వద్ద డబ్బు ఉండిపోవడంతో చాలామంది బాధితులు గగ్గోలు పెడుతూ బీకేగూడలోని ఆయన నివాసానికి చేరుకున్నారు. ఎస్ఆర్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు సిద్ధమయ్యారు. కాగా ఐపీ పెట్టేందుకు పుల్లయ్య లాయర్‌ను ఆశ్రయించినట్లు సమాచారం.



పుల్లయ్య

అనంతపురంలోనూ ఐపీ..

అనంతపురం జిల్లా గుత్తికి చెందిన పుల్లయ్య గతంలో అక్కడ కూడా చిట్టీలు, ఫైనాన్స్ వ్యాపారం చేసినట్లు తెలిసింది. అనంతపురంలో ఐపీ పెట్టిన తర్వాత హైదరాబాద్‌కు మకాం మార్చినట్లు స్థానికులు చెబుతున్నారు. కర్నూలు, మంత్రాలయం ప్రాంతాలకు చెందిన పలువురు కూడా ఆయన బాధితుల్లో ఉన్నట్లు తెలిసింది.

చోరీ కేసు నిందితుల రిమాండ్



ఉప్పల్: చోరీ కేసు నిందితులను ఉప్పల్ పోలీసులు అరెస్టు చేసి సొత్తును రికవరీ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జ్ఞాన్ చంద్‌శర్మ, రామ్ కిశోర్ ఇద్దరు ఉప్పల్ గాంధీనగర్‌లో నామన్ మార్కెటింగ్ హోల్‌సేల్ కిరాణా షాపును 8 ఏళ్లుగా నిర్వహిస్తున్నారు. ఈనెల 22న రాత్రి రామ్‌కిశోర్ షాపును మూసేసి ఇంటికి వెళ్లాడు. మరుసటి రోజు తెల్లవారుజామున 5 గంటలకు హమాలీ రాజు షాపు తెరిచి ఉండడాన్ని గమనించి షాప్ యాజమానికి సమాచారం అందించాడు. వెంటనే అక్కడికి చేరుకున్న షాపు యజమానులు లోనికి వెళ్లి గల్లా పెట్టెలో చూడగా అందులోని రూ. 7 లక్షలు కనిపించలేదు. దీంతో వెంటనే ఉప్పల్ పోలీసులను ఫిర్యాదు చేశారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు సీసీ ఫుటేజీలను పరిశీలించగా నిందితులు చోరీకి ముందు షాపు బయట ఉన్న సీసీ కెమెరాలను పక్కకు వంచారు. కానీ షాపులోపల కెమెరాలను గమనించలేదు. దీంతో దొంగతనం దృశ్యాలు సీసీ ఫుటేజీలో నిక్షిప్తమయ్యాయి. వాటి ఆధారంగా దర్యాప్తు చేపట్టారు. ఉప్పల్ పోలీసులు బుధవారం రాజ్యలక్ష్మీ థియేటర్ వద్ద పెట్రోలింగ్ చేస్తుండగా అనుమానాస్పద స్థితిలో ఉన్న ముగ్గురిని అదుపులోకి తీసుకుని విచారించగా పొంతన లేని సమాధానం చెప్పారు. వారిని స్టేషన్ తీసుకెళ్లి విచారించగా వికారాబాద్‌కు చెందిన మహ్మద్ ఖాదర్ (48), అబ్దుల్ ఖాలీద్ (48), రాజేందర్‌నగర్‌కు చెందిన షేక్ అబ్దుల్ మొయిన్ (42) ఉప్పల్‌లో దొంగతానికి పాల్పడినట్లు అంగీకరించారు. వీరు ఇప్పటికే పలు చోరీ కేసుల్లో నిందితులని పోలీసులు తెలిపారు. ఈ మేరకు వారి నుంచి రూ. 5,20,000 లు స్వాధీనం చేసుకుని నిందితులను రిమాండ్‌కు తరలించారు.

కంపెనీ నిధులు దుర్వినియోగం

- నలుగురిపై కేసు
- ఇద్దరి రిమాండ్, పరారీలో మరో ఇద్దరు

నాగోలు: కంపెనీ నిధులు దుర్వినియోగం చేయడమేగాక, మేనేజింగ్ డైరెక్టర్‌పై దాడికి పాల్పడిన నలుగురు వ్యక్తులపై ఎల్బీనగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. వారిలో ఇద్దరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఎస్సై సతీష్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఎల్బీనగర్ ప్రాంతంలోని హన్వికా ఆర్గానిక్ ఇన్నోవేషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీని మహారాష్ట్రకు చెందిన విట్టల్ రాంజీ హండాలే, అదే ప్రాంతాన్ని చెందిన శివాజీ పరాశరం బింగాలే మరో ఇద్దరితో కలిసి ఏర్పాటు చేశారు. సంస్థలో గోడౌన్ బాధ్యతలు నిర్వహిస్తున్న నలుగురు ఉద్యోగులు కంపెనీ స్టాక్, నిధులను వారి సొంత వ్యాపారానికి బదిలీ చేసుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ నాగేశ్వరరావు వారిని నిలదీయగా సిబ్బందితో అతడిపై దాడి చేయించారు. నాగేశ్వర్‌రావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు కంపెనీ నిధులు, స్టాక్‌ను నలుగురూ కలిసి తమ సొంత సంస్థ అయిన మెస్సర్స్ దాన్వి అగ్రిటెక్ ప్రైవేట్ లిమిటెడ్‌కు మళ్లించినట్లు గుర్తించారు. మంగళవారం రాత్రి కంపెనీ మాజీ ఉద్యోగులైన విట్టల్ రాంజీ హండాలే, శివాజీ పరాశరం బింగాలేను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. పరారీలో ఉన్న మరో ఇద్దరిని త్వరలోనే అరెస్టు చేస్తామన్నారు.




విట్టల్ రాంజీ



శివాజీ పరాశరం

చట్టబద్ధతే దత్తతకు మార్గం!

- పిల్లల అక్రమ రవాణా చట్టరీత్యా నేరం
- విక్రయం, కొనుగోలు రెండూ శిక్షార్హమే
- తల్లిదండ్రుల ఆశలతో వ్యాపారం చేస్తున్న దళారులు



సాక్షి, సిటీబ్యూరో: అమ్మా, నాన్న అనే పిలుపు కోసం తపన.. తల్లినయ్యానంటూ చెప్పాలనే కోరిక.. తండ్రిగా బిడ్డ వేలుపట్టి నడిపించాలనే తహతహ కొందరు దంపతులను అక్రమ మార్గంలో నడిచేలా చేస్తున్నాయి. ఎన్ని మందులు వాడినా, చికిత్సలు చేయించుకున్నా వేధిస్తున్న సంతానలేమి సమస్యలు, వివాహమై ఏళ్లు గడుస్తున్నా పిల్లలు కలగకపోవడంతో సమాజంలో చిన్నచూపు, చట్టబద్ధంగా పిల్లల దత్తతకు ఏళ్ల కాలం పాటు పట్టే సమయం వెరసి.. దళారుల మాటలు నమ్మేలా చేస్తున్నాయి. విద్యావంతులు, గౌరవ ప్రదమైన హోదాలో ఉన్న వారు సైతం అక్రమ మార్గంలో పిల్లలను అక్కున చేర్చుకుంటున్నారు. పిల్లలు లేని దంపతులకు నవజాత శిశువులను విక్రయిస్తున్న రెండు ముఠాలను మంగళవారం రాచకొండ పోలీసులు పట్టుకున్నారు. అక్రమంగా పిల్లలను విక్రయించే నేరస్తులపైనే కాదు శిశువులను కొనుగోలు చేసిన బాధిత తల్లిదండ్రుల పైనా పోలీసులు కేసులు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో చట్టబద్ధంగా పిల్లల దత్తత ఎంత అవసరమో ఈ ఘటనలు రుజువు చేస్తున్నాయి.

జాతీయ స్థాయిలో 'కారా'..

పిల్లలను చట్టబద్ధంగా దత్తత ఇవ్వడానికి జాతీయ స్థాయిలో 'కేంద్రీయ దత్తత వనరుల ఏజెన్సీ' (కారా) పని చేస్తోంది. ఈ ఏజెన్సీ కింద రాష్ట్ర దత్తత వనరుల ఏజెన్సీలు పని చేస్తాయి. అసహాయ పరిస్థితులు, ఆర్థిక భారంతో తల్లిదండ్రులు వదిలేసిన, అప్పగించిన పిల్లలను శిశు సంక్షేమశాఖ అధికారులు చేరదీస్తారు. వీరినే దత్తత ఇస్తారు. ఈ మేరకు రాష్ట్ర స్థాయిలో శిశువిహార్, జిల్లా స్థాయిలో శిశుగృహాలు ఉన్నాయి. వీటిల్లో ఆరేళ్లలోపు చిన్నారులకు మాత్రమే సంరక్షణ ఉంటుంది. ఆరేళ్లు దాటితే శిశుగృహాల నుంచి బాలసదన్‌కు పంపించి చదువు నేర్పిస్తారు. చిన్నారుల దత్తత కోసం నమోదు చేసుకున్నాక వచ్చిన సీనియారిటీ, పిల్లల వయసు, ఆడ, మగ, ఆరోగ్యం తదితరాలన్నీ పరిగణనలోకి తీసుకుంటే దత్తతకు కనీసం ఏడాది నుంచి మూడేళ్ల సమయం పడుతుంది.

బంధువుల పిల్లల దత్తతకూ అనుమతి తప్పనిసరి..

ఇలాంటి చిన్నారులే కాదు బంధువుల పిల్లలను దత్తత తీసుకోవాలన్నా 'కారా' ద్వారా అనుమతి పొందాల్సిందే. దంపతుల వయసు, వైవాహిక బంధం ఆధారంగా చిన్నారులను దత్తత ఇస్తారు. కనీసం రెండేళ్ల పాటు ఎలాంటి గొడవలు లేకుండా సాఫీగా జీవిస్తున్న వారే అర్హులు. సింగిల్ పేరెంట్ అయితే మహిళ మాత్రమే దత్తత తీసుకునేందుకు అర్హురాలు. పురుషులు దత్తత తీసుకోవడానికి చట్టం అనుమతించదు. కేరింగ్స్ పోర్టల్స్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్న దంపతులు కుటుంబ పరిస్థితులు, తనిఖీ చేసిన అనంతరం జిల్లా బాలల సంరక్షణ విభాగం (డీసీపీయూ) నివేదిక అందిస్తుంది. అనంతరం 'కారా' ప్రాథమిక అనుమతి లేఖను ఇస్తుంది. అప్పుడు డీసీపీయూ వద్ద దరఖాస్తు చేసుకోవాలి. ఈ వివరాలన్నీ పరిశీలించాక జిల్లా కలెక్టరు దత్తత ఆదేశాలు జారీచేస్తారు.

ప్రస్తుతం కారాలో నమోదైన దంపతులు: 35,469
దత్తతకు అందుబాటులో ఉన్న చిన్నారులు: 2,325

- దరఖాస్తు చేసుకున్న భారతీయ దంపతులు (ఆర్ఐ): 32,905
- ప్రవాసులు (ఎన్ఆర్ఐ): 298
- భారతీయ విదేశీ పౌరులు (ఓసీఐ): 216
- విదేశీయులు: 348

పిల్లలను దత్తత తీసుకున్న టాప్- 5 రాష్ట్రాలు	
మహారాష్ట్ర:	564
తమిళనాడు:	372
తెలంగాణ:	225
ఉత్తరప్రదేశ్:	225
కర్ణాటక:	223

గత నాలుగేళ్లలో కారా నివేదిక ప్రకారం దత్తత గణాంకాలివీ

2020-21	2021-22	2022-23	2024-25
3,559	3,405	3,441	4,020

గంజాయి విక్రయిస్తున్న ముగ్గురి అరెస్ట్




వెంగళరావునగర్: అక్రమంగా గంజాయి విక్రయిస్తున్న ముగ్గురిని పోలీసులు అరెస్టు చేశారు. మధురానగర్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ వర్మ తెలిపిన వివరాల ప్రకారం... మధురానగర్ పీఎస్ పరిసర ప్రాంతాల్లో గంజాయిని విక్రయిస్తున్నట్టుగా పోలీసులకు విశ్వసనీయ సమాచారం అందింది. ఈ మేరకు ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ పోలీసులు, హెచ్ఎన్ఈడబ్ల్యూ సిబ్బందితో కలిసి పకడ్బందీగా వల పన్నారు. ఈ మేరకు మంగళవారంరాత్రి వెంగళరావునగర్ డివిజన్‌లోని నలందా కళాశాల పక్కన ఉన్న గ్రౌండ్‌లో ముగ్గురు అనుమానితులను పట్టుకున్నారు. వారిని తనిఖీ చేయగా 41 కిలోల గంజాయి, రూ.40 వేల నగదు, గంజాయి ప్యాకింగ్ మెటీరియల్ లభించాయి. పోలీసులు వారిని అదుపులోనికి తీసుకుని గంజాయి, నగదు, మెటీరియల్‌ను సీజ్ చేశారు. కాగా, ముగ్గురిలో ఒకరు ఒడిశా రాష్ట్రంలోని కోరాపుట్ ప్రాంతానికి చెందిన అంతర్రాష్ట్ర గంజాయి స్మగ్లర్ బాల హంతాల్‌గా గుర్తించారు. మరో ఇరువురు బుర్రా శ్రీనివాసులు, గోనుగుంట అభిషేక్‌లని, వీరిది కూకట్‌పల్లి ప్రాంతమని ఇన్‌స్పెక్టర్ పేర్కొన్నారు. ముగ్గురు నిందితులను బుధవారం కోర్టుకు హాజరుపరిచి, అనంతరం రిమాండ్‌కు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

వెంగళరావునగర్ : ముకిన్‌పేట, భరత్‌నగర్ 11కెవీ ఫీడర్లు, సైబర్ సిటీ, జనప్రియ సబ్‌స్టేషన్ల పరిధిల్లో జరుగుతున్న మరమ్మతుల కారణంగా పలుచోట్ల విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు అధికారులు తెలిపారు. గురువారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు భరత్‌నగర్ కాలనీ, మహేశ్వరినగర్ కాలనీ, శక్తినగర్, ఎల్‌ఐజీ, ఈడబ్ల్యుఎస్, ఎంఐజీ, హెచ్‌ఐజీ క్వార్టర్స్, ఎస్‌పి నగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు.

సాయిబాబాకు అభిషేకం



బంజారాహిల్స్: మాఘ మాస మహోత్సవాల్లో భాగంగా బంజారాహిల్స్ రోడ్ నెంబర్ 12 లోని విశ్వసాయి మందిరంలో కొలువైన శ్రీ సాయి బాబాకు బుధవారం భస్మంతో అభిషేక జరిగింది. ఈ వేడుకంతులకించేందుకు భక్తులు భారీ సంఖ్యలో విచ్చేశారు

వైభవంగా తిరువీధి ఉత్సవాలు

వెంగళరావునగర్ : వెంగళరావునగర్ డివిజన్ మధురానగర్‌కాలనీలో ఉన్న శ్రీఅభయాంజనేయస్వామి దేవస్థానంలో మాఘమాస హనుమాన్ వైభవ ఉత్సవాల ముగింపు సందర్భంగా తిరువీధి ఉత్సవాలు వేడుకలు మంగళవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. నాలుగురోజుల పాటు జరిగిన ఈ వేడుకలను ఆలయ ధర్మకర్తలు తోటకూర నరసింహారావు, టి.వెంకటరమణలు పర్యవేక్షిస్తూ భక్తులకు కావాల్సిన ఏర్పాట్లు చేశారు.

మొబైల్ ఫోన్ చోరీ

వెంగళరావునగర్ : నిద్రిస్తున్న యువకుడి మొబైల్ ఫోన్‌ను గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు. మధురానగర్ పోలీసులు తెలిపిన మేరకు.. గుంటూరు ప్రాంతానికి చెందిన ఎం.ప్రవీణ్ స్థానిక ఎల్లారెడ్డిగూడలో గత కొంత కాలంగా ఉంటూ సోషల్ మీడియా ఎనలిస్ట్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. గత నెల 28వ తేదీ నాడు విధులు ముగించుకుని రాత్రి రూంకు వచ్చి నిద్రపోయాడు. ఉదయం లేచి చూడగా తన ఫోన్ కనిపించలేదు. సొంత పనుల నిమిత్తం స్వగ్రామానికి వెళ్ళిన ప్రవీణ్ బుధవారం మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అజ్మీర్ షరీఫ్ దర్గాకు చాదర్ పంపిన ఎమ్మెల్యే



అజ్మీర్‌దర్గాకు చాదర్‌ను సమర్పిస్తున్న సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

సనత్‌నగర్: సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ ఆధ్వర్యంలో అజ్మీర్ షరీఫ్ దర్గాకు చాదర్ పంపారు. బుధవారం వెస్ట్‌మారేడ్‌పల్లిలోని తన కార్యాలయం వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. బన్సీలాల్‌పేటలోని ముస్లీం బస్తీకి చెందిన షేక్ ముక్రం ఖదీర్, ఎక్రం ఖదీర్, ఇమ్రాన్ ఖదీర్‌లు ఈ నెల 28వ తేదీన అజ్మీర్ దర్గాలో చాదర్‌ను సమర్పిస్తారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు లక్ష్మీపతి, నాగభూషణం, ముస్లిం బస్తీవాసులు ఫహీం, అబ్బాస్, జావీద్ తదితరులు పాల్గొన్నారు.

1న మాదిగ అమరవీరుల సంస్మరణ సభ



మాట్లాడుతున్న గోవిందు నరేష్ మాదిగ

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో మార్చి 1న మాదిగ అమరవీరుల సంస్మరణ సభను నిర్వహించనున్నట్లు ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు డా.గోవిందు నరేష్ తెలిపారు. బుధవారం (ఎంఎస్ఎఫ్) నాయకుల సమావేశం జరిగింది. కార్యక్రమానికి ఎంఎస్ఎఫ్ ఓయూ అధ్యక్షులు మంద రాజు మాదిగ అధ్యక్షత వహించగా గోవిందు నరేష్ ముఖ్య అతిథిగా హాజరై పలు అంశాలపై మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణలో రిజర్వేషన్ల కేటాయింపులు శాస్త్రీయంగా జరగాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంఎస్ఎఫ్ జాతీయ అధ్యక్షులు చిప్పలపల్లి సోమశేఖర్‌మాదిగ, అధికార ప్రతినిధి బోర్ర భిక్షపతిమాదిగ పాల్గొన్నారు.





శ్రీనగర్ కాలనీ శ్రీ భ్రమరాంబికా సమేత మల్లికార్జున స్వామి ఆలయంలో..



బంజారాహిల్స్ క్యాన్సర్ ఆస్పత్రి ఆవరణలోని శ్రీ విజయగణపతి ఆలయంలో...



ఫిలింనగర్ దైవసన్నిధానంలో..



శ్రీనగర్ కాలనీ శివాలయంలో...

శంభో.. శివ శంభో..!

శివాలయాలకు పోటెత్తిన భక్తులు | **తెల్లవారుజాము నుంచే అభిషేకాలు, పూజలు** | **ఆలయాల వద్ద భారీ పోలీసు బందోబస్తు**

బంజారాహిల్స్: మహా శివరాత్రి పర్వదిన వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. బుధవారం తెల్లవారుజాము నుంచే శివాలయాలకు భక్తులు పోటెత్తారు. పరమేశ్వరుడికి అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు మంత్రోచ్చరణల నడుమ తెల్లవారుజామున అంకురార్పణతో ఈ వేడుకలు ప్రారంభమయ్యాయి. ఎటు చూసినా శివనామస్మరణ ఆధ్యాత్మికతను కళ్ళముందుంచింది. బంజారాహిల్స్‌రోడ్ నెం. 1లోని శివాలయానికి తెల్లవారుజామున 2 గంటల నుంచే అభిషేకాలు నిర్వహించేందుకు భక్తులు బారులు తీరారు. ఇందుకోసం ఆలయంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. శ్రీనగర్ కాలనీనిలో శ్రీ భ్రమరాంబికా సమేత మల్లికార్జున స్వామి వారి ఆలయానికి భక్తులు పెద్ద సంఖ్యలో విచ్చేశారు. జూబ్లీహిల్స్‌లోని శ్రీ సీతారామస్వామి దేవాలయంలో అర్చకుల వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ దేవతామూర్తులకు మంగళ హారతులతో స్వాగతం పలికారు. ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. ఫిలింనగర్ దైవసన్నిధానంలో కొలువుదీరిన శ్రీ భ్రమరాంబికా సమేత మల్లికార్జున స్వామికి విశేష పూజలు జరిగాయి.

- అన్ని ఆలయాల్లో ఉదయం శ్రీ మహాగణపతి పూజ, పుణ్యాహవచనం, మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఏకరుద్రాభిషేకాలు జరిగాయి. సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 7.30 గంటల వరకు ఏకరుద్రాభిషేకాలు వైభవంగా నిర్వహించారు. రాత్రి శ్రీ భ్రమరాంబికా మల్లికార్జున స్వామి వారి కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. రాత్రి 11 గంటంల నుంచి ఒంటి గంటన్నర వరకు లింగోద్భవ కాల మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. పలు ఆలయాల్లో జాగరణ కార్యక్రమంతో ఆధ్యాత్మికత వెల్లివిరిసింది.



బంజారాహిల్స్‌లోని బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 15 అడుగుల శివలింగం...



సనత్‌నగర్ హనుమాన్ దేవాలయంలో..



పహాడీ హనుమాన్ దేవాలయంలో..



బంజారాహిల్స్ రోడ్ నెం. 1లోని శివాలయంలో..



ఎన్టీఆర్ నగర్ అయ్యప్ప స్వామి ఆలయంలో ..



శ్రీకృష్ణానగర్ ఆంజనేయస్వామి ఆలయంలో..



విజయగణపతి ఆలయంలో పూజల్లో కార్పొరేటర్ విజయారెడ్డి...



నేపాల్ శివాలయంలో ఏసీపీ వెంకటరమణ.ఎస్‌హెచ్ఓ వీరశేఖర్ తదితరులు

భక్తులతో కిక్కిరిసిన ఆలయాలు



జీటీఎస్ కాలనీల ఆలయంలో పూజలు చేస్తున్న బిసి కమిషన్ చైర్మన్, భక్తులు

వెంగళరావునగర్ : జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో మహాశివరాత్రి వేడుకలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. శైవక్షేత్రాలు, అనేక దేవాలయాల్లో కన్నుల పండువగా పూజలు జరిగాయి. బుధవారం తెల్లవారుజామున 4 గంటల నుంచే ఆలయాల్లో పూజలు ప్రారంభమయ్యాయి. హరహర మహాదేవ శంభోశంకర, ఓం నమఃశ్శివాయ అంటూ దేవాలయాలన్నీ మార్మోగాయి. స్థానిక కార్పొరేటర్ దేదీప్య విజయ్, బీఆర్‌ఎస్ నాయకులు విజయ్‌కుమార్ వివిధ ప్రాంతాల్లో ఉన్న ఆలయాల్లో పూజలు చేశారు. జీటీఎస్ కాలనీలోని జీటీఎస్ ఆలయంలో రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ గోపిశెట్టి నిరంజన్ ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఈఓ గుమ్మడిదల సుధాకర్ భక్తులకు కావాల్సిన ఏర్పాట్లు పర్యవేక్షించారు. వెంగళరావునగర్ ప్రధాన రహదారిలోని సీతారామాంజనేయస్వామి దేవాలయం, మధురానగర్ కాలనీలోని అభయాంజనేయస్వామి దేవాలయం తదితర ఆలయాల్లో జరిగిన పూజలకు భక్తులు పెద్దసంఖ్యలో తరలిరావడంతో ఆలయాలు కిటకిటలాడాయి.

మార్మోగిన శివనామస్మరణ

రహమత్‌నగర్ : ఎస్ఎస్‌బీనగర్ నేపాల్ శివాలయంలో ఎస్ఆర్‌నగర్ డివిజన్ ఏసీపీ వెంకటరమణ, బోరబండ ఎస్‌హెచ్ఓ వీరశేఖర్, రహమత్‌నగర్ కార్పొరేటర్ సీఎన్ రెడ్డిలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. రహమత్‌నగర్‌లోని మార్కెండేయ, శివగంగానగర్‌లోని భవాని శంకర ఆలయాల్లో నగర కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి భవాని శంకర్ దంపతులు స్వామి వారిని దర్శించుకుని పూజలు చేశారు. శ్రీరాంనగర్‌లో శివాలయంలో విద్యాశాఖ డైరెక్టర్ పీవీ రాధా రెడ్డి, రవిశేఖర్‌రెడ్డి పూజలు నిర్వహించారు. బోరబండ డివిజన్‌లోని వీర హనుమాన్ ఆలయంలో మహాశివరాత్రి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. బ్రహ్మశంకర్‌నగర్ పోతులూరి వీర బ్రహ్మేంద్ర స్వామి, శ్రీరాంనగర్, శివగంగానగర్‌లోని భవాని శంకర ఆలయాలకు భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చారు.

ఆలయంలో సీపీ ప్రత్యేక పూజలు



రహమత్‌నగర్: ఎస్పీఆర్‌హిల్స్‌లోని గోరఖ్ నాథ్ శివాలయంలో నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ బుధవారం రాత్రి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో శివరాత్రి ఏర్పాట్లపై అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట వెస్ట్ జోన్ డీసీపీ విజయ్ కుమార్, ఎస్ఆర్‌నగర్ ఏసీపీ వెంకటరమణ, బోరబండ ఎస్‌హెచ్ఓ వీరశేఖర్, రహమత్‌నగర్ కార్పొరేటర్ సీఎన్ రెడ్డి ఉన్నారు.

నిజాం కాలేజీలో యూజీసీ న్యాక్ బృందం పర్యటన

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ అనుబంధ నిజాం కాలేజీని యూజీసీ న్యాక్ అధికారుల బృందం ఈ నెల 24, 25 తేదీలలో పర్యటించినట్లు అధికార వర్గాలు బుధవారం తెలిపారు. న్యాక్ గుర్తింపు కోసం కాలేజీ పనితీరు, నాణ్యత ప్రమాణాలను అంచనా వేసి గుర్తింపు ఇచ్చేందుకు అధికారుల బృందం పర్యటించిందని పేర్కొన్నారు. ప్లేస్‌మెంట్ సెల్, ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ, ఈఓసీ, పరీక్షల విభాగం, విమెన్ ఎంపవర్‌మెంట్ సెల్, క్రీడా విభాగంతో పాటు ఆర్ట్స్, సోషల్ సైన్స్, కామర్స్, సైన్స్, మేనేజ్‌మెంట్ కోర్సుల విభాగలను సందర్శించి అధ్యాపకులతో మాట్లాడినట్లు ప్రిన్సిపల్ ప్రొ.ఏవీ రాజశేఖర్ తెలిపారు.

ఘనంగా ప్రొటీన్ దినోత్సవం



ప్రొటీన్ దినోత్సవంలో పాల్గొన్న పౌల్ట్రీ ఇండియా ప్రతినిధులు

బంజారాహిల్స్: మన శరీర ఎదుగుదలలో, ఆరోగ్యం విషయంలో ప్రొటీన్ కీలక పాత్ర పోషిస్తుందని ప్రొటీన్ అనేది శరీర నిర్మాణానికి, ఎదుగుదలకు ఎంతో దోహదం చేస్తుందని పౌల్ట్రీ ఇండియా అధ్యక్షులు ఉదయ్ సింగ్ బయాస్ అన్నారు. బుధవారం ప్రపంచ ప్రొటీన్ దినోత్సవం సందర్భంగా జూబ్లీహిల్స్‌లోని సంస్థ కార్యాలయంలో పౌల్ట్రీ ఇండియా, ఇండియన్ పౌల్ట్రీ ఎక్విప్‌మెంట్ మ్యాన్‌ఫ్యాక్చరర్స్ అసోసియేషన్(ఐపీఈఎంఏ) ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహంచారు. ఈ సందర్భంగా ఉదయ్ సింగ్ బయాస్ మాట్లాడుతూ దేశంలో 73 శాంతి మంది ప్రొటీన్ లోపంతో బాధపడుతున్నారని జనాభాలో 17 శాతం మంది తక్కువ బరువు, వాటి వల్ల కలిగే సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. గుడ్డులో అత్యంత విశేషమైన పోషకాలు లభ్యమవుతాయని అందువల్ల ప్రతి ఒక్కరు రోజు ఒక గుడ్డు తప్పనిసరిగా తీసుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు.

కనుల పండువగా ధ్వజారోహణ





ఆలయంలో ధ్వజారోహణ మహోత్సవ దృశ్యాలు

ఫిలింనగర్: జూబ్లీహిల్స్ టీటీడీ శ్రీ వారి అయిదవ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా తొలి రోజు బుధవారం ధ్వజారోహణ మహోత్సవాన్ని తిరుమల నుంచి విచ్చేసిన అర్చకులు వైభవంగా నిర్వహించారు. సకల దేవతలకు స్వామివారి బ్రహ్మోత్సవాల ఆహ్వానపత్రమే గరుడ పటమని అర్చకులు తెలిపారు. ఈ సందర్భంగా గరుడపటాన్ని ఆలయ వీధుల్లో మేళతాళాల మధ్య ఊరేగించి ధ్వజస్తంభానికి ఎగురవేశారు. గరుడపటం ఎగురవేయడంతో ఆలయంలో బ్రహ్మోత్సవాలు ప్రారంభమైనట్లేనని అర్చకులు తెలిపారు. సాయంత్రం స్వామివారి పెద్ద శేష శాహన సేవ వైభవంగా జరిగింది. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

బర్డ్ ఫ్లూ ఎఫెక్ట్.. పడిపోయిన చికెన్ అమ్మకాలు

రహమత్‌నగర్ : బర్డ్‌ఫ్లూ వదంతులతో తమ వ్యాపారాలు పూర్తిగా పడిపోయాయని రహమత్‌నగర్, బోరబండ డివిజన్లకు చెందిన చికెన్ వ్యాపారులు లబోదిబోమంటున్నారు. రహమత్‌నగర్ బోరబండ డివిజన్లలో దాదాపు 500 మందికి పైగా వ్యాపారులు చికెన్ వ్యాపారాలపైనే జీవిస్తుంటారు. బర్డ్ ఫ్లూ మూలంగా చికెన్ వ్యాపారాలు దెబ్బతిన్నాయని వాపోతున్నారు. రోజుకు 100 కోళ్లను విక్రయించే తమ దుకాణం బర్డ్ ఫ్లూ మూలంగా గత 20 రోజుల నుండి కనీసం 2 కిలోలు చికెన్ కూడా విక్రయించడం లేదని బోరబండ చికెన్ వ్యాపారి షేక్ వజీర్ పాషా ఆందోళన వ్యక్తం చేశాడు. దీంతో షాపు కిరాయి, పని వారి జీతాలు కూడా రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి ప్రభుత్వ పరంగా ప్రజల్లో అవగాహన కల్పించాలని చికెన్ సెంటర్ వ్యాపారి వజీర్ పాషా కోరుతున్నాడు. చికెన్ వ్యాపారులను ఆదుకోవాలని కోరుతున్నాడు.

స్వచ్ఛంద సంస్థలకు చేయూతనివ్వాలి



ఈటల రాజేందర్‌ను కలిసి సమస్యలు వివరిస్తున్న నాయకులు

లిబర్టీ: సమాజ హితం కోసం పని చేస్తున్న స్వచ్ఛంద సంస్థలకు బాసటగా నిలవాలని లోక్‌సభ సభ్యులు ఈటల రాజేందర్‌కు ఆదిలీలా ఫౌండేషన్ విజ్ఞప్తి చేసింది. ఫౌండేషన్ జాతీయ అధ్యక్షులు డాక్టర్ ఎస్.ఆదినారాయణ సారధ్యంలోని ప్రతినిధి బృందం ఈటలను కలిసి వినతిపత్రం సమర్పించి పలు సమస్యలను విన్నవించారు. సామాజిక సేవ చేస్తూ పేదరిక నిర్మూలనకు పాటుపడుతున్న సంస్థలకు కేంద్ర ప్రభుత్వం అండగా నిలిచేలా చేయూతనివ్వాలని విన్నవించారు. పేదల కోసం కార్యక్రమాలు నిర్వహిస్తున్న సంస్థలకు అండగా ఉంటామని ఈ సందర్భంగా ఈటల భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో మాతృదేవోభవ సంస్థ జాతీయ అధ్యక్షులు కే.బి.శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ఎక్కడి సమస్యలు అక్కడే..

- జ్ఞానీజైల్‌సింగ్‌నగర్ బస్తీలో స్థానికుల ఇబ్బందులు



జ్ఞానీజైల్‌సింగ్‌నగర్‌లో అధ్వానంగా రోడ్డు..



ఫిలింనగర్: జూబ్లీహిల్స్ డివిజన పిలింనగర్‌లోని జ్ఞానీజైల్‌సింగ్‌నగర్ బస్తీలో అభివృద్ధి పనులు ముందుకుసాగడం లేదు. ఎక్కడ వేసినా గొంగడి అక్కడే వేసిన చందంగా బస్తీలో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. రెండు వీధుల్లో కొత్తగా రోడ్డు వేయాల్సి ఉంది. మంచినీటి కనెక్షన్లు కూడా ఇంకా కొన్ని ఇళ్లకు అందుబాటులో లేవు. డ్రైనేజీ సమస్య తీవ్రంగానే ఉంది. పలుమార్లు స్థానికులు ఈ సమస్యను ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకువెళ్లారు. అయితే పట్టించుకునే నాథుడే లేకపోవడంతో నిధులు మంజూరుకాక పనులు నిలిచిపోయాయి. ఎన్నికలు వచ్చినప్పుడు తమను గెలిపించాలని, సమస్యలు పరిష్కరిస్తామని నేతలు వాగ్దానాలు చేస్తూ స్థానికుల ఓట్లతో గెలిచిన తర్వాత ముఖం చాటేస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రజాప్రతినిధులే పట్టించుకోకపోవడంతో జీహెచ్ఎంసీ అధికారులు ఇటువైపు తొంగి చూడడం లేదు. బస్తీలో కమ్యూనిటీహాల్ నిర్మించాలని స్థానికులు ఎన్నో ఏళ్లుగా పోరాడుతున్నారు. ఇప్పటికీ గెలిచిన ఎమ్మెల్యేలకు కమ్యూనిటీహాల్ నిర్మాణంతో పాటు స్థానిక సమస్యలు పట్టడం లేదు. గత 15 సంవత్సరాలుగా బస్తీలో ఇదే సమస్య నెలకొంది. పాలకులు ఇప్పటికైనా తమ సమస్యలను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

నేపాల్ ప్రజాప్రతినిధులకు 10 రోజుల శిక్షణ



శిక్షణకు వచ్చిన నేపాల్ ప్రజాప్రతినిధులు

ఏజీవర్సిటీ: నేపాల్ ప్రజాప్రతినిధులు, మేయర్లు, మున్సిపాలిటీ చైర్మన్లకు పట్టణ, గ్రామీణ పాలనపై అవగాహన కల్పించేందుకు రాజేంద్రనగర్‌లోని జాతీయ గ్రామీణాభివృద్ధి పంచాయతిరాజ్‌లో (ఎన్‌ఐఆర్‌డీపీఆర్)లో 10 రోజుల శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. విదేశాంగ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ఆ శాఖ అదనపు కార్యదర్శి ముసు మహానార్ మాట్లాడుతూ భారతదేశం, నేపాల్ మధ్య బలమైన సంబంధాలు ఉన్నాయని అన్నారు. మానవ వనరుల అభివృద్ధి, వ్యవసాయం, ఉద్యానవనాలపై నేపాల్ ప్రజాప్రతినిధులు దృష్టి సారించాలని సూచించారు. ప్రపంచీకరణ, ఉద్యానవనాల పెంపకం, మురుగునీటి వ్యవస్థ, పట్టణ వ్యర్థాల నిర్వహణ, పర్యావరణం, పర్యాటకం, ఇతర అంశాల గురించి వివరించనున్నారు. అనంతరం నేపాల్ ప్రజాప్రతినిధులు మహారాష్ట్ర, తమిళనాడు, హైదరాబాద్‌లోని పలు ప్రాంతాలను సందర్శించనున్నారు. కార్యక్రమంలో ఎన్‌ఐఆర్‌డీపీఆర్ డైరెక్టర్ జనరల్ నరేంద్ర కుమార్, రిజిస్ట్రార్ మనోజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రక్షణ రంగ కెరియర్‌కు ఎస్‌ఎస్‌డీపీ ఉపయుక్తం

– బీటెక్, ఎంబీఏ విద్యార్థులకు అవకాశం

రాయదుర్గం: రక్షణ రంగం సాంకేతికతలో కెరియర్, స్టార్టప్ అవకాశాలను అన్వేషించేవారి కోసం టీ హబ్ ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఈ మేరకు బీటెక్ మూడు, నాల్గవ సంవత్సరం, ఎంబీఏ విద్యార్థుల కోసం స్పెషల్ స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్(ఎస్‌ఎస్‌డీపీ)ను రూపొందించింది. 60 రోజులపాటు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. స్టార్టప్‌ల సహకారంతో ప్రత్యక్ష రక్షణ ప్రాజెక్టులతో హ్యాండ్‌-ఆన్ అనుభవం, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, మెషీన్ లెర్నింగ్, సైబర్ సెక్యూరిటీ, డ్రోన్‌లు, క్వాంటం కంప్యూటింగ్ వంటి మరిన్ని అంశాలపై పని చేయడానికి ఈ అవకాశం కల్పిస్తారు. కార్యక్రమంలో భాగంగా ఐడియాథాన్, హ్యాకథాన్ వంటి వాటికి అనుసంధానం చేసే వినూత్న సవాళ్లను పరిష్కరించడంపై దృష్టి పెడతారు. ఈ కార్యక్రమాన్ని పూర్తి చేసినవారికి టీహబ్ సర్టిఫికెట్లు అందిస్తుంది.

వైభవంగా రాజగోపుర ప్రతిష్ఠ మహోత్సవం



పూజల్లో చినజీయర్ స్వామి, ఆలయ కమిటీ సభ్యులు

అల్వాల్: ఓల్డ్ అల్వాల్‌లోని శ్రీసీతారామచంద్ర స్వామి దేవస్థానం రాజగోపుర ప్రతిష్ఠ మహోత్సవం బుధవారం వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని శ్రీశ్రీశ్రీ త్రిదండి రామానుజ చినజీయర్ స్వామి ప్రారంభించారు. అనంతరం ప్రాణప్రతిష్ఠ కుంభప్రోక్షణం, అనుగ్రహభాషణం గావించారు. అనంతరం మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో రిత్విీకులు, ట్రస్ట్ సభ్యులు పరంధామ రంగారావు, సీతారామారావు, తిరుపతిరావు, నాగన్న, రవీంద్రరావు, గోపీకృష్ణ, చలపతిరావు తదితరులు పాల్గొన్నారు.

28న కన్హా శాంతివనంలో 'స్టార్టప్ ఫోరం' ప్రోగ్రాం

రాయదుర్గం: హైదరాబాద్ నాలెడ్జి సిటీలోని 'టీ హబ్', హార్ట్‌ఫుల్ నెస్ ఇన్‌స్టిట్యూట్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 28న కన్హా శాంతివనంలో 'స్టార్టప్ ఫోరం-2025' కార్యక్రమం నిర్వహించాలని నిర్ణయించారు. స్టార్టప్ వ్యవస్థాపకులు ఎదుర్కొనే ప్రత్యేకమైన సవాళ్లను పరిష్కరించడానికి ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. స్టార్టప్ పర్యావరణ వ్యవస్థ, నెట్ వర్క్‌లోని ప్రతినిధులకు ఇది సరైన వేదిక అవుతుందని రెండు సంస్థలు భావిస్తున్నాయి. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఐటీ శాఖ ముఖ్య కార్యదర్శి జయేష్‌రంజన్, ఐ ల్యాబ్స్ గ్రూప్ చైర్మన్ శ్రీనివాసరాజు చింతలపాటి, టీ హబ్ మాజీ సీఈఓ శ్రీనివాసరావు మహంకాళి, హార్ట్‌ఫుల్ నెస్ ఇన్‌స్టిట్యూట్ వ్యవస్థాపకుడు కమలేష్ డి.పటేల్, డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్ మేనేజింగ్ డైరెక్టర్ జీవీ ప్రసాద్‌రెడ్డి, రెడ్‌బస్ వ్యవస్థాపకుడు ఫణీంద్ర సామా, ఐ ల్యాబ్స్ గ్రూప్ ఇన్వెస్ట్‌మెంట్ సలహాదారు వైష్ణవిరాజు, క్యాన్సల్డ్ ప్లాన్స్ వ్యవస్థాపకులు మల్లికారెడ్డి, ఇన్‌కం ట్యాక్స్ సీఈఓ, వ్యవస్థాపకులు లక్ష్మీ పర్చూరి, కిరాణా ప్రో కో ఫౌండర్ దీపక్ రవీంద్రన్, ది వే ఫేరర్స్ సహ వ్యవస్థాపకులు నేహా ఖనిత్కర్, డీప్ హోలిస్టిక్స్ వ్యవస్థాపకులు సనత్‌కుమార్ ప్రసంగిస్తారు.

శివాలయంలో నేపాలీయుల సందడి



రహమత్‌నగర్: మహా శివరాత్రి సందర్భంగా ఎస్ఎస్‌బీనగర్ గోరఖ్‌నాథ్ శివాలయంలో నేపాలీయులు సందడి చేశారు. నగర నలుమూలలు నుంచి నేపాలీయులు ఆలయానికి చేరుకొని శివుడికి అభిషేకాలు, అర్చన నిర్వహించి భజనలు చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు రతన్ ఛాత్రి భక్తులు ఇబ్బందులు పడకుండా సౌకర్యాలు కల్పించారు.

సర్దుబాటుపై తర్జనభర్జన

- రోజువారీగా అందుతున్న నీరు 580.26 ఎంజీడీలు
- నేటి నుంచి ట్రాన్స్‌మిషన్ కన్వర్జెన్స్ సమావేశాలు
- వేసవిలో నీటిఎద్దడిపై దృష్టి సారించిన జలమండలి

నగరంలో పదేళ్ల నాటి కేటాయింపులతోనే నీటి సరఫరా

సాక్షి,సిటీబ్యూరో: నలుదిక్కులా విస్తరిస్తున్న మహా హైదరాబాద్ అవసరాలకు అనుగుణంగా తాగునీరు అందించడం జలమండలికి సవాల్‌గా మారింది. వేసవిలో పరిస్థితి మరింత సంక్లిష్టంగా మారుతోంది. ఈ నేపథ్యంలో తాగునీటి విషయమై సర్దుబాటు బాట పట్టింది. ప్రస్తుతం నగర జనాభా కోటిన్నర దాటినా పదేళ్ల క్రితం నాటి అవసరాలకు తగ్గ నీటి సరఫరానే ఇంకా కొనసాగుతోంది. ఇప్పుడు సరఫరా చేస్తున్న నీటి కంటే ఒక్క మిలియన్ లీటర్ పర్ డే(ఎంఎల్‌డీ) నీటిని కూడా అధికంగా సరఫరా చేసే పరిస్థితి కనిపించడం లేదు. వేసవి ఆరంభంలోనే భూగర్భజలాలు పడిపోతుండటంతో తాగునీటితోపాటు ఇతర అవసరాలకు సైతం డిమాండ్ పెరిగింది. తాగునీటి సరఫరా పథకాల వారీగా సర్వీస్ ఏరియాలో నీటి సరఫరాను నిర్ధారించేందుకు ట్రాన్స్‌మిషన్ విభాగాలతో కన్వర్జెన్స్ సమావేశాలకు సిద్ధమైంది. ఈ నెల 27న కృష్ణా తాగునీరు, 28న గోదావరి తాగునీరు, మార్చి 1న సింగూర్‌- మంజీరా నీరు, 3న ఉస్మాన్‌సాగర్‌- హిమాయత్‌సాగర్ నీటి సరఫరాపై డైరెక్టర్(టెక్నికల్) ఆధ్వర్యంలో సమావేశాలు జరగనున్నాయి. ఏరియా వారీగా నీటి కేటాయింపు, సర్దుబాటు, పంపిణీపై అధికారులు చర్చించి నిర్ణయాలు తీసుకోనున్నట్లు తెలుస్తోంది.

అత్యధికంగా కృష్ణా జలాలు

మహానగరానికి ఐదు ప్రధాన జలాశయాల నుంచి 580.26 ఎంజీడీల తాగునీరు సరఫరా అవుతోంది.



ప్రధానంగా కోర్‌సిటీ పరిధిలోని చార్మినార్, యాకుత్‌పురా, బహదూర్‌పురా, మలక్‌పేట, నాంపల్లి, ఖైరతాబాద్, గోషామహల్, జూబ్లీహిల్స్, అంబర్‌పేట, సనత్‌నగర్, సికింద్రాబాద్, కూకట్‌పల్లి, కంటోన్మెంట్, చాంద్రాయణగుట్ట నియోజకవర్గాలకు అత్యధికంగా కృష్ణా నీటి సరఫరా పథకం అందుతుండగా, గోదావరి, సింగూర్, మంజీరా, ఉస్మాన్‌సాగర్, హిమాయత్ సాగర్ నుంచి సుమారు 235.35 ఎంజీడీల నీరు సరఫరా చేస్తున్నారు. కూకట్‌పల్లి ఎల్బీనగర్, కుత్బుల్లాపూర్, ఉప్పల్, మల్కాజిగిరి, పటాన్‌చెరు, రాజేంద్రనగర్, శేరిలింగంపల్లి నియోజక వర్గాలకు 211.22 ఎంజీడీ, ఓఆర్‌ఆర్ పరిధిలోకి కొంత భాగం వచ్చే శేరిలింగంపల్లి, రాజేంద్రనగర్ , ఉప్పల్, ఎల్బీనగర్, ఇబ్రాహీంపట్నం, మల్కాజిగిరి, కుత్బుల్లాపూర్ నియోజక వర్గాలకు 58.89 ఎంజీడీల నీరు సరఫరా అవుతోంది.

జలాశయాల నుంచి ఇలా..	
పథకం	ఎంజీడీ
కృష్ణా తాగునీటి పథకం	
ఫేజ్‌-1	90.54
ఫేజ్‌-2	92.59
ఫేజ్‌-3	92.62
గోదావరి తాగునీటి పథకం	
రింగ్ మెయిన్ -1	75.87
రింగ్ మెయిన్‌-2	47.08
రింగ్ మెయిన్ -3	8.90
ఆర్‌డబ్ల్యూఎస్	31
జంట జలాశయాలు	
ఉస్మాన్‌సాగర్	22.95
హుస్సేన్ సాగర్	9.56
సింగూర్‌-మంజీరా	109.15
రోజువారీగా నీటి సరఫరా ఇలా..	
ప్రాంతం	ఎంఎల్‌డీ
కోర్‌సిటీ	1,069.90
జీహెచ్‌ఎంసీ పరిధి	960.21
ఓఆర్‌ఆర్	267.71
ట్రాన్స్‌మిషన్	199.11
భగీరథ (ఆర్‌డబ్ల్యూఎస్)	14.33

మిషన్ భగీరథ నీరు కూడా...

జలమండలి శ్రీపాద ఎల్లంపల్లి జలాశయం నుంచి తరలిస్తున్న గోదావరి జలాల్లో సుమారు 31 ఎంజీడీలను గ్రామీణ నీటి సరఫరా పథకం(ఆర్‌డబ్ల్యూఎస్) మిషన్ భగీరథ కింద ద్వారా సరఫరా చేస్తోంది. వేసవి అవసరాల కోసం అందులోని సగం నీటిని నగర అవసరాల కోసం మళ్లించాలని యోచిస్తోంది.

వడ్లకొండ కృష్ణ హంతకులను శిక్షించాలి: చెన్నయ్య



రౌండ్‌టేబుల్ సమావేశంలో అభివాదం చేస్తున్న చెన్నయ్య, బాధితురాలు భార్గవి తదితరులు

సుందరయ్య విజ్ఞానకేంద్రం: వడ్లకొండ కృష్ణ అలియాస్ మాల బంటి కుల దురహంకార హత్యపై ప్రభుత్వం వెంటనే సమగ్ర విచారణ చేపట్టి హంతకులను కఠినంగా శిక్షించాలని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు చెన్నయ్య డిమాండ్ చేశారు. బుధవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన దళిత, బహుజన, మహిళా, విద్యార్థి సంఘాల రౌండ్‌టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. బంటి కుటుంబానికి న్యాయం జరిగే వరకు పెద్దఎత్తున పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. కృష్ణ భార్య భార్గవి మాట్లాడుతూ ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ఏర్పాటు చేసి నేరస్తులకు జీవితఖైదు విధించాలని డిమాండ్ చేశారు. 'ఈ ఘటనపై సీఎం రేవంత్‌రెడ్డి ఎందుకు స్పందించడంలేదు. నేను కూడా ఆయన బిడ్డ లెక్కనే కదా' అని కన్నీటి పర్యంతమయ్యారు. కులాంతర వివాహం చేసుకున్నవారికి రక్షణ చట్టం తేవాలని కోరారు. కేఎన్‌పీఎస్ ప్రధాన కార్యదర్శి బూరం అభినవ్ మాట్లాడుతూ భార్గవికి ప్రభుత్వం ఉద్యోగం ఇవ్వాలని, ఈ ఘటనలో నిర్లక్ష్యం వహించిన పోలీసు అధికారులపై చర్యలు తీసుకోవాలని సమావేశంలో తీర్మానించారు. ఈ కార్యక్రమంలో వడ్లకొండ కృష్ణ తండ్రి డేవిడ్, కేవీపీఎస్ ప్రధాన కార్యదర్శి టి.స్కైలాబ్ బాబు, వివిధ సంఘాల నాయకులు నల్లా రాధాకృష్ణ, ఏసు రత్నం, బత్తుల రాంప్రసాద్, స్వరూప, ఎండీ వాహిద్, డీఎల్ కృష్ణచంద్ తదితరులు పాల్గొని ప్రసంగించారు.

వీర సావర్కర్ చరిత్ర స్ఫూర్తిదాయకం

– కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

కాచిగూడ: ప్రతి ఒక్కరూ దేశభక్తి, జాతీయ భావాలు కలిగి ఉండాలని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. బుధవారం వినాయక్ దామోదర్ వీర్ సావర్కర్ వర్ధంతి సందర్భంగా కాచిగూడ చౌరస్తాలోని ఆయన విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సావర్కర్ జీవిత చరిత్ర అందరికీ స్ఫూర్తిదాయకమని అన్నారు. స్వాతంత్ర్య ఉద్యమకాలంలో సావర్కర్‌కు ఆంగ్లేయులు అతి భయంకరమైన అండమాన్ జైలు శిక్ష విధించారని, అయినా ఏమాత్రం వెరవకుండా పోరాడిన మహనీయుడని అన్నారు. కార్యక్రమంలో కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్ యాదవ్, బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతంరావు, నేతలు చిట్టబోయిన నంద కిషోర్ యాదవ్, రమేష్ మంజునాథ్, బల్వీర్, శేర్‌సాగర్ తదితరులు పాల్గొన్నారు.



సావర్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న కిషన్‌రెడ్డి

భగ్గుమన్న పండ్ల ధరలు

- బాటసింగారం మార్కెట్‌లో రికార్డు స్థాయి పూలు, పండ్ల విక్రయాలు
- 40 టన్నుల పూలు, 27 వందల టన్నుల పండ్ల దిగుమతి

సాక్షి సిటీబ్యూరో: బాటసింగారం మార్కెట్‌కు శివరాత్రి శోభ వచ్చేసింది. మామూలు రోజుల కంటే శివరాత్రి పర్వదినం పురస్కరించుకొని బుధవారం వివిధ రకాల పండ్లు రెండింతలు దిగుమతి అయ్యాయి. అయితే హోల్‌సేల్‌లో పండ్ల ధరలు యథాతథంగా ఉన్నా రిటైల్‌లో మాత్రం భగ్గుమన్నాయి. పండగ రోజు పెద్ద ఎత్తున భక్తులు ఉపవాసాలు పాటించి ఎక్కువగా పండ్లు ఆరగిస్తారు. మిగతా రోజుల్లో దాదాపు 1,300 టన్నుల పండ్లు వస్తుండగా, శివరాత్రి పండుగ సందర్భంగా 2,700 టన్నులు దిగుమతి అయ్యాయని వ్యాపారులు పేర్కొన్నారు. 40 టన్నుల మేర వివిధ రకాల పూలు మార్కెట్‌కు వచ్చాయి. గ్రేటర్ పరిధిలో శివరాత్రి రోజు దాదాపు 2,500 టన్నుల పండ్ల విక్రయాలు జరుగుతాయని మార్కెట్ అధికారుల అంచనా. మరోవైపు ఎండలు తీవ్రమవడంతో పుచ్చకాయ, సంత్ర, మోసంబి, ద్రాక్షతోపాటు దానిమ్మ పండ్ల దిగుమతి పెరిగిందని కార్యదర్శి ఎల్.శ్రీనివాస్ చెప్పారు.

హోల్‌సేల్ ధరలు యథాతథం

ఈ ఏడాది రాష్ట్రంతోపాటు ఇతర రాష్ట్రాల నుంచి నగరానికి సరిపడా పండ్లు దిగుమతి అవడంతో రెట్లు ఎక్కువగా పెరగలేదు. శివరాత్రి సందర్భంగా రెండింతల పండ్లు దిగుమతి అయ్యాయి. అయినా గత ఏడాదినాటి హోల్‌సేల్ ధరలే ఇప్పుడు ఉన్నాయని మార్కెట్ అధికారులు చెబుతున్నారు. పుచ్చకాయ, మోసంబి, సంత్రా గత ఏడాది కంటే ఎక్కువగా దిగుమతి అవుతున్నాయి. దీంతో గత ఏడాది కంటే పండ్ల ధరలు కాస్త తక్కువగానే ఉన్నాయని అధికారులు చెప్పారు. అయితే బహిరంగ మార్కెట్‌లో మాత్రం భగ్గుమన్నాయి. ముఖ్యంగా శివరాత్రి నాటి ఉపవాసాలను ఆసరాగా చేసుకొని రిటైల్ వ్యాపారులు బహిరంగ మార్కెట్‌లో పండ్ల ధరలను రెండింతలు పెంచి విక్రయించారు. దీంతో గత్యంతరం లేక ఎక్కువ డబ్బులు చెల్లించి కొనాల్సి వచ్చిందని వినియోగదారులు అంటున్నారు. గతేడాది కంటే ఈసారి పండ్లపై రూ.10–రూ. 20 వరకు పెంచారు.



బసవతారకం ఆస్పత్రికి రూ.10 కోట్ల విరాళం

బంజారాహిల్స్: బసవతారకం కేన్సర్ ఆస్పత్రిలో అత్యాధునిక పరిశోధనా కేంద్రం కోసం అమెరికాకు చెందిన డాక్టర్ రాఘవేంద్ర ప్రసాద్, కల్యాణి దంపతులు రూ.10 కోట్ల విరాళం ప్రకటించారు. బుధవారం ఆస్పత్రిలో జరిగిన కార్యక్రమంలో ఈ మేరకు వారు రూ. 5 కోట్ల చెక్కును తొలి విడతగా ఆస్పత్రి ట్రస్ట్‌కు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ విరాళం ద్వారా కేన్సర్‌పై పరిశోధనలకు పెద్దపీట వేయాలని, పేదలకు మేలు జరిగే విధంగా వైద్యం చేయాలని కోరారు. ఆస్పత్రి సీఈవో డాక్టర్ కె.కృష్ణయ్య మాట్లాడుతూ పరిశోధనా విభాగంలో అత్యాధునిక సాంకేతికతతో కూడిన పరికరాల కొనుగోలు, పరిశోధనల నిర్వహణ, సిబ్బంది నియామకానికి ఈ విరాళం వినియోగిస్తామని అన్నారు. ఈ పరిశోధనా కేంద్రానికి దాతల పేరు పెడతామని తెలిపారు.



దాతలను సత్కరిస్తున్న ఆస్పత్రి యాజమాన్యం

సాంకేతిక లోపం.. ప్రయాగ్‌రాజ్ విమానం ఆలస్యం



ఎయిర్‌పోర్టులో ఎయిర్‌లైన్స్ అధికారులతో ప్రయాణికుల వాగ్వాదం

శంషాబాద్: ప్రయాగ్ రాజ్ వెళ్లాల్సిన విమానం ఆలస్యం కావడంతో ప్రయాణికులు ఆందోళనకు దిగారు. శంషాబాద్ విమానాశ్రయం నుంచి బుధవారం ఉదయం 10.05 గంటలకు ప్రయాగ్‌రాజ్ విమానాశ్రయానికి వెళ్లాల్సిన స్పైస్‌జెట్ 773 విమానంలో సాంకేతిక సమస్య తలెత్తడంతో దానిని నిలిపివేశారు. ఆ తర్వాత రెండు గంటల వరకు కూడా ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై ఎయిర్‌లైన్స్ అధికారులు సరైన సమాధానం చెప్పకపోవడంతో ప్రయాణికులు ఆందోళనకు దిగారు. కుంభమేళా ఆఖరిరోజు కావడంతో రూ.40 వేలకు పైచిలుకు టికెట్ ధర చెల్లించి ప్రయాగ్‌రాజ్‌కు ప్రయాణిస్తుంటే అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం సాంకేతిక సమస్యను నిపుణులు సరిచేయడంతో మధ్యాహ్నం 1.55 గంటలకు విమానం శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి టేకాఫ్ తీసుకుని సాయంత్రం 4 గంటలకు ప్రయాగ్‌రాజ్ చేరుకుందని ఎయిర్‌పోర్టు వర్గాలు వెల్లడించాయి.

నేడు, రేపు హెచ్‌సీయూలో అంతర్జాతీయ సదస్సు

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో స్కూల్ ఆఫ్ హ్యూమానిటీస్, తెలుగు విభాగం సంయుక్త ఆధ్వర్యంలో రెండు రోజుల అంతర్జాతీయ సదస్సు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. గురు, శుక్రవారాల్లో హెచ్‌సీయూ క్యాంపస్‌లోని జాకీర్ హుస్సేన్ లెక్చర్ హాల్ కాంప్లెక్స్‌లో ఈ సదస్సు నిర్వహిస్తారు. ముఖ్య అతిథిగా హెచ్‌సీయూ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ బీజేరావు, ముఖ్య వక్తగా తెలుగు యూనివర్సిటీ మాజీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ ఎ.భూమయ్య, అతిథిగా తెలుగు యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ వెలుదండ నిత్యానందారావు, స్కూల్ ఆఫ్ హ్యూమానిటీస్ డీన్ ప్రొ. ఎం.టి.అన్సారి, హెచ్‌సీయూ ఐఓఈ డైరెక్టర్ ప్రొ. ఎం ఘనశ్యామ్ కృష్ణ, ప్రముఖ జర్నలిస్ట్ డాక్టర్ కె.శ్రీనివాస్, పెన్సిల్వేనియా వర్సిటీ ప్రొ. అఫ్సర్, తెలుగు విభాగం హెడ్ ప్రొ. పిల్లలమర్రి రాములు, ప్రొ.దార్ల వెంకటేశ్వరరావు, డి.విజయలక్ష్మీ ప్రసంగిస్తారు.

నలువైపులా.. ఐటీ విస్తరణ

- తూర్పు దిశలో పారిశ్రామిక అభివృద్ధి లక్ష్యంగా సర్కారు ఫోకస్
- నగర శివారుల్లో సమాంతర అభివృద్ధిపై కార్యాచరణ ప్రణాళిక
- భూముల గుర్తింపు కోసం అధికారుల కసరత్తు



సాక్షి, సిటీబ్యూరో: నగర శివారుల్లో పారిశ్రామిక రంగ అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. కొత్త పరిశ్రమలతో వందలాది మంది నిరుద్యోగులకు ప్రత్యక్షంగా, వేలాది కుటుంబాలకు పరోక్షంగా ఉపాధి అవకాశాలను కల్పించటమే లక్ష్యంగా కార్యాచరణ రూపొందిస్తోంది. హైదరాబాద్‌-వరంగల్ పారిశ్రామిక కారిడార్‌తోపాటు హైదరాబాద్ మహానగరం నలువైపులా పారిశ్రామిక పార్కుల విస్తరణపై కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోంది. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఐటీ శాఖ మంత్రి కావటంతో మేడ్చల్‌-మల్కాజిగిరి జిల్లాపై ప్రత్యేక ఫోకస్ పెడుతున్నట్లు తెలుస్తోంది. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఉప్పల్ జెన్ ప్యాక్ వద్ద 20 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఐటీ పార్కు, నగరానికి ఉత్తరాన కండ్లకోయలో గేట్‌వే ఐటీ పార్కుకు శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే. వీటిని వేగవంతం చేయటంతోపాటు నగరానికి తూర్పు దిశలో ఉన్న ఘట్కేసర్ మండలం మాదారంలో ఇండస్ట్రియల్ పార్కు స్థాపనకు కాంగ్రెస్ సర్కారు చర్యలు తీసుకుంటోంది. ఇదే మండలంలోని పోచారంలో దాదాపు 450 ఎకరాల విస్తీర్ణంలో కొనసాగుతున్న ఇన్ఫోసిస్‌ను మరో రూ.750 కోట్ల పెట్టుబడులతో మరింత విస్తరింపజేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దావోస్ పర్యటనలో భాగంగా తెలంగాణ ప్రభుత్వం ఇన్ఫోసిస్ విస్తరణపై ఇటీవల వారితో ఒప్పందం కుదుర్చుకుంది. ఇప్పటికే పోచారంలో ఇన్ఫోసిస్ వేలాది మంది యువతకు ఉద్యోగ అవకాశాలను కల్పిస్తోంది. మరింత విస్తరింపజేయటం ద్వారా త్వరలో కొత్తగా వందలాది మంది యువతకు ఉద్యోగ అవకాశాలు లభించే అవకాశముంది. నరానికి తూర్పు వైపు ఐటీ విస్తరణలో భాగంగా ప్రభుత్వ భూముల వివరాల సేకరణకు అధికార యంత్రాంగం కసరత్తు చేస్తోంది.

ప్రపంచ స్థాయి ప్రమాణాలతో...

పారిశ్రామిక పార్కుల ఏర్పాటు కోసం జాతీయ రహదారులకు ఇరువైపులా ఉన్న ప్రభుత్వ భూములను గుర్తించటంతోపాటు ప్రపంచ స్థాయి ప్రమాణాలతో మౌలిక సదుపాయాలు, రోడ్లు, రైల్వే సౌకర్యం, నీటి సరఫరా, స్థానికులకు ఉద్యోగ అవకాశాలు వంటి అంశాలను పరిగణనలోకి తీసుకోవాలని ప్రభుత్వం అధికార యంత్రాంగాన్ని ఆదేశించింది. కొండలు, గుట్టలు, అటవీ భూములు కాకుండా ఇతర భూములను ఎంపిక చేయాలని సూచించింది. ప్రభుత్వ భూములు అందుబాటులో లేకుంటే ప్రైవేట్ భూములను కూడా గుర్తించాలని, వాటి బహిరంగ మార్కెట్ ధరలు, ప్రభుత్వ ధరలను తెలపాలని పేర్కొంది. స్థానికంగా ఉన్న వనరుల వివరాలతోపాటు ఏఏ పరిశ్రమలకు భూములు, ప్రాంతాలు అనువుగా ఉంటాయన్న విషయాలతో అధికారులు నివేదికను సిద్ధం చేస్తున్నారు. భూములను గుర్తించిన తర్వాత ఆయా ప్రాంత చిత్రాలు (లొకేషన్ మ్యాప్‌లు) తయారు చేసి రాష్ట్ర పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ(టీఎస్‌ఐఐసీ)కి పంపించాలని నిర్దేశించటంతో అందుకు అనుగుణంగా కార్యాచరణకు వ్యూహ రచన చేస్తోంది. ఈ నేపథ్యంలోనే మేడ్చల్‌-మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల్లో ప్రభుత్వ భూముల సమగ్ర సర్వేలో రెవెన్యూ యంత్రాంగం తలమునకలైనట్లు తెలుస్తోంది.



సానుకూల చర్యలతో పారిశ్రామిక ప్రగతి

తెలంగాణ ప్రభుత్వం తీసుకుంటున్న పలు సానుకూల చర్యలతో పారిశ్రామిక ప్రగతి సాధ్యమవుతుందని మేడ్చల్ జిల్లా పరిశ్రమల శాఖ వర్గాలు పేర్కొంటున్నాయి. మేడ్చల్ జిల్లాలో 2024 ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకు అంటే.. తొమ్మిది నెలల కాలంలో రూ.380 కోట్ల పెట్టుబడులతో పారిశ్రామిక వేత్తలు 130 కొత్త పరిశ్రమలను ఏర్పాటు చేశారు. 2,700 మందికి ఉద్యోగ అవకాశాలు లభించాయి. జిల్లాలో కొత్తగా 783 భారీ, సూక్ష్మ, మధ్యతరహా పరిశ్రమలను రూ.12,523 కోట్ల పెట్టుబడులతో ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. ఈ కొత్త పరిశ్రమల ఏర్పాటుతో మేడ్చల్ జిల్లాలో మరో 46,356 మంది నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు లభించనున్నట్లు అంచనా వేస్తున్నారు. కొత్త పరిశ్రమల ఏర్పాటుతో మేడ్చల్ జిల్లా ఐటీ హబ్‌గా మారనుంది. ప్రస్తుతమున్న పరిశ్రమలకు తోడుగా మేడ్చల్‌లో హాస్పిటల్ అండ్ హెల్త్ ఇండస్ట్రీ, శామీర్‌పేటలో అమ్యూజ్‌మెంట్ అండ్ ఎగ్జిబిషన్ ఇండస్ట్రీ, కీసరలో నాలెడ్జ్ అండ్ సైన్స్ ఇండస్ట్రీ, ఘట్కేసర్‌లో ఐటీ అండ్ ట్రాన్స్‌పోర్టు ఇండస్ట్రీ, గుండ్ల పోచారంలో ఫార్మా అండ్ బల్క్ డ్రగ్స్ ఇండస్ట్రీ రానున్నాయి. మేడ్చల్ జిల్లా ఉప్పల్, మేడ్చల్ నియోజకవర్గాల పరిధిలోని పోచారం, ఘట్కేసర్, ఉప్పల్, శామీర్‌పేట, మేడ్చల్, కీసర, బోడుప్పల్, చెంగిచర్ల తదితర ప్రాంతాల్లో పరిశ్రమల ఏర్పాటు నిమిత్తం భూసేకరణకు టీఎస్‌ఐఐసీ ఏర్పాట్లు చేస్తోంది.

ట్యాక్సీ డ్రైవర్లుగా మార్చి.. వారితోనే విటుల వద్దకు చేర్చి..

- నగరంలో వ్యవస్థీకృతంగా వ్యభిచార దందా
- 18 మంది బంగ్లా యువతీయువకులను పట్టుకున్న సౌత్‌జోన్ టాస్క్‌ఫోర్స్
- నిందితుల్లో మైనర్లు, అక్రమ వలసదారులు సైతం

సాక్షి, సిటీబ్యూరో: బంగ్లాదేశ్ నుంచి యువతులను అక్రమ రవాణా చేసి నగరంలో వ్యవస్థీకృతంగా వ్యభిచారం నిర్వహిస్తున్న ముఠా గుట్టును దక్షిణ మండల టాస్క్‌ఫోర్స్ పోలీసులు రట్టు చేశారు. చాదర్‌ఘాట్, ఖైరతాబాద్‌ల్లో మొత్తం 18 మందిని పట్టుకున్నామని, వీరిలో బంగ్లా దేశీయులతోపాటు పశ్చిమ బెంగాల్, మహారాష్ట్రలకు చెందిన వారూ ఉన్నారని అదనపు డీసీపీ అందె శ్రీనివాసరావు బుధవారం వెల్లడించారు. పశ్చిమ బెంగాల్‌కు చెందిన దళారులు కమరుల్ షేక్, అజరుల్ షేక్‌సహా మరికొందరు ఈ దందాలో సూత్రధారులుగా ఉన్నారు. వీరు బంగ్లాదేశ్‌కు చెందిన మహిళలు, పురుషులను అక్రమ మార్గాల ద్వారా సరిహద్దులు దాటించి హైదరాబాద్, బెంగళూరు వంటి నగరాలకు తీసుకువస్తున్నారు. తొలుత పశ్చిమ బెంగాల్‌కు తీసుకువచ్చి తాత్కాలికంగా ఆశ్రయం కల్పిస్తున్నారు. ఆపై స్థానిక చిరునామాలతో ఐడీ కార్డులు తయారు చేసి యువతులను హైదరాబాద్, బెంగళూరుకు తరలిస్తున్నారు. ఇలా అక్రమంగా వలసవచ్చిన యువకులను బైక్ ట్యాక్సీ డ్రైవర్లుగా మార్చి వారి వాహనాలపైనే యువతులను విటుల వద్దకు పంపిస్తున్నారు. ఒక్కో యువతికి నెలకు రూ.15 వేల నుంచి రూ.20 వేల వరకు చెల్లించి మిగిలిన డబ్బులను కాజేస్తున్నారు. దందాపై సమాచారం అందుకున్న సౌత్‌జోన్ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ ఎస్.రాఘవేంద్ర నేతృత్వంలోని బృందాలు ఏకకాలంలో చాదర్‌ఘాట్, ఖైరతాబాద్‌ల్లో దాడులు చేశాయి. ముగ్గురు మైనర్లుసహా 18 మందిని పట్టుకుని స్థానిక ఠాణాలకు అప్పగించాయి. ఈ నిందితుల్లోని రిటోయ్ ఇస్లాం, రోనీ ఖాన్, జలీల్ సర్దార్, రజత్ మండల్‌లకు నేర చరిత్ర ఉన్నట్లు గుర్తించారు. వీరిపై గతంలో తుకారాంగేట్, ఓయూ, రాజేంద్రనగర్ పోలీసులు స్టేషన్లలో కేసులు ఉన్నాయి.

సాక్షి సిటీ ప్లస్
11
హైదరాబాద్, గురువారం, 27, ఫిబ్రవరి, 2025

నిన్నా మొన్నటి దాకా సినిమాల ప్రభావంతో కుదేలైపోయిన నాటక రంగం.. ఇప్పుడు ఓ వైపు సినిమాలు, మరో వైపు ఓటీటీలు, ఇంకెన్నో డిజిటల్ వినోదాలూ.. విజృంభిస్తున్న ప్రస్తుత తరుణంలో వీటన్నింటినీ తట్టుకుంటూ నగరవాసుల్ని తన ప్రదర్శనల వైపు నడిపిస్తోంది. యువతరాన్ని ఆకట్టుకుంటూ కాలేజీ క్యాంపస్‌లతో పాటు కార్పొరేట్ కంపెనీల ఆడిటోరియమ్స్ దాకా నాటకాలు హల్‌చల్ చేస్తున్నాయి. ఈ సరికొత్త ఉత్సాహానికి కారణం.. ఆధునికులకు నచ్చే యూత్ కలర్స్ రంగరించి.. రంగస్థల ఈవెంట్స్‌ను సిటిజనులకు చేరువ చేయడంలో డ్రామానన్ వంటి సంస్థలు నగరానికి రావడం ఒక కారణంగా చెప్పొచ్చు. - సాక్షి, సిటీబ్యూరో





రంగరంగ వైభవంగా..

నగరంలో థియేటర్ ఆర్ట్‌కి పెరుగుతున్న ఆదరణ

- క్యాంపస్ నుంచి కార్పొరేట్స్ దాకా ప్రతీ 'ప్లేస్'లోనూ..
- మోడ్రన్ థియేటర్ ఆర్ట్‌కి ఊపునిచ్చిన డ్రామానాన్ సంస్థ
- నగరంలో ప్రదర్శనల నుంచి పోటీల దాకా నిర్వహణ
- 1వ తేదీ నుంచి స్కిట్స్ పేరుతో 2 రోజుల పాటు పోటీలు

స్కిట్.. ఫైట్.. షురూ..

థియేటర్ ప్రేమికులు, ఔత్సాహిక నటీనటులను ప్రోత్సహించేందుకు 'స్కిట్స్' అనే 12 నిమిషాల షార్ట్ ప్లే కాంటెస్ట్‌ని డ్రామనాన్ ప్రారంభించింది. ఇందులో నగరానికి చెందిన వివిధ కార్పొరేట్ సంస్థలు, ఔత్సాహిక అనుభవజ్ఞులైన థియేటర్ గ్రూప్స్ పాల్గొంటున్నాయి. ఒక వార్షిక కార్యక్రమంగా మారిన ఈ పోటీల్లో అతుల్ కుమార్, రజిత్ కపూర్, షెర్నాజ్ పటేల్, అభిషేక్ మజుందార్ ప్రకాష్ కోవెలమూడి తదితర రంగస్థల ప్రముఖులు న్యాయనిర్ణేతలుగా వ్యవహరిస్తున్నారు.

1, 2 తేదీల్లో ప్రిలిమినరీ పోటీలు..

ఈ పోటీల్లో ఈ ఏడాది 24 టీమ్స్ పాల్గొంటున్నాయి. స్కిట్స్ కార్యక్రమం నుంచి 'ఉత్తమ నటుడు', 'ఉత్తమ దర్శకుడు', 'ఉత్తమ ప్లే', 'ఉత్తమ ఒరిజినల్ స్క్రిప్ట్', 'ఉత్తమ పోస్టర్', 'ఉత్తమ ప్రచార వీడియో', 'ఆడియన్స్ ఛాయిస్ ప్లే' వంటి పురస్కారాలు అందిస్తున్నారు. మొత్తం ప్రైజ్ మనీ రూ.1,20,000 వరకూ ఉంటుంది. ఈ పోటీలకు సంబంధించి ప్రాథమిక రౌండ్ స్కిట్‌లు 1, 2వ తేదీల్లో గచ్చిబౌలిలోని సుప్రీమ్ ట్రాంపోలిన్ పార్క్ సమీపంలో ఉన్న ఎలైన్డ్ ఎంప్లాయీస్ కాలనీలోని రంగభూమి స్పేసెస్‌లో జరుగుతాయి.



ఈశాన్య రాష్ట్రమైన మణిపాల్‌లో పాతికేళ్ల క్రితం 2000వ సంవత్సరంలో డ్రామనాన్(డ్రామాటిస్ట్ అనామిక) ఏర్పాటైంది. వృత్తి రీత్యా ఆర్కిటెక్ట్ ఆర్‌కే షెనాయ్, దివంగత చందన్ శతపతిలు స్థాపించిన ఈ థియేటర్ గ్రూప్.. పాతిక సంవత్సరాలుగా దేశవ్యాప్తంగా 450కి పైగా ప్రదర్శనలతో 70కి పైగా నాటకాలను విజయవంతంగా ప్రదర్శించింది. అనంతరం అర్బన్ ప్లానర్ అయిన ఆర్‌కే షెనాయ్ మన నగరానికి మకాం మార్చాక 2007లో డ్రామానాన్ హైదరాబాద్ చాప్టర్ ప్రారంభమైంది. అప్పటి నుంచి డ్రామనాన్ నగర థియేటర్ రంగంలో క్రియాశీలక పాత్ర పోషిస్తోంది. 2007లో భారతీయ విద్యాభవన్‌లో విలియం సెగ్రింగ్ రచించిన 'ది ఒరిజినల్ లాస్ట్ విష్ బేబీ'తో ప్రారంభించి, 'ఫూల్స్, ది గుడ్ డాక్టర్, పిజ్జాజ్ అండ్ డబుల్స్, ది లాస్ట్ రిసార్ట్, లవ్, లాస్ట్, 24 రూబుల్స్ లాస్ట్, అదర్ ఫాస్ట్ ఫుడ్స్.. ఇలా అనేక సొంత నాటకాలను సిటీలో ప్రదర్శించింది.

ఆదరణ.. అవార్డ్స్..

19 సంవత్సరాలుగా డ్రామనాన్ దేశవిదేశాలలో వివిధ ఉత్సవాల్లో ప్రదర్శనలు సమర్పించింది. గత 2015లో, బ్రాడ్‌వే ఆన్‌లైన్ మ్యాగజైన్ డ్రామనాన్‌ను దేశంలోని టాప్–20 థియేటర్ గ్రూపులలో ఒకటిగా పేర్కొంది. డ్రామనాన్ హైదరాబాద్ 2012, 2013లో ఐనా థియేటర్ పోటీల్లో, 2013లో షార్ట్ ప్లస్ స్వీట్ థియేటర్ పోటీల్లో గెలుపొంది సిటీ థియేటర్ సత్తా చాటింది. ప్రముఖ నటులు రజిత్ కపూర్ షెర్నాజ్ పటేల్ నటించిన రేజ్ ప్రొడక్షన్స్ 'లవ్ లెటర్స్' వంటి ప్రసిద్ధ నాటకాలను కూడా డ్రామనన్ నిర్మించింది.



డెస్టినేషన్ టర్కీ



భారతీయ పర్యాటకులను ఆకర్షిస్తున్న టర్కీ

సాక్షి, సిటీబ్యూరో: ఇండో–టర్కీ స్నేహపూర్వక భాగస్వామ్యం ఇరుదేశాల సాంస్కృతిక, పర్యాటక, ఆర్థిక సంబంధాలను మరింత పటిష్టం చేయనుందని టర్కీ రిపబ్లిక్ 'సంస్కృతి, పర్యాటక మంత్రిత్వ శాఖ' ప్రమోషన్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ ఓనూర్ గోజెట్ తెలిపారు. నగరంలోని హోటల్ తాజ్‌కృష్ణా వేదికగా టర్కీ రిపబ్లిక్ సంస్కృతి, పర్యాటక మంత్రిత్వ శాఖ, టర్కీ టూరిజం ప్రమోషన్ అండ్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ ఆధ్వర్యంలో 'ఇండియా డెస్టినేషన్ ప్రమోషన్ ఈవెంట్ 2025'ను బుధవారం నిర్వహించింది. ఓనూర్ గోజెట్‌తో మాట్లాడుతూ.. భారత్‌లో ఆరు నగరాల డెస్టినేషన్ ప్రమోషన్ సిరీస్‌లో భాగంగా కోల్‌కతా, చెన్నైతో పాటు హైదరాబాద్‌లోనూ ఈ ప్రచార కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామని, ఇందులో 200లకు పైగా ఇరు దేశాల ప్రతినిధులు, పర్యాటకరంగ ప్రముఖులు పాల్గొని పర్యాటక అభివృద్ధిపై చర్చించామన్నారు. అద్భుత ఆర్థిక అభివృద్ధితో దూసుకుపోతున్న హైదరాబాద్ నగరంతో టర్కీ అనుసంధానం సాంస్కృతిక సమ్మేళనానికి నిదర్శనమని పేర్కొన్నారు. ఈ మధ్య టర్కీ ఫుడ్‌ను నగరవాసులు అమితంగా ఇష్టపడుతున్నారని, అంతేకాకుండా సైట్ సీయింగ్, టర్కీ షాపింగ్ ట్రెండ్‌గా మారిందన్నారు. టర్కీ పర్యాటక ప్రదర్శనలు, ఇంటరాక్టివ్ బీ2బీ నెట్‌వర్కింగ్ సెషన్స్, ట్రావెల్ లక్కీ డ్రా ఏర్పాటు చేశారు.

ఇస్తాంబుల్ నుంచి హైదరాబాద్‌కు విమానాలు..

ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేయడంలో హైదరాబాద్‌లో ఇండో–టర్కీ ఫ్రెండ్‌షిప్ అసోసియేషన్ (ఐటీఎఫ్ఏ) స్థాపన కీలక పాత్ర పోషిస్తుంది. టర్కిష్ ఎయిర్‌లైన్స్ ద్వారా ఇస్తాంబుల్ నుంచి హైదరాబాద్ మధ్య ప్రత్యక్ష విమానాల స్థాపనపై భారత ప్రయాణ ప్రతినిధులు ఆసక్తి చూపించడం శుభపరిణామం. ఇది రెండు ప్రాంతాల మధ్య కనెక్టివిటీని మరింత పెంచుతుంది. రెండు దేశాల మధ్య పర్యాటకం, సాంస్కృతిక మార్పిడి, వ్యాపార అవకాశాలను ప్రోత్సహించడం, దీర్ఘకాల స్నేహాన్ని మరింత బలోపేతం చేయడం ఈ అసోసియేషన్ లక్ష్యం.

– ఓర్హాన్ యల్మాన్ ఓకాన్, టర్కీ రిపబ్లిక్ కాన్సుల్ జనరల్, హైదరాబాద్

రన్ ఫర్ ఎ కాజ్‌లో.. రామ్ మిరియాల ఆవాజ్..

సాక్షి సిటీబ్యూరో: సేవా కార్యక్రమాలకు నిధుల సేకరణ నిమిత్తం నిర్వహించే రన్ ఫర్ ఎ కాజ్ వార్షిక కార్యక్రమం నగరంలో మరోసారి జరుగుతోంది. నెక్లెస్‌రోడ్‌లోని పీపుల్స్ ప్లాజాలో వచ్చే నెల 2వ తేదీన నిర్వహించే ఈ కార్యక్రమంలో భాగంగా 5 కి.మీ పరుగుతో పాటుగా పాల్గొనే వారి కోసం విందు వినోద సందడి కూడా భాగం చేస్తున్నారు. ఈ సందర్భంగా ప్రముఖ గాయకుడు రామ్ మిరియాల సంగీత గాన ప్రదర్శన కూడా నిర్వహిస్తున్నారు. కార్యక్రమం ఉదయం 5.30గంటలకు ప్రారంభం కానుంది.





డెక్కన్ ప్రాజెక్ట్ లైవ్ రేపు

సాక్షి, సిటీబ్యూరో: నగరానికి చెందిన ప్రముఖ మ్యూజిక్ బ్యాండ్ డెక్కన్ ప్రాజెక్ట్.. జూబ్లీహిల్స్‌లో సందడి చేయనుంది. ఫ్రైడే జామ్ సెషన్స్ పేరుతో జూబ్లీహిల్స్‌లోని వాల్ట్ బ్రూవరీలో శుక్రవారం ఈ సంగీత కార్యక్రమం నిర్వహిస్తున్నారు.

క్లాస్‌రూమ్, వర్క్‌ప్లేస్‌ల కోసం.. అత్యాధునిక స్మార్ట్ బోర్డ్..



సాక్షి, సిటీబ్యూరో: షార్ప్ బిజినెస్ సిస్టమ్స్(ఇండియా) పిక్సెల్ ఎడ్జ్- ఇంటరాక్టివ్ స్మార్ట్ బోర్డ్‌ను సిటీలో పరిచయం చేసింది. నగరంలో నిర్వహించిన 'షార్ప్ కనెక్ట్ జోన్' రోడ్‌షోలో ఈ అత్యాధునిక ఉత్పత్తిని ఆవిష్కరించింది. ఈ స్మార్ట్ బోర్డ్ ద్వారా తరగతి గదుల్లో బోధన మరింత సులభంగా, అర్థవంతంగా మారుతుంది.. అలాగే వర్క్‌ప్లేస్‌లలోనూ వీటి వినియోగం ఉపయుక్తంగా ఉంటుందని ఈ సందర్భంగా షార్ప్ బిజినెస్ సొల్యూషన్స్ ప్రెసిడెంట్ సుఖదేవ్ సింగ్ మీడియాకు తెలిపారు.

మహా కుంభ్‌లో.. మన నగరం

హరహర మహాదేవ అంటూ హర్షధ్వనులతో గొంతెత్తిన కోట్లాది భక్తజనంలో మన భాగ్యనగరవాసులూ ఉన్నారు. గంగమ్మ తల్లీ.. మమ్మల్ని చల్లంగా చూడమ్మా అంటూ పుణ్యస్నానాలు ఆచరించిన జన సంద్రంలో భాగమై నగరమూ తడిసి ముద్దయి మురిసింది. తండోపతండాలుగా.. నగరం నుంచి కుంభ్‌కు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివెళ్లారు. ప్రయాగ్ రాజ్, కాశీ, అయోధ్యతో కూడిన ఆధ్యాత్మిక యాత్రను ప్రణాళికాబద్ధంగా డిజైన్ చేసుకుని కుటుంబ సమేతంగా వెళ్లి వచ్చారు. చాలా మంది వ్యక్తిగత వాహనాలు ఎంచుకోగా, ప్రయాణాల కారణంగా రైళ్లు, బస్సులతో పాటు విమానాల్లో సైతం టిక్కెట్లు దొరకని పరిస్థితి ఏర్పడింది. ఇక విమాన యానం ధరలు ఆకాశాన్ని తాకాయి. చివరి రోజైన బుధవారం విమానం టిక్కెట్ ధర రూ.40వేలకు పైగానే ఉండటం రద్దీకి నిదర్శనం. - సాక్షి, సిటీబ్యూరో



టాలీవుడ్ తెరవేల్పులు ఎందరో మన నగరం నుంచీ కుంభ్‌మేళాకు తరలివెళ్లారు. సినిమా సెలబ్రిటీల నుంచి మొదలు పెడితే చిన్నితెర తారలు, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లు కూడా భారీగానే వెళ్లి వచ్చారు. నగరంలో జరిగిన నుమాయిష్‌కి లక్షల సంఖ్యలో సందర్శకులు తగ్గిపోవడానికి కుంభ్‌మేళా ఒక కారణమని నిర్వాహకులు అంటున్నారు. ఈ నేపథ్యంలో.. మహా క్రతువు ముగిసిన వేళ.. నగరం నుంచి కుంభ్‌కి వెళ్లొచ్చిన పలువురు నగరవాసులు తమ జ్ఞాపకాలను సాక్షితో పంచుకున్నారు.

దేవదేవుని స్పర్శతో పులకించి..

నీళ్లను తాకినట్టుగా అనిపించలేదు. ఆ దేవదేవుడే స్పర్శించినట్టు శరీరం పులకించింది. నగరం నుంచి కాశీ అక్కడ నుంచి ప్రయాగ్‌రాజ్‌కు దాదాపు 23 గంటల పాటు ప్రయాణం. అక్కడకు చేరుకోగానే అంతవరకూ ఆవరించిన ప్రయాణ బడలికలన్నీ చేతితో తీసినట్టు మాయమైపోయాయి. నోస్ ఆఫ్ త్రివేణీ సంగమం అనే ప్రత్యేకమైన ప్రాంతంలో నాగసాధువులూ, అఘోరాలతో కలిసి స్నానాలు ఆచరించడం అసలు ఊహించని విశేషం. ఎక్కడ చూసినా భక్త జనసంద్రమే. అక్కడ ఉట్టిపడిన ఆధ్యాత్మికత నాలో నా ఆలోచనల్లో మార్పులు తెచ్చింది. వెళ్లకుండా ఉంటే ఎంత మిస్సయి ఉండేదానినో అనిపించింది. దైవభక్తి ఎక్కువే.. అయితే ఇంతగా తనువూ మనసూ ఆద్యంతం ఆధ్యాత్మికత ఆవరించడం మున్నెన్నడూ జరగలేదు.



– అర్చన చిగుళ్లపల్లి, సోషల్ ఇన్‌ఫ్లుయెన్సర్



మహానగరానికి కుంభ్.. పుణ్యజలం

త్రివేణీ సంగమం నుంచి నీటిని తీసుకువచ్చి.. పూల్‌లో నింపి భక్తులకు ఉచిత స్నానాలు

సాక్షి, సిటీబ్యూరో: నగరం నుంచి పెద్ద సంఖ్యలో కుంభమేళాకు తరలివెళ్లారు. అనేక వ్యయప్రయాసలకు ఓర్చుకుని పుణ్య స్నానాలు చేసి తిరిగి వచ్చారు. అయితే మనసు నిండా వెళ్లాలని ఆశ ఉన్నా.. ఖర్చులు.. ఆరోగ్య కారణాలతోనో వెళ్లలేక పోయిన వారి సంఖ్య కూడా తక్కువేమీ కాదు. 'అలాంటి వారిలో నిరాశ నిస్పృహలు గమనించాను. అప్పుడే నాలో ఈ ఆలోచన వచ్చింది' అని చెప్పారు శంషాబాద్‌లో ఎ క్రియేషన్స్ బ్యూటీ గ్రీన్ రిసార్ట్ యజమాని గోకుల్ ఆస్వా. ఇదే ఆలోచనలతో 5 రోజుల క్రితం తన వారితో కలిసి ప్రయాగ్ రాజ్ తరలివెళ్లాం, అక్కడ త్రివేణీ సంగమంలో తాము పుణ్యస్నానాలు ఆచరించడంతో పాటు అక్కడ నుంచి క్యాన్లలో దాదాపు 60 లీటర్ల దాకా పుణ్య జలాన్ని నింపుకుని నగరానికి తీసుకువచ్చామని తెలిపారు.



ఉచిత స్నానాలకు అవకాశం..

స్విమ్మింగ్ పూల్‌లోని నీటిని తొలగించి, అవసరమైన పూజలు నిర్వహించిన అనంతరం కుంభ్ మేళా నుంచి తీసుకొచ్చిన పుణ్యజలంతో దాన్ని నింపామన్నారు. బుధవారం ఉదయం 7 నుంచి 8గంటల దాకా పండితులు స్నానాలు ఆచరించారు. ఆ తర్వాత సాయంత్రం వరకూ ఎంట్రీ పాస్‌ల జారీ ద్వారా స్థానికులకు స్నానాలు చేసే అవకాశాన్ని ఉచితంగా అందించామని వివరించారు. అనంతరం గంగా హారతి సమర్పించి.. పూర్తి సంప్రదాయబద్ధంగా ముగించామన్నారు.

ఈ అనుభూతి వేరు..

నాన్నగారి అస్తికల నిమజ్జనం కోసం తొలిసారి వెళ్లినప్పటి నుంచి అంటే దాదాపు 15ఏళ్లుగా, కాశీ, త్రివేణీ సంగమంతో నాకు విడదీయలేని అనుబంధం ఏర్పడింది. మనసుకు తోచిన ప్రతీసారీ.. అక్కడకు వెళ్లివస్తుంటా. అయితే ఈ సారి ప్రయాగ్‌కు చేసిన ప్రయాణం చాలా ప్రత్యేకం. కోట్లాది మంది భక్తులతో కలిసి దైవ నామస్మరణ చేస్తూ పుణ్యస్నానాలు చేయడం.. అద్భుతమైన అనుభవం. నాతో పాటు నా స్నేహితుల్లోనూ ఆధ్యాత్మికత మరింత పెరిగేలా చేసింది కుంభ్ మేళా.



– చంగవల్లి శ్రీనివాస్, స్నేహితులు, దమ్మాయిగూడ

అనిర్వచనీయం.. ఆ భావం..

మహాకుంభ్ సందర్భంగా పుణ్య స్నానాలు ఆచరించడానికి అరడజను మంది స్నేహితులతో కలిసి వ్యక్తిగత వాహనంలో వెళ్లాం. జనసమ్మర్దం వల్ల, సమాచారం లోపం వల్ల కొన్ని ఇబ్బందులు ఎదుర్కొన్నాం.. అయినప్పటికీ త్రివేణీ సంగమంలో స్నానాలతో అవన్నీ మరచిపోయాం. ఆ అనుభూతిని అనిర్వచనీయమైనదనే చెప్పాలి. వెళ్లే దారిలో ఇబ్బందులు ఎదురైనప్పుడు ఎలా అనిపించినా, ప్రయాగ్‌రాజ్ నుంచి తిరిగివస్తున్నప్పుడు మాత్రం మళ్లీ రాలేం కదా అని మనసు భారమైంది. కాశీలో 9గంటలు వేచి దర్శనం చేసుకున్నా కూడా అలసట అనిపించలేదు.



– ఆర్.అరుణ్‌కుమార్, ఎల్బీనగర్



శుబ్‌మన్ గిల్ 'టాప్' ర్యాంక్ పటిష్టం

అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) వన్డే బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో భారత ఆటగాడు శుబ్‌మన్ గిల్ తన నంబర్‌వన్ ర్యాంక్‌ను మరింత పటిష్టం చేసుకున్నాడు. బుధవారం విడుదల చేసిన తాజా ర్యాంకింగ్స్‌లో గిల్ 817 రేటింగ్ పాయింట్లతో 'టాప్' ర్యాంక్‌లో కొనసాగుతున్నాడు. చాంపియన్స్ ట్రోఫీలో ఆడిన రెండు మ్యాచ్‌ల్లోనూ గిల్ ఆకట్టుకున్నాడు. బంగ్లాదేశ్‌పై అజేయ సెంచరీ (101 నాటౌట్) చేసిన ఈ పంజాబ్ బ్యాటర్ పాకిస్తాన్‌తో జరిగిన పోరులో 46 పరుగులు సాధించాడు. దాంతో గిల్ ఖాతాలో 21 రేటింగ్ పాయింట్లు చేరాయి. పాకిస్తాన్ బ్యాటర్ బాబర్ ఆజమ్ 770 రేటింగ్ పాయింట్లతో రెండో స్థానంలో కొనసాగుతున్నాడు. గిల్, బాబర్ ఆజమ్ మధ్య 47 పాయింట్ల వ్యత్యాసం ఉంది. భారత కెప్టెన్ రోహిత్ శర్మ (757 పాయింట్లు) మూడో ర్యాంక్‌లో ఎలాంటి మార్పు లేదు. చాంపియన్స్ ట్రోఫీలో పాకిస్తాన్‌పై అజేయ సెంచరీ చేసిన భారత స్టార్ విరాట్ కోహ్లి ఒక స్థానం మెరుగుపర్చుకొని ఐదో ర్యాంక్‌లో నిలిచాడు. భారత్‌కే చెందిన శ్రేయస్ అయ్యర్ తొమ్మిదో ర్యాంక్‌లో, కేఎల్ రాహుల్ 15వ ర్యాంక్‌లో ఉన్నారు. బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో భారత స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ మూడో ర్యాంక్‌లో నిలిచాడు.



ఇబ్రహీమ్ సెంచరీ అభివాదం

అఫ్గానిస్తాన్ మళ్లీ అదరగొట్టింది

ఉత్కంఠ పోరులో ఇంగ్లండ్‌పై 8 పరుగులతో విజయం

- ఇబ్రహీమ్ జద్రాన్ అద్భుత సెంచరీ
- అజ్మతుల్లాకు 5 వికెట్లు
- జో రూట్ శతకం వృథా
- టోర్నీ నుంచి ఇంగ్లండ్ అవుట్

రెండేళ్ల క్రితం వన్డే వరల్డ్ కప్‌లో అఫ్గానిస్తాన్ చేతిలో ఇంగ్లండ్ ఓటమి పాలైంది. ఆ రోజు అది ఒక సంచలనంగా కనిపించింది. ఇప్పుడు మరో ఐసీసీ టోర్నీలో మళ్లీ చెలరేగిన అఫ్గానిస్తాన్ అదే తరహా ఆటతో మళ్లీ ఇంగ్లండ్ పని పట్టింది. ఇప్పుడిది సంచలనం కాదు సాధారణమని నిరూపించింది. స్ఫూర్తిదాయక ఆటతో అదరగొట్టిన అఫ్గానిస్తాన్ చాంపియన్స్ ట్రోఫీలో తమ సెమీఫైనల్ ఆశలను సజీవంగా ఉంచుకోగా... వరుసగా రెండో ఓటమితో ఇంగ్లండ్ నిష్క్రమించింది. చాంపియన్స్ ట్రోఫీ చరిత్రలో అత్యధిక వ్యక్తిగత స్కోరుతో ఇబ్రహీమ్ జద్రాన్ తన టీమ్‌కు భారీ స్కోరును అందించగా... బౌలింగ్‌లో ఐదు వికెట్లతో అజ్మతుల్లా టీమ్‌ను నిలబెట్టాడు. ఆరేళ్ల తర్వాత వన్డేల్లో సెంచరీ చేసిన జో రూట్ ఎంతో పోరాడినా... విజయానికి 26 బంతుల్లో 39 పరుగులు చేయాల్సిన దశలో అతను అవుటవ్వడం ఇంగ్లండ్ ఓటమికి కారణమైంది.

లాహోర్: చాంపియన్స్ ట్రోఫీ గ్రూప్ 'బి'లో ఇంకా ఆసక్తికర పోటీ సాగుతోంది. ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికాలతో పాటు ఇప్పుడు అఫ్గానిస్తాన్ కూడా సెమీఫైనల్ రేసులోకి వచ్చింది. బుధవారం జరిగిన మ్యాచ్‌లో అఫ్గానిస్తాన్ 8 పరుగుల తేడాతో ఇంగ్లండ్‌ను ఓడించింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న అఫ్గానిస్తాన్ నిర్ణీత 50 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 325 పరుగులు సాధించింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' ఇబ్రహీమ్ జద్రాన్ (146 బంతుల్లో 177; 12 ఫోర్లు, 6 సిక్స్‌లు) భారీ సెంచరీ బాదగా... అజ్మతుల్లా (31 బంతుల్లో 41; 1 ఫోర్, 3 సిక్స్‌లు), మొహమ్మద్ నబీ (24 బంతుల్లో 40; 2 ఫోర్లు, 3 సిక్స్‌లు), కెప్టెన్ హష్మతుల్లా (67 బంతుల్లో 40; 3 ఫోర్లు) సహకరించారు. అనంతరం ఇంగ్లండ్ 49.5 ఓవర్లలో 317 పరుగులకు ఆలౌటైంది. జో రూట్ (111 బంతుల్లో 120; 11 ఫోర్లు, 1 సిక్స్) సెంచరీ చేయగా...అఫ్గాన్ బౌలర్ అజ్మతుల్లా ఒమర్జాయ్ (5/58) ప్రత్యర్థిని దెబ్బ తీశాడు. శుక్రవారం జరిగే తమ చివరి లీగ్ మ్యాచ్‌లో ఆస్ట్రేలియాతో అఫ్గానిస్తాన్; శనివారం జరిగే మ్యాచ్‌లో దక్షిణాఫ్రికాతో ఇంగ్లండ్ తలపడతాయి. ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా 3 పాయింట్లతో సంయుక్తంగా అగ్రస్థానంలో ఉండగా... అఫ్గానిస్తాన్ ఖాతాలో 2 పాయింట్లున్నాయి. చివరి మ్యాచ్‌లో ఇంగ్లండ్ నెగ్గినా ఆ జట్టుకు రెండు పాయింట్లు మాత్రమే లభిస్తాయి.

భారీ భాగస్వామ్యాలు...

ఇంగ్లండ్ ఆరంభంలో కట్టుదిట్టంగా బౌలింగ్ చేయడంతో అఫ్గాన్ బ్యాటర్లు పరుగులు చేయడానికి ఇబ్బంది పడ్డారు. ఇదే ఒత్తిడిలో జట్టు 26 పరుగుల వ్యవధిలో 3 వికెట్లు కోల్పోయింది. ఒకే ఓవర్లో గుర్బాజ్ (6), సాదిఖుల్లా (4)లను అవుట్ చేసిన ఆర్చర్ ఆ తర్వాత రహ్మత్ షా (4)ను కూడా వెనక్కి పంపాడు. తొలి 10 ఓవర్లలో 3 ఫోర్లు, 1 సిక్స్‌తో అఫ్గాన్ 39 పరుగులే చేసింది. అయితే ఆ తర్వాతి మూడు భాగస్వామ్యాలు అఫ్గాన్‌ను భారీ స్కోరు దిశగా నడిపించాయి. దూకుడైన బ్యాటింగ్‌తో చెలరేగిన ఇబ్రహీమ్ వరుసగా నాలుగు, ఐదు, ఆరో వికెట్‌లకు హష్మతుల్లాతో 103 పరుగులు, అజ్మతుల్లాతో 72 పరుగులు, నబీతో 111 పరుగులు జోడించాడు. ఒవర్టన్ ఓవర్లో 2 ఫోర్లు, సిక్స్ కొట్టిన ఇబ్రహీమ్...106 బంతుల్లో వన్డేల్లో ఆరో సెంచరీని పూర్తి చేసుకున్నాడు. 40వ ఓవర్ తర్వాత అఫ్గాన్ బ్యాటింగ్ మరింత ధాటిగా సాగింది. ఆర్చర్ ఓవర్లో ఇబ్రహీమ్ 3 ఫోర్లు, సిక్స్ బాదగా... రూట్ ఓవర్లో నబీ 2 ఫోర్లు, 2 సిక్స్‌లు కొట్టాడు. మెరుపు ప్రదర్శన చేసిన ఇబ్రహీమ్ చివరి ఓవర్ తొలి బంతికి అవుటయ్యాడు. ఆఖరి 10 ఓవర్లలో అఫ్గానిస్తాన్ 113 పరుగులు సాధించడం విశేషం.

రూట్ మినహా...

సాల్ట్ (12), జేమీ స్మిత్ (9) ఆరంభంలోనే వెనుదిరగడంతో భారీ ఛేదనలో ఇంగ్లండ్‌కు సరైన ఆరంభం లభించలేదు. అయితే రూట్, డకెట్ (45 బంతుల్లో 38; 4 ఫోర్లు) కలిసి జట్టును ఆదుకున్నారు. ఈ భాగస్వామ్యం తర్వాత బ్రూక్ (25), బట్లర్ (42 బంతుల్లో 38; 2 సిక్స్‌లు) కూడా కొద్దిసేపు రూట్‌కు సహకరించారు. అయితే వరుస విరామాల్లో వికెట్లు కోల్పోవడంతో ఇంగ్లండ్ ఇన్నింగ్స్ సరైన రీతిలో సాగలేదు. రూట్, ఒవర్టన్ (28 బంతుల్లో 32; 3 ఫోర్లు) భాగస్వామ్యం కొద్దిగా ఇంగ్లండ్ విజయంపై ఆశలు రేపింది. 101 బంతుల్లో రూట్ వన్డేల్లో 17వ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. అయితే చక్కటి బంతితో రూట్‌ను అజ్మతుల్లా బోల్తా కొట్టించిన తర్వాత ఒక్కసారిగా మ్యాచ్ అఫ్గాన్ వైపు మొగ్గింది.



నిరాశలో రూట్

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో



అజ్మతుల్లా, నబీ సంబరం

స్కోరు వివరాలు

అఫ్గానిస్తాన్ ఇన్నింగ్స్: గుర్బాజ్ (బి) ఆర్చర్ 6; ఇబ్రహీమ్ (సి) ఆర్చర్ (బి) లివింగ్‌స్టోన్ 177; సాదిఖుల్లా (ఎల్బీ) (బి) ఆర్చర్ 4; రహ్మత్ షా (సి) ఆదిల్ రషీద్ (బి) ఆర్చర్ 4; హష్మతుల్లా (బి) రషీద్ 40; అజ్మతుల్లా (సి) (సబ్) బాంటన్ (బి) ఒవర్టన్ 41; నబీ (సి) రూట్ (బి) లివింగ్‌స్టోన్ 40; గుల్బదిన్ (నాటౌట్) 1; రషీద్ ఖాన్ (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 11; **మొత్తం (50 ఓవర్లలో 7 వికెట్లకు) 325. వికెట్ల పతనం:** 1–11, 2–15, 3–37, 4–140, 5–212, 6–323, 7–324. **బౌలింగ్:** ఆర్చర్ 10–0–64–3, మార్క్ వుడ్ 8–0–50–0, ఒవర్టన్ 10–0–72–1, ఆదిల్ రషీద్ 10–0–60–1, రూట్ 7–0–47–0, లివింగ్‌స్టోన్ 5–0–28–2.

ఇంగ్లండ్ ఇన్నింగ్స్: సాల్ట్ (బి) అజ్మతుల్లా 12; డకెట్ (ఎల్బీ) (బి) రషీద్ 38; స్మిత్ (సి) అజ్మతుల్లా (బి) నబీ 9; రూట్ (సి) గుర్బాజ్ (బి) అజ్మతుల్లా 120; బ్రూక్ (సి అండ్ బి) నబీ 25; బట్లర్ (సి) రహ్మతుల్లా (బి) అజ్మతుల్లా 38; లివింగ్‌స్టోన్ (సి) గుర్బాజ్ (బి) గుల్బదిన్ 10; ఒవర్టన్ (సి) నబీ (బి) అజ్మతుల్లా 32; ఆర్చర్ (సి) నబీ (బి) ఫారుఖీ 14; రషీద్ (సి) ఇబ్రహీమ్ (బి) అజ్మతుల్లా 5; వుడ్ (నాటౌట్) 2; ఎక్స్‌ట్రాలు 12; **మొత్తం (49.5 ఓవర్లలో ఆలౌట్) 317. వికెట్ల పతనం:** 1–19, 2–30, 3–98, 4–133, 5–216, 6–233, 7–287, 8–309, 9–313, 10–317. **బౌలింగ్:** ఫారుఖీ 10–0–62–1, అజ్మతుల్లా 9.5–0–58–5, నబీ 8–0–57–2, రషీద్ ఖాన్ 10–0–66–1, నూర్ 10–0–51–0, గుల్బదిన్ 2–0–16–1.

చాంపియన్స్ ట్రోఫీలో నేడు
పాకిస్తాన్ X బంగ్లాదేశ్
వేదిక: రావల్పిండి, మధ్యాహ్నం గం. 2:30 నుంచి
స్టార్ స్పోర్ట్స్, జియోహాట్‌స్టార్‌లో ప్రత్యక్ష ప్రసారం

శివమెత్తిన సివర్

- 44 బంతుల్లో 13 ఫోర్లతో 75 నాటౌట్
- ఖాతాలో మూడు వికెట్లు కూడా
- ముంబై ఇండియన్స్ హ్యాట్రిక్ గెలుపు



బెంగళూరు: మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) టి20 క్రికెట్ టోర్నమెంట్‌లో మాజీ చాంపియన్ ముంబై ఇండియన్స్ జట్టు 'హ్యాట్రిక్' విజయం నమోదు చేసుకుంది. బుధవారం జరిగిన పోరులో హర్మన్‌ప్రీత్ కౌర్ సారథ్యంలోని ముంబై ఇండియన్స్ జట్టు 8 వికెట్లతో యూపీ వారియర్స్‌పై నెగ్గింది. నాట్ సివర్ బ్రంట్ (75 నాటౌట్; 3 వికెట్లు) ఆల్‌రౌండ్ ప్రదర్శనతో ముంబై ఇండియన్స్ విజయంలో కీలకపాత్ర పోషించింది. గత మ్యాచ్‌లో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ)పై సూపర్ ఓవర్‌లో నెగ్గిన యూపీ వారియర్స్... ఈ మ్యాచ్‌లో అదే జోరు కొనసాగించలేకపోయింది. టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన యూపీ వారియర్స్ నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 142 పరుగులకు పరిమితమైంది. గ్రేస్ హ్యారిస్ (26 బంతుల్లో 45; 6 ఫోర్లు, 2 సిక్స్‌లు), దినేశ్ వృందా (30 బంతుల్లో 33; 5 ఫోర్లు) ధాటిగా ఆడారు. కెప్టెన్ దీప్తి శర్మ (4), కిరణ్ నవగిరె (1), తాలియా మెక్‌గ్రాత్ (1), షినెల్ హెన్రీ (7) విఫలమయ్యారు. ముంబై ఇండియన్స్ బౌలర్లలో సివర్ బ్రంట్ 3 వికెట్లు... షబ్నిమ్ ఇస్మాయిల్, సంస్కృతి గుప్తా చెరో 2 వికెట్లు పడగొట్టారు. అనంతరం లక్ష్యఛేదనలో ముంబై ఇండియన్స్ 17 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 143 పరుగులు చేసింది. సివర్ బ్రంట్ (44 బంతుల్లో 75 నాటౌట్; 13 ఫోర్లు), హేలీ మాథ్యూస్ (50 బంతుల్లో 59; 7 ఫోర్లు, 2 సిక్స్‌లు) అర్ధశతకాలతో అదరగొట్టారు. యూపీ బౌలర్లు సైమా, షినెల్ హెన్రీ, సోఫీ ఎకిల్‌స్టోన్ ఓవర్లలో సివర్ మూడు బౌండరీల చొప్పున కొట్టింది. రెండో వికెట్‌కు హేలీ, సీవర్ 133 పరుగులు జోడించి ముంబై జట్టుకు అలవోక విజయాన్ని అందించారు. సివర్ బ్రంట్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు దక్కింది.

నేడు జరిగే మ్యాచ్‌లో రాయల్ చాలెంజర్స్ బెంగళూరుతో గుజరాత్ జెయింట్స్ ఆడనుంది.

సాక్షి సినిమా

నా కెరీర్‌లో శబ్దం ప్రత్యేకం

\- ఆది పినిశెట్టి



''వైశాలి' చిత్రం తర్వాత డైరెక్టర్ అరివళగన్, నా కాంబినేషన్‌లో సినిమా చేయాలని అనుకున్నాం. అయితే సరికొత్త కథ, కాన్సెప్ట్ కుదరలేదు. ఇన్నేళ్లకు 'శబ్దం'తో కుదిరింది. ఈ మూవీ ప్రేక్షకులకు మంచి అనుభూతినిస్తుంది. ఈ చిత్రం నా కెరీర్‌లో ప్రత్యేకమైనది'' అన్నారు ఆది పినిశెట్టి. హీరో ఆది పినిశెట్టి, డైరెక్టర్ అరివళగన్ కాంబినేషన్‌లో తెరకెక్కిన తెలుగు–తమిళ చిత్రం 'శబ్దం'. 7ఎ ఫిల్మ్స్‌పై శివ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 28న విడుదల కానుంది. ఎన్ సినిమాస్ ద్వారా ఆంధ్రప్రదేశ్‌లో, మైత్రీ డిస్ట్రిబ్యూషన్ ద్వారా నైజాంలో రిలీజ్ అవుతోంది. ఈ సందర్భంగా ఆది పినిశెట్టి విలేకరులతో మాట్లాడుతూ– ''సూపర్ నేచురల్ క్రైమ్ థ్రిల్లర్ మూవీ 'శబ్దం'. మంచి కథా బలంతో పాటు భావోద్వేగాలున్న హారర్ మూవీ. రెగ్యులర్ హారర్ సినిమాలకి భిన్నంగా ఉంటుంది. ఆత్మలని సైంటిఫిక్ మెథడ్‌లో అన్వేషించే విధానం కొత్తగా ఉంటుంది. స్క్రీన్‌ప్లే ఆసక్తిగా ఉంటుంది. ఈ మూవీలో పారానార్మల్ ఇన్వెస్టిగేటర్ క్యారెక్టర్ నాది. శబ్దంతోనే ఆత్మలని పసిగడుతుంటాను. తమన్‌గారి మ్యూజిక్, నేపథ్య సంగీతం మా సినిమాకి చాలా ప్లస్. కెమేరామేన్ అరుణ్ అద్భుతమైన విజువల్స్ ఇచ్చారు. 'శబ్దం'ని తెలుగులో హీరో నానీగారికే తొలుత చూపించాను. సినిమా చాలా బాగుందని చెప్పారు. 'నిన్ను కోరి' మూవీ తర్వాత మేమిద్దరం కలిసి నటించే అవకాశం రాలేదు. ఆయన సినిమాలో మళ్లీ నటించే అవకాశం వస్తే కథ కూడా వినకుండా నటిస్తాను. మైత్రీ మూవీ మేకర్స్, ఎన్ సినిమాస్ వారు మా సినిమాని తెలుగులో రిలీజ్ చేయడం అదృష్టంగా భావిస్తున్నాం. ఇక హీరోగా 'డ్రైవ్' అనే సినిమా చేశాను. 'అఖండ 2'లో ఓ పాత్ర చేస్తున్నాను. అలాగే 'మరకతమణి 2' షూటింగ్ జరుగుతోంది. దేవా కట్టాగారి దర్శకత్వంలో 'మయసభ' అనే ఓటీటీ ప్రాజెక్ట్ చేస్తున్నాను'' అని చెప్పారు.

సమాజానికి ప్రతిబింబం



భూమిక, గుణశేఖర్

ప్రముఖ దర్శకుడు గుణశేఖర్ తెరకెక్కిస్తున్న చిత్రం 'యుఫోరియా'. ఈ మూవీతో విఘ్నేశ్ గవిరెడ్డి టాలీవుడ్‌కి హీరోగా ఎంట్రీ ఇస్తుండగా, నటి భూమిక ముఖ్య పాత్రలో కనిపించనున్నారు. సారా అర్జున్, నాజర్, రోహిత్, లిఖిత యలమంచిలి, పృథ్వీరాజ్ అడ్డాల, కల్పలత, సాయి శ్రీనికా రెడ్డి ఇతర పాత్రలు పోషించారు. గుణ హ్యాండ్ మేడ్ ఫిల్మ్స్ బ్యానర్‌పై నీలిమ గుణ నిర్మాణంలో గుణశేఖర్ నిర్మిస్తున్న ఈ సినిమా షూటింగ్ పూర్తయింది. ఈ విషయాన్ని ప్రకటించి, మహా శివరాత్రి సందర్భంగా 'యుఫోరియా' మేకింగ్ వీడియోను విడుదల చేశారు. ''నేటి సమాజాన్ని ప్రతిబింబించేలా ట్రెండీ టాపిక్ నేపథ్యంలో సాగే చిత్రం 'యుఫోరియా'. ఇప్పటికే విడుదల చేసిన మూవీ టైటిల్ గ్లింప్స్, కాన్సెప్ట్ వీడియో అందర్నీ ఆకట్టుకుంది. పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలను ప్రారంభించాం. త్వరలోనే ఈ సినిమాని ప్రేక్షకుల ముందుకు తీసుకు రాబోతున్నాం'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సమర్పణ: రాగిణి గుణ, సంగీతం: కాల భైరవ, కెమేరా: ప్రవీణ్ కె. పోతన్.

గెలిపించేందుకు సిద్ధం



ఆకాశ్ జగన్నాథ్

ఆకాశ్ జగన్నాథ్ హీరోగా నటిస్తున్న చిత్రం 'తల్వార్'. కాశీ పరశురామ్ దర్శకత్వం వహిస్తున్నారు. ప్రకాశ్‌రాజ్, షైన్ టామ్ చాకో, అనసూయ భరద్వాజ్, అజయ్ ఇతర కీలక పాత్రలు పోషిస్తున్నారు. వార్నిక్ స్టూడియోస్ బ్యానర్‌పై భాస్కర్ ఈ.ఎల్.వీ నిర్మిస్తున్నారు. మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా 'తల్వార్' నుంచి పవర్‌ఫుల్ ఆడియో గ్లింప్స్ రిలీజ్ చేశారు. 'యుద్ధం జరిగే తీరు మారినా... చివరకు రక్తపాతంతో ముగుస్తోంది', 'అధర్మంతో అయినా ధర్మాన్ని గెలిపించేందుకు సిద్ధం' వంటి డైలాగ్స్ గ్లింప్స్‌లో ఉన్నాయి. ''యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతోన్న చిత్రం 'తల్వార్'. ఈ సినిమా ప్రస్తుతం షూటింగ్ జరుపుకుంటోంది'' అని చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రానికి ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: జానీ బాషా, కెమేరా: త్రిలోక్ సిద్ధు, సంగీతం: కేశవ కిరణ్.

తెలుగులో ఛావా



విక్కీ కౌశల్, రష్మికా మందన్న

ఛత్రపతి శంభాజీ మహారాజ్ బయోపిక్‌గా రూపొందిన హిందీ చిత్రం 'ఛావా'. విక్కీ కౌశల్ టైటిల్ రోల్‌లో నటించారు. లక్ష్మణ్ ఉటేకర్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో రష్మికా మందన్న యేసుబాయి భోంస్లే పాత్ర పోషించారు. అక్షయ్ ఖన్నా ఔరంగజేబుగా, డయానా పెంటీ జీనత్ ఉన్ నిస్సా బేగంగా, అశుతోష్ రాణా హంబిర్రావ్ మోహితేగా, దివ్యా దత్తా సోయారాబాయిగా నటించారు. దినేష్ విజన్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 14న హిందీలో విడుదలై, బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. ఈ చిత్రాన్ని మార్చి 7న తెలుగులో రిలీజ్ చేయనున్నట్లు గీతా ఆర్ట్స్ డిస్ట్రిబ్యూషన్స్ సంస్థ ప్రకటించింది. ''ఛత్రపతి శంభాజీ మహారాజ్ జీవిత చరిత్ర, వీరగాథని వివరించే చారిత్రక ఇతిహాసం నేపథ్యంలో రూపొందిన 'ఛావా' ప్రేక్షకుల హృదయాల్లో అత్యున్నత స్థానాన్ని సంపాదించుకుంది. విడుదలైన 11 రోజుల్లోనే ఈ చిత్రం భారతదేశంలో రూ. 417.20 కోట్ల వసూళ్లను అధిగమించింది. ఛత్రపతి వంటి ధర్మయోధుడి కథని మరింత మందికి చేరువ చేయాలనే, స్ఫూర్తి నింపాలనే ఆలోచనతో తెలుగులోనూ థియేటర్లలో రిలీజ్ చేస్తున్నాం'' అని గీతా ఆర్ట్స్ డిస్ట్రిబ్యూషన్స్ సంస్థ ప్రకటించింది.


నటీనటులకు భాష అడ్డు కాదు

\- మిమో చక్రవర్తి



''తెలుగులో 'నేనెక్కడున్నా' సినిమా చేస్తున్నానని మా నాన్నకి (బాలీవుడ్ నటుడు మిథున్ చక్రవర్తి) చెప్పినప్పుడు సంతోషపడ్డారు. 'భాష రాదని ఆలోచించవద్దు... వంద శాతం నీ బెస్ట్ ఇవ్వు' అన్నారు. నటీనటులకు భాష అనేది అడ్డు కాదు... కాకూడదని నా అభిప్రాయం'' అని మిమో చక్రవర్తి తెలిపారు. మిమో చక్రవర్తి, సాషా చెత్రి లీడ్ రోల్స్‌లో నటించిన చిత్రం 'నేనెక్కడున్నా'. మాధవ్ కోదాడ దర్శకుడు. కేబీఆర్ సమర్పణలో మారుతి శ్యామ్ ప్రసాద్ రెడ్డి నిర్మించిన ఈ మూవీ ఈ నెల 28న విడుదల కానుంది. ఈ సందర్భంగా మిమో చక్రవర్తి మాట్లాడుతూ–''ఊటీలో మా నాన్నగారికి హోటల్ ఉంది. నేను అక్కడే ఉండటం వల్ల తెలుగు, తమిళ సినిమాలు చూస్తూ పెరిగాను. ఇక మాధవ్ కోదాడగారు ముంబై వచ్చి కథ చెప్పిన వెంటనే ఒప్పుకున్నాను. ఇదొక కంప్లీట్ పాప్‌కార్న్ ఎంటర్‌టైనర్. పాటలు, మంచి యాక్షన్ సీక్వెన్సులు, సన్నివేశాలు ఉన్నాయి. తెలుగులో నాకు మంచి లాంచింగ్ మూవీ అవుతుందనుకుంటున్నాను. విలన్ పాత్రలకు నేను పర్ఫెక్ట్ ఫిట్ అని నా ఫీలింగ్. మంచి క్యారెక్టర్లు వస్తే కమెడియన్‌గా, సపోర్టింగ్ రోల్స్ చేయడానికి కూడా సిద్ధం. నాన్నగారు ప్రస్తుతం ప్రభాస్‌గారి 'ఫౌజీ'లో నటిస్తున్నారు. నేను విక్రమ్ భట్ దర్శకత్వంలో 'హాంటెడ్'కి సీక్వెల్ చేస్తున్నాను. అలాగే నెట్‌ఫ్లిక్స్ కోసం 'ఖాకీ' అనే వెబ్ సిరీస్ సీజన్ 2 చేస్తున్నాను'' అన్నారు.

ఈశ్వరా.. చంద్రేశ్వరా



సురేష్ రవి, ఆశా వెంకటేశ్

సురేష్ రవి, ఆశా వెంకటేశ్ జంటగా జీవి పెరుమాళ్ వర్ధన్ దర్శకత్వం వహించిన చిత్రం 'చంద్రేశ్వర'. బేబీ అఖిల సమర్పణలో శివ బాలాజీ ఫిలింస్‌పై డా. రవీంద్ర చారి నిర్మించిన ఈ మూవీ త్వరలో రిలీజ్ కానుంది. జెరాడ్ ఫిలిక్స్ సంగీతం అందించారు. మహా శివరాత్రి సందర్భంగా ఈ సినిమాలోని 'ఈశ్వరా...' అంటూ సాగే పాటను విడుదల చేసింది చిత్రయూనిట్. నిర్మాత, నటుడు అశోక్ కుమార్ మాట్లాడుతూ– ''శివుని పాట చాలా బాగుంది. ఆ శివుడి దయ యూనిట్‌కి ఉండాలి'' అన్నారు. డా.రవీంద్ర చారి మాట్లాడుతూ– ''ఆర్కియాలజీ నేపథ్యంలో ఎమోషనల్‌తో కూడిన సస్పెన్స్ థ్రిల్లర్ చిత్రమిది. మా మూవీలోని 'ఈశ్వరా..' అంటూ సాగే పాటను మహాశివరాత్రి రోజు రిలీజ్ చేయడం సంతోషంగా ఉంది'' అన్నారు. ఈ కార్యక్రమంలో చిత్ర సహ నిర్మాతలు పి.సరిత, వి.బాలకృష్ణ, నటి సంజనా చౌదరి, డైరెక్టర్–ఆర్టిస్ట్ ఈశ్వర్, నటులు గాలిపటాల సుధాకర్, 'జబర్దస్త్' వినోద్, గడ్డం నవీన్ మాట్లాడారు.

టుక్ టుక్ రహస్యం



సాన్వీ మేఘన

హర్ష రోషన్, కార్తికేయ దేవ్, స్టీవెన్ మధు, సాన్వీ మేఘన, నిహాల్ కోదాటి ముఖ్య తారలుగా రూపొందిన చిత్రం 'టుక్ టుక్'. సి. సుప్రీత్ కృష్ణ దర్శకుడు. రాహుల్ రెడ్డి, లోక్కు శ్రీ వరుణ్, శ్రీరాముల రెడ్డి, సుప్రీత్ సి. కృష్ణ నిర్మించారు. ఈ చిత్రాన్ని మార్చి 21న విడుదల చేయనున్నట్లు ప్రకటించి, పోస్టర్‌ను విడుదల చేశారు మేకర్స్. సి. సుప్రీత్ కృష్ణ మాట్లాడుతూ–''ఈ చిత్రంలో ఉండే స్కూటర్ కమ్ ఆటో ఎన్నో మ్యాజికల్ పవర్స్‌ను కలిగి ఉంటుంది. అందరూ ఆ వాహనంతో ప్రేమలో పడిపోతారు. దానికి ఓ రహస్యం కూడా ఉంటుంది'' అన్నారు. ''ఈ చిత్రకథ ఒక గ్రామం నేపథ్యంలో ఉంటుంది. కథలో స్కూటర్ కమ్ ఆటో పాత్ర ఏంటి? అనేది ఎంతో ఆసక్తికరంగా ఉంటుంది. ఈ వేసవికి ప్రేక్షకులకు మంచి వినోదం అందించనున్నాం'' అని నిర్మాతలు తెలిపారు. ఈ చిత్రానికి కెమేరా: కార్తీక్ సాయికుమార్, సంగీతం: సంతు ఓంకార్.

కామెడీ సైకిల్



రాజా దుస్సా, అనిల్ సుంకర, గాలి కృష్ణ

1980లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం వరంగల్ జిల్లాలో జరిగిన ఒక వాస్తవ సంఘటన ఆధారంగా రూపొందిన చిత్రం 'అట్లాస్ సైకిల్ అత్తగారు పెట్లే'. రాజా దుస్సా దర్శకత్వంలో గాలి కృష్ణ నిర్మిస్తున్నారు. ''హన్సిక మోత్వాని లీడ్ రోల్‌లో '105 మినిట్స్' అనే సింగిల్ షాట్, సింగిల్ క్యారెక్టర్‌తో ఓ ప్రయోగాత్మక మూవీ చేశాను. ఇప్పుడు వాస్తవ కథతో రూపొందిస్తున్న ఈ 'అట్లాస్ సైకిల్ అత్తగారు పెట్లే' కూడా ప్రేక్షకులకు సరికొత్త అనుభూతినిస్తుంది. తెలంగాణ యాస, భాష నేపథ్యంలో ఈ చిత్రం ఉంటుంది. పూర్తి వినోదాత్మకంగా సాగుతుంది. నటీనటుల వివరాలను త్వరలో తెలియజేస్తాం'' అన్నారు రాజా దుస్సా. ఈ చిత్రానికి కెమేరా: వేణు మురళీధర్ .వి, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: కార్తికేయ శ్రీనివాస్ (వాసు).

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు (మంగళవారం ముగింపు)	
సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▼
148	6
74,602	22,548

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11:30 ముగింపు)			
నాస్‌డాక్	19,210	▲	183
డోజోన్స్	43,741	▲	120
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,741	▲	63
డాక్స్	22,794	▲	385
హాంగ్‌సెంగ్	3,380	▲	34
నికాయ్	38,142	▼	95

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	86.45	87.47
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	108.50	111.39
€	యూరో	ఎస్‌బీఐ	89.76	92.39
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	57.32	58.78
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	54.15	56.36
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	63.00	67.41
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	22.37	23.90
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	22.86	24.63
¥	చైనా యువాన్	థామస్‌కుక్	11.14	12.96

2 నెలల్లో లక్ష కోట్లు ఉఫ్!

కొద్ది నెలలుగా దేశీ స్టాక్స్‌లో విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు (ఎఫ్‌పీఐలు) అమ్మకాలకు తెగబడుతుండడంతో మార్కెట్లు పతనబాట పట్టాయి. 2024 అక్టోబర్ లో మొదలైన ఎఫ్‌పీఐల పెట్టుబడుల ఉపసంహరణ నిరవధికంగా సాగుతోంది. దీంతో స్టాక్ ఎక్స్ఛేంజీ దిగ్గజాలు బీఎస్‌ఈ, ఎన్ఎస్ఈ ఇండెక్సుల్లో భారీ కరెక్షన్ జరుగుతోంది.. లిస్టెడ్ కంపెనీల మార్కెట్ విలువలు కొత్త గరిష్టస్థాయిల నుంచి భారీగా తగ్గుముఖం పట్టాయి. – సాక్షి, బిజినెస్ డెస్క్

మార్కెట్లకు విదేశీ ఇన్వెస్టర్ల షాక్

- గత అక్టోబర్ నుంచి పెట్టుబడుల తిరోగమనం..
- గరిష్టం నుంచి ఇండెక్సులు 14 శాతం డౌన్
- 2025లోనూ కొనసాగుతున్న అమ్మకాలు



సుమారు మూడేళ్లపాటు సాగిన స్టాక్ మార్కెట్ బుల్ పరుగు గత ఏడాది చివరి త్రైమాసికం నుంచి స్పీడు తగ్గింది. విదేశీ ఇన్వెస్టర్లు అమ్మకాలకు మొగ్గు చూపడంతో సెంటిమెంట్ బలహీనపడి మార్కెట్లు లాభాల బాట నుంచి యూటర్న్ తీసుకుని నష్టాల ప్రయాణం మొదలుపెట్టాయి. దీంతో 2024 సెప్టెంబర్ 27న చరిత్రాత్మక గరిష్టాలను తాకిన నిఫ్టీ, సెన్సెక్స్ వరుసగా తగ్గుతూ ఇప్పటివరకూ 14 శాతం పతనమయ్యాయి. బేర్ ట్రెండ్‌వైపు మళ్లాయి!

కారణాలు ఇవీ...

మూడేళ్లుగా అలుపెరుగని లాభాల పరుగు తీసిన నిఫ్టీ, సెన్సెక్స్ ప్రభావంతో లార్జ్ క్యాప్స్‌తోపాటు.. పలు మధ్య, చిన్నతరహా స్టాక్స్ సైతం భారీగా ఎగశాయి. దీంతో దేశీ స్టాక్ మార్కెట్లు ఖరీదుగా మారినట్లు విశ్లేషకులు పేర్కొంటున్నారు. ఇదే సమయంలో తలెత్తిన ప్రపంచ రాజకీయ, భౌగోళిక అనిశ్చితులు సెంటిమెంటును బలహీనపరిచాయి. యూఎస్ ప్రెసిడెంట్‌గా రిపబ్లికన్ ట్రంప్ ఎన్నికవడంతో ఇన్వెస్టర్లలో ఆందోళనలు అధికమయ్యాయి. ట్రంప్ విధానాలపై అంచనాలతో డాలరు బలపడటం, ట్రెజరీ ఈల్డ్స్ మెరుగుపడటం రూపాయినీ దెబ్బతీసింది. అధికారం చేపట్టాక భారత్‌సహా పలు దేశాలపై ట్రంప్ ప్రతీకార టారిఫ్‌లకు దిగడం ప్రతికూల ప్రభావం చూపిస్తోంది. మరోపక్క జీడీపీ వృద్ధికి దన్నుగా చైనా సహాయక ప్యాకేజీలకు ప్రకటించింది. భారత్‌తో పోలిస్తే చౌకగా ట్రేడవుతున్న చైనా స్టాక్స్ విదేశీ ఇన్వెస్టర్లను ఆకట్టుకుంటున్నట్లు నిపుణులు తెలియజేశారు. ఇవి చాలదన్నట్లు దేశ జీడీపీ వృద్ధి కొంత నెమ్మదించడం, అంచనాలు అందుకోని దేశీ కార్పొరేట్ల క్యూ3 ఫలితాలు తదితర అంశాలు ఎఫ్‌పీఐలను నిరాశపరచినట్లు వివరించారు. దీంతో ప్రధాన ఇండెక్సులను మించి మిడ్, స్మాల్ క్యాప్ కౌంటర్లు పతనమవుతున్నట్లు తెలియజేశారు.

నేలచూపుల తీరిదీ

బీఎస్‌ఈ ప్రధాన ఇండెక్స్ సెన్సెక్స్ గత సెప్టెంబర్ 27న 85,978 వద్ద స్థిరపడింది. ఇదే రోజు నిఫ్టీ 26,277కు నిలిచింది. ఇవి సరికొత్త రికార్డులుకాగా.. ఈ స్థాయి నుంచి నిఫ్టీ 3,730 పాయింట్లు(14 శాతం) పతనమైంది. సెన్సెక్స్ 11,376 పాయింట్లు(13 శాతం) కోల్పోయింది. వెరసి గతేడాది అక్టోబర్ నుంచి మార్కెట్లు బేర్ ట్రెండ్‌లో సాగుతున్నాయి. గత అక్టోబర్ మొదలు అమ్మకాలు కొనసాగిస్తున్న ఎఫ్‌పీఐలు కొత్త ఏడాది(2025)లో ఇప్పటివరకూ రూ. 1.07 లక్షల కోట్ల విలువైన పెట్టుబడులను వెనక్కి తీసుకోవడం గమనార్హం! ఫలితంగా ఈ జనవరి మొదలు ఇప్పటివరకూ సెన్సెక్స్ 3,537 పాయింట్లు(4.5 శాతం) పడిపోయింది. ఈ బాటలో నిఫ్టీ 1,097 పాయింట్లు(4.6 శాతం) వెనకడుగు వేసింది.

నిపుణుల అంచనాలు



నిజానికి మార్కెట్లలో నెలకొన్న దిద్దుబాటు పలు అంశాల కలయికతో జరుగుతుందని మాస్టర్ ట్రస్ట్ గ్రూప్ డైరెక్టర్ పునీత్ సింఘానియా పేర్కొన్నారు. అధిక శాతం బ్లూచిప్ కంపెనీలు అక్టోబర్–డిసెంబర్(క్యూ3)లో నిరుత్సాహకర ఫలితాలు ప్రకటించడం సెంటిమెంటును దెబ్బతీసినట్లు తెలిపారు. వీటికితోడు ట్రంప్ టారిఫ్ భయాలు, దేశ ఆర్థిక వ్యవస్థ మందగమనం వంటి అంశాలు విదేశీ ఇన్వెస్టర్ల అమ్మకాలకు కారణమవుతున్నట్లు జియోజిత్ ఫైనాన్షియల్ రీసెర్చ్ హెడ్ వినోద్ నాయిర్ వివరించారు. దీంతో మార్కెట్లు సాంకేతికంగా బలహీనపడినట్లు చెప్పారు. చైనాతో పోలిస్తే దేశీ మార్కెట్లు ఖరీదుగా ఉండటంతో ఎఫ్‌పీఐలు అమ్మకాలకే ప్రాధాన్యమిస్తున్నట్లు మెహతా ఈక్విటీస్ రీసెర్చ్ సీనియర్ వీపీ ప్రశాంత్ తాప్సీ పేర్కొన్నారు. భారీగా పుంజుకుంటున్న డాలరు, యూఎస్ బాండ్ ఈల్డ్స్, రూపాయి క్షీణత, ఖరీదుగా మారిన దేశీ ఈక్విటీలు ఎఫ్‌పీఐల అమ్మకాలకు కారణమనేది విశ్లేషకులు అభిప్రాయం.

ఆసియాలో అమ్మకాలిలా (కోట్ల డాలర్లలో)

దేశం	అమ్మకాలు
ఫిలిప్పీన్స్	16.8
థాయ్‌లాండ్	20.5
వియత్నాం	52.8
ఇండోనేషియా	67.4
మలేషియా	89.4
దక్షిణ కొరియా	178.3
తైవాన్	265.2
భారత్	1,230



భారత్ బేర్

వర్తమాన మార్కెట్లలో చూస్తే ప్రధానంగా ఆసియా దేశాలలో భారత్ నుంచే ఎఫ్‌పీఐలు అత్యధిక శాతం పెట్టుబడులను వెనక్కి తీసుకుంటున్నారు. థాయ్‌లాండ్, దక్షిణ కొరియా, మలేసియా తదితర మార్కెట్లతో పోలిస్తే 2025 తొలి రెండు నెలల్లో దేశీ స్టాక్స్‌లో భారీగా విక్రయాలు చేపట్టారు. ఆసియా దేశాలను పరిగణిస్తే ఫిలిప్పీన్స్‌లో అతి తక్కువ అమ్మకాలు నమోదుకాగా.. భారత్‌లో అత్యధిక విక్రయాలకు తెరతీశారు. నిజానికి గత మూడేళ్లలో ఎఫ్‌పీఐలను అత్యధికంగా ఆకట్టుకున్న భారత్ ఇటీవల పలు కారణాలతో పెట్టుబడులను కోల్పోతున్నట్లు నిపుణులు పేర్కొన్నారు. అయితే ఆసియాలో మెటల్స్ ఎగుమతులతో చైనా, ఎలక్ట్రానిక్స్‌లో వియత్నాం వంటి దేశాలు ట్రంప్ ప్రతీకార టారిఫ్‌లను అధికంగా ఎదుర్కోవలసి ఉంటుందని తెలియజేశారు. ఈ అంశంలో భారత్ పరిస్థితి కొంత మెరుగ్గా ఉన్నప్పటికీ డాలర్, ట్రెజరీ ఈల్డ్స్ తదితర పలు ఇతర కారణాలతో ఎఫ్‌పీఐలు విక్రయాలకు పాల్పడుతున్నట్లు వివరించారు.

మైక్రోమ్యాక్స్ సోలార్ పవర్

- స్టార్టప్ ఎనర్జీ పేరుతో సోలార్ మాడ్యూల్స్ తయారీ సంస్థ ఏర్పాటు
- చైనా కంపెనీ జిన్‌చెన్‌తో జట్టు

న్యూఢిల్లీ: దేశీ మొబైల్, ఎలక్ట్రానిక్స్ బ్రాండ్ మైక్రోమ్యాక్స్ ఇన్ఫర్మాటిక్స్ తాజాగా పునరుత్పాదక ఇంధన రంగంలోకి ప్రవేశించింది. సోలార్ ప్యానెళ్ల తయారీ కోసం స్టార్టప్ ఎనర్జీ పేరిట సంస్థను ఏర్పాటు చేసింది. నివాస గృహాలు, కమర్షియల్, పారిశ్రామిక అవసరాలకు అందుబాటు ధరల్లో నాణ్యమైన సోలార్ ప్యానెళ్లను తయారు చేయడంపై ఇది దృష్టి పెడుతుందని మైక్రోమ్యాక్స్ ఇన్ఫర్మాటిక్స్ ఎండీ రాజేశ్ అగర్వాల్ తెలిపారు. అధునాతన ఆటోమేషన్ సామర్థ్యాలతో స్టార్టప్ ఎనర్జీ తయారీ ప్లాంటును ఏర్పాటు చేస్తుందని పేర్కొన్నారు. ఇందుకోసం చైనాకు చెందిన జిన్‌చెన్ సంస్థతో వ్యూహాత్మక కాంట్రాక్ట్ కుదుర్చుకున్నట్లు వివరించారు. దీని కింద 5 గిగావాట్ల అధునాతన సోలార్ మాడ్యూల్స్ తయారీ లైన్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. కొత్త తరం సోలార్ సొల్యూషన్స్‌పై పరిశోధనలు, అభివృద్ధి కోసం స్టార్టప్ ఎనర్జీ వ్యూహాత్మక భాగస్వామ్యాలను కుదుర్చుకుంటుందని చెప్పారు.



స్పైస్‌జెట్ లాభం 26 కోట్లు

న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో బడ్జెట్ ఎయిర్‌లైన్ స్పైస్‌జెట్ రూ. 26 కోట్ల నికర లాభం ఆర్జించింది. గత క్యూ3లో కంపెనీ రూ. 300 కోట్ల నష్టం నమోదు చేసింది. సమీక్షాకాలంలో ఆదాయం 35 శాతం పెరిగి రూ. 1,077 కోట్ల నుంచి రూ. 1,651 కోట్లకు పెరిగింది. అయితే క్యూ2లో నమోదైన రూ. 2,149 కోట్లతో పోలిస్తే మాత్రం ఆదాయం తగ్గింది. ప్యాసింజర్ లోడ్ ఫ్యాక్టర్ (పీఎల్‌ఎఫ్) 87%గా నమోదైనట్లు కంపెనీ తెలిపింది. వాస్తవానికి క్యూ3 ఆర్థిక ఫలితాలను మంగళవారమే ప్రకటించాల్సి ఉన్నా, బోర్డు సమావేశం అర్ధరాత్రి వరకు సాగడంతో బుధవారం తెల్లవారుఝామున ఒంటి గంటకు ఫైలింగ్ చేసినట్లు స్టాక్ ఎక్స్ఛేంజీలకు స్పైస్‌జెట్ తెలిపింది.



'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..

ఈపీఎఫ్‌వోలో కొత్తగా 16 లక్షల మందికి చోటు | హైదరాబాద్‌లో పెరిగిన ఇళ్ల ధరలు

భవిత

స్పర్ధయా వర్ధతే విద్య

విద్య, ఉద్యోగ సమాచారం

టీజీ ఈఏపీసెట్-2025

తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి.. 2025–26 విద్యా సంవత్సరానికి సంబంధించి ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాలకు తెలంగాణ స్టేట్ ఇంజనీరింగ్, అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ కామన్ ఎంట్రన్స్ టెస్ట్(ఈఏపీసెట్)-2025 నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ఈ పరీక్షను జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్శిటీ హైదరాబాద్ (జేఎన్‌టీయూహెచ్) నిర్వహించనుంది.

కోర్సుల వివరాలు

- బీఈ, బీటెక్/బీటెక్(బయోటెక్నాలజీ)/బీటెక్(డెయిరీ టెక్నాలజీ)/బీటెక్(అగ్రికల్చర్ ఇంజనీరింగ్)/బీఫార్మసీ/బీటెక్(ఫుడ్ టెక్నాలజీ)/బీటెక్(బయోమెడికల్ ఇంజనీరింగ్)/బీఎస్సీ(ఆనర్స్)అగ్రికల్చర్/బీఎస్సీ(ఆనర్స్) హార్టికల్చర్ /బీఎస్సీ(ఫారెస్ట్రీ)/బీవీఎస్సీ అండ్ ఏహెచ్/బీఎఫ్ఎస్సీ, ఫార్మ్-డి, బీఎస్సీ (నర్సింగ్).
- **అర్హత:** ఇంటర్మీడియట్(ఎంపీసీ/బైపీసీ)లో ఎస్సీ, ఎస్టీలకు 40 శాతం, ఇతరులకు 45 శాతం మార్కులు తప్పనిసరిగా ఉండాలి.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 04.04.2025 (ఆలస్య రుసుము లేకుండా)
- **ఈఏపీసెట్ పరీక్ష తేదీలు:** 29.04.2025, 30.04.2025 తేదీల్లో అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ పరీక్షలు. 02.05.2025 నుంచి 05.05.2025 వరకు ఇంజనీరింగ్ పరీక్షలు.
- **వెబ్‌సైట్:** https://eapcet.tsche.ac.in

ఎన్‌టీఏ-ఎన్‌సీఈటీ-ఐటీఈపీ-2025

నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ).. దేశవ్యాప్తంగా 2025–26 విద్యా సంవత్సరానికి సంబంధించి నాలుగేళ్ల ఇంటిగ్రేటెడ్ టీచర్ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్(ఐటీఈపీ)లో ప్రవేశాలకు నేషనల్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్–2025 పరీక్షను నిర్వహించనుంది.

- **కోర్సుల వివరాలు:** బీఏ–బీఈడీ, బీకాం–బీఈడీ, బీఎస్సీ–బీఈడీ.
- **అర్హత:** ఇంటర్మీడియట్ లేదా పన్నెండో తరగతి/తత్సమాన పరీక్షల్లో ఉత్తీర్ణులవ్వాలి.
- **పరీక్ష విధానం:** కంప్యూటర్ ఆధారిత పరీక్ష. ఇంగ్లిష్, హిందీతో పాటు 13 భాషల్లో పరీక్ష జరుగుతుంది.
- **తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్, కరీంనగర్, ఖమ్మం, మహబూబ్‌నగర్, వరంగల్,అనంతపురం, చిత్తూరు, గూడూరు, గుంటూరు, కాకినాడ, కర్నూలు, రాజమండ్రి, తిరుపతి, విజయవాడ, విశాఖపట్నం.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 16.03.2025.
- **దరఖాస్తు సవరణతేదీలు:** 18.03.2025, 19.03.2025.
- **పరీక్ష తేది:** 29.04.2025.
- **వెబ్‌సైట్:** https://exams.nta.ac.in

సీఎస్ఐఆర్-ఎన్ఏఎల్, బెంగళూరులో 30 సైంటిస్ట్ పోస్టులు

బెంగళూరులోని సీఎస్ఐఆర్–నేషనల్ ఏరోస్పేస్ ల్యాబొరేటరీ(ఎన్ఏఎల్) డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ప్రాతిపదికన సైంటిస్ట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 30.
- **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో పీహెచ్‌డీ, ఎంఈ/ఎంటెక్‌లో ఉత్తీర్ణులవ్వాలి.
- **వయసు:** 03.04.2025నాటికి 32 ఏళ్లు ఉండాలి
- **వేతనం:** నెలకు 67,700 నుంచి రూ.2,08,700.
- **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 03.04.2025
- **వెబ్‌సైట్:** http://www.nal.res.in

ఇంటర్‌తోనే.. ఐఐఎంల్లో ఎంబీఏ!

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎం)లు దేశంలో మేనేజ్‌మెంట్ విద్యకు అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన ఇన్‌స్టిట్యూట్‌లు! వీటిలో చేరాలంటే.. బ్యాచిలర్ డిగ్రీ అర్హతతో.. క్యాట్‌లో మంచి స్కోర్, ఆ తర్వాత నిర్వహించే ఎంపిక ప్రక్రియలో నెగ్గాల్సి ఉంటుంది. అయితే ఇప్పుడు కొన్ని ఐఐఎంలు ఇంటర్మీడియెట్ అర్హతతోనే.. ఎంబీఏలో చేరే అవకాశం కల్పిస్తున్నాయి. ఐఐఎం- జమ్ము, బోధ్‌గయ క్యాంపస్‌లలో ఇంటిగ్రేటెడ్ మేనేజ్‌మెంట్ పీజీ ప్రోగ్రామ్‌లో ప్రవేశాలకు జిప్‌మ్యాట్ -2025 నోటిఫికేషన్ విడుదలైంది. ఈ నేపథ్యంలో.. జిప్‌మ్యాట్ పరీక్ష విధానం, ప్రవేశ నిబంధనలు, కోర్సు ద్వారా లభించే నైపుణ్యాలు, భవిష్యత్తు అవకాశాలు తదితర వివరాలు..

- జమ్ము, బోధ్‌గయలలో ఇంటిగ్రేటెడ్ ఎంబీఏ
- ఎన్‌టీఏ జిప్‌మ్యాట్ స్కోర్ ఆధారంగా ప్రవేశాలు
- అయిదేళ్ల వ్యవధిలో ఇంటిగ్రేటెడ్ ఎంబీఏ కోర్సు

రెండు క్యాంపస్‌లలో 260 సీట్లు

ఎన్‌టీఏ నిర్వహించే జిప్‌మ్యాట్(జాయింట్ ఇంటిగ్రేటెడ్ ప్రోగ్రామ్ ఇన్ మేనేజ్‌మెంట్ అడ్మిషన్ టెస్ట్) స్కోర్ ద్వారా ఐఐఎం-జమ్ము, బోధ్‌గయ క్యాంపస్‌లలో ప్రవేశాలు ఖరారు చేస్తారు. ఈ రెండు క్యాంపస్‌ల్లో ఇంటిగ్రేటెడ్ ప్రోగ్రామ్ ఇన్ మేనేజ్‌మెంట్‌లో మొత్తం 260 సీట్లు భర్తీ చేస్తారు. జమ్ములో 140 సీట్లు, బోధ్‌గయలో 120 సీట్లు ఉన్నాయి. వీటిలో చేరిన కోర్సు పూర్తి చేసుకున్న వారికి బీబీఏ +ఎంబీఏ పట్టా లభిస్తుంది.

అర్హతలు

2023, 2024లో 60 శాతం మార్కులతో ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణులైన వారు దరఖాస్తుకు అర్హులు. 2025లో ద్వితీయ సంవత్సరం పరీక్షలకు హాజరవుతున్న వారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. రిజర్వ్‌డ్ కేటగిరీ అభ్యర్థులు 55 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించాలి. 2021, ఆ తర్వాత పదో తరగతి పూర్తి చేసుకుని ఉండాలి.

400 మార్కులకు పరీక్ష

జిప్‌మ్యాట్‌లో మూడు విభాగాల నుంచి ప్రశ్నలు అడుగుతారు. క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ నుంచి 33 ప్రశ్నలు, డేటా ఇంటర్‌ప్రిటేషన్ అండ్ లాజికల్ రీజనింగ్ విభాగంలో 33 ప్రశ్నలు, వెర్బల్ ఎబిలిటీ అండ్ రీడింగ్ కాంప్రహెన్షన్‌లో 34 ప్రశ్నలు ఉంటాయి. ఒక్కో ప్రశ్నకు నాలుగు మార్కులు చొప్పున మొత్తం 400 మార్కులకు పరీక్ష జరుగుతుంది. జిప్‌మ్యాట్‌లో పొందిన స్కోర్ ఆధారంగా.. అభ్యర్థులు జమ్ము, బోధ్‌గయ క్యాంపస్‌లకు వేర్వేరుగా దరఖాస్తు చేసుకోవాలి.

వెయిటేజీ ఆధారంగా తుది జాబితా

ఐఐఎం-జమ్ములో జిప్‌మ్యాట్ స్కోర్‌కు 60 శాతం వెయిటేజీ, పదో తరగతి, ఇంటర్మీడియెట్ మార్కులకు 15 శాతం వెయిటేజీ చొప్పున, పది శాతం జెండర్ వెయిటేజీ ఇచ్చి..అభ్యర్థుల ప్రతిభ ఆధారంగా తుది జాబితా రూపొందించి ప్రవేశం ఖరారు చేస్తారు.

ఐఐఎం–బోధ్‌గయలో జిప్‌మ్యాట్ స్కోర్‌కు 70 శాతం, పదో తరగతి, ఇంటర్మీడియెట్ మార్కులకు 15 శాతం చొప్పున వెయిటేజీ కల్పిస్తారు. వాటిలో ప్రతిభ ఆధారంగా తుది ప్రవేశాలు ఖరారు చేస్తారు.

మేనేజ్‌మెంట్ లీడర్లను తీర్చిదిద్దేలా

ఐఐఎంలలోని ఇంటిగ్రేటెడ్ మేనేజ్‌మెంట్ పీజీ ప్రోగ్రామ్‌లు భవిష్యత్ మేనేజ్‌మెంట్ లీడర్లను తీర్చిదిద్దే విధంగా రూపొందించారు. కోర్సు తొలి సంవత్సరం నుంచే బిజినెస్ మేనేజ్‌మెంట్‌లో రాణించేందుకు అవసరమైన కమ్యూనికేషన్ స్కిల్స్, బిజినెస్ కమ్యూనికేషన్ స్కిల్స్, అదే విధంగా మేనేజ్‌మెంట్‌కు సంబంధించిన ఫండమెండల్స్‌ను బోధించే విధంగా కరిక్యులంను సిద్ధం చేశారు. అదే విధంగా బిజినెస్ మేనేజ్‌మెంట్‌లో కీలకంగా నిలుస్తున్న అకౌంటింగ్, ఫైనాన్స్ తదితర సబ్జెక్ట్‌లకు కూడా తొలి ఏడాది నుంచే బోధన మొదలవుతుంది.

ఇంటర్న్‌షిప్స్

ఐపీఎం ప్రోగ్రామ్‌లో భాగంగా ఐఐఎంలు.. మూడో ఏడాది నుంచే ఇంటర్న్‌షిప్‌ను అమలు చేస్తుండటం ఈ కోర్సుల మరో ప్రత్యేకతగా పేర్కొనొచ్చు. ఫలితంగా విద్యార్థులకు 19, 20 ఏళ్లకే క్షేత్ర స్థాయి అవగాహన, నైపుణ్యాలు లభించే అవకాశం ఉంటుంది.



మూడేళ్ల తర్వాత ఎగ్జిట్ అవకాశం

ఐపీఎం ప్రోగ్రామ్‌లో చేరి.. మూడేళ్ల తర్వాత ఆ కోర్సును కొనసాగించడం ఆసక్తి లేని విద్యార్థులకు ఎగ్జిట్ అవకాశం కూడా అందుబాటులో ఉంది. మూడేళ్ల తర్వాత బీబీఏ సర్టిఫికెట్‌తో బయటికి రావొచ్చు. అయితే నాలుగో ఏడాది తర్వాత మాత్రం ఎగ్జిట్ అవకాశం ఉండదు.

ఎంబీఏ విద్యార్థులతో కలిపి

అయిదేళ్ల ఇంటిగ్రేటెడ్ ప్రోగ్రామ్‌లలో చేరిన విద్యార్థులు మూడేళ్లు పూర్తి చేసుకున్న తర్వాత నాలుగో ఏడాది నుంచి ఎంబీఏ విద్యార్థులతో కలిపి బోధన నిర్వహిస్తారు. దీంతో క్యాట్ స్కోర్ ఆధారంగా పీజీ ప్రోగ్రామ్‌లలో ప్రవేశించిన విభిన్న నేపథ్యాల విద్యార్థులతో కలిసి అభ్యసించే అవకాశం లభిస్తోంది. ఫలితంగా విద్యార్థులకు ఇంటర్ కల్చరల్, ఇంటర్ పర్సనల్ స్కిల్స్ అలవడుతున్నాయి.

స్పెషలైజేషన్.. నాలుగో ఏడాది నుంచి

మేనేజ్‌మెంట్ పీజీ అనగానే గుర్తొచ్చేది.. స్పెషలైజేషన్ అన్న విషయం తెలిసిందే. ఐపీఎంలో చేరిన విద్యార్థులు తమకు ఆసక్తి గల స్పెషలైజేషన్‌ను ఎంపిక చేసుకుని నాలుగో సంవత్సరం నుంచి ఆ స్పెషలైజేషన్‌తో అభ్యసించే అవకాశం ఉంది. దాదాపు అన్ని స్పెషలైజేషన్లను ఇప్పుడు ఐఐఎం క్యాంపస్‌లు అందిస్తున్నాయి.

ఆకర్షణీయంగా ప్లేస్‌మెంట్ ఆఫర్స్

అయిదేళ్ల ఇంటిగ్రేటెడ్ పీజీ మేనేజ్‌మెంట్ ప్రోగ్రామ్ పూర్తి చేసుకున్న వారికి క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌లో ఆకర్షణీయ ఆఫర్లు లభిస్తున్నట్లు సదరు ఐఐఎం వర్గాలు పేర్కొంటున్నాయి. సగటు వేతనం రూ.22 లక్షలు కాగా.. గరిష్ఠ వేతనం రూ.40 లక్షలుగా నమోదవడం గమనార్హం.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ:** 2025, మార్చి 10.
- **దరఖాస్తు సవరణ అవకాశం:** మార్చి 13 నుంచి 15 వరకు.
- **జిప్‌మ్యాట్ తేదీ:** 2025, ఏప్రిల్ 26.
- **తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు:** కర్నూలు, గుంటూరు, విజయవాడ, విశాఖపట్నం, హైదరాబాద్.
- **వివరాలకు వెబ్‌సైట్:** https://exams.nta.ac.in/JIPMAT

జిప్‌మ్యాట్‌లో బెస్ట్ స్కోర్ ఇలా

కాన్సెప్ట్స్, ప్రాక్టీస్

జిప్‌మ్యాట్‌లో మెరుగైన స్కోర్, పర్సంటైల్ సాధించేందుకు అభ్యర్థులు తొలుత సిలబస్‌ను పరిశీలించి.. కాన్సెప్ట్‌లపై అవగాహన ఏర్పరచుకోవాలి. ఆ తర్వాత ప్రామాణిక మెటీరియల్‌ను ఆధారంగా చేసుకుని ప్రిపరేషన్ సాగించాలి. దీంతోపాటు ప్రతి టాపిక్ పూర్తయిన తర్వాత ప్రాక్టీస్ చేయడం ఎంతో మేలు చేస్తుంది.

క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్

మ్యాథమెటికల్, అర్థమెటికల్ స్కిల్స్‌ను పరీక్షించే విభాగం ఇది. ఇందులో రాణించేందుకు అర్థమెటిక్‌కు సంబంధించి పర్సంటేజెస్, రేషియోస్, డిస్టెన్స్-టైం వంటి అంశాలపై పట్టు సాధించాలి. మ్యాథమెటిక్స్‌కు సంబంధించి అల్‌జీబ్రా, మోడ్రన్ మ్యాథ్స్, జామెట్రీ అంశాలపై అవగాహన పెంచుకోవాలి.

డేటా ఇంటర్‌ప్రిటేషన్, లాజికల్ రీజనింగ్

ఇది విశ్లేషణాత్మక నైపుణ్యం, తార్కిక విశ్లేషణ నైపుణ్యాన్ని పరిశీలించే విభాగం. ఇందులో మెరుగైన స్కోర్ సాధించాలంటే.. టేబుల్స్, గ్రాఫ్స్, చార్ట్స్ ఆధారిత ప్రాబ్లమ్స్‌ను ప్రాక్టీస్ చేయాలి. లాజికల్ రీజనింగ్‌లో క్యూబ్స్, క్లాక్స్, నంబర్ సిరీస్, లెటర్ సిరీస్, సీటింగ్ అరేంజ్‌మెంట్ వంటి అంశాలను బాగా ప్రాక్టీస్ చేయాలి.

వెర్బల్ ఎబిలిటీ,రీడింగ్ కాంప్రహెన్షన్

ఈ విభాగంలో రాణించాలంటే.. ఇంగ్లిష్ కమ్యూనికేషన్, ఇంగ్లిష్ సబ్జెక్ట్ నాలెడ్జ్‌లను పెంచుకోవడానికి కృషి చేయాలి. యాంటానిమ్స్, సినానిమ్స్, బేసిక్ గ్రామర్‌పై పట్టు సాధించాలి. అదే విధంగా ఫ్యాక్ట్స్, ఇన్ఫరెన్సెస్, జంబుల్డ్ పారాగ్రాఫ్స్‌లను ప్రాక్టీస్ చేయడం ఉపయుక్తంగా ఉంటుంది. ప్యాసేజ్ ఆధారిత ప్రశ్నలు అడిగే రీడింగ్ కాంప్రహెన్షన్ కోసం అసెంప్షన్, స్టేట్‌మెంట్స్‌పై పట్టు సాధించాలి.

కటాఫ్ పర్సంటైల్

ఐఐఎం-జమ్ములో మలి దశ ఎంపిక ప్రక్రియకు అభ్యర్థులను పిలిచేందుకు సెక్షనల్ కటాఫ్, ఓవరాల్ కటాఫ్‌లను పేర్కొంటున్నారు. జనరల్ కేటగిరీ అభ్యర్థులు క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్‌లో 50, డేటా ఇంటర్‌ప్రిటేషన్‌లో 50, వెర్బల్ ఎబిలిటీలో 50 చొప్పున పర్సంటైల్ పొందాల్సి ఉంటుంది. సీటు ఖరారు చేసే క్రమంలో ప్రతి సెక్షన్‌లో అత్యధిక స్కోర్ సొంతం చేసుకున్న వారితో జాబితా రూపొందిస్తారు.

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

నేటి భవిత ఈ పేపర్‌లో..

- సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం-ఇండియన్ హిస్టరీ
- టెట్/డీఎస్సీ ప్రత్యేకం- బయాలజీ
- గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం- హిస్టరీ
- బ్యాంక్ ఎగ్జామ్స్ ప్రత్యేకం-ఇంగ్లిష్



ముఖరా(కె) గ్రామంలో క్యూఆర్ కోడ్‌తో చెట్లు

చెట్టూ... నీ చరిత్ర చెప్పూ..



చెట్టుకు ఏర్పాటు చేసిన డిజిటల్ ఆధార్ క్యూఆర్ కోడ్

చెట్టు జీవిత చరిత్ర తెలిపేలా క్యూఆర్ కోడ్

ప్రతి చెట్టుకూ ఓ ఆధార్.. జియోట్యాగింగ్‌తో పర్యవేక్షణ

దేశంలో తొలి డిజిటల్ ట్రీ ఆధార్ గ్రామంగా ముఖరా (కె)కు ఖ్యాతి

సాక్షి, ఆదిలాబాద్: దేశంలో ఇప్పుడు ప్రతి పౌరుడికీ ఓ గుర్తింపు ఉంది. అదే ఆధార్.. అలాంటి ఓ గుర్తింపే ప్రతి చెట్టుకు ఉంటే..? ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలం ముఖరా (కె) గ్రామానికి వెళితే.. ఇలాంటి ప్రత్యేక గుర్తింపు ఉన్న చెట్లు అడుగడుగునా కనిపిస్తాయి. దుకాణాల్లో కనిపించే క్యూఆర్ కోడ్ స్కానర్ల మాదిరే ఈ గ్రామ పరిధిలోని ప్రతి చెట్టుకూ స్కానర్లు కనిపిస్తాయి. వాటిని స్కాన్ చేస్తే ఆ చెట్టు వివరాలన్నీ మనకు ఫోన్‌లో దర్శనమిస్తాయి. చెట్టు గుర్తింపు నంబర్, అది ఏ రకం, మొక్క నాటిన తేదీ, సంవత్సరం, దాని వయస్సుతో పాటు అది వాతావరణం నుంచి ఎంత కార్బన్‌డయాక్సైడ్ తీసుకున్నదనే సకల వివరాలు కనిపిస్తాయి. దేశంలో చెట్లకు ప్రత్యేక గుర్తింపు నంబర్లు వేసిన తొలి గ్రామంగా ముఖరా (కే) రికార్డు సృష్టించింది. చెట్ల డేటాబేస్‌ను క్రోడీకరించేందుకు 'డిజిటల్ ట్రీ ఆధార్'కార్యక్రమాన్ని ఈ గ్రామంలో ప్రారంభించారు. గ్రామ మాజీ సర్పంచ్ గాడ్గే మీనాక్షి ఓ చెట్టుకు స్కానర్‌ను అమర్చి ఈ కార్యక్రమాన్ని మొదలుపెట్టారు. గ్రామంలోని ప్రతి చెట్టును జియోట్యాగింగ్ చేసి, క్యూఆర్ కోడ్ కేటాయించారు.

ఆది నుంచి ప్రత్యేకమే..

ఆరేళ్ల క్రితమే ఏర్పడిన ముఖరా (కె) గ్రామపంచాయతీ ఆది నుంచీ ప్రత్యేకతను చాటుకుంటోంది. గ్రామ తొలి సర్పంచ్‌గా గాడ్గే మీనాక్షిని ఆ గ్రామ ప్రజలు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామంలోని చెత్త నుంచి వర్మీ కంపోస్టును తయారు చేసి విక్రయించగా వచ్చిన రూ.5 లక్షలతో సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేశారు. దీంతో వీధి దీపాలకు, ప్రభుత్వ భవనాలకు విద్యుత్ బిల్లు జీరోగా మారింది. బహిరంగ మలవిసర్జన రహిత గ్రామంగా తీర్చిదిద్దడం ద్వారా ఓడీఎఫ్ ప్లస్‌లో స్థానం దక్కించుకుంది. గ్రామంలో సామూహిక మరుగుదొడ్లు కూడా నిర్మించారు. బృహత్ పల్లె ప్రకృతి వనాల ద్వారా గ్రామంలో 1,05,624 మొక్కలను ఐదేళ్లలో నాటారు. ప్రస్తుతం ఆ చెట్లు, మొక్కలకు జియోట్యాగింగ్, క్యూఆర్ కోడ్ స్కానర్ ఏర్పాటు చేస్తున్నారు. ఈ గ్రామానికి స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డు, దీన్‌దయాళ్ ఉపాధ్యాయ శక్తికరణ్ పురస్కార్, క్లీన్ అండ్ గ్రీన్ పంచాయతీ, స్వచ్ సుజల్ శక్తి సమ్మాన్ అవార్డు, గ్రామ ఊర్జాస్వరాజ్ విశిష్ట పంచాయతీ పురస్కార్, డిజిటల్ క్యాష్‌లెస్ విలేజ్ అవార్డులు లభించాయి.



క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసినప్పుడు వచ్చే వివరాలు

నాటిన ప్రతీ మొక్క బతకాలన్నదే మా తపన



మనం ఎన్ని మొక్కలు నాటాం? ఎన్ని బతికాయి? వాటి ప్రస్తుత పరిస్థితి ఏమిటి అనే విషయాలు తెలుసుకునేందుకే జియోట్యాగింగ్, క్యూఆర్ కోడ్ స్కానర్ బిగించే కార్యక్రమం చేపట్టాం. మొక్క ఎండిపోతే తిరిగి అక్కడే మరో మొక్క నాటేందుకు జియోట్యాగింగ్ ఉపయోగపడుతుంది. – గాడ్గే మీనాక్షి, మాజీ సర్పంచ్, ముఖరా (కె)

మావోయిస్టుల డంప్ లభ్యం

కంటి పరీక్షల పరికరాలను గుర్తించిన భద్రతాదళాలు



దుమ్ముగూడెం: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని సుక్మా జిల్లా చింతల్నార్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని అటవీ ప్రాంతంలో మావోయిస్టులకు చెందిన భారీ డంప్‌ను భద్రతా బలగాలు బుధవారం కనుగొన్నాయి. సాధారణంగా మావోయిస్టుల డంపుల్లో ఆయుధాలు, మందులు, డబ్బులు లభ్యమవుతుంటాయి. కానీ ఈ డంప్‌లో కంటి పరీక్షలు నిర్వహించే ఐఓఎల్ మాస్టర్ ఆప్టోమీటర్, లెన్స్‌కిట్‌లు, స్టెతలు దొరికాయి. దీంతో మావోయిస్టులు కంటి చూపు సమస్యలతో బాధపడుతున్నారని పోలీసులు అనుమానిస్తున్నారు. సరైన చూపు లేనందునే భద్రతా బలగాల రాకను గుర్తించలేకపోతున్నారని, అందుకే దళాలకు కంటి పరీక్షలు చేసేందుకు ఆధునిక పరికరాలు తెప్పించి ఉంటారని భావిస్తున్నారు. ఈ ఆధునిక సామగ్రిని ఎక్కడి నుంచి తెప్పించారు.. వారికి కంటి పరీక్షలు ఎవరు చేస్తున్నారు.. అనే విషయంపై భద్రతాధికారులు దృష్టి పెట్టారు.

చేయూత ఇవ్వండి

▶ మొదటి పేజీ తరువాయి

చర్యలపై ప్రధాని మోదీ ఆరా తీశారు. టన్నెల్‌లో ప్రమాదం అడగ్గా, గత పదేళ్లగా టన్నెల్ పనులు నిలిచిపోవడంతో.. నీటిఊటలు పెరిగి, మట్టి వదులు కావడంతో ప్రమాదం జరిగినట్టుగా ప్రాథమికంగా అంచనా వేశామని సీఎం వివరించారు. గల్లంతయిన వారిని రక్షించేందుకు అన్ని చర్యలు చేపట్టామని.. నిత్యం మంత్రులు సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన 12శాఖల అధికారులు సహాయక చర్యల్లో పాల్గొంటున్నారని వివరించారు. చిక్కుకున్న వారిని బయటికి తెచ్చేందుకు కేంద్రం తరపున అవసరమైన అన్ని రకాల సహాయం అందిస్తామని ప్రధాని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. కాగా ఈ భేటీలో బీసీ కులగణన, ఎస్సీ వర్గీకరణ అంశాలు చర్చకు రాలేదు. వీటిపై పూర్తిస్థాయి నివేదికలు అందాకే ప్రధానితో చర్చించాలనే ఉద్దేశంతోనే ఈ అంశాలను ప్రస్తావించనట్టు తెలిసింది.



మోదీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న శ్రీధర్‌బాబు. చిత్రంలో రేవంత్‌రెడ్డి

ప్రధానికి సీఎం చేసిన వినతులివీ..

- మెట్రో రైల్ ఫేజ్–2కు అనుమతులివ్వాలి. గత ప్రభుత్వం పదేళ్లుగా హైదరాబాద్‌లో మెట్రో విస్తరణపై దృష్టి సారించలేదు. నగరంలోఫేజ్–2 కింద రూ.24,269 కోట్ల అంచనా వ్యయంతో 76.4 కిలోమీటర్ల పొడవైన ఐదు కారిడార్లను ప్రతిపాదించాం. ఈ ప్రాజెక్టును వెంటనే అనుమతించాలి.
- ట్రిపుల్‌ఆర్ ఉత్తర భాగంలో ఇప్పటికే 90శాతం భూసేకరణ పూర్తయినందున, దక్షిణ భాగాన్ని కూడా వెంటనే మంజూరు చేయాలి. ఉత్తర భాగంతో పాటే దక్షిణభాగం పూర్తయితే ఆర్‌ఆర్‌ఆర్‌ను పూర్తిగా సద్వినియోగం చేసుకోగలం. దక్షిణ భాగం భూసేకరణకు అయ్యే వ్యయంలో 50శాతం భరించేందుకు రాష్ట్రం సిద్ధంగా ఉంది. ఆర్‌ఆర్‌ఆర్‌కు సమాంతరంగా రీజనల్ రింగ్ రైలు ప్రాజెక్టు ప్రతిపాదన ఉంది. ఈ రైలు పూర్తయితే తెలంగాణతోపాటు ఇతర రాష్ట్రాల్లోని రైలు మార్గాలతో అనుసంధానం సులభం అవుతుంది. ఈ మేరకు రీజనల్ రింగ్ రైలు కు అనుమతి ఇవ్వాలి. సముద్ర మార్గం లేని తెలంగాణకు వస్తువుల ఎగుమతులు, దిగుమతులు సులువుగా చేసేందుకు రీజనల్ రింగు రోడ్డు సమీపంలో డ్రైపోర్ట్ అవసరం. ఆ డ్రైపోర్ట్ నుంచి ఏపీలోని సముద్ర పోర్టులను కలిపేందుకు గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు, దానికి అనుకొని రైలు మార్గం మంజూరు చేయాలి.
- తెలంగాణ సంస్కృతి, ఆధ్యాత్మికత మూసీ నదితో ముడిపడి ఉంది. హైదరాబాద్ మధ్యలో ప్రవహిస్తున్న దృష్ట్యా.. మూసీ పునరుజ్జీవనానికి సహకరించాలి. ఈసా, మూసా నదుల సంగమంలో ఉన్న బాపూఘాట్ అభివృద్ధి, మూసీ ప్రక్షాళనకు 27 ఎస్టీపీల నిర్మాణం, మూసీ రిటైనింగ్ వాల్స్, కరకట్టల నిర్మాణం, మూసీ–గోదావరి నదుల అనుసంధానంతో కలిపి మొత్తంగా ప్రాజెక్టుకు రూ.20 వేల కోట్లు ఆర్థిక సాయం అందజేయాలి. బాపూఘాట్ వద్ద గాంధీ సరోవర్ ప్రాజెక్టు కోసం 222.7 ఎకరాల రక్షణ భూములను బదిలీ చేసేందుకు సహకరించాలి.
- రాష్ట్ర విభజన తర్వాత తెలంగాణకు 61 ఐపీఎస్ కేడర్ పోస్టులు రాగా.. 2015 లో రివ్యూ తర్వాత మరో 15 పోస్టులు అదనంగా వచ్చాయి. సైబర్ నేరాలు, డ్రగ్స్ కేసులు పెరగడం, పెరిగిన పట్టణాలు, ఇతర అవసరాల దృష్ట్యా అదనంగా 29 ఐపీఎస్ పోస్టులు మంజూరు చేయండి
- సెమీ కండక్టర్ల పరిశ్రమ ఏర్పాటుకు అనువైన పరిస్థితులు ఉన్నందున ఇండియా సెమీ కండక్టర్ మిషన్ ప్రాజెక్టును రాష్ట్రంలో ఏర్పాటు చేసేందుకు అనుమతించాలి.

మీరు వీటిని పరిష్కరించండి

రాష్ట్ర పరిధిలోని పలు అంశాలపై సీఎం రేవంత్‌కు ప్రధాని మోదీ నోట్

సాక్షి, న్యూఢిల్లీ: ప్రధాని మోదీని కలసి రాష్ట్రానికి సంబంధించిన అంశాలకు కేంద్ర సహకారం కోరాలనుకున్న సీఎం రేవంత్‌రెడ్డికి అరుదైన అనుభవం ఎదురైంది. సీఎం బుధవారం ఉదయం ఢిల్లీలో ప్రధానికి పలు విజ్ఞప్తులు చేయగా.. రాష్ట్ర పరిధిలో పెండింగ్‌లో ఉన్న కొన్ని కేంద్ర ప్రభుత్వ అంశాలను పరిష్కరించాలని సీఎం రేవంత్‌ను ప్రధాని మోదీ కోరారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం తరపున ఓ నోట్ అందజేశారు. అందులో పేర్కొన్న మేరకు.. 'ప్రధాన మంత్రి ఆవాస్ యోజన–గ్రామీణ్ (పీఎంఏవై–జి) ఇళ్ల కేటాయింపునకు సంబంధించి.. కేంద్రం నిర్దేశించిన ఆవాస్+ 2024 మొబైల్ అప్లికేషన్ ద్వారా అర్హులైన గ్రామీణ కుటుంబాలను గుర్తించాలి. రాష్ట్ర ప్రభుత్వం ఈ గృహ సర్వేను 2025 మార్చి 31 నాటికి పూర్తిచేయాలి. వామపక్ష తీవ్రవాద ప్రభావిత జిల్లాల్లో మొబైల్ నెట్‌వర్క్ కవరేజీ విస్తరణకు సంబంధించి రైట్ ఆఫ్ వే, అటవీ అనుమతులను క్లియర్ చేయాలి. దేవాదుల, రాజీవ్ భీమా లిఫ్టులు, శ్రీరాంసాగర్ రెండో దశ ప్రాజెక్టులకు సంబంధించి భూసేకరణ, పెండింగ్‌లో ఉన్న లిటిగేషన్ల పరిష్కారం, సవరించిన అంచనాల (ఆర్‌ఈ) ఆమోదం పూర్తి చేయాలి. బీబీనగర్ ఎయిమ్స్‌కు విద్యుత్ కనెక్షన్, నీటి సరఫరా రుసుముల బకాయిలు క్లియర్ చేయాలి. శంషాబాద్‌లో 100 పడకల ఈఎస్ఐ ఆస్పత్రి నిర్మాణానికి భూమి కేటాయించాలి. మనోహరాబాద్–కొత్తపల్లి కొత్త రైలు మార్గం, కాజీపేట– విజయవాడ 3వ లైన్ విద్యుదీకరణ ప్రాజెక్టుల భూసేకరణ, అటవీ అనుమతులను క్లియర్ చేయాలి..'' అని సూచించారు.

పదేళ్లు పనులు చేయనందునే

- టన్నెల్ ప్రమాదంపై మీడియాతో చిట్‌చాట్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- పెద్దగా కమీషన్లు రావనే కేసీఆర్ ఎస్ఎల్‌బీసీని గాలికొదిలేశారంటూ ఆరోపణ

సాక్షి, న్యూఢిల్లీ: శ్రీశైలం ఎడమ గట్టు కాల్వ (ఎస్ఎల్‌బీసీ) సొరంగం కూలడానికి బీఆర్ఎస్ హయాంలో జరిగిన ఉద్దేశపూర్వక జాప్యమే ప్రధాన కారణమని సీఎం రేవంత్‌రెడ్డి ఆరోపించారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్న పదేళ్లపాటు ప్రాజెక్టు పనులు చేయకుండా, గాలికి వదిలేయడం వల్లే ప్రమాదం జరిగిందని వ్యాఖ్యానించారు. టన్నెల్‌లో చిక్కుకున్న కూలీలను కాపాడే ప్రయత్నాలు జరుగుతున్నాయని, సహాయక చర్యలు ముగిస్తేనే టన్నెల్ బోరింగ్ మెషీన్‌కు ఎంత మేర నష్టం జరిగిందన్నది, ప్రాజెక్టును ఎలా ముందుకు తీసుకెళ్లాలన్నది తెలుస్తుందని పేర్కొన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ టన్నెల్ పూర్తి చేయాలన్నదే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. ఢిల్లీలో బుధవారం ప్రధాని మోదీతో భేటీ అనంతరం సీఎం రేవంత్ తన అధికారిక నివాసంలో మీడియాతో చిట్‌చాట్ చేశారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

''ఎస్ఎల్‌బీసీ టన్నెల్ మొత్తం 43 కిలోమీటర్లు తవ్వాల్సి ఉంటే.. అందులో కాంగ్రెస్ హయాంలోనే 30 కిలోమీటర్లు పూర్తయింది. బీఆర్ఎస్‌లో కొద్దిమాత్రం పనులు చేసి వదిలేశారు. కమీషన్లు వచ్చే ప్రాజెక్టు కాదని దీనిని మూసేయాలని కేసీఆర్ భావించారు. కాళేశ్వరం ప్రాజెక్టులా లక్ష కోట్లు వెచ్చించేది అయితే దీనిని పట్టించుకునేవారు. అధికారంలో ఉన్న పదేళ్లలో కనీసం పాడైన విడిభాగాలను సైతం తెప్పించలేదు. పదేళ్లుగా ప్రాజెక్టు పనులు చేయకపోవడంతో టన్నెల్‌లో నీటి ఊటలు పెరిగాయి. భూమి పొరలు మెత్తబడ్డాయి. దీంతో పనులు మొదలుపెట్టిన నాలుగు రోజులకే అది కూలింది. దీనికి ప్రధాన కారణం కేసీఆర్ ఉద్దేశపూర్వక నిర్లక్ష్యమే..

అన్నీ నదులు పునరుద్ధరించి మూసీని చేయరా?

బీజేపీ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో నదుల పునరుద్ధరణ చేస్తోంది. యూపీలో గంగ, గుజరాత్‌లో సబర్మతి, ప్రస్తుతం ఢిల్లీలో యమున నదినీ పునరుద్ధరిస్తోంది. అదే మాదిరి తెలంగాణలో మూసీని పునరుద్ధరిస్తామని, దానికి నిధులివ్వాలని ప్రధానిని కోరా.. మూసీ పునరుజ్జీవం మంచి ఆలోచన అని ప్రధాని సైతం అన్నారు. అన్ని నదులను పునరుద్ధరిస్తూ మూసీని పట్టించుకోకుంటే ఎలా? మూసీకి గోదావరి నీళ్లను మల్లన్నసాగర్ నుంచి తెస్తామా? లేక తుమ్మిడిహెట్టి నుంచి తెస్తామా? అన్నది రెండో అంశం. గోదావరి నీటితో మూసీని పునరుజ్జీవం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం, రాష్ట్రానికి చెందిన కేంద్ర మంత్రులు సహకరించాలి. కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డను తిరిగి వినియోగంలోకి తేవడంపై ఎన్‌డీఎస్‌ఏ కమిటీ నివేదిక ఆధారంగా ముందుకు వెళతాం. రాష్ట్రంలో కాళేశ్వరం నీళ్లు అందుబాటులో లేకున్నా 1.56 కోట్ల టన్నుల ధాన్యం పండిందని అందరూ గుర్తుంచుకోవాలి.

ఆ బాధ్యత తీసుకుంటే కేంద్ర మంత్రులను సన్మానిస్తా..

ప్రధాని మోదీకి రాష్ట్రానికి సంబంధించిన ఐదు అంశాలపై విజ్ఞప్తులు ఇచ్చాం. వాటిని ఆమోదింపజేసే బాధ్యత కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లదే. ఆ అనుమతులు, నిధులు తీసుకొస్తే బహిరంగసభ పెట్టి వారిని సన్మానిస్తాం. చేతికి గండపెండేరం కూడా తొడిగిస్తా. నా వంతు చేయాల్సిందంతా చేశా. అవన్నీ సాధించి తీసుకొస్తే ఆ క్రెడిట్ వాళ్లే సొంతం చేసుకోవచ్చు. తీసుకురాకుంటే కిషన్‌రెడ్డి, బండి సంజయ్ ఇద్దరూ గుజరాత్ లేదా మరో చోటు చూసుకోవాల్సి వస్తుంది.

మెట్రోను అడ్డుకున్నది కిషన్‌రెడ్డే...

హైదరాబాద్‌కు మెట్రో రాకుండా కేంద్ర కేబినెట్ ముందు అడ్డుకున్నది కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డే. మెట్రోకు అనుమతులిస్తే కాంగ్రెస్‌కు మెరిట్ వస్తుందని.. వారి పార్ట్‌నర్, మిత్రుడు కేసీఆర్‌కు క్రెడిట్ రాదన్న సాకుతోనే కిషన్‌రెడ్డి మెట్రోను అడ్డుకున్నారు. కిషన్‌రెడ్డి ప్యాంట్ కూడా తొడగక ముందే హైదరాబాద్‌కు కాంగ్రెస్ పార్టీ మెట్రో తీసుకొచ్చింది. అప్పటి కేంద్ర పట్టణాభివృద్ధి మంత్రి జైపాల్‌రెడ్డి కృషి వల్లే నగరానికి మెట్రో వచ్చింది.

ఆ మరణాలపై కేటీఆర్ విచారణ కోరడం లేదేం?

దుబాయ్‌లో మృతి చెందిన సినీ నిర్మాత కేదార్.. కేటీఆర్‌కు సన్నిహితుడు, బిజినెస్ పార్ట్‌నర్ కూడా. ఆయన దుబాయ్‌లో చనిపోయాడు. బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డికి కూడా కేదార్ ఫ్రెండే. రాడిసన్ డ్రగ్స్ కేసులో ఉన్నాడు. కాళేశ్వరంపై కోర్టులో కేసు వేసిన రాజలింగమూర్తి, కాళేశ్వరం కేసు వాదించిన న్యాయవాది సంజీవరెడ్డి మరణించారు. ఈ ముగ్గురి అనుమానాస్పద మరణాలపై కేటీఆర్ ఎందుకు మాట్లాడటం లేదు? ఫ్రెండ్ చనిపోతే ఎందుకు విచారణ కోరడంలేదు?''అని సీఎం రేవంత్ ప్రశ్నించారు.

జనాభా ప్రాతిపదికన నియోజకవర్గాల పునర్విభజనతో

దక్షిణాదికి అన్యాయం

తమిళనాడు సీఎం స్టాలిన్ ఆందోళనతో పూర్తిగా ఏకీభవిస్తున్నా: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



సాక్షి, హైదరాబాద్: జనాభా ప్రాతిపదికన నియోజకవర్గాల పునర్విభజన చేయాలనే కేంద్ర ప్రభుత్వ నిర్ణయంతో దక్షిణాది రాష్ట్రాలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ అంశంలో తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ సామాజిక మాధ్యమాల్లో వ్యక్తం చేసిన ఆందోళనలతో తాను పూర్తిగా ఏకీభవిస్తున్నట్టు బుధవారం విడుదల చేసిన ప్రకటనలో కేటీఆర్ పేర్కొన్నారు. 'జనాభా నియంత్రణలో దక్షిణాది రాష్ట్రాల కృషిని పట్టించుకోకుండా జనాభా ఆధారంగా నియోజకవర్గాలను పునర్విభజించడం ప్రజాస్వామ్యానికి, సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధం. దక్షిణాది రాష్ట్రాలు దేశ నిర్మాణంలో అందించిన సహకారాన్ని ఎవరూ కాదనలేరు. 1951లో దక్షిణాది రాష్ట్రాల జనాభా వాటా 26.2 శాతం ఉండగా, 2022 నాటికి అది 19.8 శాతానికి పడిపోయింది. అదే సమయంలో ఉత్తరప్రదేశ్, బిహార్, మధ్యప్రదేశ్, రాజస్తాన్ వంటి ఉత్తర రాష్ట్రాల జనాభా వాటా 39.1 శాతం నుంచి 43.2 శాతానికి పెరిగింది. ఈ పరిస్థితుల్లో జనాభా ఆధారంగా లోక్‌సభ సీట్లను నిర్ణయిస్తే, ఉత్తరప్రదేశ్, బిహార్‌కు 222 సీట్లు వస్తాయి. దక్షిణాది రాష్ట్రాలైన తెలంగాణ, ఏపీ, తమిళనాడు, కర్ణాటక, కేరళకు మొత్తంగా కేవలం 165 సీట్లు మాత్రమే లభిస్తాయి. దక్షిణాది రాష్ట్రాలు ఆర్థిక వృద్ధి, మానవ అభివృద్ధి సూచికలు, జనాభా నియంత్రణ వంటి అన్ని రంగాల్లో ఉత్తర రాష్ట్రాల కంటే గణనీయంగా మెరుగైన పనితీరు కనబరిచాయి. అలాంటి రాష్ట్రాలను శిక్షించి, వెనుకబడిన రాష్ట్రాలను ప్రోత్సహించడం దేశ ప్రయోజనాలకు వ్యతిరేకం 'అని కేటీఆర్ పేర్కొన్నారు.

అధికార యంత్రాంగంపై వేధింపులు సిగ్గుచేటు

'తెలంగాణ స్టేట్ స్టాటిస్టికల్ అబ్‌స్ట్రాక్ట్ (అట్లాస్) రిపోర్టుతో కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థత రాష్ట్ర ప్రజల ముందు బట్టబయలు కావడం సీఎంకు మింగుడు పడటం లేదు. వెబ్‌సైట్ నుంచి రిపోర్టులు తొలగించి, అధికారులపై వేటు వేసినంత మాత్రాన కేసీఆర్ కృషిని చెరిపివేయలేరు'అని కేటీఆర్ అన్నారు.

టెక్, ఇన్నోవేషన్ సమ్మిట్–2025కు కేటీఆర్

ఫిబ్రవరి 27, 28 తేదీల్లో జరిగే టెక్, ఇన్నోవేషన్ సమ్మిట్ (టీస్)లో ముఖ్య అతిథిగా ప్రసంగించేందుకు కేటీఆర్ బుధవారం సాయంత్రం బెంగళూరుకు బయలుదేరివెళ్లారు. గురువారం జరిగే సదస్సులో 'డ్రైవింగ్ డిజిటల్ ఇండియా– సాంకేతికంగా అభివృద్ధి చెందిన భవిష్యత్ కోసం ఆవిష్కరణలు, వ్యూహాలు'అనే అంశంపై కేటీఆర్ కీలకోపన్యాసం చేస్తారు.

టిపినీ కాదు.. చద్దన్నం

స్టాళ్లకు ఆదరణ





రామగిరి(నల్లగొండ): పెద్దల మాట.. చద్దన్నం మూట.. అంటారు. పాత కాలంలో చద్దన్నమే ఆహారం. ఆధునిక జీవన శైలికి అనుగుణంగా ఆహారపు అలవాట్లు మారాయి. కానీ, ఇప్పుడు పాత తరం చద్దన్నానికి ఆదరణ లభిస్తోంది. నల్లగొండ ఎన్జీ కాలేజీ గేటు వద్ద చద్దన్నం స్టాళ్లు పెట్టారు. ఆరోగ్యానికి మేలు చేస్తుండడంతో ప్రజల నుంచి ఆదరణ బాగా వస్తోంది. సాధారణ బియ్యంతో పాటు బ్రౌన్ రైస్‌తో కూడా చద్దన్నం తయారు చేస్తున్నారు. జొన్నగట్క, రాగి జావ కూడా స్టాళ్లలో విక్రయిస్తుండటంతో తినే వారి సంఖ్య రోజు రోజుకూ పెరుగుతోంది. చద్దన్నం స్టాళ్ల వద్ద పొద్దున్నే జనం బారులు తీరుతున్నారు.

రాష్ట్రంలోనే తొలి సోలార్ 'మహాప్రస్థానం'

- మంచిర్యాలలో సిద్ధమైన కేంద్రం
- మరో 3 వారాల్లో వినియోగంలోకి



సౌర విద్యుత్‌తో ఏర్పాటు చేసిన దహన వాటికలు



మంచిర్యాల మహాప్రస్థానంలో శివుని విగ్రహం

మంచిర్యాలఅర్బన్/మంచిర్యాల టౌన్: రాష్ట్రంలో ఎక్కడా లేనివిధంగా మంచిర్యాల జిల్లా కేంద్రంలో సోలార్ విద్యుత్‌తో ఆధునిక వసతులతో కూడిన మహాప్రస్థానం (వైకుంఠధామం) సిద్ధమైంది. మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా బుధవారం మంచిర్యాల ఎమ్మెల్యే కె.ప్రేమ్‌సాగర్‌రావు, సురేఖ దంపతులు మహాప్రస్థానం ప్రాంగణంలోని శివుని విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే ఆధ్వర్యంలో గత ఏడాది అక్టోబర్ 3న దీనికి శంకుస్థాపన చేశారు. నాలుగెకరాల్లో ఈ వైకుంఠధామం నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వ 14వ ఆర్థిక సంఘం నిధుల నుంచి రూ.4 కోట్లు, ఎస్‌డీఎఫ్ నుంచి రూ.42 లక్షలు కేటాయించారు. కాగా, అద్దె ఇళ్లలో ఉండే వారు ఎవరైనా చనిపోయిన సమయంలో మృతదేహాలను కొందరు యజమానులు ఇళ్ల వద్దకు అనుమతించడం లేదు. ఈ నేపథ్యంలో అద్దె ఇళ్లలో ఉండేవారితోపాటు ఇంటి వద్ద సరైన సౌకర్యాలు లేని వారు ఇబ్బందిపడకుండా.. ఖననం, కర్మకాండలు, కేశఖండనం తదితర వసతులు కూడా కల్పించారు. చిన్నచిన్న పనులు పూర్తికాగానే మరో మూడు వారాల్లో మహాప్రస్థానాన్ని అందుబాటులోకి తీసుకురానున్నారు.

పట్టాలెక్కి.. పట్టిపట్టి చూస్తుంది!



ఓదెల (పెద్దపల్లి): రైలు ప్రమాదాలను ముందుగా గుర్తించి నివారించడం, పట్టాల్లో లోపాలు సవరించడం, విరిగిన ఫిష్‌ప్లేట్లను గుర్తించడం, వంతెనలు, వాగులపై ప్రమాదాల ముప్పును గుర్తించి నివారించడం కోసం ఈ ఆర్టీ–19ను రూపొందించారు. ఇది కాజీపేట నుంచి బల్హార్షా వెళ్తుండగా పెద్దపల్లి జిల్లా కొలనూరు రైల్వేస్టేషన్‌లో ఇలా పట్టాలపై కనిపించింది. ఈ వాహనం రోజూ సుమారు 200 కిలోమీటర్ల పొడవునా ప్రయాణిస్తూ.. పట్టాల పటిష్టతను పరిశీలిస్తుందని సిబ్బంది తెలిపారు.

ఇంటర్నేషనల్ డ్రగ్స్ దందా కేసులో

రూ.7.98 కోట్ల ఆస్తులు జప్తు

22 స్థిర, 8 చరాస్తులను సీజ్ చేసిన ఈడీ




సాక్షి, హైదరాబాద్: ఇంటర్నేషనల్ డ్రగ్స్ దందా కేసులో రూ.7.98 కోట్ల విలువైన ఆస్తులను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) జప్తు చేసింది. మనీ లాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్‌ఏ) నిబంధనల మేరకు చేపట్టిన ఈ తాత్కాలిక జప్తులో 22 స్థిర, 8 చరాస్తులున్నాయి. మధ్యప్రదేశ్ ఇండోర్‌లో నిందితుడు ఆశిష్ జైన్, అతని కుటుంబ సభ్యుల పేరుపై ఉన్న రూ.6.52 కోట్ల విలువైన భూములు, రూ.1.46 కోట్ల బ్యాంక్ బ్యాలెన్స్, ఫిక్స్‌డ్ డిపాజిట్లు సీజ్ చేసినట్లు ఈడీ బుధవారం పేర్కొంది. హైదరాబాద్ దోమలగూడలోని జేఆర్ ఇన్ఫినిటీ ప్రైవేట్ లిమిటెడ్ పేరుతో ఆశిష్ జైన్ డ్రగ్స్ దందా నడుపుతున్నట్లు 2022లో ఎన్సీబీ అధికారులు గుర్తించారు. ఆశిష్ ఇంట్లో అధికారులు సోదాలు నిర్వహించి, రూ.3.72 కోట్ల నగదుతో పాటు ల్యాప్‌టాప్, మొబైల్ ఫోన్, ఇతర ఎలక్ట్రానిక్ గాడ్జెట్లను స్వాధీనం చేసుకున్నారు. 2022, మే 4న ఎన్సీబీ కేసు ఆధారంగా ఈడీ రంగంలోకి దిగింది. జేఆర్ ఇన్ఫినిటీ, ఆశిష్ జైన్, అతని కుటుంబ సభ్యులపై దర్యాప్తు ప్రారంభించింది. హైదరాబాద్‌లోని ఇంటర్నెట్ ఫార్మసీ ద్వారా అమెరికా తదితర దేశాలకు ఫార్మా డ్రగ్స్ సరఫరా చేస్తున్నట్లు గుర్తించింది. ఎవరికీ ఎటువంటి అనుమానం రాకుండా రహస్యంగా కంపెనీ ఆన్‌లైన్‌లో ఫార్మా మందులతో పాటు జేఆర్ ఇన్ఫినిటీ పేరుతో అక్రమ దందా నడుపుతున్నట్లు తెలుసుకుంది. మెయిల్స్, వీఓఐపీ ద్వారా కస్టమర్ల నుంచి ఆర్డర్స్ తీసుకుని డ్రగ్స్ సరఫరా చేసేవారని, క్రెడిట్ కార్డు, బిట్ కాయిన్స్ ద్వారా చెల్లింపులు కొనసాగుతున్నాయని గ్రహించింది. అల్ప్రాజోలం, జోల్పిడెమ్, లోరాజెపామ్, క్లోనాజెపామ్, హైడ్రోకోడోన్, ఆక్సికోడోన్ తదితర సైకోట్రోపిక్ పదార్థాలను ట్యాబ్లెట్ల రూపంలో చట్టవిరుద్ధంగా ఎగుమతి చేస్తున్నారని విచారణలో తేలింది. జేఆర్ ఇన్ఫినిటీ ఏర్పాటుకు ముందే ఆశిష్‌జైన్, అతని కుటుంబ సభ్యుల బ్యాంక్ ఖాతాల్లో రూ.4.50 కోట్లు విదేశాల నుంచి వచ్చినట్లు తేల్చారు. ఇలా రూ.12.76 కోట్లు ఫిక్స్‌డ్ డిపాజిట్లకు, స్థిరాస్తుల కొనుగోలుకు వెచ్చించినట్లు ఈడీ పేర్కొంది.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.

అందమైన బంధానికి అపురూపం

ఉమ్మడి వరంగల్‌లో పెరిగిన ప్రీ వెడ్డింగ్ షూటింగ్ సరదా

ఆధునిక కెమెరాలతో చిత్రీకరణ ● భారీ ఖర్చుకు వెనకాడని నవ దంపతులు



కోటి ఆశలతో, వేల ఊసులతో ఒక్కటయ్యే అనుబంధం. నమ్మకమనే ఆస్తిని ఇద్దరి భుజస్కంధాలపై మోయాలనే మాటకు అసలైన అర్థం పెళ్లి. అంతటి ముఖ్యమైన ఘట్టంలోని మధుర క్షణాలు, జ్ఞాపకాలను పదిలంగా దాచుకునేందుకు నేటితరం ఆసక్తి చూపుతోంది. ఓ వైపు కల్యాణ మండపం, విందు.. మరోవైపు అందంగా.. ఆధునికంగా చిత్రాలు, వీడియోల చిత్రీకరణకు ఎంత ఖర్చయినా వెనకాడటం లేదు. ఇందుకోసం కొత్తగా 'ప్రీ వెడ్డింగ్ షూట్'కు యువత ఆసక్తి చూపిస్తోంది. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ఆయా ప్రాంతాల్లో పెళ్లి చేసుకుంటున్న జంటలు ప్రీ వెడ్డింగ్ షూట్ వైపు మొగ్గు చూపుతున్నారు. అందమైన ఊహలు, దివ్యమైన ఆలోచనలకు రూపాన్నిచ్చేలా.. చక్కటి రూపం కల్పిస్తుండడంతో ఈ సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. వధూవరుల ఇళ్లకు పరిమితమవ్వకుండా.. పచ్చదనంతో నిండిన అందమైన ప్రాంతాలకు వెళ్తున్నారు.

- తొర్రూరు



వెడ్డింగ్ షూట్ కొత్తపుంతలు..

ఉమ్మడి వరంగల్ జిల్లాలోని హనుమకొండ, వరంగల్, కాజీపేట, నర్సంపేట, మహబూబాబాద్, భూపాలపల్లి తదితర పట్టణాల్లో ఫొటో, వీడియోగ్రఫీ కొత్త పుంతలు తొక్కుతోంది. 'ప్రీ వెడ్డింగ్ షూట్'కు ప్రత్యేక చిత్రాలను తీయించుకునేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. వీడియో, ఫొటోగ్రాఫర్లతో ఒప్పందం కుదుర్చుకునే ముందు.. గతంలో వారు తీసిన వీడియోలను చూశాకే బుక్ చేసుకుంటున్నారు. గతంలో కేవలం సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు, వ్యాపార, వాణిజ్య, రాజకీయ నాయకుల పిల్లలు మాత్రమే వీటికి ప్రాధాన్యం ఇచ్చేవారు. ప్రస్తుతం అందరిలో ఆసక్తి పెరగడంతో ఆయా ప్రాంతాల్లో కొత్త విధానానికి మొగ్గు చూపుతున్నారు.

అందమైన ప్రదేశంలో ఫొటో.. వీడియో షూట్లకు నవ వధూవరులు ఆసక్తి చూపుతున్నారు. వివాహానికి ముందే వధూవరులు

అందమైన కావ్యంలా..

తమ హావభావాలు, సంభాషణలు, సాన్నిహిత్యాన్ని చిత్రీకరించుకుంటున్నారు. భిన్న కోణాల్లో చూసుకుని మురిసిపోయేందుకు.. రేపటి తరానికి చూపించేందుకు ఎంత వ్యయమైనా వెచ్చించేందుకు సిద్ధమవుతున్నారు. 'ప్రీ వెడ్డింగ్ షూట్' ద్వారా ఆధునిక కెమెరాలతో ఓ సినిమా పాటలా చిత్రీకరిస్తున్నారు.

ప్రీ వెడ్డింగ్ షూట్‌ను చిత్రీకరించేందుకు హైడెన్సిటీ (హెచ్‌డీ) టెక్నాలజీని ఉపయోగిస్తున్నారు. ఈ మేరకు డీఎస్‌ఎల్‌ఆర్, డ్రోన్, 5డీ, మార్క్ 3, మార్క్ 4, సోని, 1 డీఎక్స్, 1 డీఎక్స్ మార్క్ తదితర కెమెరాలను ఉపయోగిస్తున్నారు. ఒక షూట్ చేయడానికి కనీసం నలుగురు కెమెరామన్లు పని చేస్తున్నారు. డ్రోన్ కెమెరాలను కూడా వినియోగిస్తున్నారు. ఒక్కొక్క కెమెరాకు ఒక్కొక్క లెన్స్‌లను ఉప

అత్యాధునిక కెమెరాలతో చిత్రీకరణ..

యోగించి వధూవరులపై సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. మూడు నుంచి 4 నిమిషాల నిడివిగల పాటకు సుమారు 2 నుంచి 3 రోజుల పాటు పని చేస్తారు. ఒక పాటకు ఒక్కోసారి ప్రదేశాలను కూడా మార్చాల్సి ఉంటుంది. ప్రదేశం మారిన సమయంలో దుస్తులను మార్చుకోవడం, మేకప్ వంటి వాటికి ప్రాధాన్యం ఇవ్వడంతో సమయం ఎక్కువ పడుతుంది.

వధూవరులపై సన్నివేశాల చిత్రీకరణ కెమెరామెన్ల ఆలోచన, సృజనాత్మకతను బట్టి ఉంటుంది. ఒక్కోసారి వధూవరుల ఆలోచనలకూ

ఎడిటింగ్ కీలకం..

ప్రాధాన్యమిస్తారు. చిత్రీకరణకు 2 నుంచి 3 రోజుల సమయం పట్టినా దాన్ని పాట రూపంలో తీసుకొచ్చేందుకు ఎంతో శ్రమించాల్సి ఉంటోంది. ఎడిటింగ్‌కు కనీసం 10 రోజుల సమయం పడుతుంది. ఈ మేరకు సీన్‌కట్, ఈడీఎస్, ప్రీమియర్, ఆఫ్టర్ ఎఫెక్ట్స్ వంటి సాఫ్ట్‌వేర్లు ఉపయోగిస్తారు.

ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ప్రకృతి రమణీయ ప్రదేశాల్లో షూటింగ్ జరుపుతున్నారు. లక్నవరం చెరువు, రామప్ప లేక్, పాకాల చెరువు, కాకతీయ మ్యూజికల్ గార్డెన్, గోవిందరాజుల గుట్ట,

వివిధ ప్రాంతాల్లో చిత్రీకరణ..

ఏటూరునాగారం అభయారణ్యం, పాకాల అభయారణ్యం, వేయిస్తంభాల గుడి, కాకతీయ రాక్ గార్డెన్, భద్రకాళి టెంపుల్ తదితర ప్రాంతాలతో పాటు గ్రామీణ ప్రాంతాలలో ప్రీ వెడ్డింగ్ షూట్ నిర్వహిస్తున్నారు.

వధూవరుల అభిరుచులు, ఆలోచనలకు తగ్గట్టుగానే ప్రదేశాలతో పాటు సంస్కృతి, సంప్రదాయాలకు అనుగుణంగా వారి ఆలోచనలకు ప్రతిరూపం ఇస్తున్నారు. ఆహార్యం అదిరేలా

అభిరుచికి తగ్గట్టుగా..

దుస్తులను ఎంపిక చేసుకుంటున్నారు. ఈ షూట్‌కు సంబంధించి ఇంటీరియర్ కన్నా అవుట్‌డోర్‌లో షూటింగ్‌కు ఆసక్తి చూపిస్తున్నారు. అందమైన ప్రదేశాలు, ఎత్తయిన కొండలు, అడవులు, ఆలయాలను ఎంపిక చేసుకుంటున్నారు. వివాహానికి ముందే ఈ షూటింగ్‌ను పూర్తి చేసేలా ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నారు. చిత్రీకరణ పూర్తి కాగానే..పాటకు రూపం కల్పిస్తున్నారు.

గతంలో పెళ్లికి ఫొటోలు, వీడియో తీయించుకోవాలంటే తెలిసిన ఫొటోగ్రాఫర్లకు చెప్పుకునేవాళ్లు. కానీ ఇప్పుడా పరిస్థితి పూర్తిగా మారిపోయింది. కేవలం ప్రీ వెడ్డింగ్ షూట్ కాకుండా ఆల్బమ్‌లు,

లక్షలు ఖర్చయినా లక్షణంగా..

వీడియోలు అన్ని కలిపి ప్యాకేజీగా తీసుకుంటున్నారు. దీనికి రూ.లక్ష నుంచి రూ.10 లక్షల వరకు పలు రకాల ప్యాకేజీలున్నాయి. ఇందులో ప్రీ వెడ్డింగ్ షూట్, పోస్ట్ వెడ్డింగ్ షూట్స్ కూడా ఉంటాయి. వివాహానికి కొద్ది రోజుల ముందు, వివాహమైన తర్వాత రెండు రోజుల పాటు ప్రత్యేకంగా షూటింగ్ చేసి వీడియోలను చిత్రీకరిస్తున్నారు.

వాట్సాప్, ఫేస్‌బుక్‌లో షేరింగ్..

గతంలో వివాహాలంటే చాలా రోజుల ముందు నుంచే హడావుడి మొదలయ్యేది. బంధువులు, స్నేహితులకు శుభలేఖల పంపిణీ చేయడం పెద్ద ప్రహసనంగా మారిపోయేది. కానీ ఈ ప్రీ వెడ్డింగ్ షూట్ పుణ్యమా.. అని ఆ శ్రమ లేకుండా పోయింది. ప్రీ షూట్ చేశాక పెళ్లికి ముందు తమ సమీప బంధువులు, స్నేహితులకు అందరికీ వాట్సాప్, ఫేస్‌బుక్ తదితర సామాజిక మాధ్యమాల్లో పంపుకొంటున్నారు. ఈ డిజిటల్ ఆహ్వానాన్నే పెళ్లి కార్డుగా ఉపయోగిస్తున్నారు.

ఫొటోగ్రాఫర్లు, వీడియోగ్రాఫర్లకు పెళ్లిళ్ల సీజన్‌లో మాత్రమే పని ఉండేది. ప్రస్తుతం ట్రెండ్ నడుస్తుండటంతో వారికి గిరాకీ పెరిగింది. ప్రీ వెడ్డింగ్ షూట్ల వల్ల పెళ్లికి ముందు, తర్వాత కూడా చేతినిండా పని

పెరిగిన ఉపాధి..

దొరుకుతుంది. సమర్థవంతులైన ఫొటోగ్రాఫర్లు బృందాలుగా ఏర్పడి వేడుకలను నిర్వహిస్తున్నారు. యువతరం ఆసక్తి పెరగడంతో నాణ్యతతో కూడిన అత్యాధునిక కెమెరాలను ప్రీ వెడ్డింగ్ షూట్‌కు వినియోగిస్తున్నారు. ఉపాధి పొందుతున్నారు.









బయో ఆసియా సదస్సు



బయో ఆసియా సదస్సులో ఓ స్టాల్‌ను పరిశీలిస్తున్న ఆర్టీసీ ఎండీ సజ్జనార్





సదస్సులో ఏర్పాటు చేసిన వివిధ స్టాళ్లు

క్రిటికల్ మినరల్‌పై సింగరేణి ఆసక్తి

వ్యాపార విస్తరణపై ప్రత్యేక దృష్టి

- కాలుష్యరహిత ఉత్పత్తిపై ఆసక్తి
- 11 రకాల కీలక ఖనిజాల ఉత్పత్తికి సింగరేణి నజర్
- క్వీన్స్‌లాండ్ మైనింగ్‌కు నోడల్ ఏజెన్సీగా సింగరేణి



క్వీన్స్‌లాండ్ మంత్రితో భేటీ అయిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, సింగరేణి సీఎండీ బలరాం (ఫైల్)

గోదావరిఖని: క్రిటికల్ మినరల్స్‌పై సింగరేణి ఆసక్తి చూపుతోంది. కీలక ఖనిజాలు, మైనింగ్ రంగంలో సింగరేణికి సహకరించేందుకు ఆస్ట్రేలియాలోని క్వీన్‌లాండ్‌తో అవగాహన కుదుర్చుకుంది. బొగ్గు వెలికితీతతో పాటు థర్మల్, సౌర విద్యుదుత్పత్తి చేస్తూ సింగరేణి అపార అనుభవం గడించింది. కొద్దిరోజుల్లో పవన, జల విద్యుదుత్పత్తి సాధించనుంది. ఇతర రంగాల్లోనూ వివిధ సంస్థలకు శిక్షణ ఇస్తోంది. ఈనెల 24న హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో క్రిటికల్ మినరల్స్ ఉత్పత్తి, వ్యాపార విస్తరణపై ఆస్ట్రేలియాలోని క్వీన్స్‌లాండ్ రాష్ట్ర ఆర్థిక, వాణిజ్య, ఉపాధి శిక్షణ మంత్రి రోస్‌బేట్స్‌తో సింగరేణి ప్రతినిధులు భేటీ అయ్యారు. వివిధ పలు అంశాలపై పరస్పర అవగాహనకు వచ్చారు. దేశంలో విద్యుత్ వాహనాలు, సౌర విద్యుత్, బ్యాటరీ స్టోరేజ్ సిస్టంలకు విపరీతమైన డిమాండ్ ఉన్న నేపథ్యంలో.. క్రిటికల్ మినరల్స్‌కు మంచి భవిష్యత్ ఏర్పడింది. ఈ రంగానికి అవసరమైన వనడియం, కోబాల్ట్, ఇండియం, క్రోమియం, టైటానియం వంటి 11 రకాల కీలక ఖనిజాలకు ప్రాధాన్యం ఏర్పడింది. ఇప్పటివరకు ఈ కీలక ఖనిజాలను విదేశాల నుండి దిగుమతి చేసుకుంటుండగా, ఇక్కడే తయారు చేయడమా లేక ముడిసరుకు దిగుమతి చేసుకుని ఉత్పత్తి ప్రారంభించడమా? అనే ఆలోచనలో సింగరేణి ఉంది. కీలక ఖనిజాల లభ్యత క్వీన్స్‌లాండ్‌లో అధికంగా ఉంది. వీటి ఉత్పత్తి, విక్రయానికి పరస్పర లబ్ధి చేకూరే వ్యాపార ఒప్పందంపై ప్రాథమికంగా అవగాహనకు వచ్చారు. 2029–30 నాటికి తెలంగాణ రాష్ట్రం 20 వేల మెగావాట్ల గ్రీన్‌ఎనర్జీ లక్ష్యాన్ని సాధించడం ద్వారా దేశానికే ఆదర్శంగా నిలవాలని ప్రణాళిక సిద్ధం చేస్తోంది. తెలంగాణ – క్వీన్స్‌లాండ్ మధ్య సంయుక్త మైనింగ్, మినరల్ వ్యాపారానికి సింగరేణి ఒక నోడల్ ఏజెన్సీగా ఐఐటీ సంస్థతో కలిసి పని చేయాలని నిర్ణయించింది.

సదస్సుకు ఆహ్వానం

ఈఏడాది మార్చిలో క్వీన్స్‌లాండ్‌లో పెద్దఎత్తున నిర్వహించే వ్యాపార సదస్సుకు రావాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని క్వీన్స్‌లాండ్ మంత్రి ఆహ్వానించారు. ఈ క్రమంలో వ్యాపార అనుబంధం మరింత పెరిగే అవకాశాలున్నాయి.

క్వీన్స్‌లాండ్స్‌తో వ్యాపార బంధం

సింగరేణి ఇప్పటికే క్వీన్స్‌లాండ్స్‌తో రక్షణకు సంబంధించి పలు యంత్రాలు, విడిభాగాల కొనుగోలుపై ఒప్పందం చేసుకుంది. సరఫరా కూడా చేస్తోంది. సిమ్టార్స్ సంస్థతో మైనింగ్, టెక్నాలజీకి, సీఎస్ఐ, ఆర్‌వో తదితర సంస్థలతో ఒప్పందాలు చేసుకొంది. ప్రస్తుతం క్వీన్స్‌లాండ్ మంత్రి సమక్షంలో కీలక ఖనిజాల వెలికితీత, భారీఖనిజ ఉత్పత్తి యంత్రాలు సాంకేతికత, రక్షణ పెంపు, వెంటిలేషన్ మెరుగుదల, ఎక్కువ లోతులో ఉన్న బొగ్గు నిల్వల తవ్వకానికి సంబంధించి ఆధునిక సాంకేతికత అంశాలపై ముందుకు సాగుతోంది.

త్వరలో క్వీన్స్‌లాండ్‌కు సింగరేణి బృందం

క్రిటికల్ మినరల్స్‌పై లోతుగా అధ్యయనం, అవగాహన కోసం సింగరేణి బృందాన్ని క్వీన్స్‌లాండ్‌కు పంపుతున్నారు. సింగరేణితో సంబంధాలను మరింత బలోపేతం చేయడానికి క్వీన్స్‌లాండ్ మంత్రి ఆసక్తి కనబరిచారు. కీలక ఖనిజాలు (క్రిటికల్ మినరల్స్) కోబాల్ట్, టైటానియం, గ్రాఫైట్, క్రోమియం, టంగ్ స్టన్, యాంటీమోనీ, రీనియం, ఇండియంతో పాటు రేర్‌ఎర్త్ మినరల్స్ వంటి కీలక ఖనిజాలను తమతో కలిసి ఉత్పత్తి చేయడానికి ఉమ్మడి భాగస్వామ్యంపై ప్రాథమికంగా అవగాహనకు వచ్చారు. సౌర విద్యుత్, పవన విద్యుత్ రంగాల్లో పూర్తి సహకారానికి ఉభయులూ అంగీకరించారు.

బీసీల గురించి మాట్లాడే అర్హత బీజేపీకి లేదు

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ



సాక్షి, హైదరాబాద్: ఇస్లాం మతం స్వీకరించిన బీసీలకు రిజర్వేషన్లు వర్తింపజేయడానికి వీల్లేదని బీజేపీ నాయకుడు బండి సంజయ్ వ్యాఖ్యానించడం సరికాదని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ అభ్యంతరం వ్యక్తం చేశారు. దూదేకుల వర్గం, పాకీపని చేసేవారు, రాళ్లకొట్టి బతికేవారు, అత్తర్‌సాహెబ్‌లు మొదలైన వారు కులవృత్తులు చేస్తూ, సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా, విద్యాపరంగా తీవ్ర అణచివేతకు గురవుతున్నారని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వారు సామాజిక న్యాయం కోసం రిజర్వేషన్లు కోరుతుంటే, ఇస్లాం మతం స్వీకరించినంత మాత్రాన రిజర్వేషన్లను అమలు చేయడానికి వీల్లేదనడం శోచనీయమని విమర్శించారు. కులగణనకు వ్యతిరేకం కాదని చెబుతూనే, మరోవైపు పార్లమెంట్‌లో మాత్రం కులగణనను వ్యతిరేకించడం దేనికి సంకేతమని ప్రశ్నించారు. బీసీ రిజర్వేషన్లకు వ్యతిరేకంగా పోరాడిన బీజేపీ, ఇప్పుడు బీసీల గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు.

కళ తప్పిన పాకాల ఏరు



వర్షాకాలంలో చెక్‌డ్యాం పైనుంచి ప్రవహిస్తున్న ఏరు

మహబూబాబాద్ జిల్లా గార్ల సమీపంలోని పాకాల ఏరు వర్షాకాలంలో భారీ వరదతో చెక్‌డ్యాం పైనుంచి పొంగిపొర్లింది. ఇంకా వేసవికాలం రానేలేదు. కానీ, ప్రస్తుతం ఏరు ఎండిపోయి పెద్దపెద్ద బండలు తేలి కనిపిస్తోంది. పశువులు, మూగజీవాలను ఈ ఏటి వద్ద నీరు తాపేవారు. ప్రస్తుతం తాగునీటి ఎద్దడి ఏర్పడి బోరు, బావుల వద్దకు తరలిస్తున్నారు.

- గార్ల



వేసవికాలం ప్రారంభం కాకముందే ఎండిపోయి బండలు తేలి కనిపిస్తున్న ఏరు

కృష్ణా జిల్లా యనమలకుదురులో...



విశాఖలోని ఎంవీపీ కాలనీలో..



వైఎస్సార్ జిల్లా పోలాతల మల్లేశ్వరస్వామి ఆలయం వద్ద..



మహా శివరాత్రి వేడుకలను పురస్కరించుకుని రాష్ట్రంలోని ప్రముఖ శైవ క్షేత్రాలను విద్యుత్ దీప కాంతులతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. శైవ క్షేత్రాలకు తెల్లవారుజాము నుంచే భక్తులు పోటెత్తారు. మహా శివుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించుకున్నారు. దీంతో తెలుగు రాష్ట్రాల్లోని శైవ క్షేత్రాలు శివ నామ స్మరణతో మారుమ్రోగాయి.

క్లుప్తంగా...

ప్రభ'కు 'పచ్చ'జెండాలు!



ఓర్వకల్లు: కర్నూలు జిల్లా ఓర్వకల్లు మండలంలోని కాల్వ బుగ్గలో వెలసినబుగ్గ రామేశ్వరుని బ్రహ్మోత్సవాలలో గురువారం నిర్వహించేప్రభోత్సవానికి నూతనంగా సిద్ధం చేసిన ప్రభ వాహనానికి టీడీపీ జెండాలను అలంకరించడంవిస్మయానికి గురిచేస్తోంది. రాష్ట్రంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కోటప్పకొండ తరహాలో సుమారు 105 అడుగల ఎత్తు, 10 అడుగల వెడల్పుతో ఇనుప వస్తువులు, విద్యుత్ దీపాలతో ప్రభ వాహనాన్ని తీర్చిదిద్దారు. ఈ వాహనానికి చుట్టూ టీడీపీ జెండాలను అలంకరించారు. దాతల సహకారంతో సుమారు రూ.3 లక్షలతో ఈ విహనం రూపుదిద్దుకుంది. టీటీడీ బోర్డు సభ్యుడు మల్లెల రాజశేఖర్ పర్యవేక్షణలో ప్రభ వాహనానికి రాజకీయ రంగు పులమడం గమనార్హం.

హిందూస్థానీ సంగీత విద్వాంసుడు రాధాకృష్ణ మృతి



బోట్‌క్లబ్: ప్రముఖ హిందూస్థానీ సంగీత విద్వాంసుడు పాండ్రంగి రాధాకృష్ణ (60) బుధవారం కాకినాడ విద్యుత్‌నగర్‌లోని ఆయన నివాసంలో అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన మృతదేహానికి సంగీత విద్యార్థులతో పాటు పలువురు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనేక బిరుదులు పొందినప్పటికీ నిగర్విగా జీవితాన్ని కొనసాగించారు. హిందూస్థానీ సంగీత వ్యాప్తికి తన జీవితాన్ని అంకితం చేసిన గొప్ప వ్యక్తిని పలువురు కీర్తించారు. రాధాకృష్ణ వద్ద శిక్షణ పొందిన విద్యార్థులు దేశ విదేశాల్లో ఉన్నత స్థానంలో ఉన్నారు. వోకల్ విశారద, తబలా విశారద, తబలా దివాకర్ వంటి ఉన్నత బిరుదులను అఖిల భారత గురుదేవ్ మహా విద్యాలయం నుంచి స్వీకరించారు.

గుడి పందిరిని ధ్వంసం చేసిన ఏనుగులు



ఓబులవారిపల్లి: అన్నమయ్య జిల్లా వై.కోట గుండాలకోనకు వెళ్లే మార్గంలో మళ్లీ ఏనుగుల గుంపు సంచరించింది. మహాశివరాత్రి సందర్భంగా గుండాలకోనలో నిర్వహించే ఉత్సవాలు పూర్తిగా నిలిచిపోయాయి. ముందుగా అధికారులు కొంతమంది వెళ్లి నీలకంఠేశ్వరస్వామి ఉత్సవాలకు అనుమతులు ఇచ్చారు. అయితే గుండాలకోన మార్గంలో వినాయకుడి గుడి వద్ద పందిరిని ఏనుగులు ధ్వంసం చేశాయి. అక్కడికి కొంత దూరంలో ముగ్గురిని చంపిన ఏనుగులు మళ్లీ పరిసరాల్లో సంచరించడంతో ఎవరూ గుండాలకోనకు వెళ్లలేదు.

బిడ్డ చదువెలా ఉంది సారూ!

గ్రామీణ ప్రాంతాల్లో పిల్లల చదువులపై దృష్టి పెట్టిన తల్లులు

- తరచూ స్కూల్లో బిడ్డల విద్యాబుద్ధులపై ఆరా తీస్తున్న 46.6 శాతం తల్లులు
- ఏపీలోనూ 23 శాతం తల్లులు స్కూళ్లకు
- చదువుకున్న తల్లుల సంఖ్యా పెరుగుతోంది
- ఎనిమిదేళ్ల క్రితంతో పోలిస్తే గణనీయమైన పురోగతి
- ఏపీలో టెన్త్ చదివిన తల్లులు 2016లో 10.4 శాతం.. 2024లో 22.8 శాతం
- అసర్ సర్వేలో వెల్లడి



సాక్షి, అమరావతి: దేశంలో పిల్లల విద్య, భవిష్యత్తుపై తల్లిదండ్రుల శ్రద్ధ నానాటికీ పెరుగుతోంది. ముఖ్యంగా గ్రామీణ ప్రజలు చదువు విషయంలో పలు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. తమ బిడ్డలు బడికి వెళ్లారా.. ఎలా చదువుతున్నారు.. ఇంటి వద్ద ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలనే అంశాలను టీచర్లను అడిగి తెలుసుకొంటున్నారు. అంతే కాదు.. వారూ అక్షర జ్ఞానం పెంచుకుంటున్నారు. ఒకప్పుడు కేవలం రోజువారీ పనుల మీదే దృష్టి పెట్టే తల్లిదండ్రులు పిల్లల చదువుపై అంతగా శ్రద్ధ పెట్టే వారు కాదు. బడుల్లో తల్లిదండ్రుల సమావేశాలు పెట్టినా పెద్దగా హాజరయ్యేవారు కాదు. ఇప్పుడు పరిస్థితి మారింది. 46.6 శాతం తల్లులు స్కూళ్లకు వెళ్లి పిల్లల చదువుపై ఆరా తీస్తున్నారు. వారు కూడా పనులు చేసుకుంటూనే పిల్లలతో సమానంగా చదువుకుంటున్నారు. 'వార్షిక స్టేటస్ ఆఫ్ ఎడ్యుకేషన్ రిపోర్ట్ (అసర్)– 2024' సర్వే నివేదిక ఈ విషయాలు వెల్లడించింది. గ్రామీణ భారత్‌లో పాఠశాలకు వెళ్లే వయసు గల పిల్లలు (5 నుంచి 16 ఏళ్లు) ఉన్న తల్లులు విద్యా రంగంపై మంచి అవగాహనతో ఉన్నారని ఆ నివేదిక తెలిపింది. 2016లో జాతీయ స్థాయిలో గ్రామీణ ప్రాంతాల్లో 29.4 శాతం మంది తల్లులు మాత్రమే ఇలా బడిబాట పడితే.. 2024 నాటికి ఆ సంఖ్య 46.6 శాతానికి పెరిగినట్టు పేర్కొంది. తల్లుల్లో 10వ తరగతి మించి చదువుతున్న వారి సంఖ్య కూడా పెరుగుతున్నట్టు పేర్కొంది. ఎనిమిదేళ్ల క్రితం గ్రామాల్లో పదో తరగతి చదువుకున్న తల్లులు 9.2 శాతం ఉంటే ఇప్పుడు ఆ సంఖ్య 19.5 శాతం పెరిగిందని తెలిపింది. పదో తరగతి దాటి చదివిన తండ్రుల శాతం పెరుగుదల 2016లో 17.4 శాతం ఉండగా 2024లో 25 శాతానికి చేరువైంది. పదో తరగతి దాటి చదివిన తల్లులు, తండ్రుల శాతం మధ్య అంతరమూ గత ఎనిమిదేళ్లలో తగ్గిందని, 2016లో తల్లులకంటే తండ్రులు 8 శాతం ఎక్కువుంటే, 2024 నాటికి సుమారు 5 శాతానికి తగ్గినట్టు నివేదిక పేర్కొంది. ఆంధ్రప్రదేశ్‌లో సైతం 23 శాతం మంది బడుల్లో జరిగే కార్యక్రమాలకు హాజరవుతుండడంతో పాటు పిల్లలతో సమానంగా విద్యనభ్యసిస్తున్నట్టు ప్రకటించింది.

జాతీయ స్థాయిని మించి రాష్ట్రంలో ప్రగతి


పదో తరగతికి మించి విద్యావంతులైన తల్లులు గతంలో జాతీయ సగటుకంటే ఎక్కువగా కేరళలోనే అధికంగా ఉండేవారని, ఇప్పుడు ఈ జాబితాలో హరియాణా, హిమాచల్‌ప్రదేశ్, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక కూడా చేరినట్లు పేర్కొంది. ఆంధ్రప్రదేశ్‌లో 2016లో పదో తరగతికి మించి చదివిన తల్లులు 10.4 శాతం ఉండగా 2024లో 22.8 శాతానికి పెరిగినట్లు తెలిపింది. తల్లులు విద్యావంతులు కావడంతో చదువు అవసరాన్ని గుర్తించారని నివేదిక వివరించింది. పిల్లల భవిష్యత్తు బాగుండాలన్న ఆలోచన పెరగడంతోపాటు ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రోత్సాహక కార్యక్రమాలు కూడా ఇందులో కీలక పాత్ర పోషిస్తున్నట్లు పేర్కొంది. గతంలో ఈ ప్రగతి కేరళలో మాత్రమే కనిపించేదని, ఇప్పుడు దేశంలో పలు రాష్ట్రాల్లో చదువుకునే తల్లులు పెరుగుతున్నట్టు వెల్లడించింది.

సర్వే ఇలా..

అసర్ సర్వే కోసం ప్రథమ్ సంస్థ దేశంలోని 605 జిల్లాల్లో 17,997 గ్రామాల్లో 3,52,028 గృహాలను సందర్శించింది. 15,728 పాఠశాలల్లోని వివిధ తరగతుల్లో 6,49,491 మంది పిల్లల చదువులు, వారి తల్లిదండ్రుల పర్యవేక్షణను పరిశీలించింది. చదువులో పిల్లల రాణింపు, విషయ పరిజ్ఞానంతో పాటు తల్లిదండ్రులు విద్యా ప్రగతని అంచనా వేసి నివేదిక రూపొందించింది. ఆంధ్రప్రదేశ్‌లో ఈ సంస్థ 390 గ్రామాల్లో 7,721 నివాసాలను సర్వే చేసి, 3 నుంచి 16 ఏళ్ల మధ్య వయసు గల 12,697 మంది పిల్లలను పరీక్షించింది.

తల్లుల విద్యలో అత్యధిక ప్రగతి సాధించిన రాష్ట్రాలు (శాతంలో)..

రాష్ట్రం	2016	2024
కేరళ	40.4	69.6
హరియాణ	15.8	31.2
హిమాచల్‌ప్రదేశ్	30.7	52.4
ఆంధ్రప్రదేశ్	10.4	22.8
కర్ణాటక	10.2	21.5



- **ఫిబ్రవరి 15:** శ్రీసత్యసాయి జిల్లా తనకల్లు మండలం పూలకుంటపల్లికి చెందిన రైతు చంద్రశేఖర్ (32) పొలంలో రెండు బోర్లు వేయించాడు. ఆ తర్వాత ట్రాక్టరు కొనుగోలు చేశాడు. మూడేళ్ల నుంచి పంటలు చేతికి రాక నష్టాల్లో కూరుకుపోయాడు. మైక్రో ఫైనాన్స్‌లో కూడా అప్పులు చేయగా...వారి నుంచి ఒత్తిళ్లు ఎక్కువయ్యాయి. అప్పులు తీర్చే మార్గం కానరాక ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య, ఇద్దరు పిల్లలు అనాథలుగా మారారు.
- **ఫిబ్రవరి 19:** శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరానికి చెందిన అశోక్ (35) అప్పల బాధతో రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఇటుకల బట్టీ నడిపే అశోక్.. షేర్ మార్కెట్, ఆన్‌లైన్ బెట్టింగ్‌లతో అప్పల ఊబిలోకి కూరుకుపోయాడు. చివరకు ఇంటిని కూడా తాకట్టు పెట్టి రూ.8 లక్షలు తీసుకున్నాడు. ఆర్థిక పరిస్థితి మెరుగుపడకపోవడం.. అప్పలు తీర్చే మార్గం కనిపించక పోవడంతో రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఇల్లుకూడా తాకట్టులో ఉండగా ఆ కుటుంబానికి గూడు కూడా లేకుండా పోయింది.

ఆయువు తీస్తున్న అప్పు!

- భారీగా పెరిగిన జీవన వ్యయం
- అంతకంతకూ తగ్గిపోతున్న ఆదాయం
- పేదలకు అరపైసా సాయం అందించని సర్కార్
- బతుకు భారమై.. అప్పుల ఊబిలోకి
- వడ్డీలు కట్టలేక.. అప్పు చెల్లించలేక ఆత్మహత్య
- రోడ్డున పడుతోన్న బాధిత కుటుంబాలు

సాక్షి, పుట్టపర్తి: అంతంతమాత్రంగానే ఆదాయం.. పెరిగిన జీవన వ్యయం...మితిమీరిన అనవసర ఖర్చులు..ఆడంబరాలు..ఆన్‌లైన్ జూదాలు... వెరసి సామాన్యులు అప్పుల ఊబిలో చిక్కుకుపోతున్నారు. ఎంతగా ప్రయత్నించినా బయటపడే మార్గం కనిపించక... రుణదాతల ఒత్తిడి పెరిగి జీవితాలను అర్ధంతరంగా ముగిస్తున్నారు. అయిన వారికి పుట్టెడు దుఃఖం మిగుల్చుతున్నారు. కుటుంబ యజమాని అర్ధంతరంగా తనువు చాలిస్తే ఆ ప్రభావం పిల్లల భవిష్యత్‌పై తీవ్రంగా చూపుతోంది. ఎంతోమంది చదువు ఆపేసి.. పనులకు వెళ్లి.. భవిష్యత్తును కోల్పోతున్నారు.

పేదల సంక్షేమాన్ని విస్మరించిన సర్కార్

గడిచిన ఐదేళ్లలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ప్రతి నెలా.. ఏదో ఒక పథకం రూపంలో బ్యాంకు ఖాతాలకు నగదు జమ చేసేది. ఆ డబ్బుతో నిరుపేదల అవసరాలు తీరేవి. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నిరుపేదల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. గతంలో అందే అమ్మఒడి, రైతు భరోసా ఇప్పుడు అందడం లేదు. ఆరోగ్యశ్రీ పరిధిలోకి వచ్చే రోగాలు తగ్గిపోగా... ప్రైవేటు ఆస్పత్రులు ఆరోగ్యశ్రీ అంటేనే చికిత్స చేయలేమంటున్నాయి. దీంతో పేదల కుటుంబాల్లో ప్రతి అవసరమూ అప్పుతో ముడిపడుతోంది. పిల్లల చదువులు, పంటకు పెట్టుబడులు.. రోగమొస్తే ఆస్పత్రి బిల్లులు అన్నింటికీ అప్పే. ఇలా అప్పు మీద అప్పులు చేస్తూ జీవనం నెట్టుకొస్తున్నారు. నిరుపేదలు రుణదాతల ఒత్తిడి పెరిగినప్పుడు దిక్కుతోచక బలవంతంగా ఆయువు తీసుకుంటున్నారు. ఇక చిన్న, సన్నకారు రైతులు పెట్టుబడుల కోసం అధిక వడ్డీలకు అప్పు తీసుకుంటున్నారు. సకాలంలో పంట అందకపోవడం.. వచ్చినా.. గిట్టుబాటు ధర లేకపోవడంతో అప్పుల ఊబిలోకి కూరుకుపోతున్నారు. వడ్డీ కూడా కట్టలేని స్థితిలో.. ఫైనాన్షియర్ల వేధింపులు తాళలేక బలవన్మరణాలకు పాల్పడుతున్నారు.

విలాసాలూ.. అలవాట్లూ కారణమే

ఆత్మహత్య చేసుకుంటున్న వారిలో విలాసాలు, చెడు అలవాట్ల కారణంగా అప్పుల ఊబిలోకి వెళ్తున్న వారూ ఉన్నారు. ఇరుగూపొరుగు వారితో పోల్చుకుంటూ.. లేనిపోని ఖర్చులకు వెళ్లడం.. ఖరీదైన ఫర్నీచర్, గృహోపకరణాలు కొనుగోలు చేయడం కారణంగా అప్పుల పాలవుతున్న వారు ఉన్నారు. తమ దగ్గర డబ్బు లేకున్నా.. బ్యాంకుల్లో రుణాలు తీసుకోవడం.. తెలిసిన వారి దగ్గర అప్పు చేయడం.. లేదంటే ఈఎంఐ పద్ధతిలో అప్పు చేసి వస్తువులు కొనుగోలు చేసి.. లేని పోని సమస్యలను మీదకు తెచ్చుకుని ప్రాణాలు కోల్పోతున్నారు. ఇంకొందరు జూదం బారిన పడి కూడా అప్పులు చేసి.. ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు.

దురాశతోనే దుఃఖం

కొందరు యువకులు సులువుగా డబ్బు సంపాదించాలనే ఆలోచనతో.. జూదానికి బానిస అవుతున్నారు. క్రికెట్ బెట్టింగ్, ఆన్‌లైన్ పేకాట, మట్కా.. ఇలా అప్పులు చేసి జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. తొలుత అలవాటుగా మారిన 'ఆట'... ఆ తర్వాత వ్యసనంగా మారుతుండగా... జీవితాలనే నాశనం చేసుకుంటున్నారు. ఈ క్రమంలో ఆస్తులమ్మినా అప్పులకు సరిపోయే పరిస్థితి లేక...సమాజంలో తలెత్తుకోలేక ఎంతోమంది ఆయువు తీసుకుంటున్నారు.

క్యాష్ చేసుకుంటున్న మైక్రో ఫైనాన్షియర్లు

నిరుపేదల అవసరాలను ఆసరాగా చేసుకుని చాలా మంది మైక్రో ఫైనాన్షియర్లు అమాయకులకు అప్పులు ఇచ్చి.. అధిక వడ్డీలు వసూలు చేస్తున్నారు. రుణం తిరిగి చెల్లించలేని స్థితిలో ఉన్న వారి ఆస్తులు కూడా రాయించుకున్న ఘటనలు వెలుగు చూశాయి. ఫలితంగా అవమాన భారం భరించలేక.. అప్పులు తీర్చలేక పేదలు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు.

వేధిస్తే ఫిర్యాదు చేయండి



రాబడికి తగ్గట్టుగానే ఖర్చులు ఉండాలి. అత్యవసర సమయంలో మాత్రమే అప్పు చేయాలి. విలాసాలు... జూదాలు.. విందు వినోదాలకు అప్పు చేయకూడదు. ఖర్చులకు ఆదాయ మార్గాలు ఎంచుకోవాలి. ఎక్కడైనా మైక్రో ఫైనాన్స్ వేధింపులు ఎక్కువైతే పోలీసుల దృష్టికి తీసుకురావాలి.

– వి.రత్న, ఎస్పీ, సత్యసాయి జిల్లా

రామయ్యక్షేత్రంలో శివరాత్రి సంబరం

రామతీర్థానికి పోటెత్తిన భక్తులు



రామతీర్థం వద్ద భక్తుల కోలాహలం

నెల్లిమర్ల రూరల్: శివరాత్రి పర్వదినాన విజయనగరం జిల్లా నెల్లిమర్ల మండలంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థానికి బుధవారం భక్తులు పోటెత్తారు. రాములోరితో పాటు ఇక్కడ ఉన్న ఉమాసదాశివ ఆలయాన్ని దర్శించారు. సాక్షాత్తు శ్రీరాముడు రామక్షేత్రంలో శివుని మంత్రాన్ని జపించారని విశ్వసించిన భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి పూజలు జరిపారు. రామకోనేరు గట్టు, కల్యాణ మండపం, నీలాచల గిరి పరిసర ప్రాంతాల్లో భక్తులు కాగడాలు వెలిగించి బుధవారం రాత్రంతా జాగరణ చేశారు. ముందుగా సీతారామస్వామివారిని దర్శించుకొని పక్కనే ఉన్న ఉమాసదాశివునికి భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు. అర్చకులు శివునికి ప్రత్యేక అభిషేకాలు, లింగోద్భవ పూజలు జరిపారు. భోగాపురం, పూసపాటిరేగ, లావేరు, రణస్థలం, భీమిలి, విశాఖపట్నం ప్రాంతాల నుంచి మత్స్యకారులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారి ప్రతిమను మధ్యలో ఉంచి చుట్టూ వత్తంలా ఏర్పడి సంప్రదాయబద్ధంగా నృత్యాలు చేశారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. బోడికొండ పర్వతంపై శిఖర జ్యోతిని నిర్వాహకులు వెలిగించారు. రెండు రోజుల పాటు జ్యోతి భక్తులకు దర్శనమివ్వనుంది.

రోడ్డు ఏర్పాటు చేయకుండా 'పోలవరం' పనులు చేపట్టవద్దు

అసిస్టెంట్ కలెక్టర్‌ను అడ్డగించిన తాళ్లూరు గ్రామస్తులు



అసిస్టెంట్ కలెక్టర్ కారును అడ్డుకుని నిరసన తెలుపుతున్న తాళ్లూరు గ్రామస్తులు

తుని రూరల్: రహదారి ఏర్పాటు చేయకుండా గ్రామానికి, పంట భూముల మధ్య పోలవరం ఎడమ ప్రధాన కాలువ పనులు చేపట్టవద్దని కాకినాడ జిల్లా తాళ్లూరు గ్రామస్తులు, రైతులు డిమాండ్ చేశారు. మంగళవారం గ్రామస్తులు, రైతులు ఆందోళన చేస్తూ కాలువ తవ్వకం పనులు అడ్డుకున్న విషయం తెలిసిందే. దీంతో బుధవారం మధ్యాహ్నం అసిస్టెంట్ కలెక్టర్ హెచ్ఎస్ భావన, పెద్దాపురం ఆర్డీవో శ్రీరమణ తదితర అధికారులు గ్రామాన్ని ఆనుకుని పోలవరం కాలువ తవ్వకం పనులను, గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్న ప్రాంతాన్ని పరిశీలించారు. ప్రస్తుతం గ్రామానికి, జగనన్న కాలనీకి, పంట భూములకు, గ్రామ దేవత తలుపులమ్మ అమ్మవారి గుడికి మధ్య రాకపోకలకు అనువుగా ఉన్న రహదారిని అసిస్టెంట్ కలెక్టర్‌కు చూపించారు. ఇదే ప్రాంతంలో బ్రిడ్జి నిర్మిస్తే గ్రామస్తులకు, కాలనీవాసులకు, రైతులకు, నిర్మాణంలో ఉన్న మహాత్మ జ్యోతిరావుపూలే వసతి గృహానికి సౌకర్యవంతంగా ఉంటుందన్నారు. రహదారి ధ్వంసం చేసి కాలువ నిర్మిస్తే తామంత తీవ్ర ఇబ్బందులకు గురవుతామని స్పష్టం చేశారు. గ్రామస్తులు, రైతుల సమస్యలు విన్న అసిస్టెంట్ కలెక్టర్ భావన.. పోలవరం కాలువకు రెండువైపులా ప్రత్యామ్నాయ మార్గాలను పరిశీలించారు. ఇప్పటికే ఉన్న కట్టడాలను సద్వినియోగం చేసుకోవాలని అసిస్టెంట్ కలెక్టర్, ఆర్డీవో, ఈఈలు చేసిన రెండు ప్రతిపాదనలకు గ్రామస్తులు, రైతులు అంగీకరించలేదు. ఈ రెండు ప్రత్యామ్నాయ మార్గాలతో పంట భూముల్లోకి వెళ్లాలన్నా, కాలనీ ఇళ్లకు వెళ్లాలన్నా నాలుగైదు కిలోమీటర్లు నడిచి వెళ్లాల్సి ఉందని, రహదారి మార్గం వద్ద బ్రిడ్జి నిర్మించాలని డిమాండ్ చేశారు. దీంతో వెనుతిరిగి వెళుతున్న అసిస్టెంట్ కలెక్టర్ కారును రైతులు, గ్రామస్తులు, మహిళలు అడ్డుకున్నారు. బ్రిడ్జి నిర్మిస్తామని హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. పోలవరం కాలువకు తాము భూములు ఇచ్చి నష్టపోగా రహదారి మార్గం లేకపోతే తరతరాలు తీవ్రంగా నష్టపోవలసి వస్తుందని గ్రామస్తులు, రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులతో చర్చించి న్యాయం చేస్తానని హామీ ఇవ్వడంతో కారుకు అడ్డుతొలిగారు. దీంతో అసిస్టెంట్ కలెక్టర్ తుని తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి అక్కడ ఈ సమస్యపై అధికారులతో చర్చించారు.



బెజవాడ దుర్గమ్మకు మంగళగిరి పట్టువస్త్రాలు

మంగళగిరి: మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని బెజవాడ కనకదుర్గ అమ్మ వారికి గుంటూరు జిల్లా మంగళగిరికి చెందిన శ్రీ శివ భక్త మార్కేండేయ వంశీకులు బుధవారం చేనేత పట్టు వస్త్రాలను బహూకరించారు. మంగళగిరిలో భక్త మార్కెండేయ ట్రస్ట్ ఆధ్వర్యంలో చేనేత మగ్గాలపై వారం రోజుల పాటు భక్తి శ్రద్ధలతో ఈ వస్త్రాలను ప్రత్యేకంగా తయారు చేశారు. మహా శివరాత్రి సందర్భంగా జరిగే శ్రీ దుర్గా మల్లేశ్వరస్వామివారి కళ్యాణ మహోత్సవానికి శివ భక్త మార్కెండేయ వంశీకులు చేనేత పట్టు వస్త్రాలు బహూకరించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ ఏడాది ప్రధాన కైంకర్యపరులుగా మార్కెండేయ ట్రస్ట్ వ్యవస్థాపక సభ్యులు చిల్లపల్లి శ్రీనివాసరావు, గౌరి దంపతులు గుత్తికొండ ధనుంజయరావు, విజయ దంపతులు అమ్మ వారికి చేనేత కళ్యాణ వస్త్ర నివేదన చేశారు.

వైభవంగా నృసింహ మహా యజ్ఞం



ద్వారకాతిరుమల: ఐఎస్ జగన్నాథపురంలోని సుందరగిరిపై స్వయంభూగా కొలువైన శ్రీ లక్ష్మీనరసింహ క్షేత్రంలో అతిరుద్ర ప్రయోగ సహిత మహా సుదర్శన నృసింహ 31వ మహా యజ్ఞం బుధవారం రాత్రి కన్నులపండువగా జరిగింది. సుదర్శన సంపుటితమైన 17 వేల రుద్రనామాలతో 1,331 కలశాలకు రుద్రపూజను ఘనంగా జరిపారు. ప్రతి ఏటా వలె హైదరాబాద్‌కు చెందిన కొచ్చర్లకోట సత్యవెంకట లక్ష్మీనరసింహ గురూజీ ఆధ్వర్యంలో వివిధ ప్రాంతాలకు చెందిన రుత్విక్కులు, పండితులు పాల్గొని, ఈ యజ్ఞ క్రతువును వైభవోపేతంగా నిర్వహించారు. స్వయంభూ శ్రీ లక్ష్మీ నారసింహునికి ఈ యజ్ఞం జరపడం వల్ల లోకశాంతి చేకూరుతుందని పండితులు తెలిపారు. ఈ క్రమంలో ఆలయ ప్రాంగణంలో జరిగిన పలు కార్యక్రమాలతో సుందరగిరి పరిసరాలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. ఉదయం విఘ్నేశ్వర పూజ, మండపారాధనలు, అనంతరం శాలిగ్రామ అభిషేకం, రుద్రపారాయణ, చతుర్వేద పారాయణ, శ్రీ విష్ణు సహస్రనామ, లక్ష్మీ సహస్రనామ పారాయణలు, సూర్య నమస్కారాలను రుత్విక్కులు వేడుకగా జరిపారు.

ప్రకృతి మాత

కొలిచిన భక్తులకు కొంగుబంగారంగా శ్రీ కొండలమ్మ తల్లి భక్తుల నమ్మకాన్ని చూరగొంటున్నారు. తల్లి చెంతకు వచ్చి తమ కోర్కెలు కోరినంతనే ఆ కోర్కెలను తీర్చే కల్పతరువుగా ప్రసిద్ధి గాంచారు ఈ అమ్మవారు. కృష్ణాజిల్లా గుడ్లవల్లేరు మండలం వేమవరం కొండలమ్మ ఇప్పటికే తెలుగు రాష్ట్రాల్లో ప్రఖ్యాతి గాంచారు. కొండరాళ్లలో దొరకటం వలన ఆ తల్లిని కొండలమ్మ అనే పేరుతో భక్తులు పిలుస్తున్నారు.

కొండంత అమ్మ


సర్వాలంకార భూషితురాలైన అమ్మవారి మూలవిరాట్


తల్లి సన్నిధిలో విద్యుద్దీపాలంకరణ

వ్యాపారం, ఉద్యోగం, సంతానం, వివాహం, రాజకీయ పదవులు, పారిశ్రామికం, సినిమా అవకాశాలు ఒకటేమిటి? ఏ రంగానికి చెందిన వారైనా భక్తితో నమ్మి అమ్మ వద్ద తలచుకుంటే చాలు వారికి వరాల జల్లు కురిపిస్తుంది కొండలమ్మ తల్లి. బిడ్డ పుట్టినా, పెళ్లి జరిగినా పిల్లాపాపలు, నూతన వధూవరులు తమ కోర్కెలు తీరాక తల్లి సన్నిధిలోనే తమతమ మొక్కుబడులను చెల్లించుకోవటం పరిపాటిగా వస్తోంది. భక్తితో కొలవటంతో తృప్తి చెందక తమ ఇంటిలో ఆ తల్లి పేరును అనుకున్నదే తడవుగా స్తుతించాలనే దృక్పథంతో కొండలమ్మను ఆ భక్తులు తలచుకుంటున్నారు. ఆ ఊరిలోనే కాదు చుట్టుపక్కల జిల్లాల్లో కూడా కొండా, కొండలమ్మ, కొండయ్య, కొండబాబు వంటి పేర్లతో ఆ దేవత పేరును తమ కడుపున పుట్టిన బిడ్డలకు పెట్టుకుంటున్నారు. ఆ తల్లి చల్లని సన్నిధిలో వివాహాలు, అన్నప్రాశన, ఊయలలో వేయటం వంటి శుభ కార్యక్రమాలను భక్తులు జరుపుకుని దీవెనలను పొందుతున్నారు

మహిమలతో తల్లి కీర్తి చాలా తక్కువ కాలంలోనే దశదిశలకు వ్యాపించింది. అమ్మవారి ఆలయానికి ప్రతి ఆదివారం కృష్ణాజిల్లా నుంచే గాక ఇరు రాష్ట్రాల నుంచి కూడా భక్తులు అధికసంఖ్యలో విచ్చేసి మొక్కుబడులు చెల్లిస్తున్నారు. ఆది, గురువారాల్లో 25 వేల మంది భక్తులు తల్లిని దర్శించుకుంటున్నారు.

అమ్మవారు కొలువైన ప్రాంతం మచిలీపట్నం–నూజివీడు–కత్తిపాడు ప్రధాన రహదారి కావటంతో ఎవరు రోడ్డు వెంబడి వెళ్లినా ఆమె దర్శనం కొరకు నిలుస్తున్నారు. వాహనాల్లోనే గాక నడిచి వెళ్లినా రాకపోకల్లో అమ్మవారిని దర్శించుకోవాల్సిందే.


దసరా నవరాత్రుల్లో అందమైన రథంపై అమ్మవారి ఊరేగింపు

కొండరాళ్లలో దొరికిన అమ్మ

ఈ దేవాలయానికి దాదాపు దశాబ్దాల చరిత్ర ఉంది. వేమవరంలో రహదారి పక్కనే దివాన్ సాహెబ్ కోడ్డు మురుగు కాలువకు రివిట్ మెంట్ కడుతున్నారు. ఆ గోడను కొండరాళ్లతో నిర్మిస్తుండగా వాటిలో ఒకరాయి అమ్మవారిని పోలినట్లుగా పనివారికి కనబడింది. ఆ రాయిని నిర్మాణంలో కలపకుండా పక్కన పెట్టారు. కొద్ది రోజులకు ఆ రాయిని రోడ్డు పక్కన నిలబెట్టి... పసుపు, కుంకుమలు చల్లి భక్తులు పూజలు చేసేవారు. అక్కడికి బాతులు పెంచుకునే వారు వచ్చారు. ఆ రాయి పక్కనే కుటీరం ఏర్పాటు చేసుకున్నారు. అమ్మవారి విగ్రహం పక్కనే ఉండటం వలన ఆ బాతులు విపరీతంగా గుడ్లు పెట్టేవని పెంపకందారులకు నమ్మకం ఏర్పడింది. ఆ బాతుల యజమానికి విపరీతమైన లాభాలు వచ్చాయి. సీజన్ పూర్తి కావటంతో ఆ బాతుల యజమాని గుంటూరు వలస వెళ్లటకు నిర్ణయించుకున్నాడు. బాతుల్ని లారీలో వేసుకునేటపుడు వాటితోపాటు అమ్మవారిని కూడా తీసుకెళ్లారు. గుంటూరు వెళ్లగానే అక్కడ బాతుల్ని దించారు. వాటితో పాటు అమ్మవారిని దించగా వెంటనే బాతులు మొత్తం హఠాత్తుగా మృత్యువాతపడ్డాయి. వెంటనే అతను మరలా అమ్మవారిని ఈ ప్రాంతానికి తీసుకొచ్చేశాడు. ప్రస్తుతం అమ్మవారు పూజలందుకుంటున్న స్థానంలోనే నిలిపాడు. ఈ నిదర్శనం చుట్టుపక్కల ప్రాంతాల్లో అనతికాలంలో మౌఖికంగా ప్రచారం జరిగింది. అప్పటి నుంచి అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు విరివిగా వచ్చి పాల పొంగళ్లు సమర్పించి మొక్కుబడులు తీర్చుకుంటున్నారు.


పొంగళ్లు పొంగిస్తున్న మహిళా భక్తులు


అమ్మవారి అనివేటి మండపం


అలరించే శక్తి వేషధారణలు

– అయికా రాంబాబు
సాక్షి, గుడ్లవల్లేరు, కృష్ణాజిల్లా

శోభాయమానంగా నవరాత్రులు...

తల్లి సన్నిధిలో ఏటా దసరా నవరాత్రి మహోత్సవాలు శోభాయమానంగా జరుగుతాయి. దుర్గాష్టమి రోజున కనకదప్పుల వాద్యాలు, బాణాసంచా, చిత్ర విచిత్ర వేష ధారణలతో చుట్టుపక్కలున్న గ్రామాల్లో అమ్మవారి భారీ ఊరేగింపు సాగుతుంది. ఆ రోజు 20 వేల మంది భక్తులకు అన్నసమారాధన ఉంటుంది. నవరాత్రుల్లో భక్తుల ఉల్లాసం కొరకు సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శనలు ఉంటాయి. తొలుత కొండలమ్మ మూలవిరాట్‌ను దర్శించుకునే ఆలయం చిన్నదిగా ఉండేది. ఆ తర్వాత భారీ ఆలయాన్ని దేవాదాయ శాఖ వారు నిర్మించి అభివృద్ధి చేయటం జరిగింది. అనివేటి మండపాన్ని నిర్మించారు. ఈ మండపంలో అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఆ విగ్రహానికే దసరా ఉత్సవాలకు దేవతా స్వరూపాలను అలంకరిస్తున్నాం.

ఈ తల్లి మూలవిరాట్ నేల మీదనే తల వరకే దర్శనమిస్తుంది. మనసులో మాట అనుకున్నంతనే అవి తీరుస్తున్న అమ్మవారికి భక్తుల నుంచి తాకిడి నానాటికీ పెరిగిపోతుంది. సినీ నటులు, నిర్మాతలు, దర్శకులు, రాజకీయ నేతలు, పారిశ్రామిక వేత్తలు, వ్యాపార వేత్తలు, రైతులు ఒక్క రంగమే కాదు అన్ని రంగాలకు చెందిన భక్తులు ఏం కోరుకుంటే అది తీరుస్తూ వారి నుంచి పూజలందుకుంటున్నారు అమ్మవారు. మొక్కుబడులు తీర్చుకునే భక్తులు కొండలమ్మకు పాలపొంగళ్లను సమర్పిస్తారు.

నిర్మల వాణి

సౌందర్యలహరి... సహజ యోగం

శ్రీ ఆది శంకరాచార్యులు అద్వైత సిద్ధాంతాన్ని బోధిస్తూ భారతదేశమంతటా పర్యటించారు. ఈ క్రమంలో ఆయన శివానందలహరి, సౌందర్య లహరి, కనకధార స్తోత్రము, సుబ్రహ్మణ్య భుజంగ స్తోత్రం, భజ గోవిందం, అన్నపూర్ణాష్టకం వంటి ఎన్నో అద్భుతమైన రచనలను మనకు అందించారు. ఆయన మన సూక్ష్మ శరీరంలో కుండలినీ శక్తి ప్రయాణం గురించి 'సౌందర్య లహరి' అనే తన గ్రంథంలో వివరించారు. దీనినే మనం నేడు శ్రీ మాతాజీ నిర్మలా దేవి బోధించిన సహజయోగంలో ప్రత్యక్షంగా అనుభూతి ద్వారా తెలుసుకుంటున్నాము.

కుండలినీ శక్తి జాగృతి చెందినప్పుడు అది ఏ విధంగా షట్చక్రాలను దాటుకుంటూ పైకి ఊర్ధ్వముఖంగా ప్రయాణిస్తుందో 'సౌందర్య లహరి' గ్రంథంలో ఆదిశంకరులు కింది విధంగా వివరించారు..

అమ్మా! మీరు మూలాధార చక్రంలో పృథ్వీ తత్త్వాన్ని, మణిపూర చక్రంలో జల తత్త్వాన్ని, స్వాధిష్ఠాన చక్రంలో అగ్ని తత్త్వాన్ని హృదయ చక్రంలో వాయు తత్త్వాన్ని, ఆ పైన విశుద్ధి చక్రంలో ఆకాశ తత్త్వాన్ని, భ్రూమధ్యంలో నున్న ఆజ్ఞా చక్రంలో మనస్సును దాటి ప్రయాణించి సహస్రార చక్రం వద్ద పరమశివుని కలుస్తారు. ఈ కుండలినీ శక్తి ప్రయాణాన్ని సహజ యోగంలో చైతన్య తరంగాల రూపంలో అనుభూతి



చెందుతాం. కుండలినీ శక్తి జాగృతి చెంది, మన చుట్టూ ఉండే సర్వ వ్యాపితమైన భగవంతుని ప్రేమ శక్తితో కలయికను పొందినప్పుడు మన హృదయంలో గల శివతత్త్వం ప్రకాశిస్తుంది.


పరమ పూజ్య శ్రీ మాతాజీ నిర్మలా దేవి

అది శంకరులు తన రచించిన ఆత్మాష్టకంలో మనం కానిది ఏమిటో ముందుగా వివరిస్తూ, మనం చైతన్యమయ మయిన ఆత్మస్వరూపులమని విశదీకరిస్తారు. ఇదే విషయాన్ని సహజ యోగ ధ్యానంలో శ్రీ మాతాజీ నిర్మలా దేవి అనుభూతి ద్వారా తెలుసుకునేటట్లు చేస్తారు.

మన సూక్ష్మ శరీరంలో శ్రీ శివుని స్థానం మన హృదయంలో ఉంటుంది. శ్రీ శివుడు మన హృదయంలో ఆత్మ రూపంలో నివసిస్తాడు. ఈ సచ్చిదానంద స్వరూపమైన శ్రీ శివ తత్త్వాన్ని పొందడమే సమస్త మానవాళి ఆధ్యాత్మిక ఉత్థానంలో పరమ గమ్యం. కొన్ని వేల సంవత్సరాల నుండి ఋషులు, మునులు అందరూ ఆ శివ తత్త్వమును పొందడానికే కఠోరమైన తపస్సులను ఆచరించారు.

మనిషి తనను తాను తెలుసుకోలేక పోవడం వల్లనే మాయలో పడుతున్నాడు. తద్వారా దుఃఖాన్ని పొందుతున్నాడు. మనిషి తనను తాను తెలుసుకోవడానికి ఆత్మాష్టకం చాలా వరకు సహాయ పడుతుంది. ఇందులో ప్రగాఢమైన ఆధ్యాత్మిక జ్ఞానం ఉండడంతోపాటు పాడుకోవడానికి వీలుగా రాగ యుక్తంగా మలచబడింది.

శ్రీ శివుని ప్రసన్నం చేసుకోవాలంటే శ్రీ శివుని నివాసమయిన మన హృదయం స్వచ్ఛంగా ఉండాలి. అందులో సాటి మానవులందరి పట్ల ప్రేమ ఉండాలి. ఆ ప్రేమ నిర్వ్యాజ్యమైన దయి ఉండాలి. అందులో ఎటువంటి కామం లేదా లోభం ఉండకూడదు.ప్రతిఫలాపేక్ష ఉండకూడదు.

డా. పి. రాకేష్
(పరమ పూజ్య శ్రీ మాతాజీ నిర్మలా దేవి ప్రవచనాలు ఆధారంగా)

ధర్మ సందేహం

మనం రోజును ఎలా లెక్కిస్తాం? అర్ధరాత్రి 12 తరువాత తేదీ మారినట్లు, అప్పుడే మనకి రోజు (వారం) మారుతుందా?

జ: మనకి సూర్యోదయం నుండి సూర్యోదయం వరకు ఒకరోజు కింద లెక్క, అర్ధరాత్రి లెక్కకి లేదు. సూర్యోదయమే ప్రధానం. 'ఉదయాదుదయం వారం' అని శాస్త్రం.

నది– నదం ఈ రెండింటికీ తేడా ఏమిటి?

జ: తూర్పుదిక్కు వైపు ప్రవహిస్తూ పోయి, తనంత తానే సముద్రంలో కలిసేది – నది. (కృష్ణ, గోదావరి మొదలైనవి) పడమటి దిక్కున ప్రవహిస్తూ వెళ్ళి, అక్కడ నదితో చేరి, సముద్రంలో కలిసేది 'నదం'. (నర్మద, తపతి మొదలైనవి)

మా ఇంట్లో బోర్వెల్ సదుపాయం గానీ, నుయ్యిగానీ లేదు. మున్సిపల్ పంపుల మీదనే ఆధారపడవలసి వస్తోంది. ఆ నీరునే పట్టి సంపులలో దాచుకోవాలి. మరి పూజలకి నీళ్లు వాడుకోవాల్సినప్పుడు, శుచిగా ఎలా సాధ్యం? నిత్యకర్మలు చేయడం ఎలా కుదురుతుంది?

జ: మనకి దొరికే నీటినే పూజలకు వినియోగించుకోవాలి. 'సాధ్యమైనంత వరకు' శక్తివంచన లేకుండా నియమాలను పాటించాలి. సాధ్యం కానిది ఎలాగూ చేయలేం.సాధ్యమైన మేరకు శుచిగల జలాన్ని సేకరించి, ఆ దొరికిన దానిలోనే 'గంగ, యమునా, గోదావరి' లాంటి పుణ్యనదుల్ని భావనచేసి, ఇష్టదేవతా స్మరణ చేసి వినియోగించాలి. అంతేగానీ నిత్యకర్మానుష్ఠానం మానరాదు.

పూజాదికాలు చేస్తున్నప్పుడు మధ్యలో తుమ్ము వంటివి వస్తే, పూజ నిష్ఫలమా?

జ: శాస్త్రరీత్యా పూజాదికాల సమయంలో కన్నీరు కారినా, క్రోధం కలిగినా, అపాన వాయువు, తుమ్ము వంటివి కలిగినా, అశౌచులను చూసినా ఆచమనం చేస్తే ఆ దోషాలు పోతాయి. అదే విధంగా కుడి చెవిని కుడిచేతితో తాకాలి.



ఇస్లాం వెలుగు

ఈ పాపాలు త్యజిస్తేనే దైవ కరుణ



పవిత్ర రమజాన్ సత్కార్యాల సమాహారం. ఈ మాసంలో దైవ కారుణ్యం విశేషంగా వర్షిస్తూ ఉంటుంది. ఆచరించే ప్రతి సత్కార్యానికి పుణ్యఫలం అనేకరెట్లు అధికంచేసి ప్రసాదించడం జరుగుతుంది. ఈ శుభమాసంలో చిత్తశుద్ధితో ఆరాధనలు చేసినవారి పూర్వపాపాలన్నీ క్షమించబడతాయి. కాని నలుగురి పాపాలు మాత్రం పవిత్ర రమజాన్ రోజాలు పాటించి, ఆరాధనలు చేసినా క్షమించబడవు.

వారు ఎవరంటే..

1. బంధుత్వ సంబంధాలను తెంచేవారు; 2. మనసులో పగ, ప్రతీకారేచ్ఛ కలిగినవారు; 3. తల్లిదండ్రులకు అవిధేయత చూపేవారు; 4. తాగుబోతులు.

అనంతమైన దైవకారుణ్యం, శుభాలు కుండపోతగా వర్షిస్తున్నప్పటికీ పాపప్రక్షాళన జరగడంలేదంటే ఇవిఎంతఘోరమైన పాపాలో మనకు అర్థమవుతుంది.

కనుక బంధువులతో సత్సంబంధాలు కలిగి ఉండాలి. ఏకారణం వల్లనైనా పొరపొచ్చాలు ఏర్పడితే సాధ్యమైనంత తొందరగా వాటిని దూరంచేసుకొనే ప్రయత్నం చెయ్యాలి. పంతాలు, పట్టింపులకు పోయి మనస్పర్థలు పెంచుకోకూడదు. చిన్నచిన్న విషయాలకు మాట్లాడుకోవడం మానేయకూడదు. ఒకర్నొకరు క్షమించుకొని ప్రేమపూర్వక సంబంధాలు నెలకొల్పుకోవాలి. బంధుత్వ సంబంధాలను గౌరవించాలి. ఇద్దరు వ్యక్తుల మధ్యగాని, ఇరు కుటుంబాల మధ్యగాని, రెండు తెగలు, లేక వర్గాల మధ్యగాని ఏవైనా అభిప్రాయ భేదాలు తలెత్తితే సామరస్యంగా పరిష్కరించుకునే ప్రయత్నం చెయ్యాలి. మనసులో పగ, ప్రతీకారాలు పెంచుకోకూడదు. మనసులో ఒకరిపై పగపెంచుకోవడమనేది దేవుని ఆగ్రహానికి దారితీస్తుంది. మనసులో ఏదైనా ఉంటే కలిసి కూర్చొని మాట్లాడుకోవాలి. ఆ పరిస్థితి లేకపోతే మధ్యవర్తిద్వారానైనా సమస్యను పరిష్కరించుకొనే ప్రయత్నం చెయ్యాలి. మనసు లో పెట్టుకొని అవకాశం కోసం ఎదురు చూడడం మంచి పద్ధతి కాదు.

తల్లిదండ్రుల్ని గౌరవించాలి. వారికి సేవలు చేయాలి. వారి అవసరాలు తీర్చాలి. వారిమనసు కష్టపెట్టకూడదు. తల్లిపాదాల కింద స్వర్గం ఉంది. తండ్రి స్వర్గానికి సింహద్వారం. తండ్రి సంతోషంలోనే దైవ సంతోషం ఇమిడి ఉంది. తండ్రి సంతోషంగా లేకపోతే స్వర్గద్వారం తెరుచుకోదు. ప్రసన్న వదనంతో తల్లిదండ్రులవైపు ఓసారి ప్రేమతో చూస్తే స్వీకారయోగ్యమైన ఒక హజ్ చేసినంత పుణ్యం లభిస్తుందని ప్రవక్త (స) చెప్పారంటే, తల్లిదండ్రుల స్థానం ఏమిటో మనం అర్థం చేసుకోవాలి. ఏమిచేసి మనం వారి రుణం తీర్చుకోగలం..? ఒక్కసారి ఆలోచించండి.

తాగుడు అలవాటు ఉన్నవారికి దైవ క్షమాపణ లేదు. లెక్కకు మిక్కిలి పాపాత్ములు కూడా క్షమించబడి పునీతులయ్యే తరుణం రమజాన్ లాంటి పవిత్ర మాసంలో కూడా మన్నింపు లభించే పరిస్థితి లేదంటే తాగుడు ఎంతటి దుర్మార్గమైన, నీచమైన అలవాటో అర్థం చేసుకోవచ్చు. తాగుబోతుల్ని సమాజమూ గౌరవించదు. దేవుడూ క్షమించడు. ఇహలోక ఛీత్కారం, పరలోక వైఫల్యం. కనుక తాగుడు అలవాటు ఉన్నవాళ్ళు వెంటనే మానుకుంటే మంచిది. ఎవరికైనా మన్నింపు ఉంటుందేమోకాని ఈ నాలుగు రకాల పాపాత్ములకు మాత్రం పవిత్ర రమజాన్ మాసంలో కూడా మన్నింపులేదు. అందుకని ఎవరిలోనైనా ఈ దుర్గుణాలు ఉన్నట్లయితే వెంటనే దైవంముందు సాగిలపడి, తప్పుఒప్పుకొని క్షమాపణ వేడుకోవాలి. మళ్ళీ జీవితం లో ఇలాంటి పాపాలజోలికి వెళ్ళమని ప్రతిన బూనాలి. పాపక్షమాపణకు ఇదే సరైన సమయం. సరైన తరుణం. క్షమించమని మొరపెట్టుకోవాలేగాని దేవుడు క్షమించడానికి సిద్ధంగా ఉన్నాడు. కనుక పవిత్ర రమజాన్ మాసం సాక్షిగా మన మంతా ఆత్మపరిశీలన చేసుకోవలసిన అవసరం ఎంతైనా ఉంది. దైవం మనందరినీ ఈ దుర్గుణాలనుండి దూరంగా ఉంచి తన కరుణకు పాత్రులుగా చేయాలని మనసారా కోరుకుందాం.

– యండి. ఉస్మాన్ ఖాన్
(మార్చి 2 నుంచి రంజాన్ మాసం ఆరంభం)

పరిహారం



అనారోగ్య సమస్యలు పీడిస్తున్నాయా?

అన్నీ ఉన్నా ఆరోగ్యం లోపిస్తే జీవితంలో ఏమాత్రం ఆనందం ఉండదు. కొందరికి అన్నీ ఉన్నా కుటుంబ సభ్యుల్లో ఎవరో ఒకరికి ఏదో ఒక ఆరోగ్య సమస్య వెంటాడుతూనే ఉంటుంది. ఆరోగ్య సమస్యల కారణంగా అనివార్యపు ఖర్చులు దీర్ఘకాలంలో ఆర్థికంగా కూడా కుంగదీస్తాయి. ఇలాంటి పరిస్థితిని అధిగమించాలంటే...

- రోజూ ఉదయాన్నే వీధి కుక్కలకు రొట్టె ముక్కలను తినిపించండి. రొట్టె ముక్కల సంఖ్య కుటుంబ సభ్యుల సంఖ్య కంటే ఎక్కువగా ఉండేలా చూసుకోండి.
- ఇంట్లో ఎవరైనా గుర్తుతెలియని వ్యాధి లక్షణాలతో బాధపడుతున్నట్లయితే, ఏదైనా గురువారం రోజున పురోహితులకు కిలోన్నర శనగలు, పసుపు వస్త్రాలు, గుమ్మడి పండు దానంగా ఇవ్వండి. అలాగే, గురువారం ఉదయం ఇంటికి చేరువలో ఉన్న ఆలయానికి గుమ్మడి పండును సమర్పించండి.
- తరచు ఇబ్బంది పెట్టే ఆరోగ్య సమస్యల నుంచి బయటపడాలంటే, ఎప్పుడూ ఒంటరిగా ఆహారం తీసుకోవద్దు. మీరు తినే ఆహారాన్ని ఇతరులతో పంచుకోండి. మనుషులెవరూ అందుబాటులో లేకుంటే కనీసం పక్షులు, జంతువులు, కీటకాలకైనా మీరు తినే ఆహారంలో కొంత భాగం సమర్పించండి.
- రాత్రి నిద్రించేటప్పుడు తల వైపు రాగి చెంబులో నీరు నింపి పెట్టండి. ఉదయం నిద్రలేచిన తర్వాత ఆ నీటిని రావిచెట్టుకు పోయండి. ఇంట్లో నిత్య పూజ పూర్తయ్యాక అదే రావిచెట్టు వద్ద ఆవనూనెతో దీపం వెలిగించండి.

– సాంఖ్యాయన

సువార్త

ఆ బాధ్యత విశ్వాసులందరిదీ..!

నిజమైన భక్తి అడుగంటినపుడు మూఢభక్తి రాజ్యమేలుతుంది. ఇశ్రాయేలీయులకు ఫిలిష్తీయులకూ మధ్య తరతరాలుగా బద్ధ వైరం. అప్పట్లో షిలోహు అనే పట్టణంలో ఏలీ అనే ప్రధాన యాజకుని నేతత్వం లోని దేవుని మందిరంలో దేవుని 'నిబంధన మందసం' ఉండేది. కానీ ఏలీ అసమర్థత యాజకత్వంలో ఇశ్రాయేలీయులు దేవుణ్ణి మర్చిపోయి విచ్చలవిడిగా జీవిస్తున్న కారణంగా దేవుడు వారి మధ్య నుండి తన సన్నిధిని తీసివేశాడు. యాజకులున్నారు, మందిరముంది, మందసముంది కాని అక్కడ లేనిదల్లా దేవుడే!!

ఫిలిష్తీయులతో జరిగిన యుద్ధాల్లో ఆ కారణంగా ఇశ్రాయేలీయులు వరుసగా ఓడిపోయారు. మందసం తమతోపాటే యుద్ధభూమి లో ఉంటేనైనా గెలుస్తామేమోనన్న మూఢవిశ్వాసంతో మందసాన్ని మందిరంనుండి తొలగించి ఇశ్రాయేలీయులు తమ వెంట ఒకసారి యుద్ధానికి తీసుకెళ్లారు. అయితే ఈసారి మరీ భయంకరంగా ఓడిపోయారు. పైగా ఫిలిష్తీయులు ఆ మందసాన్ని చేజిక్కించుకు వెళ్లారు. ఇశ్రాయేలీయుల మధ్య, దేవుని మందిరం లో దేవుని సన్నిధికి సాదృశ్యంగా ఉండాల్సిన 'నిబంధన మందసం', దాన్ని కాపాడలేకపోయిన ఏలీ అనే ప్రధాన యాజకుని అసమర్థత వల్ల, ఇశ్రాయేలీయుల విచ్చలవిడి జీవితం వల్ల శత్రువుల వశమైంది. నిజానికి ఇశ్రాయేలీయులకు కాదు, వారి దేవునికే శత్రువులు భయపడేవారు. కాని ఇప్పుడు దేవుడు వారితో లేడన్నది రుజువు కావడమేకాక, పవిత్రమైన నిబంధన మందసాన్ని కూడా కాపాడుకోలేకపోయిన నిష్ప్రయోజకులు, దుర్బలులు ఇశ్రాయేలీయులన్న అపవాదు కూడా ఇపుడు దేవుని ప్రజలకొచ్చింది.

ఆవు చేలో మేస్తే దూడ గట్టున మేస్తుందా? దేవుని పని పూటగడవడానికి, జీవనోపాధికి, ఆస్తులు సంపాదించుకోవడానికి చేసే వృత్తి కాదు. తొలినాళ్లలో కూడా దేవుడు తన ప్రజల్లోని లేవీయులనే ఒక గోత్రీకులను తన సేవకోసం ప్రత్యేకించుకొని వారికి అన్ని గోత్రాలవారికిచ్చినట్టు వాగ్దానభూమిలో భాగాలివ్వకుండా 'నేనే మీ స్వాస్థ్య భాగమన్నాడు'. వారికి కావాలనే భూములు, ఆస్తులివ్వలేదు. ఆ లేవీయులైన యాజకులు పవిత్రంగా, నిబద్ధతతో పని చేసినంతకాలం అక్కడి మందిరం కూడా పవిత్రంగా నిలిచింది, ప్రజల్లో దేవుని భయాన్ని నింపి వారిని సన్మార్గులను చేసింది. ఆ తర్వాత ఏలీ లాంటి అసమర్థులు, అపవిత్రులు, దేవునికన్నా తమ సంతానాన్నే ఎక్కువగా ప్రేమించే యాజకుల హయాంలో ఆలయం తన ప్రాభవాన్ని కోల్పోయింది, ప్రజలు మార్గం తప్పి భ్రష్టులయ్యారు. పరిస్థితి అప్పుడూ ఇప్పుడూ అంతే. నేటి పరిస్థితుల్లో అక్కడి అవినీతిని, అపవిత్రతను రూపుమాపేందుకు విశ్వాసులే పూనుకోవాలి. ప్రేమ, క్షమ, నిబద్ధత, నిస్వార్థతకు నిలయంగా ఉండాల్సిన పాదిర్లు, చర్చిలు ధనార్జనే ధ్యేయంగా పనిచేస్తూ ఉంటే దేవుడు లేని, నిబంధన మందసమూ లేని నాటి షిలోహు మందిరం లాగా ప్రాభవం కోల్పోయిన శిథిలాలే మిగులుతాయి.



పుష్కలంగా, కష్టపడకుండా డబ్బు దొరికే రంగాల్లోని వారు తమ పిల్లల్ని కూడా అవే రంగాల్లోకి వారసులుగా తెస్తుంటారు. ఈనాడు దేవుని సేవలో కూడా అదే చూస్తున్నాం. అయితే డబ్బే ప్రధానమైన ఏ రంగంలోనైనా దేవుడుండడన్నది వేరుగా చెప్పాలా? దేవుని పని ఒక్క యాజకులది మాత్రమే కాదు విశ్వాసులందరిదీ. చర్చిల్లో, దైవపరిచర్యల్లోని పరిస్థితుల్ని చక్కదిద్దే బాధ్యత కూడా దేవుని ప్రేమించేవారందరిదీ.

– సందేశ్ అలెగ్జాండర్

బిజినెస్ రీల్

ప్యూర్ ఈవీ క్యాష్‌బ్యాక్ ఆఫర్లు



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనాల తయారీ సంస్థ ప్యూర్ ఈవీ పండుగల సీజన్ నేపథ్యంలో తమ కస్టమర్ల కోసం 'ప్యూర్ పర్ఫెక్ట్ 10' పేరిట రిఫరల్ ప్రోగ్రాంను ప్రకటించింది. ఈ స్కీము కింద ప్యూర్ ఈవీ వాహనాలను కొనుగోలు చేసేందుకు తమ స్నేహితులు, కుటుంబ సభ్యులను రిఫర్ చేసిన కస్టమర్లు రూ. 40,000 వరకు క్యాష్‌బ్యాక్ ఆఫర్లను పొందవచ్చని తెలిపింది. ప్రస్తుత కస్టమర్లకు, మార్చి 31లోగా కొనుగోలు చేసే కొత్త కస్టమర్లకు లేదా ఆయా అవుట్‌లెట్స్‌లో స్టాక్స్ ఉన్నంత వరకు ఇది వర్తిస్తుందని ప్యూర్ ఈవీ వివరించింది. కస్టమర్లకు 10 రిఫరల్ కోడ్స్ లభిస్తాయని, ఒక్కో రిఫరెన్స్ కొనుగోలుపై రూ. 4,000 క్యాష్‌బ్యాక్ వోచర్ లభిస్తుందని కంపెనీ పేర్కొంది. ఇలా గరిష్టంగా కొత్తగా పది కొనుగోళ్లకు ఈ ఆఫర్ వర్తిస్తుంది. ఈ వోచర్లను సర్వీసింగ్, స్పేర్ పార్ట్స్, అప్‌గ్రేడ్స్ మొదలైన వాటికి ఉపయోగించుకోవచ్చు.

సంపన్న కస్టమర్లకు స్టాన్‌చార్ట్ కొత్త సేవలు



భువనేశ్వర్: స్టాండర్డ్ చార్టర్డ్ బ్యాంక్ సంపన్నులైన తమ ఖాతాదారుల కోసం కొత్తగా మరిన్ని ప్రాధాన్యతా శాఖలను ఏర్పాటు చేస్తోంది. ఈ ఏడాది చివరి నాటికి దేశవ్యాప్తంగా కొత్తగా 10 నగరాల్లో వీటిని ప్రారంభిస్తామని బ్యాంక్ అఫ్లుయెంట్ డిస్ట్రిబ్యూషన్, బ్రాంచ్ బ్యాంకింగ్ ఎండీ నితిన్ చెంగప్ప తెలిపారు. అన్ని కొత్త ప్రాధాన్యతా శాఖలు ప్రస్తుత లేదా నూతన ప్రదేశానికి మార్చిన బ్రాంచ్ ఆవరణలో తెరుస్తామని చెప్పారు. ఇండోర్, చండీగఢ్, నోయిడా, హైదరాబాద్, ఢిల్లీ, బెంగళూరు, కోల్‌కతా ఈ జాబితాలో ఉన్నాయి. సంస్థ ఇప్పటికే ఇటువంటివి 14 సెంటర్స్‌ను నిర్వహిస్తోంది.

ఉక్కు దిగుమతులపై 'సేఫ్‌గార్డ్' సుంకాలు వేయాలి

టాటా స్టీల్ ఎండీ టీవీ నరేంద్రన్



ముంబై: అమెరికా టారిఫ్‌ల పరోక్ష ప్రభావం నుంచి దేశీ పరిశ్రమను రక్షించేందుకు ఉక్కు దిగుమతులపై సేఫ్‌గార్డ్ సుంకాలను విధించాలని టాటా స్టీల్ ఎండీ టీవీ నరేంద్రన్ కేంద్రాన్ని కోరారు. ఇప్పటికే చైనా నుంచి దిగుమతులపై వియత్నాం యాంటీ–డంపింగ్ సుంకాన్ని విధించిందని, అటు దక్షిణ కొరియా కూడా అలాంటి నిర్ణయమే తీసుకుందని వివరించారు. యాంటీ–డంపింగ్ సుంకాల అమలుకు సమయం పడుతుంది కాబట్టి పరిశ్రమకు తక్షణ రక్షణ కల్పించేందుకు సేఫ్‌గార్డ్ సుంకాలను కోరుతున్నట్లు వివరించారు. అమెరికాకు భారత్ భారీగా ఉక్కును ఎగుమతి చేయకపోయినా, టారిఫ్‌ల భారం వల్ల అక్కడికి మిగతా దేశాల నుంచి వెళ్లాల్సిన స్టీల్, భారత్ లాంటి దేశాలవైపు మళ్లే అవకాశం ఉందని నరేంద్రన్ చెప్పారు. ఈ నేపథ్యంలోనే సేఫ్‌గార్డ్ డ్యూటీ విధించాలని కోరుతూ ఇండియన్ స్టీల్ అసోసియేషన్ ఇప్పటికే ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. అలా చేయని పక్షంలో ఉక్కు కంపెనీల ఆదాయాలపైనా, అంతిమంగా పెట్టుబడి ప్రణాళికలపైనా ప్రతికూల ప్రభావం పడొచ్చని చెప్పారు. జిందాల్ స్టెయిన్‌లెస్ ఎండీ అభ్యుదయ్ జిందాల్ ఫిబ్రవరి 13న ఉక్కు దిగుమతులపై 25 శాతం వరకు సుంకాలు విధించాలని వ్యాఖ్యానించిన సంగతి తెలిసిందే.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

27-2-2025

విశాఖ	482–00
చిత్తూరు	493–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	480–00
విజయవాడ	485–00
రిటైల్ ధర (డజను)	60.00
హైదరాబాద్	445–00
వరంగల్	447–00
రిటైల్ ధర	5.05

ముడిచమురు... (బ్యారెల్)

నైమెక్స్ లైట్ స్వీట్	68.77 (రాత్రి 11.30కు)	$ 68.93 (క్రితం ముగింపు)
బ్రెంట్	72.24 (రాత్రి 11.30కు)	$ 72.05 (క్రితం ముగింపు)

జీసీసీలు @ రూ.105 బిలియన్ డాలర్లు

2030 నాటికి అంచనాలు



న్యూఢిల్లీ: దేశీయంగా గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ల (జీసీసీ) ఆదాయం 2030 నాటికి 105 బిలియన్ డాలర్లకు చేరుతుందనే అంచనాలు ఉన్నట్లు కేంద్ర కార్మిక శాఖ కార్యదర్శి సుమీతా దావ్రా తెలిపారు. అప్పటికి 28 లక్షల మందికి ఉద్యోగాలు కల్పిస్తూ ఎంటర్‌ప్రైజ్ ఆపరేషన్స్, నవకల్పనల్లో గ్లోబల్ హబ్‌గా భారత్ స్థానం మరింత పటిష్ఠమవుతుందని పేర్కొన్నారు. గతేడాది 1,700 జీసీసీల్లో 19 లక్షల మంది నిపుణులు పనిచేస్తుండగా, 64.6 బిలియన్ డాలర్ల ఆదాయం నమోదైందని వివరించారు. మరో అయిదేళ్లలో జీసీసీల సంఖ్య దాదాపు 2,400కి చేరవచ్చని దావ్రా చెప్పారు. ఇంటర్నేషనల్ లేబర్ ఆర్గనైజేషన్ (ఐఎల్‌వో) బృందంతో భేటీ అయిన సందర్భంగా ఆమె ఈ విషయాలు వివరించారు. హైదరాబాద్, బెంగళూరు, పుణె, చెన్నై మొదలైన ప్రాంతాలు కీలక జీసీసీ హబ్‌లుగా ఉంటున్నాయని పేర్కొన్నారు. మరోవైపు, కొత్త ఆవిష్కరణలు, వ్యాపార అభివృద్ధికి దోహదపడే నిపుణులు పెద్ద సంఖ్యలో ఉన్నందున భారత్ పోటీతత్వం మరింతగా మెరుగుపడుతోందని ఐఎల్‌వో డైరెక్టర్ జనరల్ గిల్బర్ట్ ఎఫ్ హువాంగ్‌బో తెలిపారు. కృత్రిమ మేధ, సైబర్ సెక్యూరిటీ, క్లౌడ్ కంప్యూటింగ్, సెమీకండక్టర్లు మొదలైన కొత్త విభాగాల్లో జీసీసీలు విస్తరించడం కొత్త ట్రెండ్ అని పేర్కొన్నారు.

అంకుర సంస్థలకు ప్రభుత్వ తోడ్పాటు


- పేటీఎంతో డీపీఐఐటీ ఒప్పందం
- ఇన్‌ఫ్రా, నిధుల అవకాశాలపరంగా మద్దతు



న్యూఢిల్లీ: తయారీ, ఫిన్‌టెక్ స్టార్టప్‌ల అభివృద్ధికి తోడ్పాటు అందించే దిశగా కేంద్రం మరిన్ని చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా పేటీఎంతో పరిశ్రమలు, అంతర్గత వాణిజ్య ప్రోత్సాహక విభాగం డీపీఐఐటీ అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. అంకుర సంస్థలు కార్యకలాపాలు విస్తరించేందుకు, కొత్త ఆవిష్కరణలు చేసేందుకు అవసరమైన మెంటార్‌షిప్, మార్కెట్ యాక్సెస్, నిధుల అవకాశాలు, మౌలిక సదుపాయాల కల్పన మొదలైన అంశాలపరంగా మద్దతునిచ్చేందుకు ఈ ఒప్పందం ఉపయోగపడనుంది. దీని కింద, నియంత్రణ నిబంధనలను పాటించడంపై, పెట్టుబడులను సమకూర్చుకోవడానికి ఉన్న అవకాశాలపై అవగాహన కల్పించేందుకు వర్క్‌షాప్‌లను నిర్వహిస్తారు. పేటీఎం విస్తృత మర్చంట్ నెట్‌వర్క్‌ను ఉపయోగించుకుని స్టార్టప్‌లు తమ ఉత్పత్తులను టెస్ట్ చేసేందుకు, వేలిడేట్ చేసేందుకు, వాటిని మరింత మెరుగుపర్చుకునేందుకు ఉపయోగపడేలా మౌలిక సదుపాయాలు, మార్కెట్ యాక్సెస్‌కి సంబంధించిన మద్దతు లభిస్తుంది. మెంటార్‌షిప్, ఆర్థిక సాయం, అధునాతన టెక్నాలజీ ద్వారా ఔత్సాహిక వ్యాపారవేత్తలకు సాధికారత కల్పించేందుకు పేటీఎం కట్టుబడి ఉందని సంస్థ వ్యవస్థాపకుడు విజయ్ శేఖర్ శర్మ చెప్పారు. పేటీఎం ఫిన్‌టెక్ అనుభవాన్ని, మౌలిక సదుపాయాలను ఉపయోగించుకుని, కార్యకలాపాలను విస్తరించడంలో, సవాళ్లను అధిగమించడంలో స్టార్టప్‌లను తోడ్పాటు అందిస్తామని డీపీఐఐటీ సంయుక్త కార్యదర్శి సంజీవ్ తెలిపారు.

హైదరాబాద్‌లో పెరిగిన ఇళ్ల ధరలు

- అక్టోబర్–డిసెంబర్ కాలంలో 2% వృద్ధి నమోదు
- టాప్–8 నగరాల్లో 10% అధికం
- క్రెడాయ్ – కొలియర్స్ – లైసస్ ఫోరాస్ నివేదిక



న్యూఢిల్లీ: హైదరాబాద్ మార్కెట్లో ఇళ్ల ధరలు గత అక్టోబర్–డిసెంబర్ త్రైమాసికంలో 2 శాతం పెరిగినట్టు క్రెడాయ్–కొలియర్స్–లైసస్ ఫోరాస్ సంయుక్త నివేదిక వెల్లడించింది. దేశవ్యాప్తంగా టాప్–8 నగరాల్లో ఇళ్ల ధరలు సగటున 10 శాతం పెరగ్గా.. అత్యధికంగా ఢిల్లీ ఎన్‌సీఆర్‌లో 31 శాతం ఎగసినట్టు తెలిపింది. ఈ మేరకు ఒక నివేదిక విడుదల చేసింది. బలమైన డిమాండ్‌కుతోడు అధిక నిర్మాణ వ్యయాలు ధరలు పెరగడానికి దారితీసినట్టు పేర్కొంది. వరుసగా 16వ త్రైమాసికంలోనూ ఇళ్ల ధరలు పెరిగినట్టు ఈ నివేదిక వెల్లడించింది. విశాలమైన ఇళ్లు, మెరుగైన జీవనశైలికి ప్రాధాన్యం వంటివి హౌసింగ్ డిమాండ్‌ను పెంచినట్టు క్రెడాయ్ నేషనల్ ప్రెసిడెంట్ బొమన్ ఇరానీ తెలిపారు. నిర్మాణ వ్యయాలు, భూమి కొనుగోలు ధరలు పెరగడం ధరలకు ఆజ్యం పోసినట్టు చెప్పారు.

రేట్ల తగ్గింపుతో విక్రయాలకు ఊతం

టాప్–8 నగరాల్లో ఈ ఏడాది కూడా ఇళ్ల ధరలు పెరుగుతాయని కొలియర్స్ ఇండియా సీఈవో బాదల్ యాగ్నిక్ అంచనా వేశారు. ''రానున్న రోజుల్లో బెంచ్‌మార్క్ రుణ రేట్లు మరింత తగ్గే అవకాశాలున్నాయి. దీంతో చాలా పట్టణాల్లో ఇళ్ల విక్రయాలు పుంజుకోవచ్చు. దీంతో ఇళ్ల ధరలు గతంలో మాదిరే 2025లోనూ పెరిగే అవకాశం ఉంది''అని యాగ్నిక్ వివరించారు. అందుబాటు ధరల ఇళ్లు, మధ్యస్థ ధరల విభాగంలో ఇళ్ల సరఫరా, విక్రయాలు రానున్న రోజుల్లో పెరగొచ్చని లైసస్ ఫోరాస్ ఎండీ పంకజ్ కపూర్ అంచనా వేశారు. డిసెంబర్ త్రైమాసికంలో ఇళ్ల విక్రయాలు స్వల్పంగా తగ్గాయని, కొత్త ఇళ్ల ఆవిష్కరణ మోస్తరుగా ఉండడాన్ని కారణంగా పేర్కొన్నారు.

పట్టణాల వారీగా ధరల పెరుగుదల

- హైదరాబాద్‌లో 2024 అక్టోబర్–డిసెంబర్ క్వార్టర్‌లో ఇళ్ల ధరలు అంతక్రితం ఏడాది ఇదే కాలంతో పోల్చి చూస్తే 2 శాతం పెరిగాయి. చదరపు అడుగు (ఎస్‌ఎఫ్‌టీ) ధర రూ.11,351కి చేరింది.
- ఢిల్లీ ఎన్‌సీఆర్‌లో ఎస్‌ఎఫ్‌టీ ధర 31 శాతం ఎగసి 11,993కు చేరింది.
- బెంగళూరులో 23 శాతం పెరిగి ఎస్‌ఎఫ్‌టీ ధర రూ.12,238గా ఉంది.
- అహ్మదాబాద్‌లో ధరలు 15 శాతం పెరగడంతో చదరపు అడుగు రూ.7,725కు చేరింది.
- చెన్నైలో 6 శాతం వృద్ధితో ఎస్‌ఎఫ్‌టీ ధర రూ.8,141గా ఉంది.
- ముంబై మెట్రోపాలిటన్ రీజియన్ (ఎంఎంఆర్)లో ధరలు 3 శాతం పెరగడంతో ఎస్‌ఎఫ్‌టీ రూ.20,725కు చేరింది.
- పుణెలో ఇళ్ల ధరలు 9 శాతం పెరిగాయి. ఎస్‌ఎఫ్‌టీ రూ.9,982గా నమోదైంది.
- కోల్‌కతాలో అతి తక్కువగా ఒక శాతం ధర పెరగడంతో ఎస్‌ఎఫ్‌టీ రూ.7,971కి చేరింది.

వెల్‌స్పన్ రూ. 1,000 కోట్ల పెట్టుబడులు



ముంబై: గిడ్డంగుల విభాగానికి సంబంధించి రూ. 1,000 కోట్ల పెట్టుబడుల ప్రోగ్రాంను వెల్‌స్పన్ వన్ ఆవిష్కరించింది. తమ రెండో ప్రత్యామ్నాయ పెట్టుబడి నిధి అయిన ఫండ్ 2కి ఇది మద్దతుగా ఉంటుందని వివరించింది. 50 లక్షల చ.అ. వేర్‌హౌసింగ్ స్పేస్‌ను అభివృద్ధి చేసేందుకు ఈ నిధులు తోడ్పడతాయని సంస్థ తెలిపింది. దీనితో కంపెనీ పోర్ట్‌ఫోలియో మొత్తం 2.2 కోట్ల చ.అ.కు చేరుతుందని పేర్కొంది. పూర్తయిన తర్వాత నికరంగా రూ. 1,100 కోట్ల నిర్వహణ ఆదాయం రాగలదని అంచనా వేస్తున్నట్లు వెల్‌స్పన్ తెలిపింది. రూ. 2,000 కోట్ల కార్పస్ నిధి లక్ష్యంతో 2023 మార్చ్‌లో ఆవిష్కరించిన ఫండ్ 2, ప్రధానంగా ఈ–కామర్స్ వంటి విభాగాలకు అనుగుణంగా ఉండే కొత్త తరం గిడ్డంగులపై దృష్టి పెడుతోంది. దీని కింద ఇప్పటికే తొమ్మిది గ్రేడ్ ఏ అసెట్స్‌కి వెల్‌స్పన్ కేటాయింపులు జరిపింది. కొత్తగా కో–ఇన్వెస్ట్‌మెంట్ ప్రోగ్రాంతో తమ పెట్టుబడుల పోర్ట్‌ఫోలియోను 14–15 పెంచుకోవాలని భావిస్తోంది.

ఈపీఎఫ్‌వోలో కొత్తగా 16 లక్షల మందికి చోటు

- డిసెంబర్ నెలలో 9.69 శాతం అధికంగా నమోదు
- పేరోల్ గణాంకాలను విడుదల చేసిన కార్మిక శాఖ



న్యూఢిల్లీ: ఉద్యోగుల భవిష్యనిధి సంస్థ (ఈపీఎఫ్‌వో) కిందకు 2024 డిసెంబర్‌లో కొత్తగా 16.05 లక్షల మంది సభ్యులుగా నమోదయ్యారు. 2024 నవంబర్ నెల గణాంకాలతో పోల్చి చూస్తే 10 శాతం, 2023 డిసెంబర్ గణాంకాలతో పోల్చి చూసినప్పుడు 2.74 శాతం చొప్పున వృద్ధి నమోదైంది. ఈ వివరాలను కేంద్ర కార్మిక శాఖ విడుదల చేసింది. నికరంగా చూస్తే 8.47 లక్షల కొత్త చందాదారులు చేరారు. ఇది ఉపాధి అవకాశాల కల్పన పెరుగుదలను సూచిస్తున్నట్టు కార్మిక శాఖ తెలిపింది. కొత్త సభ్యుల్లో 4.85 లక్షల మంది 18–25 ఏళ్ల వయసులోని వారే కావడం గమనార్హం. నికర కొత్త సభ్యుల్లో 57 శాతం మేర ఈ వయసు నుంచే ఉన్నారు. వీరంతా మొదటిసారి సంఘటిత రంగంలో ఉపాధి పొందినట్టు తెలుస్తోంది. 15.12 లక్షల మంది సభ్యులు ఒక సంస్థలో మానేసి, మరో సంస్థలో చేరారు. 2024 నవంబర్ నెలతో పోల్చి చూసినప్పుడు వీరి సంఖ్య 5 శాతం పెరిగింది. కొత్త సభ్యుల్లో 2.22 లక్షల మంది మహిళలు ఉన్నారు. 2023 డిసెంబర్ నెలతో పోల్చి చూస్తే మహిళా సభ్యుల చేరికలో 6.34 శాతం వృద్ధి నమోదైంది.

టాప్–5 రాష్ట్రాల నుంచే 60 శాతం

కొత్త సభ్యుల్లో 60 శాతం మంది టాప్ 5 రాష్ట్రాల నుంచే ఉన్నారు. ఒక్క మహారాష్ట్ర నుంచే 21.71 శాతం మంది ఈపీఎఫ్‌లో చేరారు. మహారాష్ట్ర, కర్ణాటక, గుజరాత్, హర్యానా, ఢిల్లీ, తమిళనాడు, యూపీ, తెలంగాణ ఇలా ఒక్కో రాష్ట్రం నుంచి విడిగా 5 శాతానికి పైనే కొత్త సభ్యులు చేరారు. మానవ వనరుల సరఫరా, కాంట్రాక్టర్లు, సెక్యూరిటీ సేవలు తదితర ఎక్స్‌పర్ట్‌సర్వీసెస్ తరఫున 41 శాతం మంది కొత్తగా ఈపీఎఫ్‌వో కిందకు వచ్చారు.

హెచ్‌బీఎన్ డెయిరీస్‌కు నో


సెబీ తాజా హెచ్చరిక



న్యూఢిల్లీ: క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ తాజాగా హెచ్‌బీఎన్ డెయిరీస్‌కు సంబంధించిన ఎలాంటి లావాదేవీలు చేపట్టవద్దంటూ పబ్లిక్‌ను హెచ్చరించింది. హెచ్‌బీఎన్ డెయిరీస్ అండ్ అలైడ్ లిమిటెడ్‌కు చెందిన ఎలాంటి ప్రాపర్టీ కొనుగోలు లేదా లావాదేవీలు చేపట్టవద్దంటూ పేర్కొంది. వీటి విషయంలో అప్రమత్తంగా వ్యవహరించవలసిందిగా సూచించింది. కొంతమంది వ్యక్తులు లేదా సంస్థలు తప్పుడు సమాచారం(వదంతులు) ప్రచారం చేస్తూ హెచ్‌బీఎన్ ప్రాపర్టీస్ వేలాన్ని తప్పుదారి పట్టిస్తున్నారని తెలియజేసింది. సెబీ అధికారులుగా చెప్పుకుంటూ చట్టాన్ని అతిక్రమిస్తున్నట్లు వెల్లడించింది. తద్వారా నిజమైన కొనుగోలుదారులను పక్కదారి పట్టించడంతోపాటు.. సెబీ ఈవేలం విధానానికి అడ్డుతగులుతున్నట్లు వివరించింది. హెచ్‌బీఎన్ ప్రాపర్టీస్‌లో.. సంస్థ డైరెక్టర్లు, సంబంధిత అనుబంధ, సహచర సంస్థలు తదితరాలకు ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా ఎలాంటి హక్కులూ లేవని స్పష్టం చేసింది. వెరసి హెచ్‌బీఎస్ ఆస్తుల విషయంలో సంస్థకు సంబంధించిన ఏ వ్యక్తినీ లేదా ఏ సంస్థనూ చట్ట విరుద్ధంగా అనుమతించబోమని పేర్కొంది.

భారత్‌కు గడ్డుకాలం ముగిసినట్టే

- క్యూ3లో జీడీపీ 6.2 శాతం
- డాయిష్ బ్యాంక్ నివేదిక వెల్లడి



న్యూఢిల్లీ: భారత ఆర్థిక వ్యవస్థకు గడ్డుకాలం ముగిసినట్టేనని జర్మనీకి చెందిన డాయిష్ బ్యాంక్ అభిప్రాయపడింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం సెప్టెంబర్ క్వార్టర్‌లో జీడీపీ 5.4 శాతానికి (ఏడు త్రైమాసికాల కనిష్ఠం) పడిపోవడం తెలిసిందే. దీంతో దేశ ఆర్థిక వృద్ధిపై ఆందోళనలు నెలకొన్నాయి. ఈ తరుణంలో డిసెంబర్ త్రైమాసికంలో జీడీపీ 6.2 శాతానికి మెరుగుపడుతుందని బ్యాంక్ అంచనా వేసింది. అయినప్పటికీ 2025–26లో జీడీపీ వృద్ధి 7 శాతం లోపే ఉంటుందని పేర్కొంది. క్యూ3 (2024 అక్టోబర్–డిసెంబర్) జీడీపీ గణాంకాలు విడుదల కావడానికి ముందు బ్యాంక్ ఈ నివేదిక విడుదల చేయడం గమనార్హం. కీలక సూచికలు సైతం వృద్ధి రేటు 6.2 శాతానికి పెరుగుతుందని సూచిస్తున్నట్టు తెలిపింది. వృద్ధికి మద్దతుగా ఏప్రిల్ మానిటరీ పాలసీ సమీక్షలోనూ ఆర్‌బీఐ మరో 25 బేసిస్ పాయింట్ల మేర రేట్లను తగ్గించొచ్చని అంచనా వేసింది. అనంతరం 0.50 శాతం రేటు బదిలీ దిశగా లిక్విడిటీ చర్యలపై ఆర్‌బీఐ దృష్టి సారించొచ్చని తెలిపింది. ప్రస్తుత సైకిల్‌లో మరిన్ని రేట్ల కోతలు ఉండకపోవచ్చని అభిప్రాయం వ్యక్తం చేసింది. లిక్విడిటీ అవసరాల పట్ల ఆర్‌బీఐ ఇప్పటికే దృష్టి పెట్టిందంటూ.. ఇటీవల 10 బిలియన్ డాలర్ల స్వాప్ ప్రకటన ప్రోత్సాహనీయంగా పేర్కొంది.

జీడీపీలో పన్నుల నిష్పత్తిని పెంచుకోవాలి: ఈవై

భారత్ 6.5–7 శాతం మేర జీడీపీ వృద్ధిని నమోదు చేయాలంటే, పన్నుల పరిధిని 1.2–1.5 శాతం స్థాయిలో కొనసాగించాలని ఈవై సూచించింది. ఆదాయ వసూళ్లను బలోపేతం చేసుకోవాలంటూ.. జీడీపీలో పన్నుల నిష్పత్తిని 2025–26లో 12 శాతం అంచనా స్థాయి నుంచి 2030–31 నాటికి 14 శాతానికి పెంచుకోవాలని పేర్కొంది. ద్రవ్య నిర్వహణ, నిర్మాణాత్మక సంస్కరణలు, పన్ను చెల్లింపుదారుల పరిధిని పెంచుకోవడంపై భారత్ దృష్టి సారించాలని సూచించింది. 2025–26లో భారత జీడీపీ 6.3–6.8 శాతం మధ్య వృద్ధిని నమోదు చేయవచ్చని అంచనా వేసింది.

నాలుగు ఇన్‌ఫ్లుయెంజా వైరస్‌లకు జైడస్ వ్యాక్సిన్



న్యూఢిల్లీ: కొత్త రకం ఇన్‌ఫ్లుయెంజా వైరస్ నుండి రక్షణ కోసం వ్యాక్సిన్‌ను ప్రవేశపెడుతున్నట్టు ఔషధ తయారీ సంస్థ జైడస్ లైఫ్‌సైన్సెస్ బుధవారం తెలిపింది. ఫ్లూ నుంచి రక్షణ కోసం డబ్ల్యుహెచ్‌ఓ సిఫార్సు చేసిన కూర్పు ప్రకారం దేశంలోనే మొట్టమొదటి క్వాడ్రివలెంట్ ఇన్‌ఫ్లుయెంజా వైరస్ వ్యాక్సిన్ వ్యాక్సిఫ్లూ–4ను పరిచయం చేస్తున్నట్టు వెల్లడించింది. రాబోయే ఫ్లూ సీజన్‌లో ప్రబలంగా ఉంటుందని అంచనా వేసిన నాలుగు ఇన్‌ఫ్లుయెంజా వైరస్ జాతులకు వ్యతిరేకంగా కాలానుగుణ రక్షణను, క్రియాశీల రోగనిరోధకతను ఈ వ్యాక్సిన్ అందిస్తుందని కంపెనీ వివరించింది. సెంట్రల్ డ్రగ్ ల్యాబొరేటరీ నుంచి వ్యాక్సిఫ్లూ–4కు ఆమోదం లభించినట్టు జైడస్ తెలిపింది.

ఆర్థికేతర కంపెనీల అమ్మకాల్లో వృద్ధి

ఆర్‌బీఐ తాజా నివేదికలో వెల్లడి



ముంబై: ప్రైవేట్ రంగంలో ఉన్న ఆర్థికేతర లిస్టెడ్ కంపెనీల ఆదాయం 2024–25 ఆర్థిక సంవత్సరం మూడవ త్రైమాసికంలో 8 శాతం పెరిగిందని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) వెల్లడించింది. గత ఏడాది ఇదే కాలంలో ఇది 5.5 శాతంగా ఉందని తెలిపింది. జూలై–సెప్టెంబర్ కాలంలో అమ్మకాల వృద్ధి 5.4 శాతం నమోదైంది. డిసెంబర్ త్రైమాసికంలో ప్రైవేట్ కార్పొరేట్ రంగం పనితీరుపై 2,924 ఆర్థికేతర లిస్టెడ్ కంపెనీల సంక్షిప్త త్రైమాసిక ఆర్థిక ఫలితాల ఆధారంగా ఆర్‌బీఐ నివేదిక రూపొందించింది. ఆటోమొబైల్స్, రసాయనాలు, ఆహార ఉత్పత్తులు, విద్యుత్ యంత్రాల పరిశ్రమలలో అధిక అమ్మకాల జోరు కారణంగా 1,675 లిస్టెడ్ ప్రైవేట్ తయారీ కంపెనీల ఆదాయ వృద్ధి 7.7 శాతానికి మెరుగుపడింది. పెట్రోలియం, ఇనుము, ఉక్కు, సిమెంట్ పరిశ్రమల ఆదాయం వార్షిక ప్రాతిపదికన తగ్గింది. ఐటీ కంపెనీల టర్నోవర్ 6.8 శాతం ఎగసింది. గత ఏడాది ఇదే కాలంలో ఇది 3.2 శాతంగా ఉంది. ముడి పదార్థాలపై తయారీ కంపెనీల ఖర్చులు 6.3 శాతం దూసుకెళ్లాయి. వేతనాల ఖర్చు అధికంగా 9.5 శాతం పెరిగింది. ఇది ఐటీలో 5 శాతం, ఐటీయేతర సేవల కంపెనీల్లో 12.4 శాతం అధికమైంది. 2024 అక్టోబర్–డిసెంబర్‌లో లిస్టెడ్ నాన్–ఫైనాన్షియల్ కంపెనీల ప్రాఫిట్ మార్జిన్ వరుసగా 50 బేసిస్ పాయింట్లు వృద్ధి చెంది 16.2 శాతానికి చేరుకుందని ఆర్‌బీఐ తెలిపింది.

అగ్రి, గృహ రుణాల్లో ఎగవేతలు పెరగొచ్చు

- 2030 నాటికి 30 శాతానికి చేరుకోవచ్చు
- రూ.12.9 లక్షల కోట్ల వ్యాపార అవకాశాలు
- బీసీజీ సంస్థ అంచనా



న్యూఢిల్లీ: పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, వాతావరణ మార్పులతో వ్యవసాయ, గృహ రుణాల్లో వచ్చే ఐదేళ్ల కాలంలో రుణ ఎగవేతలు 30 శాతానికి చేరుకోవచ్చని బీసీజీ సంస్థ అంచనా వేస్తోంది. పారిశ్రామిక విప్లవానికి ముందు నాటి రోజులతో పోల్చి చూస్తే ఉష్ణోగ్రతలు సగటున 1.2 డిగ్రీల మేర పెరిగాయని, ఇది తీర ప్రాంతాల్లో వరదలు, వ్యవసాయ ఉత్పత్తి క్షీణతకు దారితీస్తున్నట్టు తెలిపింది. ఈ తరహా తీవ్ర ప్రతికూల వాతావరణ పరిస్థితులతో తలసరి ఆదాయం తగ్గినట్టు తెలిపింది. షెడ్యూల్డ్ వాణిజ్య బ్యాంకుల రుణాల్లో సగం మేర ప్రకృతిపై ఆధారపడి ఉంటాయని, ప్రకృతి విపత్తులు వాటి లాభాలపై ప్రభావం చూపిస్తాయని వివరించింది. 2030 నాటికి దేశంలోని 42 జిల్లాలు సగటున రెండు డిగ్రీల సెల్సియస్ మేర ఉష్ణోగ్రతల పెరుగుదలను ఎదుర్కొంటాయని, ఈ ప్రకారం వచ్చే ఐదేళ్లలో 321 జిల్లాలపై పెరిగే ఉష్ణోగ్రతల ప్రభావం ఉంటుందని తెలిపింది. వాతావరణ మార్పులతో బ్యాంక్‌లకు 150 బిలియన్ డాలర్ల (రూ.12.9 లక్షల కోట్లు) మేర వార్షికంగా వ్యాపార అవకాశాలు రానున్నట్టు బీసీజీ సంస్థ అంచనా వేసింది. పర్యావరణ అనుకూల ఇంధనాలకు సంబంధించి ఈ మేరకు రుణ వితరణ అవకాశాలు లభిస్తాయని పేర్కొంది. 2070 నాటికి సున్నా కర్బన ఉద్గారాల విడుదల (తటస్థ స్థాయి) లక్ష్యాన్ని చేరుకోవడం కేవలం ప్రభుత్వ నిధులు ఒక్కటితోనే సాధ్యపడదని గుర్తు చేసింది.

భారీ పెట్టుబడులు అవసరం..

''భారత్ బొగ్గు, చమురు వినియోగాన్ని తగ్గించి పునరుత్పాదక ఇంధన వనరుల పెంపు పట్ల అంకిత భావాన్ని ప్రదర్శించింది. ఈ విధమైన ఇంధన పరివర్తనానికి ఏటా 150–200 బిలియన్ డాలర్ల మేర పెట్టుబడులు అవసరం. కానీ దేశంలో ప్రస్తుతం వాతావరణ సంబంధిత రుణ వితరణలు 40–60 బిలియన్ డాలర్లుగానే ఉంటున్నాయి. మరో 100–150 బిలియన్ డాలర్లు అవసరం''అని బీజీసీ ఎండీ, పార్ట్‌నర్ అభినవ్ భన్సాల్ తెలిపారు. ఇది బ్యాంక్‌లకు గణనీయమైన అవకాశాలను తీసుకొస్తుందంటూ.. ఇందులో ఎక్కువ భాగం 2030–40 మధ్య కాలంలో ఆచరణ రూపం దాల్చొచ్చని అభిప్రాయపడ్డారు.

దానిశ్ ధమాకా

అజేయ సెంచరీతో విజృంభించిన యువ బ్యాటర్

విదర్భ 254/4 ● మెరిసిన కరుణ్ నాయర్ ● కేరళతో రంజీ ఫైనల్


దానిశ్ మాలేవర్


కరుణ్ నాయర్

నాగ్‌పూర్: యువ ఆటగాడు దానిశ్ మాలేవర్ (259 బంతుల్లో 138 బ్యాటింగ్; 14 ఫోర్లు, 2 సిక్స్‌లు) సెంచరీతో కదంతొక్కడంతో కేరళతో జరుగుతున్న రంజీ ట్రోఫీ ఫైనల్లో విదర్భ జట్టు కోలుకుంది. ఆరంభంలో కేరళ బౌలర్ల విజృంభణతో 24 పరుగులకే 3 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడ్డ జట్టును సీనియర్ బ్యాటర్ కరుణ్ నాయర్ (188 బంతుల్లో 86; 8 ఫోర్లు, 1 సిక్స్)తో కలిసి దానిశ్ ఆదుకున్నాడు. ఫలితంగా బుధవారం తొలి రోజు ఆట ముగిసే సమయానికి విదర్భ జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 86 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 254 పరుగులు చేసింది. తాజా సీజన్‌లో ఓటమి ఎరగకుండా తుదిపోరుకు అర్హత సాధించిన విదర్భ జట్టు టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగింది. పచ్చికతో కూడిన పిచ్‌పై కేరళ బౌలర్లు స్వింగ్‌తో చెలరేగడంతో కేరళ జట్టు వెంట వెంటనే వికెట్లు కోల్పోయింది. ఇన్నింగ్స్ రెండో బంతికే పార్థ్ రేఖడె (0)ను కేరళ పేసర్ నిధీశ్ వికెట్ల ముందు దొరకబుచ్చుకున్నాడు. బంతి అనూహ్యంగా స్వింగ్ అవుతుండటంతో విదర్భ బ్యాటర్లు అతి జాగ్రత్తకు పోగా... 21 బంతులాడి ఒక్క పరుగు చేసిన దర్శన్ నల్కండేను కూడా నిధీశ్ పెవిలియన్ బాట పట్టించాడు. కాసేపటికే ధ్రువ్ షోరే (16)ను ఎడెన్ టామ్ ఔట్ చేశాడు. దీంతో విదర్భ జట్టు 24/3తో నిలిచింది.

215 పరుగుల భాగస్వామ్యం..

తాజా సీజన్‌లో చక్కటి ఫామ్‌లో ఉన్న 21 ఏళ్ల కుడిచేతి వాటం బ్యాటర్ దానిశ్ వికెట్ల పతనానికి అడ్డుకట్ట వేశాడు. మరో ఎండ్ నుంచి కరుణ్ నాయర్ అతడికి దిశానిర్దేశం చేయడంతో ఈ జంట ఇన్నింగ్స్‌ను నిర్మించే పనిలో పడింది. మంచి బంతులను గౌరవించిన ఈ ఇద్దరూ... చెత్త బంతులను శిక్షిస్తూ ముందుకు సాగారు. ఈ క్రమంలో భాగస్వామ్యాన్ని నెమ్మదిగా బలపరచడంతో ఇన్నింగ్స్ కుదుట పడింది. ఆ తర్వాత స్వేచ్ఛగా ఆడిన దానిశ్ 168 బంతుల్లో శతకం పూర్తి చేసుకున్నాడు. తొలి రంజీ సీజన్ ఆడుతున్న అతడికిది రెండో ఫస్ట్ క్లాస్ సెంచరీ. నాకౌట్ మ్యాచ్‌ల్లో కీలక ఇన్నింగ్స్‌లతో జట్టు విజయంలో కీలకపాత్ర పోషించిన దానిశ్... తుదిపోరులోనూ దాన్నే కొనసాగించాడు. మిడ్‌వికెట్, లాంగాన్ దిశగా చక్కటి షాట్లు ఆడుతూ పరుగులు రాబట్టాడు. కాస్త నిధానంగా ఆడిన కరుణ్ నాయర్ 125 బంతుల్లో అర్ధ శతకం పూర్తి చేసుకున్నాడు. ఉదయం పచ్చికతో కూడిన పిచ్‌పై విజృంభించిన కేరళ బౌలర్లు బంతి పాతబడ్డ అనంతరం అదే జోరు కొనసాగించలేకపోగా... కొన్ని కఠిన సవాళ్లను ఎదుర్కొన్న ఈ జంట సంయమనంతో క్రీజులో నిలిచి పరుగులు రాబట్టింది. నాలుగో వికెట్‌కు 414 బంతుల్లో 215 పరుగులు జోడించిన అనంతరం కరుణ్ నాయర్ లేని పరుగుకు ప్రయత్నించి రనౌటయ్యాడు. ఆ తర్వాత యశ్ ఠాకూర్ (5 బ్యాటింగ్)తో కలిసి మరో వికెట్ పడకుండా దానిశ్ తొలి రోజు ఆటను ముగించాడు. మొదటిసారి రంజీ ఫైనల్ ఆడుతున్న కేరళ జట్టు... ఆరంభంలోనే మ్యాచ్‌పై పట్టు చేజిక్కించుకున్నా... దాన్ని చివరివరకు కొనసాగించలేకపోగా... ఆదిలోనే 3 వికెట్లు పడ్డా పోరాడిన విదర్భ మంచి స్కోరు దిశగా సాగుతోంది. దానిశ్, యశ్ ఠాకూర్‌తో పాటు యశ్ రాథోడ్, కెప్టెన్ అక్షయ్ వాడ్కర్ బ్యాటింగ్ చేయగల సమర్థులే కావడంతో విదర్భ తొలి ఇన్నింగ్స్‌లో మరెన్ని పరుగులు చేస్తుందో చూడాలి.

స్కోరు వివరాలు

విదర్భ తొలి ఇన్నింగ్స్: పార్థ్ (ఎల్బీడబ్ల్యూ) (బి) నిధీశ్ 0; ధ్రువ్ షోరే (సి) అజహరుద్దీన్ (బి) ఎడెన్ టామ్ 16; దర్శన్ (సి) బాసిల్ (బి) నిధీశ్ 1; దానిశ్ మాలేవర్ (బ్యాటింగ్) 138; కరుణ్ నాయర్ (రనౌట్) 86; యశ్ ఠాకూర్ (బ్యాటింగ్) 5; ఎక్స్‌ట్రాలు 8; **మొత్తం (86 ఓవర్లలో 4 వికెట్లకు) 254. వికెట్ల పతనం:** 1-0, 2-11, 3-24, 4-239, **బౌలింగ్:** నిధీశ్18-7-33-2; ఎడెన్ టామ్ 21-5-66-1; ఆదిత్య సర్వతే 12-2-46-0; బాసిల్ 14-4-36-0; జలజ్ సక్సేనా 14-0-46-0; అక్షయ్ చంద్రన్ 7-0-22-0.



క్వార్టర్స్‌లో సాకేత్-రామ్ జోడీ

బెంగళూరు: వరుస సెట్‌లలో గెలిచిన భారత జోడీ సాకేత్ మైనేని-రామ్ కుమార్ రామనాథన్ బెంగళూరు ఓపెన్ ఏటీపీ-125 చాలెంజర్ టెన్నిస్ టోర్నీలో క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించింది. బుధవారం జరిగిన పురుషుల డబుల్స్ తొలి రౌండ్‌లో సాకేత్-రామ్ ద్వయం 6-3, 7-6 (7/4)తో జాకోపో బెరెటిని-ఎన్రికో డల్లా వాలె (ఇటలీ) జంటను ఓడించింది. 74 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో సాకేత్-రామ్ జోడీ తొమ్మిది ఏస్‌లు సంధించి, ప్రత్యర్థి సర్వీస్‌ను రెండుసార్లు బ్రేక్ చేసింది. ఇతర తొలి రౌండ్ మ్యాచ్‌ల్లో టాప్ సీడ్ అనిరుధ్ చంద్రశేఖర్ (భారత్)-రే హో (చైనీస్ తైపీ) 6-4, 6-4తో గంటా సాయికార్తీక్ రెడ్డి (భారత్)-సుల్తానోవ్ (ఉజ్బెకిస్తాన్)లపై, సిద్ధాంత్-పరీక్షిత్ సామాని (భారత్) 6-4, 6-3తో నికీ కలియంద పునాచా (భారత్)-జాన్ లాక్ (జింబాబ్వే)లపై, ప్రజ్వల్ దేవ్-ఆర్యన్ షా (భారత్) 4-6, 6-3, 10-6తో ఎంజో కుకాడో (ఫ్రాన్స్)-మైకేల్ గీర్ట్స్ (బెల్జియం)లపై, ఆదిల్ కల్యాణ్‌పూర్-కరణ్ సింగ్ (భారత్) 1-6, 6-2, 10-4తో నితిన్ కుమార్ సిన్హా-మనీశ్ సురేశ్‌కుమార్ (భారత్)లపై గెలిచి క్వార్టర్ ఫైనల్లోకి అడుగు పెట్టారు.

బోపన్న ద్వయం తొలి రౌండ్‌లోనే...



దుబాయ్: ఈ ఏడాది భారత టెన్నిస్ డబుల్స్ వెటరన్ స్టార్ రోహన్ బోపన్న ఆశించినస్థాయిలో రాణించలేకపోతున్నాడు. సీజన్‌లో పాల్గొన్న నాలుగో టోర్నీలోనూ అతను క్వార్టర్ ఫైనల్ దాటి వెళ్లలేకపోయాడు. దుబాయ్ ఓపెన్ ఏటీపీ-500 టోర్నీలో రోహన్ బోపన్న (భారత్)-ఇవాన్ డోడిగ్ (క్రొయేషియా) ద్వయం తొలి రౌండ్‌లోనే ఇంటిదారి పట్టింది. బోపన్న-డోడిగ్ జంట 2-6, 4-6తో జూలియన్ క్యాష్-లాయిడ్ గ్లాస్‌పూల్ (బ్రిటన్) జోడీ చేతిలో ఓడిపోయింది. 60 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో బోపన్న-డోడిగ్ నాలుగు ఏస్‌లు సంధించి, ఆరు డబుల్ ఫాల్ట్‌లు చేసింది. బోపన్న-డోడిగ్‌లకు 13,890 డాలర్ల (రూ. 12 లక్షల 10 వేలు) ప్రైజ్‌మనీ లభించింది.



నిశేష్‌కు నిరాశ

అకాపుల్కో: మెక్సికో ఓపెన్ ఏటీపీ-500 టెన్నిస్ టోర్నీలో తెలుగు సంతతికి చెందిన అమెరికా ప్లేయర్ నిశేష్ బసవరెడ్డి తొలి రౌండ్‌లో ఓడిపోయాడు. బుధవారం జరిగిన పురుషుల సింగిల్స్ మెయిన్ 'డ్రా' తొలి రౌండ్‌లో ప్రపంచ 106వ ర్యాంకర్ నిశేష్ 5-7, 2-6తో ప్రపంచ 32వ ర్యాంకర్ డెనిస్ షపోవలోవ్ (కెనడా) చేతిలో ఓటమి చవిచూశాడు. 98 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో నిశేష్ తన సర్వీస్‌ను ఐదుసార్లు కోల్పోయి, ప్రత్యర్థి సర్వీస్‌ను రెండుసార్లు బ్రేక్ చేశాడు. నిశేష్‌కు 20,165 డాలర్ల (రూ. 17 లక్షల 57 వేలు) ప్రైజ్‌మనీ లభించింది. క్వాలిఫయింగ్‌లో ఆడిన రెండు మ్యాచ్‌ల్లో నెగ్గిన నిశేష్ మెయిన్ 'డ్రా'కు అర్హత పొందాడు. ఈ ఏడాది నాలుగో టోర్నీ ఆడుతున్న నిశేష్ ఆస్ట్రేలియన్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ తొలి రౌండ్‌లో సెర్బియా దిగ్గజం నొవాక్ జొకోవిచ్‌కు గట్టిపోటీనిచ్చి ఓడిపోయాడు. అంతకు ముందు ఆక్లాండ్ ఓపెన్‌లో సెమీఫైనల్లో, బ్రిస్బేన్ ఓపెన్‌లో తొలి రౌండ్‌లో పరాజయం చవిచూశాడు.


ఐపీఎల్ సమయంలోనూ 'ఎర్రబంతి'తో...

● భారత క్రికెటర్ల ప్రాక్టీస్‌కు బోర్డు ప్రణాళిక
● టెస్టులకు సిద్ధంగా ఉంచే ఆలోచన



ముంబై: భారత క్రికెట్ జట్టు చక్కటి ప్రదర్శనతో ఇప్పటికే చాంపియన్స్ ట్రోఫీలో సెమీస్ చేరింది. తమ స్థాయికి తగినట్లుగా ఆడితే టైటిల్ కూడా సాధించే అవకాశం ఉంది. ఈ టోర్నీ ముగిసిన వెంటనే ఆటగాళ్లంతా ఐపీఎల్ హడావిడిలో పడిపోతారు. తమ ఫ్రాంచైజీల తరఫున సత్తా చాటేందుకు సిద్ధమైపోతారు. అయితే భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) మాత్రం టీమిండియా ఇటీవలి టెస్టు ప్రదర్శనను పూర్తిగా మర్చిపోలేదు. సొంతగడ్డపై న్యూజిలాండ్ చేతిలో అనూహ్యంగా 0-3తో చిత్తయిన భారత్ ఆ తర్వాత ఆస్ట్రేలియాలో 1-3తో సిరీస్ కోల్పోయింది. ఇప్పుడు ఐపీఎల్ ముగిసిన వెంటనే టీమిండియా జూన్-జులైలో జరిగే ఐదు టెస్టుల సిరీస్‌లో తలపడేందుకు ఇంగ్లండ్ వెళ్లనుంది. ఈ కీలక సిరీస్‌కు ముందు అంతా ఐపీఎల్‌లోనే ఉంటారు కాబట్టి టెస్టుల సన్నద్ధతకు తగిన సమయమే లభించదు. గతంలో ఐపీఎల్ ముగిసిన వెంటనే ఇంగ్లండ్ వెళ్లిన సందర్భాల్లో (2011, 2014, 2018లలో) భారత్ చిత్తుగా ఓడి సిరీస్‌లు కోల్పోయింది. 2021 సిరీస్‌లో ముందంజలో నిలిచినా... కోవిడ్ కారణంగా కొద్ది రోజుల తర్వాత జరిగిన టెస్టుల ఓడి సిరీస్‌ను 2-2తో సమంగా ముగించింది. ఈ నేపథ్యంలో ఐపీఎల్ సమయంలోనూ భారత క్రికెటర్లు టెస్టులకు సిద్ధమయ్యేలా చూసే ప్రణాళికను బీసీసీఐ రూపొందిస్తోంది. పూర్తిగా టి20కే అంకితం కాకుండా టెస్టుల కోసం ఎర్రబంతితో సాధన చేసేలా చేయడమే దీని ఉద్దేశం. ఈ ప్రతిపాదన ప్రకారం టెస్టు జట్టులో సభ్యులైన భారత ఆటగాళ్లు రెండు నెలల పాటు పూర్తిగా ఐపీఎల్‌కే అంకితమైపోరు. ఒకవైపు ఐపీఎల్ ఆడుతూనే మరోవైపు రాబోయే టెస్టుల కోసం ప్రాక్టీస్ కొనసాగించాల్సి ఉంటుంది. దీని కోసం ప్రత్యేకంగా సెషన్‌లు ఉంటాయి. ఆటగాళ్లంతా ఇందులో పాల్గొనేలా ప్రణాళికలు రూపొందిస్తున్నారు. భారత్, పాకిస్తాన్ మ్యాచ్ ముగిశాక దుబాయ్‌లో దీనికి సంబంధించి ఇప్పటికే బోర్డు అధికారులు చర్చించారు. చాంపియన్స్ ట్రోఫీ ముగిసిన తర్వాత జరిగే మరో సమావేశంలో ఈ అంశంపై పూర్తి స్పష్టత వస్తుంది. మొత్తంగా ఇంగ్లండ్‌తో టెస్టు సిరీస్‌ను బోర్డు ప్రతిష్టాత్మకంగా తీసుకుంటూ ముందుగానే సన్నాహాలు మొదలు పెడుతోంది.

క్లీన్ కూనెమన్



మెల్‌బోర్న్: ఆస్ట్రేలియా స్పిన్నర్ మాథ్యూ కూనెమన్ బౌలింగ్ శైలి... నిబంధనలకు అనుగుణంగానే ఉందని అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) స్పష్టం చేసింది. గత నెలలో శ్రీలంకతో రెండో టెస్టు సందర్భంగా కూనెమన్ బౌలింగ్ యాక్షన్‌పై ఫిర్యాదులు అందగా... బ్రిస్బేన్ వేదికగా ఐసీసీ ప్రత్యేక పరీక్షలు నిర్వహించింది. వీటిలో అతడు నిబంధనలకు లోబడే బంతులు వేస్తున్నట్లు నిర్ధారణ అయింది. దీంతో అతడు అంతర్జాతీయ క్రికెట్‌లో బౌలింగ్ కొనసాగించవచ్చని ఐసీసీ వెల్లడించింది. 'కూనెమన్ బౌలింగ్ శైలి చట్టబద్ధంగానే ఉంది. ఈ లెఫ్టార్మ్ స్పిన్నర్ అంతర్జాతీయ క్రికెట్‌లో బౌలింగ్ చేయవచ్చు' అని ఐసీసీ బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది. దీంతో 28 ఏళ్ల కూనెమన్ బౌలింగ్ యాక్షన్‌పై కమ్ముకున్న నీలినీడలు వీడిపోయాయి. శ్రీలంకతో జరిగిన రెండు మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌లో 16 వికెట్లు పడగొట్టిన కూనెమన్... ఆస్ట్రేలియా సిరీస్ చేజిక్కించుకోవడంలో కీలక పాత్ర పోషించాడు. ఐసీసీ పరీక్ష సమయంలో క్రికెట్ ఆస్ట్రేలియా (సీఏ) కూనెమన్‌కు పూర్తి మద్దతుగా నిలిచింది. ఈ ఏడాది జూన్‌లో ఆస్ట్రేలియా జట్టు వెస్టిండీస్‌లో పర్యటించనుండగా... మూడు మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌కు కూనెమన్ అందుబాటులో ఉండనున్నాడు.

'మరో సిరాజ్' వేటలో...

పేస్ బౌలర్ల ప్రతిభాన్వేషణ కార్యక్రమం ● ఎమ్మెస్కే ప్రసాద్ అకాడమీ నిర్వహణ



సాక్షి, హైదరాబాద్: పేస్ బౌలర్ మొహమ్మద్ సిరాజ్ గత కొంత కాలంగా భారత క్రికెట్ జట్టులో కీలక ఆటగాడిగా ఎదిగాడు. పలు చిరస్మరణీయ విజయాల్లో భాగంగా ఉన్న అతను టి20 వరల్డ్ కప్ గెలిచిన జట్టులో కూడా సభ్యుడు. ఎంతో మంది యువ ఆటగాళ్లతో పోలిస్తే అతని ప్రస్థానం ఎంతో ప్రత్యేకం. పేదరిక నేపథ్యం, ఆటోడ్రైవర్‌గా పని చేసే తండ్రి, కనీస ఖర్చులకు కూడా ఇబ్బంది పడే స్థితి నుంచి అతను అంతర్జాతీయ క్రికెటర్‌గా ఎదిగాడు. ఒకదశలో షూస్ కూడా కొనుక్కోలేకపోయిన అతను డబ్బుల కోసం టెన్నిస్ బాల్ క్రికెట్ ఆడేవాడు. ఆ తర్వాత కేవలం తన కఠోర శ్రమ, పట్టుదలతో పైకి ఎదిగాడు. ఇప్పుడు అలాంటి సిరాజ్‌లను వెతికి సానబెట్టేందుకు భారత మాజీ క్రికెటర్, మాజీ చీఫ్ సెలక్టర్ ఎమ్మెస్కే ప్రసాద్ ప్రయత్నిస్తున్నారు. ఈ క్రమంలో ఆయన ప్రత్యేకంగా నగరంలోని పాతబస్తీలో ఉన్న పేద పేస్ బౌలర్ల కోసం ఒక ప్రతిభాన్వేషణ కార్యక్రమాన్ని నిర్వహించారు. 'హూ ఈజ్ అవర్ నెక్స్ట్ సిరాజ్' పేరుతో ఈ కార్యక్రమం ఎమ్మెస్కే ప్రసాద్ ఇంటర్నేషనల్ క్రికెట్ అకాడమీ (ఎంఎస్‌కేఐసీఏ) ఆధ్వర్యంలో జరిగింది. దీనికి స్వయంగా సిరాజ్ హాజరై తన అనుభవాలను పంచుకున్నాడు. కెరీర్‌లో ఎదిగే క్రమంలో తనకు ఎదురైన కష్టాలను గుర్తు చేసుకున్న అతను... ప్రతిభావంతులైన కుర్రాళ్లు ఈ అవకాశాన్ని ఉపయోగించుకొని భవిష్యత్తులో గొప్ప బౌలర్లుగా ఎదగాలని ఆకాంక్షించాడు. అత్తాపూర్‌లోని విజయానంద్ గ్రౌండ్స్‌లో జరిగిన ఈ ప్రతిభాన్వేషణ కార్యక్రమాన్ని హైదరాబాద్ పార్లమెంట్ సభ్యుడు అసదుద్దీన్ ఒవైసీ ప్రారంభించారు. ఇలాంటి ప్రయత్నాలు క్రికెట్‌ను కెరీర్‌గా తీసుకోవాలనుకునే యువ ఆటగాళ్లలో స్ఫూర్తిని నింపుతాయని, ప్రతిభ గలవారిని తీర్చిదిద్దుతున్న ఎమ్మెస్కే ప్రసాద్‌ను ప్రత్యేకంగా అభినందించారు. తన బాల్య స్నేహితుడు మునీర్ అహ్మద్, కోచ్ రహ్మతుల్లా బేగ్ గౌరవార్థమే ప్రత్యేకంగా పాతబస్తీ క్రికెటర్ల కోసం 'హూ ఈజ్ అవర్ నెక్స్ట్ సిరాజ్' కార్యక్రమాన్ని లాభాపేక్ష లేకుండా నిర్వహించేందుకు సిద్ధమైనట్లు ఎమ్మెస్కే చెప్పారు. సుమారు 400 మంది యువ పేస్ బౌలర్లు ఈ ట్రయల్స్‌కు హాజరవుతున్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్ర మాజీ క్రికెటర్లు షహాబుద్దీన్, ఫసీర్ రహమాన్, సత్యప్రసాద్, మనోజ్‌సాయి, ప్రకాశ్‌బాబు, అమానుల్లా ఖాన్‌లతో పాటు టీఎన్‌జీఏ ప్రధాన కార్యదర్శి ముజీబ్ తదితరులు పాల్గొన్నారు.

పరాజయంతో ముగింపు



షార్జా: పింక్ లేడీస్ కప్ అంతర్జాతీయ మహిళల ఫుట్‌బాల్ టోర్నమెంట్‌ను భారత జట్టు పరాజయంతో ముగించింది. దక్షిణ కొరియా జట్టుతో బుధవారం జరిగిన చివరి లీగ్ మ్యాచ్‌లో భారత జట్టు 0-3 గోల్స్ తేడాతో ఓడిపోయింది. ప్రపంచ ర్యాంకింగ్స్‌లో 20వ ర్యాంక్‌లో ఉన్న కొరియా తొలి అర్ధ భాగం ముగిసేసరికి 2-0 గోల్స్‌తో ఆధిక్యంలో నిలిచింది. కొరియా తరఫున చోయ్ యూజంగ్ (8వ నిమిషంలో), చోయ్ డాగ్‌యోంగ్ (27వ నిమిషంలో), మున్ ఇంజు (81వ నిమిషంలో) ఒక్కో గోల్ చేశారు. నాలుగు జట్లు పోటీపడ్డ ఈ టోర్నీలో భారత జట్టు తొలి మ్యాచ్‌లో జోర్డాన్‌పై 2-0తో గెలిచి, రెండో మ్యాచ్‌లో రష్యా చేతిలో 0-2తో ఓడిపోయింది.

క్రీడా సమాఖ్యలకు సాయంపై సమీక్ష!

కొత్త కమిటీని నియమించిన ప్రభుత్వం



న్యూఢిల్లీ: వేర్వేరు క్రీడాంశాలకు సంబంధించిన జాతీయ సమాఖ్య (ఎన్‌ఎస్‌ఎఫ్)లకు కేంద్ర ప్రభుత్వం నుంచి లభిస్తున్న ఆర్థిక సహాయంపై సమీక్ష జరపాలని ప్రభుత్వం నిర్ణయించింది. 2036 ఒలింపిక్స్‌ను నిర్వహించేందుకు భారత్ ఆసక్తి చూపిస్తున్న నేపథ్యంలో... రాబోయే కొన్నేళ్లలో ఎదురయ్యే సవాళ్లను అధిగమించేలా సమాఖ్య నిబంధనలు ఉండాలని కేంద్రం భావిస్తోంది. 'మూడేళ్ల క్రితం రూపొందించిన విధానం ప్రకారం జాతీయ క్రీడా సమాఖ్యలకు కేంద్ర ఆర్థిక సహాయం అందిస్తోంది. ఇందులో ఉన్న నిబంధనలను సమీక్షించాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇందు కోసమే కొత్త కమిటీని ఏర్పాటు చేశాం. వేర్వేరు అంశాలను సమీక్షించి ఈ కమిటీ నివేదిక అందజేస్తుంది' అని క్రీడా మంత్రిత్వ శాఖ కార్యదర్శి తరుణ్ పరీక్ పేర్కొన్నారు. కొత్తగా ఆరుగురు సభ్యులతో ఈ కమిటీని ఏర్పాటు చేశారు. ఆయా క్రీడల్లో టోర్నీల నిర్వహణ, విదేశాల్లో జరిగే టోర్నీల్లో ఆటగాళ్లు పాల్గొనడం, క్రీడా సామగ్రి కొనుగోలు, కోచింగ్ క్యాంప్‌ల నిర్వహణ వంటి కార్యక్రమాల కోసం ఎన్‌ఎస్‌ఎఫ్‌లకు కేంద్ర ప్రభుత్వం ఆర్థిక సహాయం అందిస్తోంది. కోచ్‌లు, ఇతర సహాయక సిబ్బంది జీతాలు, గుర్తింపు పొందిన ఆటగాళ్ల కోసం ఇతర అదనపు సౌకర్యాలు, ప్రోత్సాహకాలు కూడా ప్రభుత్వమే చెల్లిస్తుంది. వీటికి తోడు సమాఖ్యలు తమ స్థాయిని బట్టి బయట స్పాన్సర్ల ద్వారా కూడా కొంత ఆర్థిక సహాయాన్ని పొందుతాయి. గత ఏడాది బడ్జెట్‌లో ఎన్‌ఎస్‌ఎఫ్‌ల కోసం రూ. 340 కోట్లు కేటాయించిన ప్రభుత్వం ఈ సారి దానిని కొంత పెంచి రూ.400 కోట్లు చేసింది. సమాఖ్యల పనితీరులో మరింత పారదర్శకత, జవాబుదారీతనం కోసమే కొత్త కమిటీని ఏర్పాటు చేసి నిబంధనలు మార్పు చేసే విషయంపై చర్చిస్తున్నట్లు సమాచారం. మరోవైపు ముసాయిదా క్రీడా బిల్లును కూడా త్వరలో పార్లమెంట్‌లో ప్రవేశపెట్టే అవకాశం ఉంది. ఎన్‌ఎస్‌ఎఫ్‌లకు గ్రాంట్‌లు అందజేసే విషయంలో ఒక రెగ్యులేటరీ బోర్డును కూడా ఏర్పాటు చేయాలని ఈ బిల్లులో ప్రతిపాదన ఉంది. 2036లో ఒలింపిక్స్ క్రీడల నిర్వహణ కోసం భారత్ ఇప్పటికే తమ ఆసక్తిని చూపిస్తూ 'లెటర్ ఆఫ్ ఇంటెంట్'ను ఐఓసీకి పంపించింది.

జింబాబ్వేదే టి20 సిరీస్



ఐర్లాండ్‌తో చివరి మ్యాచ్ రద్దు

హరారే: సొంతగడ్డపై ఐర్లాండ్‌తో జరిగిన టి20 సిరీస్‌ను జింబాబ్వే కైవసం చేసుకుంది. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా జరిగిన చివరి పోరు వర్షం కారణంగా రద్దు కాగా... జింబాబ్వే 1-0తో సిరీస్ చేజిక్కించుకుంది. తొలి మ్యాచ్ కూడా వర్షం కారణంగా రద్దయింది. రెండో టి20లో జింబాబ్వే 3 వికెట్ల తేడాతో విజయం సాధించింది. ఇక మంగళవారం అర్ధరాత్రి జరిగిన చివరి టి20లో మొదట బ్యాటింగ్ చేసిన జింబాబ్వే 18 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 142 పరుగులు చేసింది. కెప్టెన్ సికందర్ రజా (27 బంతుల్లో 34; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు), టోనీ (26), తషింగా (26 నాటౌట్) రాణించారు. ఐర్లాండ్ బౌలర్లలో క్రెయిగ్ యంగ్, గారెత్ డెలానీ చెరో 2 వికెట్లు పడగొట్టారు. అనంతరం ఐర్లాండ్ జట్టు లక్ష్య ఛేదనకు దిగకముందే భారీ వర్షం కురిసింది. దీంతో మ్యాచ్ సాధ్యపడలేదు. ఫలితంగా జింబాబ్వేకు సిరీస్ దక్కింది. ఈ పర్యటనలో భాగంగా తొలుత జరిగిన ఏకైక టెస్టులో ఐర్లాండ్ జట్టు విజయం సాధించగా... అనంతరం మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌లో జింబాబ్వే 2-1తో గెలుపొందింది.

ఆర్మీ వాహనంపై ఉగ్రవాదుల కాల్పులు

జమ్మూ: జమ్మూకశ్మీర్‌లోని రాజౌరీ జిల్లాలో సైనిక వాహనంపైకి ఉగ్రవాదులు కాల్పులకు తెగబడ్డారు. నియంత్రణ రేఖ వెంబడి సుందర్‌బని సెక్టార్‌లోని ఫల్ గ్రామం సమీపంలో బుధవారం ఈ ఘటన చోటుచేసుకుంది. ఎవరికీ ఎటువంటి అపాయం కలగలేదని, బలగాలు కూడా తిరిగి కాల్పులు జరిపాయని అధికారులు తెలిపారు. ఆ ప్రాంతంలో భారీ కూంబింగ్ ఆపరేషన్ చేపట్టినట్లు వెల్లడించారు. అటవీ ప్రాంతంలో దాగున్న ముష్కరులు, అటుగా వచ్చిన ఆర్మీ వాహనంపైకి కొన్ని రౌండ్ల కాల్పులు జరిపినట్లు వివరించారు. తరచూ ఉగ్రవాదులు ఈ ప్రాంతం వద్దనే చొరబాట్లకు ప్రయత్నిస్తుంటారని చెప్పారు. మరో పరిణామంలో..జమ్మూలోని అఖ్నూర్ సెక్టార్‌లో కేరి బట్టాల్ ప్రాంతంలో నియంత్రణ రేఖ వెంబడి మంగళవారం అర్ధరాత్రి అనుమానాస్పద కదలికలను గమనించి జవాన్లు కాల్పులు జరిపారు. బుధవారం ఉదయం అక్కడ గాలింపు చేపట్టారు.

చొరబాటుదారు కాల్చివేత

పంజాబ్‌లోని అంతర్జాతీయ సరిహద్దు వెంబడి దొంగచాటుగా భారత భూభాగంలోకి ప్రవేశించేందుకు ప్రయత్నించిన పాకిస్తాన్ పౌరుడిని భద్రతా బలగాలు కాల్చి చంపాయి. పఠాన్‌కోట్ జిల్లా తాష్‌పటన్ ప్రాంతంలో అనుమానాస్పద కదలికలతో అప్రమత్తమైన బీఎస్ఎఫ్ జవాన్లు హెచ్చరికలు చేశారు. అయినప్పటికీ చొరబాటుదారు సరిహద్దు దాటి లోపలికి ప్రవేశించేందుకు ప్రయత్నించగా జవాన్లు కాల్పులు జరిపారు. ఈ ఘటనలో గుర్తు తెలియని పాకిస్తానీ చనిపోయాడని అధికారులు వివరించారు. ఈ పరిణామంపై పాకిస్తాన్ రేంజర్లకు నిరసన తెలిపినట్లు జమ్మూ ఫ్రంటియర్ బీఎస్ఎఫ్ ప్రతినిధి ఒకరు తెలిపారు. పంజాబ్‌లోని 553 కిలోమీటర్ల భాగం సహా భారత-పాకిస్తాన్ అంతర్జాతీయ సరిహద్దులను బీఎస్ఎఫ్ జవాన్లు కాపాలా కాస్తుంటారు.



జమ్మూకశ్మీర్‌లో లభ్యమయ్యే పండ్లు, ఆకర్షణీయమైన పూలతో బుధవారం దాల్ సరస్సులో షికారాల ర్యాలీ దృశ్యమిది. శ్రీనగర్ హెరిటేజ్ ఫెస్టివల్ 2025- సోన్ మీరాస్‌లో భాగంగా ఈ ప్రదర్శన చేపట్టారు.

మే 2న తెరుచుకోనున్న కేదార్‌నాథ్ ఆలయం

రుద్రప్రయాగ్(ఉత్తరాఖండ్): కేదార్‌నాథ్ ఆలయాన్ని మే 2వ తేదీన ఉదయం 7 గంటల నుంచి భక్తుల సందర్శన కోసం తెరువనున్నారు. ఈ విషయాన్ని బుధవారం శ్రీ బద్రీనాథ్-కేదార్‌నాథ్ ఆలయ కమిటీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ అధికారి విజయ్ ప్రసాద్ తప్లియాల్ వెల్లడించారు. దీంతో, గఢ్వాల్ హిమాలయాల్లో ఉన్న మిగతా మూడు ప్రముఖ ఆలయాల తలుపులను తెరిచే తేదీలు ఖరారయ్యాయి. బద్రీనాథ్ ఆలయాన్ని మే 4న, గంగోత్రి యమునోత్రి ఆలయాలను ఏప్రిల్ 30న తెరువనున్నారు. ఈ నాలుగు ఆలయాలను కలిపి చోటా చార్‌ధామ్‌గా పిలుస్తుంటారు. ఉంఖిమఠ్‌లోని ఓంకారేశ్వర ఆలయంలో బుధవారం మహాశివరాత్రి పూజల అనంతరం సమావేశమైన ఆచార్యులు, వేద పండితులు ఆలయాలను తిరిగి తెరిచేందుకు అనువైన ముహూర్తాలను ఖరారు చేశారని తప్లియాల్ వివరించారు.

కుమారస్వామి విచారణకు అనుమతివ్వండి

గవర్నర్ గెహ్లోట్‌కు పోలీసు శాఖ వినతి

శివాజీనగర: జేడీఎస్ సీనియర్ నేత, కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ మంత్రి హెచ్‌డీ.కుమారస్వామిని విచారించేందుకు అనుమతివ్వాలని రాష్ట్ర పోలీసు శాఖ గవర్నర్ తావర్‌చంద్ గెహ్లోట్‌కు విజ్ఞప్తి చేసింది. గతంలో బళ్లారి జిల్లాలో శ్రీ సాయి వెంకటేశ్వర మినరల్స్ మైనింగ్ కేసులో అప్పట్లో ముఖ్యమంత్రిగా ఉన్న కుమారస్వామి అక్రమాలకు పాల్పడినట్లు ప్రస్తుత కాంగ్రెస్ సర్కారు ఆరోపిస్తోంది. దీనిపై ఇప్పటికే ఓ కేసు విచారణలో ఉన్నందున ఆయనను విచారించడానికి అనుమతి ఇవ్వాలని సిట్ బృందం రాజ్‌భవన్‌కు లేఖ రాసింది. అయితే చార్జిషీట్ కన్నడలో ఉందని, ఆంగ్లంలోకి అనువదించి అందజేయాలని రాజ్‌భవన్ అధికారులు సూచించారు. దీంతో సుమారు 4,500 పేజీల చార్జిషీటును ఇంగ్లిష్‌లోకి మార్చి సమర్పించారు. ప్రస్తుతం కర్ణాటకలో కుమారస్వామి, కాంగ్రెస్ సీఎం సిద్దరామయ్య, డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ మధ్య ఆరోపణల పర్వం కొనసాగుతోంది.

40 ఏళ్ల తరువాత తల్లిని చేరిన కూతురు

ఐదు రోజుల పసికూనగా వెళ్లిపోయిన కూతురు 40 ఏళ్ల తరువాత తల్లి ముందు నిలబడితే.. ఆ ఆనందానికి అవధులు ఉండవు కదా! ఈ అంతులేని సంతోషానికి ఇటీవల వేదికయ్యింది చిలీలోని శాన్ అంటోనియో. వివరాల్లోకి వెళ్తే.. 40 ఏళ్లకిందట.. శాన్ అంటోనియాకు చెందిన 24 ఏళ్ల ఎడిటా బిజామాకు అప్పటికే ఇద్దరమ్మాయిలు. మూడోసారి కుమార్తె పుట్టింది. పిల్లల్లో పేదరికాన్ని తగ్గించడానికి అప్పటి అగస్టో పినోచెట్ నాయకత్వంలోని సైనిక నియంతృత్వ ప్రభుత్వం అంతర్జాతీయ దత్తతలే మార్గమని భావించింది. అట్లా దాదాపు 20వేల మంది పిల్లలను బలవంతపు దత్తత ఇచ్చింది. బిడ్డ కడుపులో ఉండగా.. బిజామా సైతం దత్తతకు అంగీకరించింది. కానీ.. పాప పుట్టిన తరువాత పంపించడానికామె ఒప్పుకోలేదు. 'ఉద్యోగం లేదు, ఇల్లు లేదు, స్థిరత్వం లేదు. పిల్లలను ఎలా పెంచుతావ్'అంటూ ప్రశ్నించిన ప్రభుత్వాధికారులు ఆమె ఐదు రోజుల కూతురిని తీసుకెళ్లిపోయారు. బిజామా కుటుంబంలోని చాలా మందికి ఈ విషయం కూడా తెలియదు. కానీ పేగు తెంచుకు పుట్టింది కదా.. బిజామా బిడ్డకోసం రోదిస్తూనే ఉంది. వెదకడానికి కనీసం పేరు తెలియదు. మార్గం కూడా లేదు.

మరోవైపు.. ఆమె కూతురు అడామరీ గార్సియా ఫ్లోరిడాలో పెరిగింది. ఇప్పుడు ప్యూర్టో రికోలో నివసిస్తోంది. తనను దత్తత తీసుకున్నారని చిన్నతనం నుంచే తెలుసు. కానీ కన్న తల్లిదండ్రులను కలుసుకోవడమెలాగో తెలియదు. అలాంటి సమయంలో ఆమె ఫ్రెండ్ ఒకరు.. శిశువుగా దత్తతకు వచ్చి.. చిలీలోని తన సొంత కుటుంబాన్ని కలుసుకున్న టెక్సాస్ అగ్నిమాపక అధికారి టేలర్ గ్రాఫ్ గురించి చెప్పారు. అలాంటివారి కోసం సాయం చేసేందుకు ఆయన ఏర్పాటు చేసిన 'కనెక్టింగ్ రూట్స్'స్వచ్ఛంద సంస్థ గురించి వివరించారు. వెంటనే ఆ సంస్థను కలిసింది గార్సియా. కుటుంబం గురించి తెలుసుకోవడానికి గార్సియా తపన చూసి.. ఆమెను దత్తత తీసుకున్న తల్లిదండ్రులు సైతం ప్రోత్సాహమందించారు. సోదరి బర్త్ సర్టిఫికెట్ ద్వారా కుటుంబ వివరాలు తెలిసాయి. అయినా.. డీఎన్ఏ పరీక్షతో బిజామానే గార్సియా కన్నతల్లని కనెక్టింగ్ రూట్స్ నిర్ధారించింది. వెంటనే మొదటిసారి జూమ్ ద్వారా మాట్లాడుకున్నారు. గార్సియాది ప్యూర్టో రికన్ స్పానిష్, మయామీ యాస. కానీ తల్లి, అక్కలది విలక్షణమైన చిలీ యాస. మొదటిసారి సంభాషణ కష్టమే అయ్యింది. ఒకరినొకరు చూసుకుంటూ కన్నీటిపర్యంతమయ్యారు. గతవారం కుటుంబం చెంతకు చేరుకుంది గార్సియా. 41 ఏళ్ల గార్సియాకు తల్లికి, ఇద్దరు అక్కలకు దగ్గరకు పోలికలున్నాయి. అంతేకాదు.. పెద్దక్కకు ఇష్టమున్నట్టే ఆమెకూ కుక్కలంటే చాలా ఇష్టం. ఇప్పుడు గార్సియా చిలీయాస, వంటకాలు, సంగీతం అన్నింటినీ నేర్చుకుంటోంది. అక్కలతో ఎక్కువకాలం గడపాలని నిర్ణయించుకుంది.

కనెక్టింగ్ రూట్స్ ఈ ఏడాది చిలీకి తీసుకు వచ్చిన ఐదుగురు దత్తతదారుల్లో గార్సియా ఒకరు. ఇది ఆ ఎన్జీవో చేసిన నాలుగవ పునరేకీకరణ. ఎన్జీవో చర్యలకు ప్రభుత్వం మద్దతు ఇస్తోంది. 40 ఏళ్ల కిందట దత్తతకు పోవడంతో ఇప్పుడు తల్లులు పెద్దవారవుతున్నారు. కొందరు చనిపోయారు. అందుకే ఆలస్యం కాకముందే సాధ్యమైనన్ని ఎక్కువ కుటుంబాలను తిరిగి కలపాలని లక్ష్యంగా పెట్టుకుంది కనెక్టింగ్ రూట్స్.

– సాక్షి, నేషనల్ డెస్క్

పంజాబ్ ఉప పోరులో ఆప్ రాజ్యసభ ఎంపీ

చండీగఢ్: పంజాబ్‌లోని లుధియానా వెస్ట్ అసెంబ్లీ నియోజకవర్గానికి జరిగే ఉప ఎన్నికకు రాజ్యసభ ఎంపీ సంజీవ్ అరోరా(61)ను ఆప్ అభ్యర్థిగా ప్రకటించింది. ఈ ఉప ఎన్నికలో అరోరా గెలిస్తే రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేయాల్సి ఉంటుంది. అయితే, ఉప ఎన్నిక షెడ్యూల్‌ను ఈసీ ఇంకా ప్రకటించలేదు. ఆప్‌కు చెందిన ఎమ్మెల్యే గుర్‌ప్రీత్ బస్సి గోగి తన నెలలో తన నివాసంలో ప్రమాదవశాత్తు తుపాకీ పేలిన ఘటనలో చనిపోవడం లుధియానా వెస్ట్ స్థానం ఖాళీ అయ్యింది. లూధియానాకు చెందిన పారిశ్రామికవేత్త అరోరా 2022 నుంచి రాజ్యసభ సభ్యునిగా కొనసాగుతున్నారు. కాగా, అరోరా స్థానంలో రాజ్యసభలో అడుగు పెట్టేందుకే ఆప్ చీఫ్ కేజ్రీవాల్ ఈ నిర్ణయం తీసుకున్నారన్న పంజాబ్ కాంగ్రెస్ చేసిన వ్యాఖ్యలను ఆ పార్టీ ఖండించింది. ఉప ఎన్నిక షెడ్యూల్ ఇంకా ఖరారు కాకమునుపే ప్రతిపక్షాలు వదంతులు వ్యాపింపజేస్తున్నాయని ఆప్ ప్రతినిధి నీల్ గర్గ్ విమర్శించారు. ఉప ఎన్నిక ఫలితం వెలువడ్డాకే అరోరా బదులు రాజ్యసభకు ఎవరు వెళ్లాలనే దానిపై స్పష్టత వస్తుందన్నారు. పార్టీని దేశవ్యాప్తంగా విస్తరించడమనే బృహత్తర బాధ్యతను ఆయన భుజాన వేసుకున్నారని వివరించారు. కాగా, ఆప్‌కు పంజాబ్ నుంచి ఏడుగురు రాజ్యసభ సభ్యులున్నారు.

కలియుగానికి ఇదో ఉదాహరణ

పంజాబ్ హరియాణా హైకోర్టు వ్యాఖ్య

తల్లికి రూ.5వేల మనోవర్తిపై కుమారుడి పిటిషన్ కొట్టివేత

చండీగఢ్: వృద్ధురాలైన తల్లికి మనోవర్తిగా నెలకు రూ.5 వేలు ఇవ్వాలంటూ దిగువ కోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ ఓ వ్యక్తి వేసిన పిటిషన్‌పై పంజాబ్ హరియాణా హైకోర్టు ఆశ్చర్యం వ్యక్తం చేసింది. కలియుగంలో జరుగుతున్న విపరీతాలకు ఇదో ఉదాహరణ అంటూ వ్యాఖ్యానించింది. సంగ్రూర్ కుటుంబ న్యాయస్థానంలో మూడు నెలల్లోగా రూ.50 వేలు డిపాజిట్ చేయాలంటూ పిటిషనర్‌ను ఆదేశించింది. పిటిషన్‌ను కొట్టివేసిన హైకోర్టు..అది చాలా తక్కువ మొత్తమని తెలిపింది. మనోవర్తి మొత్తం పెంచాలంటూ పిటిషనర్ తల్లి ప్రత్యేకంగా ఎలాంటి విజ్ఞాపన చేయలేదని కూడా పేర్కొంది. 77 ఏళ్ల వృద్ధురాలి భర్త 1992లోనే చనిపోయారు. వీరికి ఒక కుమార్తె, ఇద్దరు కుమారులున్నారు. ఒక కుమారుడు చనిపోయాడు. అతడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. ఆమెకున్న సుమారు 30 ఎకరాల భూమిని పిటిషనర్ అయిన మరో కుమారుడు, చనిపోయిన కుమారుడి పిల్లలు పంచుకున్నారు. 1993లో మనోవర్తి కింద వృద్ధురాలికి రూ.లక్ష ఇచ్చారు. అప్పటి నుంచి ఆమె కుమార్తె వద్దే ఉంటోంది. తన పోషణ భారం కుమార్తె మోయాల్సి రావడంతో వృద్ధురాలు సంగ్రూర్ కుటుంబ కోర్టును ఆశ్రయించారు. తల్లి తన వద్ద ఉండటం లేదు కాబట్టి, మనోవర్తి తాను ఇవ్వాల్సిన పనిలేదని కుమారుడు వాదించాడు. తోసిపుచ్చిన న్యాయస్థానం నెలకు రూ.5 వేల చొప్పున అందజేయాలంటూ ఆదేశించింది. ఈ ఆదేశాలను హైకోర్టులో సవాల్ చేశాడు. విచారణ సందర్భంగా న్యాయస్థానం..'తన తల్లికి వ్యతిరేకంగా సాక్షాత్తూ కుమారుడే ఈ పిటిషన్ వేయడం చూసి మేం షాక్‌కు గురయ్యాం. తండ్రి నుంచి ఆస్తి సంక్రమించినప్పటికీ, ఎలాంటి ఆదాయ వనరుల్లేని వయో వృద్ధురాలైన తల్లిని పెళ్లయి మెట్టినింట్లో ఉంటున్న ఆమె కుమార్తె వద్ద వదిలేయడం దురదృష్టకరం. కలియుగంలో జరిగే వైపరీత్యాలకు ఈ కేసు సిసలైన ఉదాహరణ'అని వ్యాఖ్యానించింది.

మూడేళ్లలో 1,65,000 మంది రష్యా సైనికులు మృతి

ఆ దేశ స్వతంత్ర మీడియా కథనం

- 95,000 మంది సైనికుల వివరాలతో ప్రచురణ
- లెక్కలపై నోరు విప్పని ప్రభుత్వం

మాస్కో: ఉక్రెయిన్‌తో పోరాడుతూ 165,000 సైనికులు మరణించారని రష్యన్ స్వతంత్ర వార్తా సైట్ మీడియాజోనా ప్రకటించింది. అందులో 95,000 మందికి పైగా సైనికుల వివరాలను పేర్లతో సహా వెల్లడించింది. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం మూడేళ్లయిన సందర్భంగా సైనికుల మరణాలకు సంబంధించిన చిత్రాలు, అధికారిక సమాచారంతో కూడిన కథనాన్ని మీడియాజోనా సోమవారం ప్రచురించింది. రష్యన్ కళాకారుడు వాసిలీ వెరెష్చాగిన్ 1,871లో 'ది అపోథియోసిస్ ఆఫ్ వార్'చిత్రాన్ని వేలాది మంది సైనికుల ఫొటోల గ్రాఫిక్స్‌తో రూపొందించింది. ప్రతి ఎంట్రీలో సైనికుడి వయస్సు, మరణించిన తేదీ, ప్రాంతం, యూనిట్, అందుబాటులో ఉంటే ఫొటోలను కూడా ప్రచురించింది. ఇక ఈ ఏడాది ఇప్పటివరకు రష్యన్ మరణాల సంఖ్యను 393గా పేర్కొంది.రష్యన్ల మరణాల సంఖ్య ప్రతి సంవత్సరం దాదాపు రెట్టింపవుతూ వచ్చిందని వెల్లడించింది. తమ విశ్లేషణ ప్రకారం 2024 యుద్ధంలో అత్యంత రక్తసిక్త సంవత్సరమని పేర్కొంది. 2022లో సుమారు 20,000, 2023లో సుమారు 50,000 మంది మరణించగా.. ఒక్క 2024లో 1,00,000 మంది చనిపోయాడని వెల్లడించింది. బీబీసీ రష్యన్ సర్వీస్, వలంటీర్ల బృందం సహకారంతో జాబితాను రూపొందించామని తెలిపింది.

మౌనం వహించిన ప్రభుత్వం...

దీనిపై వ్యాఖ్యానించడానికి క్రెమ్లిన్ నిరాకరించింది. ఈ ప్రచురణ గురించి తనకు తెలియదని క్రెమ్లిన్ అధికార ప్రతినిధి దిమిత్రి పెస్కోవ్ అన్నారు. మరణాల సంఖ్యను ధ్రువీకరించలేదు, అలాగని ఖండించనూ లేదు. ఇది నిజమో కాదో తనకు తెలియదని, మృతుల సంఖ్య సమాచారం రక్షణ మంత్రిత్వ శాఖ ప్రత్యేక హక్కని ఆయన అన్నారు. యుద్ధానికి సంబంధించిన మరణాల గణాంకాలను రష్యా చాలా అరుదుగా ఇస్తోంది. 2022 సెప్టెంబర్లో జరిగిన యుద్ధంలో 5,937 మంది సైనికులు మరణించినట్లు రక్షణ మంత్రిత్వ శాఖ అప్పట్లో తెలిపింది. మీడియాజోనాను రష్యన్ ప్రతి పక్ష కార్యకర్త ప్యోటర్ వెర్జిలోవ్ స్థాపించారు. కాగా, రష్యా ప్రభుత్వం మీడియాజోనాను 'విదేశీ ఏజెంట్'గా ప్రకటించింది. వెర్జిలోవ్‌ను తీవ్రవాదుల జాబితాలో చేర్చింది. సైన్యం గురించి తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేశారని దోషిగా నిర్ధారించింది.

మా సైనికులు 46 వేల మంది మరణించారు: జెలెన్‌స్కీ

రష్యాతో యుద్ధంలో 46,000 మందికి పైగా ఉక్రెయిన్ సైనికులు మరణించారని, సుమారు 3,80,000 మంది గాయపడ్డారని అధ్యక్షుడు జెలెన్‌స్కీ ప్రకటించారు. ఇతర అంచనాలు చాలా ఎక్కువగా ఉన్నాయన్నారు. కాగా, 70,000 మంది చనిపోయారని, 35,000 మంది గల్లంతయ్యారని తమ సైనిక వర్గాలు అంచనా వేశాయని స్వతంత్ర ఉక్రేనియన్ వార్ కరస్పాండెంట్ యూరీ బుటుసోవ్ డిసెంబరులో చెప్పారు.

నితీశ్ కేబినెట్ విస్తరణ

ఏడుగురు బీజేపీ ఎమ్మెల్యేలకు మంత్రి పదవులు

పట్నా: బిహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ బుధవారం తన మంత్రివర్గంలో కొత్తగా ఏడుగురిని చేరుకున్నారు. వీరంతా సంకీర్ణంలోని బీజేపీకి చెందిన ఎమ్మెల్యేలే కావడం విశేషం. సాయంత్రం 4 గంటలకు రాజ్‌భవన్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో గవర్నర్ ఆరిఫ్ మహ్మద్ ఖాన్ ప్రమాణ స్వీకారం చేయించారు. మంత్రి పదవులు దక్కిన వారిలో జిబేశ్ కుమార్, సంజయ్ సరావగి, సునీల్ కుమార్, రాజు కుమార్ సింగ్, మోతీ లాల్ ప్రసాద్, విజయ్ కుమార్ మండల్, కృష్ణ కుమార్ మంటు ఉన్నారు. దీంతో, బిహార్ కేబినెట్ బలం గరిష్ట స్థాయి అయిన 36కు చేరుకుంది. అంతకుముందు, బిహార్ బీజేపీ అధ్యక్షుడు దిలీప్ జైశ్వాల్ మంత్రి పదవికి రాజీనామా సమర్పించారు. ఒక వ్యక్తి–ఒక పదవి అనే పార్టీ విధానానికి కట్టుబడి రెవెన్యూ, భూ సంస్కరణల శాఖ మంత్రి పదవికి రాజీనామా చేసినట్లు ఆయన తెలిపారు. బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా మంగళవారం బిహార్ పార్టీ కోర్ కమిటీతో భేటీ అనంతరం ఈ పరిణామాలు చోటుచేసుకున్నాయి. బిహార్ అసెంబ్లీకి ఈ ఏడాదిలోనే జరిగే ఎన్నికలకు సమాయత్తంలో భాగంగానే బీజేపీ ఈ మేరకు చర్యలు తీసుకున్నట్లు భావిస్తున్నారు.

బస్సు బోల్తా.. 18 మంది మృతి

బ్యాంకాక్: థాయ్‌లాండ్‌లో బస్సు బోల్తా పడిన ఘటనలో 18 మంది ప్రాణాలు కోల్పోగా 31 మంది తీవ్రంగా గాయపడ్డారు. మునిసిపల్ స్టడీ టూర్‌లో భాగంగా ప్రచీన్‌బురి ప్రావిన్స్‌కు చెందిన సుమారు 200 మంది అధికారులు మూడు డబుల్ డెకర్ బస్సుల్లో రయోంగ్ ప్రావిన్స్ వైపు వెళ్తున్నారు. ఇందులో, 49 మందితో కూడిన ఒక బస్సు కొండ ప్రాంతం గుండా వెళ్తున్న సమయంలో అదుపు తప్పి పల్టీలు కొడుతూ లోయలోకి దూసుకెళ్లింది. తెల్లవారు జామున 3.30 గంటల సమయంలో చోటుచేసుకున్న ఈ ఘటనలో 18 మంది ప్రాణాలు కోల్పోగా డ్రైవర్ సహా 32 మంది గాయపడ్డారు. క్షతగాత్రుల్లో దాదాపు 20 మంది పరిస్థితి విషమంగా ఉన్నట్లు చెబుతున్నారు. బ్రేకులు పనిచేయకపోవడం వల్లే ప్రమాదం జరిగినట్లు డ్రైవర్ చెప్పాడని అధికారులు అంటున్నారు. రహదారి భద్రతా నియమాలను పాటించని కారణంగా థాయ్‌లాండ్‌లో రోడ్డు ప్రమాదాలు తరచూ జరుగుతున్నాయి. గతేడాది అక్టోబర్‌లో స్కూల్ ట్రిప్‌లో వెళ్తున్న బస్సుకు మంటలు అంటుకుని 23 మంది విద్యార్థులు, టీచర్లు ప్రాణాలు కోల్పోయారు. 2023 డిసెంబర్‌లో బస్సు చెట్టుకు ఢీకొన్న ఘటనలో 14 మంది చనిపోగా 30 మంది క్షతగాత్రులయ్యారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదిక ప్రకారం..175 సభ్య దేశాలకు గాను రోడ్డు ప్రమాద మరణాల్లో థాయ్‌లాండ్ 9వ ర్యాంకులో ఉంది. ఇక్కడ ఏటా 20 వేల మంది మృత్యువాత పడుతున్నారు.

కాస్త మెరుగైన పోప్ ఆరోగ్యం

కుర్చీలో కూర్చుని థెరపీ చేయించుకున్న పోప్

రోమ్: ప్రపంచవ్యాప్తంగా ఉన్న క్యాథలిక్‌ల అత్యున్నత మత గురువు పోప్ ఫ్రాన్సిస్ ఆరోగ్యం కాస్తంత మెరుగు పడింది. ఆయన ఐసీయూలో కుర్చీలో కూర్చుని శ్వాస సంబంధ థెరపీ చేయించుకుంటున్నారని వాటికన్ సిటీ వర్గాలు బుధవారం వెల్లడించాయి. అయితే ఆయన ఆరోగ్య పరిస్థితి ఇంకా విషమంగానే కొనసాగుతోందని రోమ్‌లోని గెమెల్లి ఆస్పత్రి వైద్య బృందం బుధవారం ప్రకటించింది. రెండు ఊపిరితిత్తుల్లోనూ డబుల్ న్యుమోనియా, ఇన్ఫెక్షన్ ప్రబలడంతో శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు పడుతున్న 88 ఏళ్ల పోప్‌కు అధిక పీడనంతో ఆక్సిజన్‌ను అందిస్తున్న విషయం తెల్సిందే. మంగళవారం సాయంత్రం తీసిన సీటీ చెస్ట్ స్కాన్ ఫలితాల ఫొటోలను సామాజిక మాధ్యమాల్లో ఆస్పత్రి వర్గాలు బహిర్గతంచేశాయి. ఫిబ్రవరి 14వ తేదీ నుంచి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పోప్ త్వరగా కోలువాలని ప్రపంచవ్యాప్తంగా క్రైస్తవ దేశాల్లో ప్రజలు చర్చిల్లో ప్రార్థనలు చేస్తున్న వేళ పోప్ హెల్త్ బులెటిన్‌ను ఆస్పత్రి వర్గాలు వెల్లడించాయి. తాజా రక్త పరీక్షల్లో ఆరోగ్య పరిస్థితి కాస్తంత మెరుగు పడిన విషయం తేలిందని పేర్కొన్నాయి. కొద్దిరోజుల క్రితం ఒక మూత్రపిండంలో వెలుగుచూసిన 'వైఫల్య'ఛాయలు ఇప్పుడు సమసిపోయాయని తెలిపాయి. ఊపిరితిత్తుల్లోని పేరుకుపోయిన ద్రవరూప ఇన్ఫెక్షన్లను బయటకు తోసేందుకు పోప్ ఫిజియోథెరపీ చేయించుకుంటున్నారని వాటికన్ సిటీ వర్గాలు తొలిసారిగా ప్రకటించాయి.

బందీల విడుదలకు మార్గం సుగమం

ఈజిప్టు మధ్యవర్తిత్వంతో ఇజ్రాయెల్-హమాస్ చర్చలు

నలుగురు ఇజ్రాయేలీల మృతదేహాలను అప్పగించనున్న హమాస్

600 మంది పాలస్తీనా ఖైదీలను విడుదల చేయనున్న ఇజ్రాయెల్

జెరూసలెం: ఇజ్రాయెల్, పాలస్తీనా మధ్య బంధీల విడుదలకు మార్గం సుగమం అయ్యింది. ఇరు వర్గాలు తాజాగా ఓ ఒప్పందానికి వచ్చాయి. నలుగురు ఇజ్రాయెల్ బందీల మృతదదేహాలను అప్పగించేందుకు హమాస్ అంగీకరించగా, 600 మంది పాలస్తీనా ఖైదీలను విడుదల చేసేందుకు ఇజ్రాయెల్ అంగీకరించిందని ఈజిప్టు తెలిపింది. తొలి దశ కాల్పుల విరమణ ఒప్పందంలో భాగంగా బంధీల మార్పిడి సమయంలోనూ,మృతదేహాలను విడుదల చేసినప్పుడు హమాస్ అవమానకరంగా వ్యవహరించిందంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. తొలి దశలోని పాలస్తీనా ఖైదీల విడుదల విషయంలో ఇజ్రాయెల్ కాలయాపన చేసింది. ఈ జాప్యం కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించడమేనని హమాస్ పేర్కొంది. వారిని విడుదల చేసేవరకు రెండో దశ చర్చలు సాధ్యం కాదని పేర్కొంది. మొదటి దశ ఒప్పందం ఈ వారంతో ముగియనుండటంతో బంధీల మార్పిడిపై ఈజిప్టు పర్యవేక్షణలో మంగళవారం రాత్రి చర్చలు జరిగాయి. ఖైదీలను విడుదల చేసేందుకు ఇజ్రాయెల్, మృతదేహాలను అప్పగించేందుకు హమా స్ అంగీకరించాయి. గురువారం నాటికి మార్పిడి జరిగే అవకాశం ఉంది. ఇజ్రాయెల్ బంధీల మృతదేహాలను ఎటువంటి బహిరంగ వేడుకలు లేకుండా ఈజిప్టు అధికారులకు అప్పగించనున్నారు.

గాజా కాల్పుల విరమణ..

జనవరి 19న కాల్పుల విరమణ అమల్లోకి వచ్చినప్పటి నుంచి హమాస్ 25 మంది ఇజ్రాయెల్ బందీలను బహిరంగ వేడుకల ద్వారా విడుదల చేసింది. హమాస్ చర్యలను ఇజ్రాయెల్‌తో పాటు రెడ్‌క్రాస్, ఐక్యరాజ్యసమితి అధికారులు ఖండించారు. ఈ నేపథ్యంలో ఖైదీలు, బందీల మార్పిడిని హుందాగా, వ్యక్తిగతంగా చేపట్టాలని అంతర్జాతీయ రెడ్ క్రాస్ కమిటీ ఇరు వర్గాలను కోరింది. మరోవైపు ఇజ్రాయెల్ కూడా 1,100 మంది పాలస్తీనా ఖైదీలను విడుదల చేసింది.

మొదటి దశ ముగింపు

తాజా ఒప్పందంతో దాదాపు 2000 మంది పాలస్తీనా ఖైదీలకు బదులుగా ఎనిమిది మృతదేహాలు సహా 33 మంది ఇజ్రాయెల్ బందీల విడుదల ఒప్పందం ముగిస్తుంది. రెండో దశ చర్చలు కొన్ని వారాల కిందటే జరగాల్సి ఉండగా.. ఇంకా ప్రారంభం కాలేదు. ఈ నేపథ్యంలో అమెరికా మిడిల్ ఈస్ట్‌రాయబారి స్టీవ్ విట్కాఫ్ ఈ ప్రాంతంలో పర్యటించనున్నారు. హమాస్ చెరలో ఉన్న మిగిలిన బందీలందరినీ విడుదల చేయాలని, యుద్ధానికి ముగింపు పలకడానికి రెండో దశ చర్చలకు వెళ్లాలని ఇరు పక్షాలను కోరనున్నారు.

సీబీఐ చార్జిషీట్‌లో అభిషేక్ బెనర్జీ పేరు

కోల్‌కతా: పశ్చిమబెంగాల్‌లో చోటుచేసుకున్న టీచర్ ఉద్యోగాల కుంభకోణంలో సీబీఐ ఇటీవల సమర్పించిన మూడో అనుబంధ చార్జిషీట్‌పై వాడీవేడిగా చర్చ జరుగుతోంది. 2017లో అభిషేక్ బెనర్జీ అనే వ్యక్తి రూ.15 కోట్లు డిమాండ్ చేసిన సంభాషణకు సంబంధించిన ఆడియో రికార్డు కూడా ఇందులో ఉండటం విశేషం. అభిషేక్ బెనర్జీ ఎవరనే విషయాన్ని సీబీఐ స్పష్టంగా పేర్కొనకున్నా, అతడు సీఎం మమతా బెనర్జీ మేనల్లుడు, అధికార టీఎంసీ జాతీయ ప్రధాన కార్యదర్శి అభిషేక్ బెనర్జీయే అయి ఉంటారని భావిస్తున్నారు. ఈయనే ఈ కుంభకోణానికి పాల్పడ్డారంటూ గతంలోనే ప్రతిపక్షాలు పలుమార్లు ఆరోపణలు చేశాయి. కుంభకోణం ఆరోపణలపై విచారణ చేపట్టిన ఈడీ, సీబీఐలు పలుమార్లు ఈయన్ను ప్రశ్నించాయి కూడా. తాజా పరిణామంపై అభిషేక్ లాయర్ సంజయ్ బసు స్పందించారు. సీబీఐ చార్జిషీటును ఆయన తప్పుదోవపట్టించేది, వాదనకు నిలువనిది అంటూ అభివర్ణించారు. తమ క్లయింట్‌ను వేధించడానికే తప్ప, ఎందుకూ పనికిరాదన్నారు.

పెట్రోల్‌లో కలిపే ఇథనాల్‌ను 20%కి పెంచుతాం

పెట్రోలియం మంత్రి హర్దీప్ సింగ్ పురి

గౌహతి: పెట్రోల్‌లో జీవ ఇంధనం ఇథనాల్‌ను 20 శాతానికి పైగా కలపడాన్ని లక్ష్యంగా పెట్టుకోవాలనుకుంటున్నట్లు కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పురి తెలిపారు. ఇందులో సాధ్యాసాధ్యాలను పరిశీలించేందుకు నీతి ఆయోగ్య సారథ్యంలో ఓ కమిటీ ఏర్పాటైందని వెల్లడించారు. పెట్రోల్‌లో 19.6 శాతం ఇథనాల్ కలపాలన్న లక్ష్యాన్ని ఇప్పటికే సాధించామన్నారు. 20 శాతం ఇథనాల్‌ను కలపాలన్న లక్ష్యాన్ని 2026 నాటికి సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, అయితే అంతకుమునుపే అంటే వచ్చే నెలలోనే ఈ లక్ష్యాన్ని సాధిస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. అడ్వాంటేజ్ అసోం 2.0 బిజినెస్ సమిట్‌లో బుధవారం మంత్రి పురి ప్రసంగించారు. మనకు 1,700 కోట్ల లీటర్ల ఇథనాల్‌ను కలిపే సామర్థ్యముండగా ఇప్పటికే 1,500 కోట్ల లీటర్లను వాడుతున్నామని చెప్పారు. వివిధ రకాలైన ఇంధన దిగుమతుల కోసం దేశం ఏటా 15,000 కోట్ల డాలర్లను వెచ్చిస్తోందని మంత్రి వివరించారు. అయితే, సంప్రదాయ ఇంధనాలకు బదులుగా గ్రీన్ హైడ్రోజన్‌పై దృష్టి సారించాల్సి ఉందన్నారు. ప్రస్తుతం గ్రీన్ హైడ్రోజన్ ధర 4.5 డాలర్లుగా ఉంది. దీనిని 2.5 డాలర్లకు తగ్గించ గలిగితే ఈ రంగంలో పెను విప్లవమే వస్తుందన్నారు. ప్రస్తుతం మన దేశంలో రోజుకు 55 లక్షల బారెళ్ల ముడి చమురును వాడుతున్నామని మంత్రి తెలిపారు. సమీప భవిష్యత్తులో ఇది 65 లక్షల బ్యారెళ్ల నుంచి 70 లక్షల బ్యారెళ్లకు పెరగనుందని, అదేవిధంగా దేశీయ పెట్రోలియం, సహజ వాయువుల ఉత్పత్తి 2030కల్లా 50 లక్షల టన్నులకు చేరనుందని మంత్రి పురి అంచనా వేశారు.

యాంటీ షిప్ క్షిపణి ప్రయోగం విజయవంతం

బాలాసోర్(ఒడిశా): మొట్టమొదటి నావల్ యాంటీ షిప్ మిస్సైల్(ఎన్ఏఎస్ఎం-ఎస్ఆర్) ఫ్లయిట్ ట్రయల్స్‌ను మంగళవారం డీఆర్‌డీవో, భారత నావికాదళం విజయవంతంగా నిర్వహించాయి. ఒడిశాలోని చండీపూర్‌లో ఉన్న ఇంటిగ్రేటెడ్ టెస్ట్ రేంజ్(ఐటీఆర్)లోని సీ కింగ్ హెలికాప్టర్ నుంచి చేపట్టినట్లు బుధవారం అధికారులు వెల్లడించారు. హెలికాప్టర్ నుంచి ప్రయోగించిన క్షిపణి సముద్రంలో ఉన్న చిన్న ఓడను నేరుగా వెళ్లి ఢీకొట్టిందని తెలిపారు. క్షిపణి తన మార్గాన్ని నిర్దేశించుకునేందుకు ఇందులో దేశీయంగా రూపొందించిన ఫైబర్ ఆప్టిక్ గైరోస్కోప్ ఆధారిత నేవిగేషన్ వ్యవస్థను, రేడియో అల్టిమీటర్‌ను వాడామన్నారు. క్షిపణి వెళ్లి ఓడను ఢీకొనే వరకు పైలట్‌కు లైవ్‌లోచిత్రాలను పంపుతూనే ఉందన్నారు. అన్ని పరామితులను ఈ ప్రయోగం అధిగమించిందని వివరించారు. మిస్సైల్ అభివృద్ధిలో డీఆర్‌డీవోలోని వివిధ ల్యాబొరేటరీలు పాలుపంచుకున్నాయని ఆ అధికారి వివరించారు. ఈ ఘనత సాధించిన డీఆర్‌డీవో, నేవీని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అభినందించారు.

సాక్షి ప్లస్
గురువారం। 27-2-2025

'ఆంధ్రకవితా పితామహుడు'గా పేరు పొందిన కవి ఎవరు?

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం
జనరల్ స్టడీస్
ఇండియన్ హిస్టరీ

బహమనీ సుల్తానులు

తాజుద్దీన్ ఫిరోజ్‌షా (1398-1422)

ఫిరోజ్‌షా సింహాసనం అధిష్ఠించిన సమయంలో బహమనీ రాజ్యం అల్లకల్లోలంగా ఉంది. ఇతడు కొండవీటి రెడ్డిరాజుల సహాయంతో రెండో హరిహరరాయల నుంచి అంతర్వేది ప్రాంతాన్ని తిరిగి స్వాధీనం చేసుకున్నాడు. పద్మనాయకుల నుంచి పానగల్లు ప్రాంతాలను ఆక్రమించాలనే ఇతడి ప్రయత్నం విఫలమైంది. ఇతడి కాలంలో మహారాష్ట్ర అంతటా పన్నెండేళ్ల పాటు కరవు నెలకొంది. ఫిరోజ్‌షాను ధర్మబుద్ధి, ఉదార స్వభావం ఉన్న సుల్తాన్‌గా 'బర్హాన్-ఎ-మాసిర్' గ్రంథంలో వర్ణించారు. బహమనీ సుల్తానుల్లో ఫిరోజ్‌షా అగ్రగణ్యుడని ఫెరిస్టా పేర్కొన్నాడు. ఫిరోజ్‌షా బహుభాషావేత్త, దైవ చింతనాపరుడు, సహనశీలిగా పేరు పొందాడు. ఉన్నత ఉద్యోగాల్లో అనేక మంది హిందువులను నియమించాడు. గుల్బర్గాలో హిందూ-ముస్లిం వాస్తురీతిలో పెద్ద మసీదును నిర్మించాడు. ఫిరోజాబాద్ అనే నూతన నగరాన్ని నిర్మించి, అందులో జనానాకు గ్రీసు, చైనా దేశాల నుంచి తొమ్మిది వందల మంది యువకులను రప్పించాడు. చివరి రోజుల్లో ఫిరోజ్‌షా అంతఃపురం విడిచి బయటికి రాలేదు. దాంతో రాజ్యభద్రతకు ప్రమాదం వాటిల్లుతుందనే భయంతో అతడి తమ్ముడు ఫిరోజ్‌షాను బంధించి, రెండో అహ్మద్ షా బిరుదుతో సింహాసనాన్ని అధిష్ఠించాడు. ఫిరోజ్‌షా జైల్లోనే మరణించాడు.

రెండో అహ్మద్‌షా (1422-35)

ఇతడు గుల్బర్గా నుంచి రాజధానిని బీదర్ నగరానికి మార్చాడు. షియా మతస్థులైన పారశీకులు, తురుష్కులను ఉన్నత ఉద్యోగాల్లో నియమించాడు. ఇతడి కాలంలో అజరీ అనే కవి 'బహ్మన్ నామా' పేరుతో బహమనీ వంశ చరిత్రను రచించాడు. రెండో అహ్మద్ షా అనుసరించిన మత విధానం వల్ల ముస్లింలలో విదేశీయులు, స్వదేశీయులు అనే విషయంలో విభేదాలు తలెత్తాయి. మధ్యాసియా ప్రాంతాలు, ఇరాన్, తుర్కిస్తాన్ నుంచి వచ్చిన విదేశీయులు షియా శ్వేతవర్ణులుగా; ఆఫ్రికా, టర్కీ నుంచి వచ్చిన నల్లవర్ణం వారిని 'సున్నీ' మతస్థులుగా గుర్తించాడు.

ఈ తెగల మధ్య జాతి, మతం, ఆచారాల విషయంలో వైవిధ్యాలు ఉండటం వల్ల క్రమంగా ఘర్షణలు ప్రారంభమై చివరకు బహమనీ రాజ్య విచ్ఛిన్నానికి దారి తీశాయి. ఇతడి తర్వాత రెండో అల్లా ఉద్దీన్ (1435-58), హుమాయూన్ (1458-61), నిజాంషా (1461-63) పాలించారు. క్రూర స్వభావం ఉండటం వల్ల ప్రజలు హుమాయూన్‌ను 'జాలిమ్'గా పిలిచేవారని ఫెరిస్టా పేర్కొన్నాడు.

మూడో మహ్మద్ షా(1463-82)

ఇతడి కాలంలో బహమనీ రాజ్యం ఉన్నత స్థితికి చేరుకుంది. దీనికి కారణం ప్రధాన మంత్రి మహ్మద్ గవాన్ పరిపాలనాధ్యక్షత. గవాన్ పారశీక దేశస్థుడు. మూడో మహ్మద్ షా కొలువులో వకీలు, వజీర్‌గా ఇతడు పని చేశాడు. ఇతడు 1447లో బీదర్‌కు వచ్చి మొదటగా రెండో అల్లా ఉద్దీన్ కొలువులో చేరాడు. ఇతడు గొప్ప రాజనీతిజ్ఞుడు, యుద్ధ నైపుణ్యంలో దిట్ట. శత్రువుల దాడుల నుంచి బహమనీ రాజ్యాన్ని రక్షించాడు. ఇతడి శక్తి సామర్థ్యాలు, సేవలను గుర్తించి మూడో మహ్మద్‌షా ప్రధాన మంత్రిగా నియమించాడు. గవాన్ నాయకత్వంలో మూడో మహ్మద్‌షా బెల్గాం కోటను స్వాధీనం చేసుకున్నాడు. విజయనగర రాజుల నుంచి గోవా, పశ్చిమ తీరాలను; ఒరిస్సా రాజుల నుంచి కొండపల్లి, రాజమహేంద్రి, మచిలీపట్నం ప్రాంతాలను స్వాధీనం చేసుకున్నాడు. తమిళనాడులోని కాంచీపురాన్ని ధ్వంసం చేశాడు. గవాన్ బహమనీ రాజ్యాన్ని పటిష్ఠం చేసే సంకల్పంతో అనేక సంస్కరణలు చేపట్టాడు. వికేంద్రీకరణ ద్వారా తరఫ్‌దార్ల (గవర్నర్ల) అధికారాన్ని తగ్గించి, నాలుగు రాష్ట్రాలను ఎనిమిది రాష్ట్రాలుగా విభజించాడు. అవి గుల్బర్గా, బీజాపూర్, దౌలతాబాద్, జున్నార్, గావిల్‌గర్, మాహూర్, రాజమహేంద్రి, వరంగల్.

గవాన్ పారశీక భాషలో పండితుడు. విద్యాభిమాని. బీదర్‌లో పెద్ద మదర్సా (పాఠశాల)ను నిర్మించి అందులో మూడువేల గ్రంథాలతో గ్రంథాలయాన్ని ఏర్పాటు చేశాడు. గణిత, సాహిత్య, వైద్య శాస్త్రాలంటే అతడికి ప్రత్యేక అభిమానం. ఇతడు 'రాజట్ - ఉల్ - ఇన్‌షా', 'దివాన్-ఎ-ఇన్‌షా' గ్రంథాలను రాశాడని ఫెరిస్టా పేర్కొన్నాడు. సమర్ ఖండ్‌లోని విశ్వవిద్యాలయాన్ని పోలినవిధంగా బీదర్‌లో పెద్ద కళాశాల నిర్మించాడు.

మహ్మద్ గవాన్ వివిధ ప్రాంతాల తరఫ్‌దార్లు, కులీన వంశాలపై అనేక ఆంక్షలు విధించాడు. పశ్చిమాసియా నుంచి కొత్తగా వచ్చిన అఫాఖీల ఆధిపత్యం పెరగడం దక్కనీ కులీన వంశాల వారికి నచ్చలేదు. ఇలా అసంతృప్తి చెందిన వారంతా కుట్రతో సుల్తాన్‌కు ఫిర్యాదులు చేసి మహ్మద్ గవాన్‌కు 1481లో ఉరిశిక్ష వేయించారు. గవాన్‌ను వధించిన అనంతరం బహమనీ సామ్రాజ్యం క్రమంగా పతనమైంది. భారతదేశంలోని మహ్మదీయ చరిత్రలో ప్రధాన మంత్రి గవాన్‌తో సరిసమానమైన వారు కనిపించరని చరిత్రకారుల అభిప్రాయం. గవాన్ ఉరిశిక్షతో సుల్తాన్ మహ్మద్‌షాపై ప్రజలు తిరుగుబాటు చేశారు. మహ్మద్‌షా 1482లో మరణించాడు.



బహమనీ-విజయనగర రాజుల మధ్య పోరు

భారతదేశ మధ్యయుగ చరిత్రలో విజయనగర, బహమనీ రాజ్యాల మధ్య నిరంతరం యుద్ధాలు జరిగాయి. ఆయా ప్రాంతాల్లో విపరీత జన నష్టం, ఆస్తి నష్టం సంభవించేవి. ఇరు పక్షాలు పట్టణాలు, గ్రామాలను భస్మీపటలం చేసేవి. స్త్రీలు, పిల్లలు, పురుషులను బందీలుగా పట్టుకొని బానిసలుగా విక్రయించేవారు. విజయనగర మొదటి బుక్కరాయల కాలంలో ముద్గల్ కోట కోసం ఘర్షణలు ప్రారంభమయ్యాయి.

విజయనగర రాజులు, బహమనీ సుల్తాన్లు తరచుగా మూడు ప్రాంతాలపై ఆధిపత్యం కోసం పోటీపడ్డారు. అవి-తుంగభద్ర మాగాణి, కృష్ణా-గోదావరి డెల్టా, మరట్వాడా ప్రాంతాలు. కొంకణి ప్రాంతం ప్రధానమైంది. పశ్చిమ కనుమలు, సముద్రానికి మధ్య సన్నని చీలికలా ఉండే ప్రాంతమే కొంకణ్ ప్రాంతం. గోవా రేవుపట్టణం ఈ ప్రాంతంలోనే ఉంది. ఈ ప్రాంతం సారవంతమైంది. ఇరాన్, ఇరాక్ నుంచి మేలుజాతి గుర్రాలు గోవా రేవు ద్వారా భారతదేశానికి దిగుమతి అయ్యేవి. అందువల్ల రాజకీయంగా గోవా రేవుకు ప్రాధాన్యం ఏర్పడింది.

రెండో హరిహరుని కాలంలో పశ్చిమ ప్రాంతంలో బెల్గాం, గోవాను హరిహరుడు బహమనీల నుంచి స్వాధీనం చేసుకున్నాడు. ఒకటో దేవరాయల కాలంలో తుంగభద్ర ప్రాంతంపై రెండు రాజ్యాల పాలకులు ఆధిపత్యం కోసం పోరాడారు.

బహమనీ సుల్తాన్ ఫిరోజ్‌షా మొదటి దేవరాయలను ఓడించాడు. కృష్ణా-గోదావరి డెల్టాపై ఆధిపత్యం కోసం విజయనగర రాజులు, బహమనీలు, ఒరిస్సా గజపతులు కలహించుకున్నారు. సంగమ వంశంలో రెండో దేవరాయలు సైనిక శిక్షణ కోసం ముస్లింలను చేర్చుకున్నాడు.

కృష్ణదేవరాయల మరణానంతరం ఆయన వారసుల మధ్య సింహాసనం కోసం ఘర్షణలు ప్రారంభమయ్యాయి. వీరిలో అళియ రామరాయలు ఆధిపత్యం చెలాయించాడు. బీజాపూర్ సుల్తాన్‌ను అళియ రామరాయలు ఓడించాడు. ఆ తర్వాత బీజాపూర్ సుల్తాన్‌తో సంధి కుదుర్చుకొని గోల్కొండ, అహ్మద్ నగర్ సుల్తాన్‌లను ఓడించాడు. చివరకు బహమనీ సుల్తాన్‌లందరూ కలిసికట్టుగా విజయనగర సైన్యాలను ఎదుర్కొని 1565లో తళ్లికోట సమీపంలోని బన్నిహట్టి ప్రాంతంలో అళియ రామరాయలను ఓడించారు. తళ్లికోట యుద్ధానంతరం విజయనగర సామ్రాజ్యం క్రమంగా అంతరించింది.

తళ్లికోట యుద్ధం (1565)

తళ్లికోట యుద్ధాన్ని రాక్షస తంగడి, బన్నిహట్టి యుద్ధమని కూడా పేర్కొంటారు. రాక్షస, తంగడి అనే గ్రామాలు కృష్ణానది ఒడ్డున ఉన్నాయి. ఈ యుద్ధంలో బీరార్ మినహా మిగిలిన నాలుగు బహమనీ రాజ్యాలు అళియ రామరాయలపై దండెత్తాయి. అహ్మద్‌నగర్ సుల్తాన్ హుస్సేన్ నిజాంషా అళియ రామరాయల తలనరికి వధించాడు. ఫెరిస్టా కథనం ప్రకారం ఈ యుద్ధం నెల రోజుల పాటు సాగింది. అళియ రామరాయల సోదరులు తిరుమలరాయలు, వెంకటాద్రి యుద్ధంలో పాల్గొన్నారు. తిరుమల రాయుడు యుద్ధం నుంచి పారిపోయి, సదాశివరాయలతో పెనుగొండకు వెళ్లిపోయాడు. బహమనీ సుల్తాన్‌లు విజయనగరంలోకి ప్రవేశించి విధ్వంసం చేశారు. తర్వాత సదాశివరాయలు విజయనగరం వచ్చినప్పటికీ నగరం తన పూర్వ వైభవాన్ని కోల్పోయింది.

అయిదు రాజ్యాలు

ప్రధానమంత్రి గవాన్ హత్యతో బహమనీ రాజ్యం విచ్ఛిన్నమై దాని స్థానంలో 5రాజ్యాలు ఏర్పడ్డాయి.

ఇమాద్ షాహీ వంశం-బీరార్ (క్రీ.శ. 1490-1574): ఇమాద్ షాహీ రాజ్యస్థాపకుడు షాతుల్లా ఇమాద్-ఉల్- ముల్క్ స్వతంత్ర రాజ్యాన్ని స్థాపించాడు.

బరీద్ షాహీ వంశం - బీదర్ (క్రీ.శ. 1527-1619): ఈ రాజ్యస్థాపకుడు కాశిం ఆలీ బరీద్.

నిజాం షాహీ వంశం-అహ్మద్ నగర్ (క్రీ.శ.1490-1636): మాలిక్ అహ్మద్ స్వతంత్ర రాజ్యాన్ని స్థాపించాడు.

ఆదిల్ షాహీ వంశం-బీజాపూర్ (క్రీ.శ. 1490-1686): రాజ్యస్థాపకుడు యూసఫ్ ఆదిల్ షా.

కుతుబ్ షాహీ వంశం-గోల్కొండ (క్రీ.శ. 1512-1687): రాజ్య స్థాపకుడు సుల్తాన్ కులీ కుతుబ్ షా.

మాదిరి ప్రశ్నలు

1. సంగమ వంశంలో గొప్ప పాలకుడిగా పేరు పొందిన వారెవరు?
   1) హరిహర 2) బుక్కరాయలు
   3) రెండో దేవరాయలు
   4) మొదటి దేవరాయలు
2. తుళువ వంశ స్థాపకుడు ఎవరు?
   1) వీరనరసింహరాయలు
   2) కృష్ణదేవరాయలు
   3) మొదటి దేవరాయలు
   4) సదాశివరాయలు
3. కింద పేర్కొన్న ఏ ప్రాంత ముస్లిం పాలకుడు తళ్లికోట యుద్ధం (1565)లో పాల్గొనలేదు?
   1) గోల్కొండ 2) అహ్మద్‌నగర్
   3) బీజాపూర్ 4) బీరార్
4. 'యవనరాజ్య స్థాపనాచార్య' అనే బిరుదు ఉన్న విజయనగర పాలకుడెవరు?
   1) కృష్ణదేవరాయలు
   2) రెండో దేవరాయలు
   3) హరిహరరాయలు 4) బుక్కరాయలు
5. కృష్ణదేవరాయల కాలంలో భత్కల్ కోటపై జెండా ఎగురవేసినవారెవరు?
   1) డచ్ వ్యాపారులు
   2) పోర్చుగీసు వ్యాపారులు
   3) ఈస్టిండియా కంపెనీవారు
   4) ఫ్రెంచ్ వ్యాపారులు
6. పొట్నూర్ సింహాద్రి వద్ద విజయ స్తూపాన్ని నిర్మించిన విజయనగర పాలకుడెవరు?
   1) రామరాయలు
   2) మొదటి దేవరాయలు
   3) శ్రీకృష్ణదేవరాయలు
   4) బుక్కరాయలు
7. 'ఆంధ్రకవితా పితామహుడు'గా పేరు పొందిన కవి ఎవరు?
   1) అల్లసాని పెద్దన 2) ముక్కు తిమ్మన
   3) తెనాలి రామకృష్ణుడు
   4) శ్రీనాథుడు
8. తన మాతృమూర్తి నాగాంబ గుర్తుగా 'నాగలాపురం' అనే నగరాన్ని నిర్మించిన విజయనగర పాలకుడు ఎవరు?
   1) శ్రీకృష్ణదేవరాయలు
   2) మొదటి హరిహరరాయలు
   3) సాలువ నరసింహరాయలు
   4) రెండో దేవరాయలు
9. 'నాయకర్ (పాలెగార్లు)' అనే పదం ఎవరిని సూచిస్తుంది?
   1) రెవెన్యూ అధికారులు
   2) సైనికాధికారులు
   3) స్థానిక పాలకులు
   4) నగర పాలకులు
10. విజయనగర పాలకుల కాలంలో గ్రామ పాలన బాధ్యతలు నిర్వహించినవారు?
    1) తలారి 2) పూజారులు
    3) గౌడ 4) మండలేశ్వర్
11. విజయనగర పాలకుల కులదేవత?
    1) విరూపాక్ష 2) శివుడు
    3) గరుడ 4) పార్వతి
12. కిందివాటిలో కృష్ణదేవరాయలు నిర్మించిన దేవాలయాలేవి?
    1) బృహదీశ్వరాలయాలు
    2) విఠల, కైలాసనాథ ఆలయాలు
    3) హజర, మీనాక్షి ఆలయాలు
    4) విఠల, హజరరామాలయాలు

సమాధానాలు

1) 3; 2) 1; 3) 4; 4) 1;
5) 2; 6) 3; 7) 1; 8) 1;
9) 2; 10) 3; 11) 1; 12) 4.

జీవసముదాయాలను కలిగిన నిర్దిష్ట భూ ప్రాంతం?



టెట్/డీఎస్సీ- ప్రత్యేకం
బయాలజీ

జీవజాలం- పర్యావరణం

ప్రకృతిలో జీవులను, నిర్జీవులను నిశ్చితంగా పరిశీలిస్తే వాటి మధ్య వివిధ రకాలైన అవినాభావ సంబంధాలను గమనించొచ్చు. వాటి పర్యవసానమే జీవ వైవిధ్యం. పర్యావరణాన్ని మొదట ఆవరణం అనేవారు. దాని నుంచే ఆవరణ శాస్త్రం ఉద్భవించింది. ఆవరణ శాస్త్రం (Ecology) అనే పదాన్ని మొదట రీటర్ అనే శాస్త్రజ్ఞుడు ఉపయోగించాడు. గ్రీకు భాషలో Oikos అంటే ఇల్లు. logos అంటే అధ్యయనం. ఈ పదాలనుంచే Ecology ఏర్పడింది. అంటే ఇంటిలో ఉన్న నిర్జీవ, జీవ అనుఘటకాలు, వాటి మధ్య ఉన్న సంబంధం అని అర్థం.

ఆవరణ శాస్త్రంలో ముఖ్యమైన పదాలు:

1. **జాతి:** ఒకే రకంగా ఉండి తమలోతాము ప్రత్యుత్పత్తి జరుపుకొనే జీవ సముదాయం.
2. **జనాభా:** ఒకే జాతికి చెంది, ఒకేరకమైన జీవన విధానం కలిగిన జీవ సముదాయం.
3. **ఆవరణ వ్యవస్థ:** అనేక జీవ సముదాయాలను కలిగిన నిర్దిష్ట భూ ప్రాంతం. భూమి ఒక మహా ఆవరణ వ్యవస్థ.
4. **బయోం:** జీవ సముదాయం, వివిధ జీవుల సమూహం.
5. **బయోస్ఫియర్:** నిర్దిష్ట ప్రదేశంలో ఉన్న జీవ సముదాయం.
6. **ఆహార గొలుసు:** వివిధ జీవుల మధ్య ఆహార పదార్థాల రవాణా క్రమాన్ని ఆహార గొలుసు అంటారు.
7. **ఆహార వలలు:** ఆహార గొలుసుల సంక్లిష్ట క్రమాన్ని ఆహార వలలు అంటారు.

ఆవరణ వ్యవస్థ అనే పదాన్ని ఎ.జి. టాన్స్‌లే మొదట వాడారు. ఆవరణ వ్యవస్థలో జీవ, నిర్జీవ అనుఘటకాలు అనే రెండు రకాలుంటాయి.

ఎ) జీవ అనుఘటకాలు:

ఇవి మూడు రకాలు.

i) **ఉత్పత్తిదారులు:** స్వతహాగా ఆహార పదార్థాలు తయారుచేసుకొనే జీవ సముదాయం.
ఉదా: మొక్కలు, వృక్ష ప్లవకాలు .

ii) **వినియోగదారులు:** ఆహారం కోసం ఇతర జీవుల మీద ఆధారపడేవి.
ఇవి తిరిగి మూడు రకాలు
- ఎ) **ప్రాథమిక వినియోగదారులు**
  ఉదా: కుందేలు, జింక
- బి) **ద్వితీయ వినియోగదారులు**
  ఉదా: కుక్క, పిల్లి
- సి) **తృతీయ వినియోగదారులు**
  ఉదా: తోడేలు, నక్క, పాము
- డి) **అంతిమ వినియోగదారులు:**
  ఉదా: పులి, సింహం, రాబందు

ప్రాథమిక వినియోగదారులను శాఖా హారులు అని, ద్వితీయ వినియోగదారుల ను సర్వభక్షకాలు అని, తృతీయ వినియోగ దారులను మాంసాహారులని అంటారు.

iii) **విచ్ఛిన్నకారులు:** ఉత్పత్తి, వినియోగ దారుల విసర్జక పదార్థాలను, మృత కళేబ రాలను కుళ్లింపచేసి నేలలో కలిసేటట్లు చేసేవి.
ఉదా: బ్యాక్టీరియా, కొన్ని శిలీంధ్రాలు.

బి) నిర్జీవ అనుఘటకాలు:

i) **శీతోష్ణస్థితి పరమైనవి:** కాంతి,ఉష్ణం, వర్షపాతం
ii) **రసాయన పరమైనవి:**
   ఎ) **సేంద్రియ:**
   ఉదా: కార్బోహైడ్రేట్స్, ప్రొటీన్స్, లిపిడ్స్
   బి) **నిరేంద్రియ:**
   ఉదా: Ca, K, O_2, N, P

ఆవరణ వ్యవస్థ రకాలు:

ఇది రెండు రకాలు. 1. సహజ 2. కృత్రిమ


I. **సహజసిద్ధ ఆవరణ వ్యవస్థ:**
ఇది ప్రకృతిలో కనిపించే నిజమైన వ్యవస్థ.
ఎ) **భౌమ/భాండ ఆవరణ వ్యవస్థ**
1) అటవీ ఆవరణ వ్యవస్థ
2) ఎడారి ఆవరణ వ్యవస్థ
3) గడ్డి మైదాన ఆవరణ వ్యవస్థ
4) టంండ్రాలు
బి) **జలావరణ వ్యవస్థ:** దీనిలో 1) సముద్ర 2) మంచినీటి 3) పరివర్తన అనే ఆవరణ వ్యవస్థలు ఉంటాయి.

II. **కృత్రిమ ఆవరణ వ్యవస్థ:** మానవుడి ప్రమేయంతో నిర్మితమైంది. దీనిలో
ఎ) పంటపొలాలు బి) పారిశ్రామిక
సి) పాఠశాల ఆవరణ వ్యవస్థ
అనే వ్యవస్థలు ఉంటాయి.

ఆవరణ వ్యవస్థలో జీవుల మధ్య ఆహార ఉత్పత్తి, పంపిణీ, వినియోగం మొదలైన అంశాలను పరిశీలిస్తే ప్రతి జీవి తన ఆహారం కోసం ఇతర జీవులపై, నిర్జీవ అనుఘటకాలపై ఆధారపడాల్సి ఉంటుంది. ఆహారం కోసం జీవుల (జంతు, వృక్ష) మధ్య తత్సంబంధాన్ని ఒక వరుస క్రమంలో చూపితే దాన్ని ఆహార గొలుసు అంటారు.

ఉదా:
గడ్డిమైదానం → కుందేలు, జింక → కుక్క, పిల్లి → తోడేలు, గద్ద → పులి, సింహం

అదేవిధంగా వివిధ జీవుల మధ్య ఒకటికంటే ఎక్కువ మార్గాల్లో ఆహార వినియోగం జరుగుతుంది. దీన్నే ఆహార వల (food web) అంటారు.



మంచినీటి ఆవరణ వ్యవస్థలో నిలకడగా ఉండే నీటిలో ఉండే జీవజాల సముదాయాలను లెంటక్ అని, ప్రవాహంలో ఉన్న నీటి వ్యవస్థను లోటిక్ ఆవరణ వ్యవస్థ అంటారు.

జీవ వైవిధ్యం (Biodiversity):

జీవ మండలంలోని జీవుల మధ్య ఉన్న వివిధ రకాల తారతమ్యాలు, భేదాలు మొదలైన అంశాలను జీవ వైవిధ్యం అంటారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా జీవ వైవిధ్యం జరుగుతోంది.

జీవ వైవిధ్యంలో 3 రకాలు ఉన్నాయి.

1. **జన్యు వైవిధ్యత:** సహజంగా జీవుల్లో విభిన్న సంఖ్యలో జన్యువులుంటాయి. వీటి వితరణ, అనుకోని మార్పులు మొదలైన అంశాల ద్వారా జాతుల్లో మార్పులు కనిపిస్తాయి.
2. **జాతి వైవిధ్యత:** ఒక నిర్దిష్ట ప్రాంతంలో ఉన్న జాతుల సంఖ్య వాటి పరిమాణం, ఆహారాన్ని పొందడం మొదలైన అంశాల ఆధారంగా దీన్ని గుర్తిస్తారు. ఉదాహరణకు గడ్డిపైన కుందేలు, కుందేళ్ల పైన గద్దలు వీటిపైన తర్వాతి జాతులు (ఉదా: పులులు మొదలైనవి) ఆధారపడి ఉంటాయి.
3. **ఆవరణ వ్యవస్థ వైవిధ్యత:** ఒక ఆవరణ వ్యవస్థలో ఉన్న వివిధ మొక్కలు, జంతువులు వాటి మధ్య ఉన్న వైవిధ్యాన్ని ఈ అంశంగా పరిగణించవచ్చు.

ప్రకృతిలో జీవ వైవిధ్యం జరగటం అవసరం. ఇది జీవ పరిణామానికి నాంది పలుకుతుంది. అదేవిధంగా జీవజాలానికి అనేక విధాలుగా లాభాన్ని చేకూరుస్తుంది. కొన్ని పరిస్థితుల్లో అదే జీవ జాలానికి అపార నష్టాన్ని కూడా కలిగిస్తుంది.

జీవ వైవిధ్య సంరక్షణ: జనాభా పెరగడం, కాలుష్యం అధికమవడం, జీవ జాతులు అంతరించిపోవడం, ప్రకృతిలో అనూహ్య మార్పులు ఏర్పడడం వల్ల మానవ మనుగడకే ముప్పు కలిగే అవకాశం ఉంది. కాబట్టి జీవ వైవిధ్యాన్ని సంరక్షించడం అత్యంత ఆవశ్యకం. దీనికోసం 1992లో బ్రెజిల్‌లోని రియో డీజెనీరోలో జరిగిన ధరిత్రీ సదస్సులో దీనికోసం రెండు విధానాలను రూపొందించారు.

I. **స్వస్థానీయ సంరక్షణ (In-situ conservation):** ఈ విధానం ముఖ్య ఉద్దేశం- జీవ జాతులను పుట్టిన ప్రదేశాల్లోనే సంరక్షించడం.

ఎ. **బయోస్ఫియర్ రిజర్వులు ఏర్పాటు:** అంతరించే జాతుల కోసం సహజ వాతావరణంలో సంరక్షణ స్థానాలను ఏర్పాటు చేయడం. మన దేశంలో 18, ప్రపంచంలో 408 వరకు రిజర్వులు ఉన్నాయి.

బి. **రక్షిత ప్రాంతాల ఏర్పాటు:** ముఖ్యంగా ఈ ప్రాంతాలను వన్యప్రాణుల సంరక్షణ కోసం ఏర్పాటు చేస్తారు. ఇవి తక్కువ వైశాల్యాన్ని కలిగి ఉంటాయి.

i. **జాతీయ పార్కులు:** ప్రత్యేకమైన జంతువులను సంరక్షించడానికి వీటిని ఏర్పాటు చేస్తారు. మన దేశంలో 2012 నాటికి 102 నేషనల్ పార్కులు, ప్రపంచ వ్యాప్తంగా 2006 నాటికి 6,555 నేషనల్ పార్కులు ఉన్నాయి.

ii. **అభయారణ్యాలు/వన్యమృగ సంరక్షణ కేంద్రం:** ప్రత్యేక జంతువులు, అన్ని రకాల జంతువులను సంరక్షించడానికి వీటిని ఏర్పాటు చేస్తారు. ఇండియాలో 507 వన్యమృగ సంరక్షణ కేంద్రాలున్నాయి.

iii. **ప్రత్యేక పథకాలు:** దుర్భర పరిస్థితుల్లో ఉన్న జీవ జాతులను సంరక్షించడానికి వీటిని ఏర్పాటు చేస్తారు.
ఉదా: మన దేశంలో ప్రాజెక్టు టైగర్, ప్రాజెక్టు ఎలిఫెంట్.

II. **పరస్థానీయ సంరక్షణ (Ex-situ conservation):** అంతరించిపోతున్న జీవ జాతులను మానవ ప్రమేయంతో కృత్రిమ ఆవాసాలు ఏర్పాటు చేసి వాటిని సంరక్షించడం. ఈ విధానంలో అమలు చేస్తున్న కొన్ని అంశాలు.

i. **ఉద్యానవనాల ఏర్పాటు:** ఉదా: బొటానికల్ గార్డెన్స్, కజిరంగా, సుందర్బన్, గిర్ జాతీయ పార్కులు.

ii. **జూలాజికల్ పార్కులు:** ఉదా: పెరియార్, అన్నామలై, చిలికా సరస్సు.

iii. **విత్తన నిల్వ పద్ధతి:** వివిధ రకాల మొక్కల జాతుల విత్తనాలను సేకరించి 20°C- 30°C వద్ద నిల్వ చేస్తారు.

iv. **జన్యు బ్యాంకుల ఏర్పాటు:** వివిధ జంతువులు, మొక్కల జన్యు పదార్థాన్ని నిల్వ చేసి వాటి జాతులను అభివృద్ధి పరుస్తారు. ఉదా: ఇక్రిశాట్‌లో కందులు, శనగ, వేరుశనగ, సజ్జ, జొన్న వంటి పంటలకు సంబంధించిన జన్యు పదార్థాలను నిల్వ చేస్తారు.

v. **పరస్థానిక సంరక్షణ (Inviro conservation)** కణజాల వర్ధనం కోసం మొక్కల శాఖీయ భాగాలను (−196°C వద్ద) ద్రవ నత్రజనిలో నిల్వచేస్తారు. వీటితోపాటు జీవ వైవిధ్యం కోసం అంతర్జాతీయంగా, జాతీయంగా అనేక చట్టాలు చేశారు.

జీవ వైవిధ్యం- చట్టాలు

1972 - పారిస్ ఒప్పందం (ప్రపంచ సాంస్కృతిక వారసత్వ సంపద సంరక్షణ)
1975 - CITES ఒప్పందం (వన్యప్రాణులను వేట, అంతర్జాతీయ వ్యాపార నిషేధం)
1979 - వలస పక్షుల సంరక్షణ చట్టం
1971 - ఇండియాలో రామ్‌సార్ ఒప్పందం (చిత్తడి ప్రాంత ఆవరణ సంరక్షణ)
1897 - ఫిషరీస్ చట్టం
1927 - అటవీ చట్టం
1972 - వన్యప్రాణుల సంరక్షణ చట్టం
1974 - జల కాలుష్య నియంత్రణ చట్టం
1980 - అటవీ సంరక్షణ చట్టం
1981 - వాయు కాలుష్య నియంత్రణ చట్టం
2002 - జీవ వైవిధ్య సంరక్షణ చట్టం

జీవ వైవిధ్య ప్రయోజనాలు	నష్టాలు / పర్యవసానం
1. ప్రాణవాయువు(O_2)ను అందజేస్తుంది.	1. కాలుష్యం అధికమవుతుంది.
2. వర్షం కురిసేలా చేస్తుంది.	2. జన్యుసంబంధ వైవిధ్యాలు కొన్ని సందర్భాల్లో విపరీత నష్టాన్ని కలుగజేస్తాయి.
3. కాలుష్యాన్ని తగ్గిస్తుంది.	3. జంతువులను వేటాడటం ద్వారా జీవజాలం అంతరించిపోతుంది.
4. భూగర్భ జలాల సంరక్షణ	4. మార్కెట్ విలువల పెరుగుదల.
5. నేల కోతలను అరికట్టి భూసారాన్ని పెంపొందిస్తుంది.	5. విదేశీ ఎగుమతులు పెరుగుతాయి.
6. మానవాళికి అవసరమైన అన్ని ప్రయోజనాలను చేకూరుస్తుంది. ఉదా: ఆహారం,దుస్తులు,ఔషధాలు	6. జీవజాలాన్ని ఎక్కువగా వినియోగించడం.
7. శిలాజ ఇంధనం, ముత్యాలు, పగడాలు మొదలైనవి పొందడం.	7. ప్రకృతి వైపరీత్యాల ద్వారా కొన్ని జాతులు అంతరించడం.
8. మానవ సంక్షేమంలో ముఖ్యపాత్ర	8. మానవ సంక్షేమాన్ని ఆటంకపర్చడం.

విద్య, ఉద్యోగ సమాచారం

బెల్ ఉత్తరాఖండ్‌లో ఇంజనీర్ పోస్టులు

కోట్‌ద్వారా(ఉత్తరాఖండ్)లో భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్(బీఈఎల్) తాత్కాలిక ప్రాతిపదికన ట్రెనీ ఇంజనీర్, ప్రాజెక్ట్ ఇంజనీర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 07.
» **పోస్టుల వివరాలు:** ట్రెనీ ఇంజనీర్(ఎలక్ట్రానిక్స్)-01, ప్రాజెక్ట్ ఇంజనీర్ (ఎలక్ట్రానిక్స్/కంప్యూటర్ సైన్స్)-06.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బీఎస్సీ/బీఈ/బీటెక్ ఇంజనీరింగ్ ఉత్తీర్ణతతో పాటు ఉద్యోగానుభవం ఉండాలి.
» **వయసు:** ట్రెనీ ఇంజనీర్‌కు 28 ఏళ్లు, ప్రాజెక్ట్ ఇంజనీర్‌కు 32 ఏళ్లు మించకూడదు.
» **స్టైపెండ్:** నెలకు ట్రెనీ ఇంజనీర్‌కు రూ.30,000, ప్రాజెక్ట్ ఇంజనీర్‌కు రూ.40,000.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
దరఖాస్తును సీనియర్ డీజీఎం, భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్, కోట్‌ద్వారా, పౌరి గార్వాల్, ఉత్తరాఖండ్-246149 చిరునామకు పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 27.02.2025.
» **వెబ్‌సైట్:** https://bel-india.in

రైట్స్ లిమిటెడ్‌లో 40 టెక్నికల్ అసిస్టెంట్ పోస్టులు

గుర్గావ్‌లోని రైల్ ఇండియా టెక్నికల్ అండ్ ఎకనామిక్ సర్వీస్ లిమిటెడ్(రైట్స్) టెక్నికల్ అసిస్టెంట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 40.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిప్లొమా (మెటలర్జికల్ /మెకానికల్ ఇంజనీరింగ్)లో ఉత్తీర్ణులవ్వాలి. దీనితో పాటు పని అనుభవం ఉండాలి.
» **వయసు:** 11.03.2025 నాటికి 40 ఏళ్లు మించకూడదు.
» **వేతనం:** నెలకు రూ.16,338.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 11.03.2025.
» **రాతపరీక్ష తేది:** 23.03.2025.
» **వెబ్‌సైట్:** https://www.rites.com

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

తెలంగాణలో ఏకైక జైన క్షేత్రం?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం
జనరల్ స్టడీస్
చరిత్ర

జైన - బౌద్ధమతాల ఆవిర్భావం

క్రీ.పూ.6వ శతాబ్దంలో భారతదేశంలో అనేక మతాలు ఆవిర్భవించాయి. వీటిలో ముఖ్యమైనవి జైనమతం, బౌద్ధమతం. ఈ రెండు మతాలు భారతదేశ సంస్కృతిని గణనీయంగా ప్రభావితం చేశాయి. ముఖ్యంగా బౌద్ధం చైనా, జపాన్ లాంటి దేశాల్లో ఇప్పటికీ గొప్ప ఆదరణ పొందుతోంది.

జైన మతం

జైనమతం చాలా పురాతన కాలం నుంచి ఉందని తెలుస్తోంది. రుగ్వేదంలో జైన మత స్థాపకులైన మొదటి తీర్థంకరుడైన రుషభనాథుని గురించి స్పష్టమైన ప్రస్తావన ఉంది. జైన సాహిత్యం ప్రకారం జైన మతంలో 24 మంది తీర్థంకరులు ఉన్నారని, అందరూ క్షత్రియులేనని తెలుస్తోంది. వీరిలో మొదటి ఇరవై రెండు మంది పౌరాణిక వ్యక్తులు. కానీ 23వ తీర్థంకరుడైన పార్శ్వనాథుడు, 24వ తీర్థంకరుడైన మహావీరుడు చారిత్రక పురుషులు. చారిత్రకంగా మాత్రం జైనమత స్థాపకుడు 23వ తీర్థంకరుడైన పార్శ్వనాథుడు. 'తీర్థంకరులంటే జీవ ప్రవాహాన్ని దాటడానికి వారధి నిర్మించినవారు' అని అర్థం.

పార్శ్వనాథుడు: కాశీ (బెనారస్) రాజైన అశ్వసేనుడు, రాణి వామలకు జన్మించాడు. 30 ఏళ్ల వయస్సు వరకు గృహస్థ జీవితాన్ని గడిపాడు. తర్వాత ఇహలోక సుఖాలను త్యజించి, 84 రోజులు తపస్సు చేసి జ్ఞానిగా మారాడు. అహింస, సత్యం, అస్తేయం(దొంగతనం చేయకూడదు), అపరిగ్రహం (ఆస్తి ఉండకూడదు) అనే నాలుగు సూత్రాలను బోధించాడు. అదనంగా ఐదో సూత్రమైన బ్రహ్మచర్యాన్ని మహావీరుడు జోడించాడు. పార్శ్వనాథుడు తన వందో ఏట బెంగాల్‌లో నిర్యాణం చెందాడు.

వర్ధమాన మహావీరుడు (క్రీ.పూ. 540- 468): వర్ధమానుడు.. సిద్ధార్థ, త్రిశాల దంపతులకు క్రీ.పూ. 540లో వైశాలి సమీపాన కుంద గ్రామంలో జ్ఞాత్రిక క్షత్రియ వంశంలో జన్మించాడు. వర్ధమానుని తండ్రి జ్ఞాత్రిక తెగకు అధిపతి కాగా, తల్లి వైశాలిని పరిపాలించిన చేతకుడి సోదరి, లిచ్ఛవీ రాజ కుమార్తె. మగధ రాజు బింబిసారుడు చేతకుడి కుమార్తె అయిన చెల్లనను పెళ్లి చేసుకున్నాడు. అందువల్ల మగధను పరిపాలించిన హర్యాంక రాజ వంశీకులకు మహావీరుడు బంధువు అవుతాడు. మహావీరుడికి యుక్త వయసులోనే యశోదతో వివాహం అయింది. తన 30వ ఏట సన్యసించాడు. ఆరేళ్ల దిగంబర యోగిగా తపస్సు చేసి విఫలుడై మక్కలి గోసాలుని (అజీవక మతశాఖ స్థాపకుడు) వద్ద శిష్యత్వం స్వీకరించాడు. తన 42వ ఏట జ్ఞానోదయం (కైవల్య) పొంది జినుడయ్యాడు. 'జినుడు అంటే పంచేంద్రియాలను జయించినవాడు' అని అర్థం. ధైర్యసాహసాలతో తపస్సు సాగించినందున మహావీరుడు అని, మహాజ్ఞాని కావడం వల్ల కేవలి అని, సకల బంధాలు తెంచుకొన్నందున నిర్గ్రంథుడని వర్ధమానుడు గుర్తింపు పొందాడు.

జ్ఞానోదయం పొందిన తర్వాత వర్ధమాన మహావీరుడు ఏడాదిలో ఎనిమిది నెలలు దేశాటన చేస్తూ ప్రజలకు తన సిద్ధాంతాలను బోధించాడు. మిగిలిన నాలుగు నెలలు చంప, వైశాలి, రాజగృహ, మిథిల, శ్రావస్తి మొదలైన పట్టణాల్లో కాలం గడిపేవాడు. ఈ నగరాలు జైనమత వ్యాప్తిని సూచిస్తాయి. మహావీరుడు 72వ ఏట క్రీ.పూ. 468లో పాటలీపుత్రం సమీపంలోని పావపురిలో హస్తిపాలుడనే రాజు గృహంలో నిర్యాణం చెందాడు.

మహావీరుడు వేదాలు ప్రామాణిక గ్రంథాలు, యజ్ఞాలు మోక్ష సాధనాలు కాదని చెప్పాడు. జంతు బలులను, వర్ణ భేదాలను ఖండించాడు. బ్రాహ్మణుల ఆధిక్యతను ఖండించి, అన్ని వర్ణాలవారు మోక్షానికి అర్హులే అనే సమత్వ సూత్రాన్ని ఉద్బోధించాడు. పవిత్ర జీవితం గడుపుతూ సన్యాసిగా తపస్సు చేసి నిర్యాణం పొందొచ్చని మహావీరుడు బోధించాడు. భగవంతుడే ఈ ప్రపంచాన్ని సృష్టించాడని విశ్వసించ లేదు. మానవుడు.. ముక్తి కోసం భగవంతుడి అనుగ్రహం పొందిన లేదా మరే ఇతర వ్యక్తిపైనా ఆధారపడకూడదని, తన భవిష్యత్తుకు తానే కర్తని బోధించాడు.

వర్ణ వ్యవస్థలో ఒక వ్యక్తి స్థానాన్ని అతని పూర్వ జన్మలోని పాపపుణ్యాలు నిర్ణయిస్తాయని మహావీరుడు పేర్కొన్నాడు.

మహావీరుడికి భగవంతుడిపై నమ్మకం లేకపోయినప్పటికీ కర్మ సిద్ధాంతాన్ని నమ్మాడు. ఆత్మ ఉందని, ఆత్మకు పునర్జన్మ ఉందని కూడా అంగీకరించాడు. మానవుల కర్మలే వారి భవిష్యత్తుని నిర్ణయిస్తాయని కర్మ సిద్ధాంతాన్ని చాటి చెప్పాడు. కామ, క్రోధ, లోభ, మోహం, అజ్ఞానం కర్మకు కారణమని, కర్మ ఫలితాలను అనుభవించడానికి మళ్లీ జన్మించాల్సి వస్తుందని అన్నాడు. కర్మను అంతం చేసి మోక్షం పొందాలంటే ప్రతి ఒక్కరూ మూడు సూత్రాలను పాటించాలని బోధించాడు. వీటిని త్రిరత్నాలు అంటారు. అవి..

- సరైన విశ్వాసం అంటే మహావీరుడి భావనల్లో శ్రద్ధ, విశ్వాసం కలిగి ఉండటం.
- సరైన జ్ఞానం అంటే మహావీరుడి బోధనల్లోని సత్యాన్ని గ్రహించడం.
- సరైన నడవడి అంటే జైన పంచ వ్రతాలను ఆచరించడం.



జైనుల మొదటి సమావేశం పాటలీపుత్రంలో క్రీ.పూ.300లో జరిగింది. ఈ సమావేశ ఫలితంగా జైన తీర్థంకరులు బోధించిన సిద్ధాంతాలను 12 అంగాలుగా క్రోడీకరించారు. వీటిపై వ్యాఖ్యానాలు కూడా రాశారు. వాటిని నిర్యుక్తులు అని అంటారు.

క్రీ.పూ. 4వ శతాబ్ది చివరి కాలంలో బీహార్‌లో భయంకరమైన కరువు ఏర్పడింది. ఇది 12 ఏళ్లపాటు ఉంది. ఈ సమయంలో భద్రబాహు నాయకత్వంలో కొందరు జైనులు దక్షిణాదిలోని మైసూరు ప్రాంతానికి వెళ్లారు. వీరు దక్షిణాదిలో జైనమతం వ్యాపింప చేశారు.

స్థూలభద్రుడి అనుచరులను శ్వేతాంబరు లని, భద్రబాహు అనుచరులను దిగంబరులని అంటారు.'శ్వేతాంబరుల ఆధ్వర్యంలో క్రీ.శ.5 వ శతాబ్దంలో వల్లభి (గుజరాత్)లో జైనమత రెండో పరిషత్ జరిగింది'. ఈ సమావేశం ముఖ్య ఉద్దేశం పవిత్ర గ్రంథాలను సేకరించి వాటిని క్రమ పద్ధతిలో, అర్ధమాగధి భాషలో రాయడం.

బౌద్ధ మతం

గౌతమబుద్ధుడి అసలు పేరు.. సిద్ధార్థుడు. క్రీ.పూ. 563లో కపిలవస్తు నగర సమీపంలోని లుంబిని వద్ద జన్మించాడు. తండ్రి శుద్ధోధనుడు శాక్య తెగ అధిపతి. తల్లి మాయాదేవి కొలియ తెగలో పుట్టింది. సిద్ధార్థుడు పుట్టిన కొద్ది కాలానికే తల్లి మరణించడంతో సవతి తల్లి మహాప్రజాపతి గౌతమి చేతుల్లో పెరిగాడు. అందుకే అతడిని గౌతముడు అంటారు. అయితే 'సిద్ధార్థుని గోత్ర నామమైన గౌతమి నుంచి కూడా గౌతముడు అనే పేరు వచ్చి ఉండొచ్చు'.

గౌతముడికి యశోధర అనే రాకుమార్తెతో వివాహం జరిగింది. వారికి రాహులుడు అనే కుమారుడు జన్మించాడు. ఒకరోజు రథసారథి చెన్నడు రథం తోలుతుండగా బుద్ధుడు దారిలో ముసలివాడిని, రోగిని, శవాన్ని, సన్యాసిని చూశాడు. వీరిని చూసిన తర్వాత అతడికి దేహం అశాశ్వతమని, ప్రాపంచిక సుఖాలు క్షణభంగురాలని, నిష్ప్రయోజనాలని అనిపించి హృదయంకలత చెందింది. అర్ధరాత్రి తన రథసారథిని అశ్వం సిద్ధం చేయమని ఆజ్ఞాపించి దానిపై బయలుదేరి వెళ్లాడు. సిద్ధార్థుడు తన 29వ ఏట మహాభినిష్క్రమణం చేశాడు.

సిద్ధార్థుడు చాలా గ్రామాలు ప్రయాణం చేసి వైశాలి గ్రామం చేరాడు. అక్కడ 'అలారకలామ' అనే గురువు దగ్గర సాంఖ్య దర్శన విజ్ఞానం సంపాదించాడు. కానీ దీనివల్ల తృప్తి పొందలేకపోయాడు. తర్వాత వైశాలి రాజధాని అయిన రాజగృహానికి వెళ్లాడు. అక్కడ కూడా సంతృప్తి చెందలేక ఉరువేల అనే ప్రాంతం చేరాడు. అక్కడ బోధి వృక్షం కిందకు చేరాడు. ఈ ప్రదేశం గౌతముడికి నచ్చడంతో జ్ఞానోదయం పొందేవరకు అక్కడే తపస్సు చేయాలనే దృఢమైన నిర్ణయం తీసుకున్నాడు. ఏడువారాల దీర్ఘ తపస్సులో నిమగ్నమైన తర్వాత వైశాఖ పూర్ణిమ నాడు జ్ఞానోదయం అయింది. అప్పుడతడు బుద్ధుడయ్యాడు. ఆ ప్రదేశం బుద్ధ గయగా మారింది. బుద్ధ గయ (ఉరువేల) నుంచి బుద్ధుడు వారణాసి చేరి తర్వాత సారనాథ్‌లోని జింకల వనంలో తన పూర్వ సహచరులైన ఐదుగురు బ్రాహ్మణ సన్యాసులకు ప్రప్రథమంగా జ్ఞానోపదేశం చేశాడు. ఇదే ధర్మచక్ర ప్రవర్తనంగా పేరొందింది. వారు బుద్ధుడికి శిష్యులు అయ్యారు. వారితో బుద్ధుడు ఒక సంఘం స్థాపించాడు. తర్వాత మగధాధీశులైన బింబిసారుడు, అతని కుమారుడు అజాతశత్రువు బుద్ధుడికి శిష్యులయ్యారు. దొంగ అయిన అంగుళీమాలుడిని బుద్ధుడు బౌద్ధుడిగా చేశాడు.

దుఃఖ నివారణ సాధించడానికి దుఃఖ కారణమైన కోరికలను త్యజించాలని అందుకు అష్టాంగ మార్గాన్ని అవలంబించాలని బుద్ధుడు బోధించాడు. అష్టాంగ మార్గంలో ఎనిమిది సూత్రాలున్నాయి. ఈ ఎనిమిది సూత్రాలను చక్కగా అర్థం చేసుకొని ఆచరణలో వాటిని పాటించడం ద్వారా మనశ్శాంతి, జ్ఞానం, నిర్యాణంపొందొచ్చని బౌద్ధం చెబుతోంది.

వృద్ధాప్యంలో ఆనందుడిని తన పరిచారకుడిగా ఎంపిక చేసుకున్నాడు. బుద్ధుడు తన 80వ ఏట క్రీ.పూ. 483లో కుశినార అనే ప్రదేశం వద్ద నిర్యాణం చెందాడు. దీనినే మహాపరినిర్యాణం అంటారు. 'మహాపరిని బానసుత్త' కుశినార వరకు జరిగిన బుద్ధుడి చివరి యాత్రను, అపాయకరమైన రోగం, నిర్యాణం, అవశేషాల పంపిణీ గురించి విపులంగా పేర్కొంటుంది.

బుద్ధుడి మరణం తర్వాత ఆయన బోధనలను త్రిపీఠకాల రూపంలో సేకరించారు. త్రిపీఠకాలు అంటే మూడు ధర్మపు బుట్టలు. అందుకే వాటికి త్రిపీఠకాలు అని పేరు వచ్చింది. బౌద్ధం కొన్నేళ్లకు హీనయానం, మహాయానం, వజ్రయానం రూపాలుగా పరిణామం చెందింది. మహాయానంలో బుద్ధుడిని దేవుడిగా పరిగణించారు. వజ్రయానంలో మళ్లీ కర్మకాండలకు ప్రాధాన్యం పెరిగింది.

బుద్ధుడి పూర్వ జీవితం గురించి చెప్పే కథలే జాతక కథలు. ఎడ్విన్ ఆర్నాల్డ్ బుద్ధుడిని 'ఆసియాజ్యోతి (light of Asia)' అని, శ్రీమతి రైస్ డేవిడ్స్ 'ప్రపంచ జ్యోతి (light of world)' అని కీర్తించారు.

మహనీయులు బుద్ధుడిని భగవంతుడిగా చేసి ప్రజలకు పూజించే అవకాశం కల్పించారు. మహాయాన బౌద్ధ మతం సుమారు క్రీ.పూ.1 శతాబ్దంలో ఆంధ్ర దేశంలో ప్రవేశించిందని తెలుస్తోంది. మహాయాన బౌద్ధుల నుంచి హిందువులు విగ్రహారాధన చేపట్టారు.

మాదిరి ప్రశ్నలు

1. గౌతమ బుద్ధుడు ఏ భాషలో తన ప్రవచనాలను బోధించాడు?
   1) హిందీ 2) మరాఠీ
   3) పాళీ 4) మాగధి
2. కిందివాటిలో బౌద్ధ నిర్మాణం కానిదేది?
   1) సంఘం 2) స్థూపం
   3) విహారం 4) చైత్యం
3. బాక్ట్రియన్ రాజు మినాండర్ ఏ బౌద్ధ సన్యాసితో జరిపిన చర్చల సారాంశం మిళిందపన్హ గ్రంథంలో ఉంది?
   1) నాగభట్టుడు 2) కుమారిలభట్టుడు
   3) నాగసేనుడు 4) నాగార్జునుడు
4. రుగ్వేదంలో ఏ తీర్థంకరుడి గురించి ప్రస్తావన ఉంది?
   1) పార్శ్వనాథుడు 2) మహావీరుడు
   3) రుషభనాథుడు 4) దేవదత్తుడు
5. ఏ సంవత్సరంలో బుద్ధుడి మహాపరినిర్యాణం జరిగి 2500 ఏళ్లు పూర్తి అయ్యాయి?
   1) 1950 2) 1959
   3) 1956 4) 1955
6. దక్షిణ భారతదేశంలో ఉన్న బుద్ధుడి అస్థికలు గల తొలి మహాస్థూపం ఏది?
   1) భట్టిప్రోలు 2) అమరావతి
   3) నాగార్జున కొండ 4) పైవేవీ కాదు
7. బుద్ధుడి జీవితంలో జరిగిన నాలుగు ముఖ్య సంఘటనలతో ప్రమేయం లేని ప్రదేశం ఏది?
   1) సంఖ్యస 2) రుమిందై 3) కాసియా
   4) ఇసిపటాన వద్ద జింకల వనం
8. నాలుగో బౌద్ధ సంగీతి ఏ నగరంలో జరిగింది?
   1) వైశాలి 2) పాటలీపుత్రం
   3) కశ్మీర్ 4) కురుక్షేత్ర
9. గౌతమబుద్ధుడు కుశినారలో మరణించేటప్పుడు అతడి పక్కన ఉన్న శిష్యుడు ఎవరు?
   1) నాగసేన 2) ఆనంద
   3) అంబపాలి 4) సారిపుత్ర
10. యోగాచార లేదా విజ్ఞానవాద సిద్ధాంతాన్ని ప్రతిపాదించిన తత్వవేత్త ఎవరు?
    1) వసుబంధు 2) అసంగ
    3) మైత్రేయనాథ 4) వత్తగామిని
11. మహాయాన బుద్ధిజంలో 'బోధిసత్తియ అవలోకితేశ్వర' కు మరొక పేరు?
    1) పద్మపాణి 2) వజ్రపాణి
    3) మంజుశ్రీ 4) మైత్రేయ
12. జైనతత్వానికి గల మరో పేరు?
    1) సమాచారి 2) స్యాదవాద
    3) సంఖ్య 4) పుద్గల
13. జ్ఞానం ద్వారా మోక్షం పొందవచ్చని తెలిపింది?
    1) భగవద్గీత 2) ఇతిహాసాలు
    3) ఉపనిషత్తులు 4) వేదాలు
14. జైనమత సాంప్రదాయ ప్రకారం మొత్తం తీర్థంకరుల సంఖ్య?
    1) 23 2) 22 3) 24 4) 21
15. జైనమత పవిత్ర గ్రంథాలు?
    1) త్రిపీఠకాలు 2) వేదాలు
    3) అంగాలు 4) భగవద్గీత
16. తెలంగాణలో ఏకైక జైన క్షేత్రం?
    1) కొలనుపాక 2) బోధన్
    3) ఉదయగిరి 4) రామతీర్థం

సమాధానాలు

1) 3; 2) 1; 3) 3; 4) 3;
5) 3; 6) 1; 7) 1; 8) 3;
9) 2; 10) 3; 11) 1; 12) 2;
13) 3; 14) 3; 15) 3; 16)1

Common nouns followed by 'of'..

BANK EXAMS
GENERAL ENGLISH

NOUNS

We use nouns to refer to animals, people, places and things.

Kinds and uses

- **Proper nouns:** The specific names by which we know an individual animal, a person, a place, such as an institution, a building or a town, or something such as a month, a day of the week, a season or a festival.
  E.g. Smith; Delhi; India Gate; January; Sankranthi.. etc.
  Note: that all proper nouns begin with a capital letter.
- **Common nouns:** words that name people, animals, places and things of the same kind Dog (as in my dog, Goldie), doctor (as in Satish, a doctor), library (as in central library), spoon(as in a plastic spoon)
  Note: that all common nouns begin with a lower-case letter.
- **Common nouns are countable when:**
  - We use a / an in front of them.A bag, an orange, a shirt, an engineer
  - We can talk about many of them using their plural forms, with or without numbers in front of them. Ships, two books, seven women, many sheep, a few lemons.
  - We can use them in questions that begin with 'how many'.
    How many pens do you need?
    How many children are present today?
- **Common nouns are uncountable when:**
  - We do not use a/an in front of them. Not a slat, but salt; not an oil, but oil.
  - We do not use their plural forms, with or without numbers in front of them, to specify what quantity we are talking about.
    Not a sugar, two sugars, many milks, but a grain of/two spoons of/four bags of/ ten kilograms of / many packets of / a lot of sugar, a little milk.
- We do not use them in questions that begin with 'how many', but only in those that begin with 'how much'.
  Not How money do you owe him?



but How much money do you owe him? not A How many plastic is manufactured in a day?, but How much plastic is manufactured in a day?

- **Note:** that some nouns can be used both as countables, when they refer to a thing, and as uncountables, when they refer to the substance or material it is made up of.
  There are three glasses on the tray. ('glasses', countable noun).
  The tray is made of glass. ('glass', uncountable noun).

Some countable nouns are concrete and represent people, things or activities that can be seen, touched or heard, for example rose, table, basket. Other countable nouns are abstract and represent states, feelings or qualities, which can only be felt or imagined, for example hop, ambition, joy. Similarly, some uncountable nouns are concrete, for example cotton, clothing, bread, while others are abstract, for example peace, pain, anger.

- **Collective nouns:** common nouns followed by 'of' and referring to groups of people or things.

A team of players, an army of soldiers, a bouquet of flowers.

- **Note:** that when using collective nouns, you will usually have to use the complete expression in order to make sense. For example, the collective noun 'bunch' by itself would not tell people what you are talking about because it could be used for grapes, roses or letters. Exceptions to this are, for example, 'an army', 'a bouquet' and 'a gang', which are usually used for soldiers, flowers and thieves respectively.

Plural forms of nouns

We use plural forms of nouns to talk about people, places and things that are more than one in number, for example 'two trolleys', 'a box of brushes', 'a few monkeys'.

Regular forms: You can follow these patterns below to form the plural forms of most nouns.

1. **Add-s in the case of most nouns:** mugs, pets, beds, cups, tubs, chiefs, cans, sums, teachers, dolls, months, smiles, tongues, days, windows.
2. **Add-es after nouns ending in:**
   -s: glasses, classes, passes, masses.
   -x: boxes, taxes, faxes.
   -ch: matches, clutches, stitches.
   -sh: wishes, bushes, dishes.
3. **Add-s after nouns ending in -ay, -ey,-oy, -uy:** rays, keys, toys, guys.
4. **In nouns ending in a consonant letter+-y, replace the final-y with 'ies':** countries, cities, ladies, babies.
5. **In nouns ending in-fe, replace the letters with-ves:** knives, lives, wives.

Irregular forms: There are some nouns for which you cannot find the plural forms by following the patterns above. You will have to learn the plurals of these nouns through reading or by looking them up in a standard dictionary Look at some plurals that do not follow the usual pattern.

1. **Nouns ending in-f forms plurals:**
   - **With a final -f :** roof/ roofs, chief/ chiefs, proof/ proofs.
   - **With a final -ves in place of the -f :** calf/calves, loaf/loaves, leaf/ leaves.
   - **With either a final-s or a final -ves:** dwarf/ dwarfs or dwarves, hoof / hoofs or hooves, scarf/ scarfs or scarves.
2. **Nouns ending in-o form plurals:**
   - **Always with a final-oes:** potatoes, tomatoes, echoes.
   - **With either a final-oes or-os:** buffaloes/ buffalos.
   - **Always with a final-os:** kilos, radios, videos, photos.
3. **Nouns whose plural forms are formed by adding-en/-ren:** oxen, children
4. **Nouns whose plural forms are formed by changes in letters within the singular form:** foot/feet, mouse/mice, man/men.

Tips to remember

- The following words are countable and are normally used in singular form only. The indefinite article a/an should not be used with them.
- The words such as measles, mumps, ethics, maths, politics, phonetics, rickets, billiards and innings look like plural nouns but give singular meaning. So, they take singular form of verbs.
- Some nouns have the same form whether singular or plural.
  Sheep, deer, service, series, species, apparatus.
- The following nouns are always used in the plural form only.
  Cattle, scissors, spectacles, electorate, binoculars, crackers, clergy. These are used with plural form of verbs.
- Add's' to the main word in compound noun to make it plural.
  Sister-in-law, sister's- in-law
- The possessive case of a compound noun is formed by adding's' to the last word.
  Father-in-law's property.
- After the phrases one of, some of, each of, either of, neither of, any of, none of, a plural form of a noun is used.
- Nouns indicating numerals should be used in singular form.
  A dozen eggs/ two dozen oranges.
- After collective noun either a singular or plural form of verb is used.
- An apostrophe and 's' is used with living beings only to show possession.
- When two nouns are connected by 'and' and are closely related add an apostrophe and s to the last noun.
- Collective nouns, such as *family, majority, audience,* and *committee* are singular when they act in a collective fashion or represent one group. They are plural when the members of the collective body act as individuals. Collective nouns will usually be singular in Sentence Correction sentences.

A majority of the shareholders wants the merger.

This sentence is grammatically correct - but confusing. To determine whether a confusing noun requires a singular or plural verb, it might be helpful to visualize what's actually going on in the sentence. Is the sentence talking about something that acts as a singular entity? Or is it talking about the individual elements within that entity?

In the sentence here, there is no indication that the sentence is referring to the individuals within the majority. The "majority" acts as one - as a singular entity - and therefore requires a singular verb, "wants."

Again, the "flock of birds" is referred to as a singular group - we're not talking about each bird's direction of flight, but the direction of the flock as a whole - thus it requires the singular verb "is" not the plural verb "are".

The team are always fighting amongst themselves.

This is an example of a collective noun that requires a ***plural*** verb. While 'team' is often used as a singular collective noun, in this case, the sentence describes the fighting that occurs between the individual members of the team. "Team" therefore refers to several individual members, and requires a plural verb, "are," as a result.

The key to these questions is simplicity: recognize the collective noun, visualize what's going on in the sentence, and proceed.

Directions (Q. 1-15): Each question below has a blank, indicating that something has been omitted. Choose the word from the five options for the blank that best fits the meaning of the sentence as a whole.

1. The work increases our ___ about how the body fights disease.
   1) knowledge 2) knowledges
   3) knowledgably 4) acknowledge
   5) knowledgeable
2. They are doing some fascinating-__________ into the language of dolphins.
   1) Researches 2) researcher
   3) research 4) re searches
   5) re search
3. In our family, we share the _______ between us.
   1) Houseworks 2) housework
   3) houses works 4) house works
   5) house working
4. The first task is to clean up the _____ left behind by the factories.
   1) Pollutions 2) pollution
   3) polluting 4) pollute
   5) polite
5. They are suffering from _____ lack of medical supplies.
   1) a serious 2) serious
   3) seriously 4) seriousness
   5) series
6. He's starting to get a few grey _____ now.
   1) Hair 2) heirs 3) heir
   4) hairs 5) hairy
7. Would you like some more ___ on your plate?
   1) Cauliflower 2) cauliflowers
   3) the cauliflowers
   4) a cauliflowers
   5) an cauliflowers
8. The doctor said that she was making _____ and she would probably be out of hospital by next week.
   1) a good progress
   2) good progress
   3) good progresses
   4) better progress
   5) good progressing
9. The book has ______ at the end of every chapter.
   1) Exercises 2) exercise
   3) excess 4) exceed
   5) execute
10. Do you want any help in bringing your ________ from the van?
    1) stuffs 2) stuff 3) stuffing
    4) stuffy 5) stuffed
11. _______ was the ideal punishment for her.
    1) A prison 2) Prison 3) prisons
    4) the prisons 5) an prison
12. Emily ate six _____ and two eggs for breakfast.
    1) bacons 2) rashers of bacon
    3) bacon 4) rash of bacon 5) bake
13. Is there _____ for all of us to fit in?
    1) a room 2) rooms 3) room
    4) the room 5) room's
14. They think she put _____ on their family.
    1) a curse 2) curse 3) cursory
    4) curses 5) an curse
15. Their offices have small upholstered _____ and comfortable chairs.
    1) sofa 2) sofa's 3) sofas
    4) an sofa
    5) the sofas

Key:

1) 1 2) 3 3) 2 4) 2 5) 1
6) 4 7) 1 8) 2 9) 1 10) 2
11) 2 12) 1 13) 3 14) 1 15) 3.